
ISSN : 0971-8729

ప్రత్యేక సంచిక

# యోజన

సంపుటి : 44 సంచిక : 5 అభివృద్ధి మాసపత్రిక మార్చి 2016 ₹ 20

# కేంద్ర బడ్జెట్ 2016-17




విశేషవ్యాసం :

## గ్రామీణ, వ్యవసాయ రంగాలకు వెన్ను దన్ను 2016-17 కేంద్ర బడ్జెట్‌పై సమీక్ష

సీ.ఎస్.సీ. శేఖర్

## మౌలిక సదుపాయాలకు బడ్జెట్ కేటాయింపులు

జి. రఘురాం

## సరైన అంచనా - అసలైన ప్రాధాన్యాలు

డి.హెచ్. పాయ్ పణందికర్

## 2016-17 రైల్వే బడ్జెట్‌పై ప్రతిస్పందనలు

శాంతి నారాయణ్

ప్రత్యేకవ్యాసం

## బ్యాంకింగ్ రంగాన్ని కేంద్ర బడ్జెట్ పునరుద్ధరించగలదా?

ఎన్.ఆర్. భానుమూర్తి

తెలుగు రాష్ట్రాల వార్షిక బడ్జెట్‌లు.

## సేతు భారతం ప్రాజెక్ట్

జాతీయ రహదారులలో రైల్వే క్రాసింగుల వల్ల, రోడ్డు రావాణాలో అంతరాయాలే కాక, ప్రమాదాలలో అనేకమంది మరణిస్తున్నారు. ఈ దుర్ఘటనలను నివారించేందుకు, కేంద్ర ప్రభుత్వం **"సేతు భారతం"** అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల ఢిల్లీలో ప్రారంభించిన ఈ పథకం క్రింద, మొత్తం రూ. 20,800/-ల కోట్ల వ్యయంతో 208 రైలు వంతెనలను (ఆంధ్ర ప్రదేశ్‌లో33, అస్సామ్‌లో 12, బీహార్‌లో 20, చత్తీస్‌ఘడ్‌లో 05, గుజరాత్‌లో 08, హర్యానాలో 10, హిమాచల్ ప్రదేశ్‌లో 05, ఝార్ఖండ్‌లో 11, కర్ణాటకలో 17, కేరళలో 04, మధ్యప్రదేశ్‌లో 06, మహారాష్ట్రలో 12, ఒడిషాలో 04, పంజాబ్‌లో 10, రాజస్థాన్‌లో 09, తమిళనాడులో 09, ఉత్తరాఖండ్‌లో 02, ఉత్తరప్రదేశ్‌లో 09, పశ్చిమబెంగాల్‌లో 22) నిర్మించి, 2019 నాటికి, దేశంలోని మొత్తం జాతీయ మార్గాలలో రైల్వేల వల్ల ఎటువంటి అటంకాలు లేకుండా చేస్తారు. ఇప్పటికే, ఇట్టి 73 కార్యక్రమాలకు విపుల ప్రణాళికలు తయారుగా ఉన్నాయి. వీటిలో 64 అమలుకు 2015-16 సం॥లో రూ. 5,000/- కోట్లు మంజురయ్యాయి. అదనంగా జీర్ణస్థితిలో నున్న 1500 ల వంతెనలను రూ. 30,000/- కోట్ల కేటాయింపుతో మరమ్మత్తులు చేస్తారు. కేంద్ర రోడ్డు రవాణా జాతీయమార్గాల మంత్రిత్వశాఖ ఇండియన్ అకాడమీ ఆఫ్ హైవే ఇంజనీరింగ్ (నోయిడా)లో ఇందుకోసం ఇండియన్ బ్రిడ్జి మేనేజ్‌మెంట్ సిస్టమ్స్‌ను ఏర్పాటుచేసింది.

## ప్రధానమంత్రి పంటల బీమా పథకం

ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రతిపాదించిన పంటలబీమా పథకానికి పార్లమెంట్ తన ఆమోదాన్ని తెలిపింది. దీని ప్రకారం దేశవ్యాప్తంగా రైతులందరూ ఖరీఫ్ పంటకు రెండుశాతం, రబీ పంటకు 1.5 శాతం ప్రీమియం చెల్లిస్తే చాలు. అదే వాణిజ్య, ఉద్యానవన పంటలైతే, ఐదుశాతం చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన ప్రీమియంను రైతుల తరపున ప్రభుత్వమే చెల్లిస్తుంది. తద్వారా ప్రకతి వైపరీత్యాలవల్ల పంట నష్టం జరిగినపుడు, పూర్తి పరిహారం పొందవచ్చు. ప్రభుత్వం ఇచ్చే రాయితీకి గరిష్ట పరిమితి లేదు. గతంలో ప్రభుత్వం ఇచ్చే ఈ రాయితీపై పరిమితి ఉండటంవల్ల, రైతులకు అందే పరిహారంపై కూడ పరిమితి ఉండేది. సాంకేతిక విజ్ఞానానికి ప్రాధాన్యమిస్తూ, పంట నష్టాన్ని వివరాలతో స్మార్ట్ ఫోను ద్వారా అధికారులకు నివేదించడం వల్ల, పరిహారం పోందటంలో జరుగుతున్న కాలయాపనను నివారించవచ్చు.

■

సంపుటి : 44 సంచిక : 5

ISSN : 0971-8729

మార్చి 2016

# యోజన

ముఖ్య సంపాదకులు : **దీపికా కచ్చల్**
వరిష్ఠ సంపాదకుడు : **విజయకుమార్ వేదగిరి**
సంపాదకుడు : **మహమ్మద్ సిరాజుద్దీన్**

జాయింట్ డైరెక్టర్ (ప్రొడక్షన్) : **వి.కె. మీనా**

e-mail : yojana_telugu@yahoo.co.in
e-mail : yojana.telugu@nic.in

*ఆనోభద్రా క్రతవోయన్తు విశ్వతః (ఉత్తమ భావాలు అన్నివైపుల నుండి రావాలి)*

## ఈ సంచికలో...

| | | |
|---|---|---|
| 1. | గ్రామీణ, వ్యవసాయ రంగాలకు వెన్ను దన్ను 2016-17 కేంద్ర బడ్జెట్‌పై సమీక్ష – సీ.ఎస్.సీ. శేఖర్ | 5 |
| 2. | రెవిన్యూలోటు, విత్తలోటు ధోరణులు–ఆర్థికరంగం – డాక్టర్ అమేయకుమార్ మహాపాత్రా | 9 |
| 3. | మౌలిక సదుపాయాలకు బడ్జెట్ కేటాయింపులు – జి. రఘురాం | 13 |
| 4. | సరైన అంచనా – అసలైన ప్రాధాన్యాలు – ప్రొఫెసర్ డి. హెచ్. పాయ్ పణందికర్ | 16 |
| 5. | కేంద్ర బడ్జెట్ 2016-17: విత్త సంఘటితానికి ఓ యత్నం – బి.వి.మధుసూదన్‌రావు | 20 |
| 6. | 2016-17 రైల్వే బడ్జెట్‌పై ప్రతిస్పందనలు – శాంతి నారాయణ్ | 23 |
| 7. | గ్రామీణ మౌలిక సదుపాయాలూ, గ్రామీణ విద్యుదీకరణ – డా॥ హిరణ్మయ్ రాయ్, డా॥ అనిల్ కుమార్, డా॥ ప్రసూం ద్వివేది. | 25 |
| 8. | బ్యాంకింగ్ రంగాన్ని కేంద్ర బడ్జెట్ పునరుద్ధరించగలదా? – ఎన్.ఆర్. భానుమూర్తి, మనీష్ ప్రసాద్ | 29 |
| 9. | బడ్జెట్ 2016-17లో పన్నుల హేతుబద్ధీకరణ ప్రతిపాదనలు – జయంత రాయ్ చౌదరి | 33 |
| 10. | విజ్ఞాన విపంచి – ప్రాతూరి పోతయ్య శర్మ | 36 |
| 11. | దర్పణం | 39 |
| 12. | "భారత్ లో తయారీ" కి పటిష్టమైన విధానం – నీరజ్ బాజ్ పాయ్ | 41 |
| 13. | కేంద్ర బడ్జెట్ 2016-17 :విద్యారంగానికి కేటాయింపులు – ప్రోవిత కుందు | 45 |
| 14. | జెండర్ బడ్జెట్ – నిబంధనలు | 49 |
| 15. | ఆరోగ్య బడ్జెట్–2016 – ఉర్మి ఎ.గోస్వామి | 52 |
| 16. | ఆత్మవిశ్వాసంతో ఆంధ్రప్రదేశ్ బడ్జెట్... – జీడిగుంట నాగేశ్వర రావు | 56 |
| 17. | సాగునీటి ప్రాజెక్టులకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చిన తెలంగాణ బడ్జెట్ – రేవూరు ఉమామహేశ్వరరావు | 60 |
| 18. | ప్రపంచ ఆర్థిక సమస్య – భారత్‌లో సంస్కరణల ప్రభావం – జి. అనూష | 63 |
| 19. | మహిళారోగ్యం –పౌష్టికాహార లోపం – మీరా మిశ్రా | 66 |
| 20. | భారత్‌లో తయారీ రంగం (మేక్ ఇన్ ఇండియా) – సందీప్ దాస్ | 69 |

**ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల గురించిన సమాచారాన్ని అందజేసేందుకు తెలుగు, హిందీ, ఇంగ్లీషు, అస్సామి, బెంగాలి, తమిళం, ఉర్దూ, మరాఠీ, గుజరాతీ, మళయాళం, పంజాబీ, కన్నడ, ఒడియా భాషలలో వెలువడుతున్న మాసపత్రిక.**

**యోజన (తెలుగు) చందా వివరాలు**

**1 సంవత్సరానికి - రూ. 230/- 2 సంవత్సరాలకు - రూ. 430/- 3 సంవత్సరాలకు - రూ. 610/-**

**మరిన్ని వివరాలకోసం : 040-27546312 / 13 / 14**

**చందాను మనియార్డర్ / డి.డి. ద్వారా పంపవలసిన చిరునామా** :ఎడిటర్, యోజన (తెలుగు)

205, 2వ అంతుస్తు, సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ – 500 080

యోజనలో ప్రచురించిన వ్యాసాలలో వ్యక్తపరిచిన భావాలు ఆయా రచయితలవే, వారు పనిచేస్తున్న సంస్థలు, ప్రభుత్వ అభిప్రాయాలను అవి ప్రతిబింబించవు.

యోజనలో ప్రచురించే ప్రకటనలలోని అంశాలు ఆయా సంస్థలు వారి ప్రతినిధులకు చెందినవి. ప్రకటన పాఠం/సారాంశం మూలంగా ఎదురయ్యే ఎటువంటి పర్యవసానాలకు యోజన బాధ్యత వహించదు.


ISSN : 0971-8729

# యోజన

చీఫ్ ఎడిటర్స్ డెస్క్

## సంపాదకీయం:

### జాతి నిర్మాణం




కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ సమర్పించిన తాజా బడ్జెట్ రైతులకు, పేదలకు మద్దతునిచ్చేదిగానూ, అభివృద్ధి ప్రేరకంగానూ ఉన్నట్లు ప్రజలనుండి ప్రతిస్పందన వచ్చింది. ఎందుకు రాదూ, నేటికీ స్థూల జాతీయ ఆదాయంలో 17 శాతం వ్యవసాయం నుండే వస్తున్నది. దేశంలోని కార్మికులలో సగం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. 2022 నాటికి రైతుల ఆదాయన్ని రెట్టింపు చేయాలనే ప్రభుత్వ ఉద్దేశ్యం కొంత అవాస్తవికంగా తోచవచ్చు, కానీ, రైతులలో కొంతమేరకైనా ఆత్మ విశ్వాసాన్ని, సంతోషాన్ని కలిగిస్తుంది కదా! వరుసగా రెండు సంవత్సరాల పంట నష్టం తరువాత, ఈ వార్త రైతులకు నిజంగా ఎంతో ఆశాజనకమైంది. "ప్రధానమంత్రి సించాయి యోజన" పథకం ద్వారా 28.5 లక్షల హెక్టార్ల భూమిని అదనంగా యుద్ధ ప్రాతిపదికపై సాగులోనికి తెచ్చే ప్రతిపాదన సమస్యను కొంతవరకూ పరిష్కరించవచ్చు. నాబార్డు నేతృత్వంలో మరో 20,000ల కోట్ల రూపాయలతో సాగునీటి లభ్యత మరో ప్రోత్సాహక చర్య! ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన పథకం రూ. 5,500ల కోట్ల కేటాయింపుతో ప్రతికూల పరిస్థితులలో రైతులను అదుకుంటుంది.

కేవలం ప్రజారంజకంగా కాక, ఈ బడ్జెట్‌లో, ప్రతిరంగానికీ వాస్తవిక కేటాయింపులతో, ప్రాథమిక అంశాలపై దృష్టి కేంద్రీకరించారు. బడ్జెట్‌లో అన్నింటికన్నా ప్రధానాంశము, గ్రామీణాభివృద్ధికి రూ. 87,765 కోట్లు ఒకే మొత్తంగా కేటాయించడం. అత్యధిక కేటాయింపు గ్రామ పంచాయితీలకు జరిగింది.రూ. 2.87 లక్ష కోట్ల కేటాయింపుతో ప్రతి గ్రామ పంచాయతీకీ, మునిసిపాలిటీకీ గత పంచవర్ష ప్రణాళికతో పోలిస్తే, కేటాయింపు 228 శాతం పెరగడం విశేషమే. అంటే సగటున ప్రతి గ్రామపంచాయతీకీ రూ. 80 లక్షల రూపాయలు, ప్రతి మునిసిపాలిటీకీ రూ. 21 కోట్లు కేటాయించినట్లు! మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి రూ. 38,500ల కోట్లు కేటాయించడంతో గ్రామీణ వ్యవసాయేతర రంగానికి, మరింత వూపునిచ్చినట్లయింది. గ్రామీణ మౌలిక సౌకర్యమైన రోడ్ల నిర్మాణానికి ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకానికి మరిన్ని నిధుల కేటాయింపు ఒక మేలు మలుపు. ఆరోగ్యం, మహిళా-శిశు సంక్షేమం వంటి సామాజిక రంగాలకు మరింత ప్రేరణనిచ్చేందుకు, అన్ని మంత్రిత్వశాఖల ద్వారా మహిళా-శిశు సంక్షేమంకోసం చేసే ఖర్చును 55 శాతం పెంచారు. మహిళా సశక్తీకరణ పథకం కేటాయింపును రెట్టింపు చేశారు. నిర్భయ పథకం కేటాయింపును కూడ అధికంచేశారు. గ్రామీణ ప్రాంతాలలో మహిళల పేరున ఎల్.పి.జి. కనెక్షన్లకు రూ. 2,000ల కోట్లను కేటాయించారు. గ్రామీణ పేద షెడ్యూల్డ్ కులాలు/తెగలకు చెందిన మహిళలు తమకాళ్ళపై తాము నిలబడేందుకు ఊతమిచ్చే 'స్టాండప్' పథకానికి రూ. 500 కోట్లు కేటాయించారు. మనదేశాన్ని ప్రపంచ నైపుణ్య రాజధానిగా చేసే లక్ష్యంతో 15 వందల బహుళ నైపుణ్య కేంద్రాల స్థాపనకు రూ. 1700 కోట్లు కేటాయించారు. ప్రధానమంత్రి కౌసల్య వికాస యోజన పథకంతో ఉద్యోగావకాశాలను యువత వద్దకే తెచ్చే లక్ష్యం పట్ల ప్రభుత్వ నిబద్ధతను తెలియచేస్తున్నది.

పారిశ్రామికరంగం విషయానికి వస్తే, గత బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా ప్రాథమిక పన్ను రేటును దశలవారీగా 30 శాతం నుండి 25 శాతనికి తగ్గిస్తారనే అందరూ భావించారు. కానీ ఆర్థికలోటును భర్తీ చేసేందుకు, ఎటువంటి తగ్గింపునూ ప్రకటించలేదు. అయితే, 'భారతదేశంలో తయారీ పథకానికి ఊతమిచ్చేందుకు, ప్రారంభ సంస్థలకు (స్టార్టప్‌లు) మూడు సంవత్సరాల పన్ను మినహాయింపునిచ్చారు. స్వయం ఉపాధి పొందిన అల్పాదాయ వ్యక్తులకు పన్ను చెల్లింపులో అత్యల్పంగా ఇంటి అద్దె భత్యంలో ఊరటనిచ్చి, అధిక ఆదాయంవున్న వారికి మాత్రం, మరో మూడుశాతం సర్ ఛార్జిని పెంచారు (అయితే వీరు పన్ను చెల్లింపుదారులలో కేవలం ఒక్క శాతం మాత్రమే!). పటిష్టమైన ప్రాథమిక సౌకర్యాలు పెట్టుబడులను ఆకర్షించడానికి అత్యావశ్యకమని గ్రహించి, రోడ్లు, రైళ్ళు, ఓడరేవులు, వంటి ప్రాథమిక సౌకర్యాలకు 2.21 లక్షల కోట్ల రూపాయలను కేటాయించారు. ఇళ్ళ నిర్మాణాన్ని ప్రోత్సహించేందుకు డెవలపర్లకు, వ్యక్తిగత నిర్మాణదారులకు పన్ను రాయితీనిచ్చారు. తొమ్మిది అంశాల ప్రాధాన్యంతో ప్రభుత్వం చేపట్టిన వ్యూహం నిజమైన సమస్యలను గుర్తించి, దీర్ఘకాలిక ప్రగతికి రాచబాట వేస్తుంది. ■

పటిష్టమైనచేయూత

ప్రత్యేక వ్యాసం

# గ్రామీణ, వ్యవసాయ రంగాలకు వెన్నుదన్ను 2016-17 కేంద్ర బడ్జెట్‌పై సమీక్ష



వ్యవసాయరంగంలో పెట్టుబడులను ప్రోత్సహించే దిశగా రాష్ట్రాలకు ఎలాంటి రాయితీలనూ ఇవ్వకపోవడం, జాతీయ స్థాయి నుండి నిధులు అట్టడగు స్థాయి వరకు సమానంగా చేరేందుకు అవసరమైన స్థానిక మార్పులు చేయకపోవడం మరియు భూ రికార్డుల ఆధునికీకరణను స్పృశించక పోవడం ఈ బడ్జెట్‌లోని లోపాలు.

భారతదేశంలో వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తూ గ్రామీణ ప్రాంతాలకు అభివృద్ధి చేసే దిశగా 2016-17 ఆర్థిక సంవత్సరం కోసం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ కేంద్ర ప్రభుత్వం ధ్యేయాన్ని ప్రస్ఫుటం చేస్తోంది. వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం చేపడుతున్న కొత్త పథకాలలో భాగంగా కీలకమైన సాగునీటి ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేసేందుకు అదనపు నిధులు కేటాయించడంతో దీర్ఘకాలిక సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభించే అవకాశం కనిపిస్తోంది. గత రెండేళ్లలో ఎదురైన వర్షాభావ పరిస్థితుల ఫలితంగా వ్యవసాయ రంగంలో అభివృద్ధి కుంటుపడడంతో కేంద్రప్రభుత్వం ఈ సారి వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. పదకొండవ పంచవర్ష ప్రణాళిక సందర్భంగా ఆశాజనకంగా కనిపించిన వ్యవసాయరంగం ఆ తర్వాత అభివృద్ధి గమనంలో తడబాటుకు లోనైంది. 2012-13 ఆర్థిక సంవత్సరంలో 1.5 శాతం తర్వాత ఏడాది 4.2 శాతం అభివృద్ధి నమోదుకాగా ఆ తర్వాత వృద్ధిరేటు 0.2 శాతానికి పడిపోవడం గమనార్హం. అలాగే 2015-16 ఆర్థిక సంవత్సరం వ్యవసాయాభివృద్ధి కేవలం 1.1 శాతం మాత్రమే ఉండగలదని కేంద్ర గణాంక కార్యాలయం అంచనా వేసింది.

వరుసగా రెండు సీజన్లలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో వ్యవసాయ రంగంలో మందగమనాన్ని అధిగమించలేక పోవడానికి సాగునీటి వసతి, విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల కొరత, మార్కెటింగ్ సౌకర్యలేమి ప్రధాన కారణాలుగా ప్రభుత్వం గుర్తించింది. అందువల్ల ఈ లోపాలను సవరించి, వ్యవసాయ రంగంలో దీర్ఘకాలిక సమస్యలను ముందుగ పరిష్కరించేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. ఈ చర్యల్లో భాగంగానే సాగునీటి వసతులు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, మార్కెటింగ్ సౌకర్యాలను మెరుగు పరిచే కార్యక్రమాలకు ప్రభుత్వం చేయూత నివ్వాలని భావిస్తోంది.

బడ్జెట్లో నిధుల కేటాయింపులను గమనిస్తే వ్యవసాయాభివృద్ధి, ఆహారోత్పత్తి, ద్రవ్యోల్బణం వంటి అంశాలన్నింటి పైన సానుకూలమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. 1990 దశకంలో వ్యవసాయాభివృద్ధి మందకొడిగా సాగడం వల్ల దేశ ఆర్థిక ప్రగతి కూడా దెబ్బతిన్నది. ఇలా వ్యవసాయాభివృద్ధి

**సీ.ఎస్.సీ. శేఖర్,** అసోసియేట్ ప్రొఫెసర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్, ఢిల్లీ యూనివర్సిటీ
E-mail: csekhar@iegindia.org

కుంటుబడటంతో 1997-98 నుంచి 2004-05 వరకు కీలకమైన జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగం వార్షికాభివృద్ధి రేటు కేవలం 2.2 శాతం మాత్రమే కావడం గమనార్హం. ఇలాంటి అభివృద్ధిని మనం హరిత విప్లవానికి ముందు కాలంలో మాత్రమే గమనించాం. అంతే కాకుండా ఆహారోత్పత్తి పెరుగుదల కూడా వెనుకడుగుగానే సాగింది. ఇలాంటి తిరోగమన పరిస్థితుల వల్ల వ్యవసాయ రంగంలో పెట్టుబడులు కూడా మందగించడంతో చివరకు పొలంలో విత్తనాలు చల్లడం, ఎరువులు వాడడం కూడా గణనీయంగా తగ్గి పోయేంతటి ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫలితంగా వ్యవసాయం లాభాల్లేని దండగమారి పరిశ్రమలా మారిపోయింది.

ఈ తిరోగమన పరిస్థితులు తొలిసారి 2005-06 ఆర్థిక సంవత్సరంలో కనిపించగా ప్రభుత్వం సానుకూల చర్యలు తీసుకోవడంతో పరిస్థితి కొంత అదుపులోకి వచ్చింది. 2007-08 సంవత్సరం నాటికి వ్యవసాయ రంగం అభివృద్ధిలో కొంత మార్పు కనిపించింది. అప్పట్లో వ్యవసాయ రంగంలో పెట్టుబడులను పెంచేందుకు రాష్ట్రాల వారీగా లక్ష్యాలను నిర్దేశించేందుకు రాష్ట్రీయ కృషి వికాస్ యెజన (ఆర్.కె.వి.వై.), జాతీయ ఆహార భద్రత కార్యక్రమాలను (ఎన్.ఎఫ్.ఎస్.ఎం.) చేపట్టడం వల్ల దేశవ్యాప్తంగా కొంతమేరకు ఆహారోత్పత్తి కూడా పెరిగినట్టు గణాంకాలు చెపుతున్నాయి. అయితే ఉత్పత్తి క్రమాల్లో ఒడిదుడుకులు ఉండడం, ఉత్పత్తులకు తగిన మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడం వల్ల రైతుకు తగిన గిట్టుబాటు ధర లభించకపోవడం వంటి కారణాల వల్ల వ్యవసాయాభివృద్ధి స్థిరంగా కోనసాగలేకపోయింది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఈ బడ్జెట్ ద్వారా తగిన చర్యలు తీసుకున్నది.

## సాగునీటి పారుదల

దేశంలో చాలావరకు వర్షాధారితమైన భూములే కావడమే వ్యవసాయ రంగాన్ని పీడిస్తున్న ప్రధాన సమస్య! దేశంలోని 45 శాతం పంటభూములకు మాత్రమే సాగునీటి సౌకర్యం ఉండడం వల్ల అత్యధిక శాతం భూమిలో దిగుబడి దైవాధీనంగా అనిశ్చిత పరిస్థితిలో కొనసాగుతోంది. ఈ పరిస్థితిని తప్పించేందుకు ఈ బడ్జెట్‌లో 17,000 కోట్ల రూపాయల ఖర్చు అంచనాతో 28 లక్షల హెక్టార్ల సేద్యపు భూమికి సాగునీటి వసతి కల్పించేందుకు ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన (పి.ఎం.కె.ఎస్.వై) ద్వారా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. అంతేకాకుండా, అసంపూర్తిగా నిలిచిపోయిన 89 సాగునీటి పథకాల నిర్మాణాన్ని వేగవంతం చేయడం ద్వారా 81 లక్షల హెక్టార్ల భూమికి సాగునీటి వసతి కల్పించేందుకు అక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్ ప్రోగ్రాం (ఏఐబీపీ) చేపట్టేందుకు నిధులను కేటాయించింది. మరో ఆరు వేల కోట్ల రూపాయలతో భూగర్భ జలవనరులను పరిపుష్టం చేసేందుకు ప్రభుత్వం మరో ప్రణాళికను రూపొందించింది. అంతేగాక మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సేద్యపునీటి చెరువులలో మరమ్మతు చేయించడం, పూడికలు తీయించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో సాగునీరు, తాగునీటి సరఫరా పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఈ పథకాలన్నింటికీ కలిపి సుమారు 25 వేల కోట్ల రూపాయలు ఖర్చుచేసే అవకాశం ఉండడం వల్ల వ్యవసాయ రంగానికి, గ్రామీణాభివృద్ధికి ఎంతో తోడ్పాటు లభిస్తుంది.

## పరపతి, బీమా సౌకర్యాలు

రైతుకు సకాలంలో తగినంత రుణ సహాయాన్ని అందజేయడం, రైతు పండించిన పంట నష్టం కాకుండా తగిన బీమా సౌకర్యం కల్పించడం వ్యవసాయ రంగంలో ప్రధానమైన సమస్యలు. వ్యవసాయ రంగం ద్వారా వచ్చే జాతీయోత్పత్తితో పోలిస్తే ఈ రంగానికి లభించే రుణ సౌకర్యం కూడా పెరుగుతూనే వచ్చింది. 1999-2000 ఆర్థిక సంవత్సరంలో 10 శాతంగా ఉన్న వ్యవసాయక రుణాల మొత్తం 2012-13 నాటికీ 38 శాతం పెరిగింది. అయితే వ్యవసాయ రంగానికి అందవలసిన దీర్ఘకాలిక రుణాల మొత్తం మాత్రం గణనీయంగా తగ్గిపోవడం దురదృష్టకరం. 2006-07లో 55 శాతంగా ఉన్న దీర్ఘకాలిక రుణాల మొత్తం 2011-12 నాటికీ 39 శాతానికి పడిపోయింది. ఈ పరిస్థితిని చక్కదిద్ది దీర్ఘకాలిక రుణాల లక్ష్యాన్ని 8.5 లక్షల కోట్ల నుంచి ఈ బడ్జెట్‌లో తొమ్మిది లక్షల కోట్లకు పెంచారు. అంతేకాకుండా రైతు రుణాలపై వడ్డీ రాయితీ కల్పించేందుకు మరో 15 వేల కోట్ల రూపాయలు కేటాయించారు. అయినప్పటికీ భూమిపై యాజమాన్య, కౌలు హక్కులు కలిగిన నిజమైన రైతులకు మాత్రమే ఈ వడ్డీ రాయితీ లభిస్తోంది.

ఇక ప్రకృతి వైపరీత్యాలలో పంట నష్టపోయి, ఆర్థిక విషవలయంలో కొట్టుమిట్టాడుతున్న రైతులను ఆదుకునేందుకు కొత్తగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కోసం 5,500 కోట్ల రూపాయలు కేటాయించారు. ఈ పథకం కింద బీమా ప్రీమియం (కిస్తీ) మొత్తాన్ని ఆహార ధాన్యాలు, నూనెగింజలు పంటలపై రెండు శాతంగాను ప్రతి ఇతర తోట పంటలపై ఐదు శాతంగాను నిర్ణయించారు. ఈ పథకంలో బీమా సొమ్ము మొత్తంపై పరిమితి లేనందువల్ల ప్రీమియం ఎంతైనా చెల్లించి, అందుకు తగిన నిష్పత్తిలో బీమా సొమ్ము పొందవచ్చు. అలాగే ఎరువులు, రసాయనాల సబ్సిడీని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో వేసే ప్రయోగాత్మక ప్రణాళికను రూపొందించారు. అయితే ఇవన్నీ భూమిపై హక్కులు, లేదా గుర్తింపు పొందిన కౌలుదారులకు మాత్రమే వర్తిస్తాయి. ఈ

సానుకూల ప్రణాళికల వల్ల రైతులకు ఎంత మేరకు లబ్ధి చేకురుతుందన్నది రైతుల నీతినిజాయితీపైన, వీటిని అమలు చేసే అధికారుల చిత్తశుద్ధిపైన ఆధారపడి ఉంటుంది. వీటి అమలు తీరును పరిశీలించిన తర్వాత కాని ఫలితాలు ఎలా ఉన్నాయన్నది చెప్పలేం. కానీ ఇవన్నీ రైతులకు వినియోగపడే కార్యక్రమలేనని మాత్రం స్పష్టంగా చెప్పవచ్చు.

### ధాన్యం సేకరణ, పంపిణీ, మార్కెటింగ్ సౌకర్యాలు

పారదర్శకమైన, వికేంద్రీకరణ పద్ధతుల్లో "ఆన్‌లైన్" సేవల ద్వారా రైతుల వద్దనుంచి ధాన్యం సేకరణ, పంపిణీ, మార్కెటింగ్ సౌకర్యాలను కల్పించే విషయంలో అన్ని రాష్ట్రాలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం ఈ బడ్జెట్ ప్రత్యేకతగా చెప్పవచ్చు. పప్పు ధాన్యాల నిల్వలను పెద్ద ఎత్తున పెంచడం ద్వారా ధరలను అదుపులో ఉంచేందుకు కూడా ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ప్రత్యేక శ్రద్ధ చూపింది. దేశంలో ఉన్న సుమారు 5.35 లక్షల చౌక దుకాణాలలో సుమారు మూడు లక్షల దుకాణాలకు ఆధునీకరించిన కంప్యూటర్ సౌకర్యాలను కల్పించాలనే ప్రతిపాదన ఈ బడ్జెట్‌లో కనిపిస్తుంది. సుమారు 200 కోట్ల రూపాయల కేటాయింపులతో ఏర్పాటు చేసిన వ్యవసాయ సాంకేతిక మౌలిక సదుపాయాల నిధి (అగ్రి-టెక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్-ఏఐటీఎఫ్) ద్వారా జాతీయ వ్యవసాయ మార్కెట్‌ను (నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్-నామ్) స్థాపించాలని గత ఏడాది జూలైలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. ఈ బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో 585 రెగ్యులేటెడ్ అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ మార్కెట్ కమిటీలను అనుసంధానం చేసేందుకు ప్రతిపాదించారు. అయితే దీనికి అనేక ప్రతిబంధకాలు ఉన్నాయి. అందులో ముఖ్యమైనది ప్రస్తుతం వివిధ రాష్ట్రాలు ప్రస్తుతం అనుసరిస్తున్న అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీల చట్టాల్లో మార్పులు తీసుకురావలసి ఉంటుంది. వివిధ ప్రాంతాల్లో ధరలు తెలుసుకుని, ఎలక్ట్రానిక్ పద్ధతిలో జరిగే వేలంలో పాల్గొనేందుకు, సింగిల్ పాయింట్ మార్కెట్ ఫీజు చెల్లింపుతో పాటు రాష్ట్ర మంతటికీ ఒకే లైసెన్స్ విధానం అమలు చేయవలసి ఉంటుంది. ప్రస్తుతం 12 రాష్ట్రాలు మాత్రమే ఏపీఎంసీ చట్టంలో మార్పులు చేసుకోగా మిగిలిన రాష్ట్రాలు ఈ నిబంధనలను పాటించడం కోసం వేగవంతమైన చర్యలను తీసుకోవలసి ఉంది. తోట పంటలకు సంబంధించి మన దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఏమిటంటే పండ్లు. కూరగాయల ఉత్పత్తులలో సుమారు 20 నుంచి 22 శాతం వరకు మార్కెట్‌కు చేరకముందే చెడిపోయి పనికిరాకుండా పోవడం లేదా వృధాకవడం. (ఎపెడ 2007). 2015-16 ఆర్థిక సర్వేలో తాజా గణాంకాలు సైతం కనీసం 15 శాతం తోట పంటల ఉత్పత్తులు వృధా అవుతున్నట్లు స్పష్టం చేస్తున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీలో నూటికి నూరు శాతం విదేశీ పెట్టుబడులను అంగీకరించడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తులలో వృధాను అరికట్టేందుకు ప్రభుత్వం యోచిస్తున్నది.

### గ్రామీణాభివృద్ధి

ప్రస్తుత బడ్జెట్లో గ్రామీణాభివృద్ధి నిధులను 87.765 కోట్ల రూపాయలకు పెంచారు. ఇందులో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 38,500 కోట్ల రూపాయలు కేటాయించారు. అంతే గాకుండా మునుపెన్నడు లేనంత పెద్ద ఎత్తున సుమారు 2.87 లక్షల కోట్ల రూపాయల సొమ్మును గ్రామపంచాయతీలకు, పురపాలక సంఘాలకు నేరుగా చెల్లించడం వల్ల ఒక్కొక్క గ్రామపంచాయతీకి సగటుల 80 లక్షల రూపాయల మేరకు నిధులు అందే అవకాశం లభించింది. అలాగే ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీ.ఎం.జీ.ఎస్.వై.)కు పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం గ్రామీణాభివృద్ధి దిశలో కీలకమైన చర్యగా చెప్పవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రోడ్లు, భవనాల నిర్మాణం, సేవా కార్యక్రమాల విస్తరణ వల్ల వ్యవసాయేతర రంగాలలో కూడా భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు ఏర్పడుతున్నాయి. దీంతో ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు లభించడం వల్ల వ్యవసాయ రంగంపై ఒత్తిడి తగ్గడమేగాక వ్యవసాయం కూడా మరింత లాభసాటిగా మారేందుకు మార్గం సుగమమవుతుంది.

### బడ్జెట్‌లో లోటుపాట్లు

ఎంత గొప్పగా చెప్పుకున్నప్పటికీ ఈ బడ్జెట్లో కొన్ని లోటుపాట్లు కూడా లేకపోలేదు. మొట్టమొదటిది వ్యవసాయ రంగంలో పెట్టుబడులను పెంచే దిశగా రాష్ట్రాలకు ఎలాంటి ప్రత్యేక రాయితీలు కల్పించక పోవడం ఈ బడ్జెట్‌లోనే ప్రధానమైన లోపంగా కనిపిస్తోంది. వాస్తవానికి రాజ్యాంగ రీత్యా వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వాలే తగిన చర్యలు తీసుకోవలసి ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం తగిన చేయూత నివ్వకపోతే లక్ష్యసాధన కష్టసాధ్యమే అవుతున్నది. ఇటీవల కొంతకాలంగా వ్యవసాయ రంగంలో పెట్టుబడులు గణనీయంగా తగ్గిపోతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్న తరుణంలో వ్యవసాయ రంగం వైపు పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నాలు ముమ్మరంగా సాగవలసి ఉంది. అభివృద్ధి సూచికలను పరిగణనలోకి తీసుకుంటే వ్యవసాయరంగంలో జరుగుతున్న అభివృద్ధికి తగినట్టు పెట్టుబడులు లేవన్నది స్పష్టమవుతోంది. వ్యవసాయ రంగంలో పెట్టుబడులు గణనీయ ప్రమాణంలో తగ్గిపోవడం 2004-05 ఆర్థిక సంవత్సరం నుంచీ జరుగుతుండగా కేవలం 2011-12 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగంలో

పెట్టుబడులు 18.3 శాతం నుంచి 2014–15లో 15.8 శాతానికి తగిపోవడం గమనార్హం. ఈ పరిస్థితుల్లో వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెంచేదిశగా రాష్ట్ర ప్రభుత్వాలను ప్రోత్సహించేందుకు తగిన చర్యలు ఈ బడ్జెట్‌లో సూచించకపోవడం దురదృష్టకరం.

ఇక అభివృద్ధి క్రమంలో నిర్దేశిత ప్రణాళికలు, నిధులు పైనుంచి అట్టడుగు స్థాయి వరకు ప్రవహించే సందర్భంగా స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తగిన మార్పులు చేసుకునే స్వేచ్ఛ కల్పించక పోవడం ప్రస్తుత బడ్జెట్‌లో రెండో ప్రధాన లోపంగా కనిపిస్తోంది. అడుగడుగునా విభిన్నమైన భౌగోళిక, వాతావరణ పరిస్థితులు కలిగిన భారత దేశంలో సాగునీటి పారుదల, పంటల బీమా వంటి పథకాలను అమలు చేసేటప్పుడు స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తగిన విధంగా మార్పులు చేసుకున్నప్పుడే ఆశించిన ప్రయోజనం సిద్ధిస్తుంది. అయితే ప్రస్తుత బడ్జెట్ సూచనలపైన చెప్పించే క్రింది స్థాయిలో అమలు చేయాలన్న ధోరణి కొట్టొచ్చిన లోపంగా కనిపిస్తోంది. దీన్ని ఆధిగమించేందుకు వివిధ రాష్ట్రాల్లో ఇప్పటికే తయారైన రాష్ట్రీయ కృషి విజ్ఞాన్ యోజన (ఆర్.కె.వి.వై.) జిల్లా వ్యవసాయ ప్రణాళిక (డి.ఎ.పి.)లను సునిశితంగా పరిశీలించి అమలుచేసినప్పుడే తగిన లాభం కలుగుతుంది. (సేన్........2016)

కౌలు రైతులకు కూడా వ్యవసాయ రుణాలు, పంటల బీమా వంటి సౌకర్యాలను విస్తరించేలా, భూమి రికార్డులను ఆధునీకరించే దిశగా పటిష్టమైన చర్యలను ఈ బడ్జెట్‌లో కూడా సూచించలేకపోవడం మరో విచారకరమైన అంశం. వ్యవసాయ, గ్రామీణ, రంగాల్లో కీలకమైన కౌలు రైతులకు, యాజమానులకు సంబందించిన హక్కులను విడివిడిగా, స్పష్టంగా పేర్కొంటూ భూముల రికార్డులను ఆధునికీకరించకపోతే, భూమి రికార్డులతో ముడిపడి చేయాల్సిన అభివృద్ధికి అసలు అర్థమే ఉండదు. అందువల్ల యాజమాన్య హక్కులకు, కౌలురైతుల హక్కులకు సంబందించిన చట్టాలను పటిష్టపరిచి వ్యవసాయ కార్యక్రమాలన్నింటినీ పారదర్శకంగా సాగించగలిగేనప్పుడే అందరకీ ప్రయోజనం కలుగుతుంది. భూమి రికార్డుల ఆధునీకరణపై రైతులలో అవగాహన పెంచాల్సి ఉంది. ప్రస్తుతం ఈ లోపంవల్ల అసలైన లబ్దిదారులకు ప్రయోజనం లేకుండా పోతోందని నీతీ ఆయోగ్ కూడా స్పష్టంచేసిన విషయాన్ని ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించి భూమి రికార్డుల ఆధునీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి.

ఇక చివరగా వ్యవసాయ సేవల విస్తరణ అంశంలో ఆధునిక సంకేత పరిజ్ఞానాన్ని వినియోగించుకునే విషయంలో తగిన శ్రద్ధ వహించినట్టు కనిపించడంలేదు. రైతులు వ్యవసాయంలో ప్రభుత్వ పథకాలను, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించు కోలేకపోవడానికి కారణం వాటికీ తగినంత ప్రచారం లేకపోవడమే! అందువల్ల వ్యవసాయ విజ్ఞానాన్ని, ప్రభుత్వ పథకాలను రైతులకు అందుబాటులోకి తెచ్చేలా తగిన ప్రచారం కల్పించినప్పుడే బడ్జెట్ ద్వారా ఆశిస్తున్న అభివృద్ధి సాధ్యమవుతుంది.


**FORM IV**

Statement about ownership and other particulars about
Yojana(Telugu)


| | | | |
|---|---|---|---|
| 1. | Place of Publication | : | Room No.205, 2nd Floor, CGO Towers, Kavadiguda, Hyderabad, Telangana-500 080 |
| 2. | Periodicity of Publication | : | Monthly |
| 3. | Printer's Name & Nationality Address | : | Dr. Sadhana Rout<br>Indian<br>Publications Division, Soochna Bhavan, New Delhi-110 003 |
| 4. | Publisher's Name & Nationality Address | : | Dr. Sadhana Rout<br>Indian<br>Publications Division, Soochna Bhavan, New Delhi-110 003 |
| 5. | Editor's Name & Nationality Address | : | Vedagiri Vijaya Kumar<br>Indian<br>Yojana(Telugu)<br>Room No.205, 2nd Floor, CGO Towers, Kavadiguda, Hyderabad-500 080 |
| 6. | Names & Address of the Individuals who own the Newspaper and partners of Shareholders holding more than One percent of the total capital | : | Wholly owned by Ministry of Information & Broadcasting Government of India, New Delhi-110 001 |

I, Dr. Sadhana Rout, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Dated: 29-02-2016

(Sadhana Rout)
Additional Director General(I/c)
Publications Division
Ministry of Information & Broadcasting
New Delhi-110 003

# రెవిన్యూలోటు, విత్తలోటు ధోరణులు-ఆర్థికరంగం




**పీపీపీ విధానంలో రైల్వే స్టేషన్ల అభివృద్ధి చేయాలనే అంశం పై దృష్టిని కేంద్రీకరించడం మంచి ముందడుగు. విధాన రూపకల్పన – అమలు ప్రక్రియలను వేరు చేయడంపై దృష్టిని కేంద్రేకరించ వలసిఉంది. ప్రణాళికా పెట్టుబడులు ఎంత భారీగా ఉ న్నాయనే దాని కన్నా బడ్జెట్‌లో నిర్దేశించుకున్న లక్ష్యాలను ఏ మేరకు సాధించారు, స్థూలంగా ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం ఎలా ఉంది అన్నదే బడ్జెట్ సమర్థతకు గీటురాయిగా నిలుస్తుంది.**

దేశాన్ని ఆర్థిక సుస్థిరత, అభివృద్ధి పథంలో నడిపించాలంటే వివేకంతో పావులు కదుపుతూ విత్తస్థిరీకరణ సాధించడం అత్యంత కీలకం. ఆర్థిక రంగంలో స్థిరమైన వృద్ధి సాధించే లక్ష్యంతోనే ప్రభుత్వం 2003 సంవత్సరంలో ఆర్థిక బాధ్యతలు, బడ్జెట్ నిర్వహణ చట్టం–2003 (ఎఫ్ఆర్‌బిఎం) రూపొందించింది. వ్యయాలను హేతుబద్ధీకరించి, ప్రాధాన్యతలు పునర్ నిర్వచించడం ద్వారా భవిష్యత్తులో రెవిన్యూ, విత్తలోటు రెండింటినీ నిర్దేశిత స్థాయిల్లో నిలువరించడం కోసం ఎఫ్ఆర్‌బిఎం పరిధిలో ప్రభుత్వం కృషి చేస్తోంది.

ఈ ఎఫ్ఆర్‌బిఎంఏ చట్టాన్ని మార్గదర్శకంగా చేసుకుని ఆర్థిక రంగానికి అత్యంత కీలకమైన వివిధ సూచికలను విశ్లేషించడం ద్వారా 2016–17 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం ఇటీవల ప్రతిపాదించిన బడ్జెట్‌ను, ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావాన్ని మదింపు చేయవచ్చు. ప్రభుత్వం తాను సాధించినట్టు చెప్పుకుంటున్న ఆర్థిక విజయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటూ వివిధ లోటు సూచికల ఆధారంగా బడ్జెట్ ఎంత ఆరోగ్యకరంగానూ, సుస్థిరతను సాధించగలదిగా ఉన్నదో విశ్లేషించాల్సి ఉంటుంది. మనకి అందుబాటులో ఉన్న ప్రధాన ఆర్థిక సూచికలు రెవిన్యూలోటు, విత్తలోటు, ప్రాథమిక లోటు. బడ్జెట్ సాధించిన స్థూల ఆర్థిక విజయాలు, దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలన్నింటినీ మదింపు చేయడానికి ఈ ఆర్థిక సూచికలు అత్యంత కీలకం. సమ్మిళిత వృద్ధి పథం వీడకుండానే దీర్ఘకాలిక వృద్ధి, ప్రస్తుత అవసరాలకు వనరులు సమకూర్చుకుంటూనే ప్రభుత్వం రెవిన్యూలోటు, విత్తలోటు రెండింటినీ నిర్దేశిత పరిధిలో ఏ విధంగా అదుపు చేయగలి గిందన్నదే బడ్జెట్ ఎంత మేరకు విజయం సాధించిందనేందుకు గీటురాయి.

## రెవిన్యూలోటు, ఆర్థిక క్రమశిక్షణపై దాని ప్రభావం

''ప్రభుత్వానికి అందుతున్న ఆదాయాన్ని మించిపోయి ప్రభుత్వ వ్యయాలు ఏ స్థాయిలో ఉన్నాయి" అన్నది తెలియచేసేదే రెవిన్యూలోటు. ఎఫ్ఆర్‌బిఎంఏ అనంతర కాలంలో ప్రభుత్వ రెవిన్యూలోటు లక్ష్యాలు, వాస్తవంగా సాధించిన స్థాయిలను ఈ దిగువ పట్టిక–1 సూచిస్తుంది.

**డాక్టర్ అమేయకుమార్ మహాపాత్రా,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఎకనామిక్స్) ఫార్చ్యూన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ (ఎఫ్ఐబి) వసంత్ విహార్, న్యూఢిల్లీ – చరవాణి : 08826464474

**పట్టిక – 1: జాతీయ స్థూల ఉత్పత్తిలో రెవిన్యూ లోటు వాస్తవాలు, అంచనాల శాతం.**

| సంవత్సరం | 2004-05 | 2005-06 | 2006-07 | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 | 2012-13 | 2013-14 | 2014-15 | 2015-16 | 2016-17 | 2017-18 | 2018-19 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| రెవిన్యూ లోటు అంచనా (శాతం) | 2.5 | 2.7 | 2.1 | 1.5 | 1 | 4.8 | 4 | 3.4 | 3.4 | 3.3 | 2.9 | 2.8 | 2.3 | *1.8 | *1.3 |
| వాస్తవ రెవిన్యూ లోటు (శాతం) | 2.5 | 2.6 | 1.9 | 1.1 | 4.5 | 5.2 | 3.3 | 4.4 | 3.6 | 3.1 | 2.9 | - | - | - | - |

మూలం కేంద్ర బడ్జెట్ పత్రాలనుంచి రచయిత సేకరించారు.

## రెవిన్యూలోటు ధోరణులు–ప్రభావం

ప్రభుత్వానికి ఆదాయం సమకూరే మార్గాలన్నీ పూర్తి స్థాయిలో మూసుకు పోవడంతో ఆ లోటును పూడ్చుకునేందుకు ప్రభుత్వం పెట్టుబడుల సమీకరణపై దృష్టిని సారించాల్సివస్తుంది. ఇలా సమీకరించే పెట్టుబడులు ఇటు ఆస్తులను తరిగించేయడమే కాకుండా అటు రుణభారాన్ని పెంచుతాయి గనుక రెవిన్యూ లోటు పూడ్చుకునేందుకు పెట్టుబడులు సమీకరించడం అత్యంత ప్రమాదకరమైన ధోరణి అనే చెప్పాలి. దీని వల్ల భవిష్యత్తులో వడ్డీచెల్లింపుల భారం పెరిగిపోతూ రెవిన్యూలోటును మరింతగా పెంచేస్తుంది. పైగా పెట్టుబడుల ఉపసంహరణ/ఆస్తుల విక్రయం అనేది కుటుంబ 'మూలసంపద'ను విక్రయించడం వంటిదే. ఇలా చేయడం వల్ల ఆదాయాలు మరింతగా క్షీణించిపోయి ప్రభుత్వ ఆదాయాల పరిస్థితి మరింత సంక్లిష్టం అవుతుంది. ఆదాయవనరులు ఉత్తేజితం చేయడం, పన్నులు, ఇతర మార్గాల్లో (నాన్‌టాక్స్) ఆదాయాలు పెంచుకోవడం ద్వారా రెవిన్యూలోటును కనీస స్థాయికి తగ్గించుకోవచ్చు.

## విత్తలోటు–ఆర్థిక క్రమశిక్షణపై దాని ప్రభావం

"ప్రభుత్వం సమీకరించే రుణాలు మినహా ఖజానాకు వస్తున్న ఆదాయాన్ని మించిపోయిన ప్రభుత్వ వ్యయం" విత్తలోటుగా నిర్వచించవచ్చు. ఒక ఆర్థిక సంవత్సరంలో లోటును పూడ్చుకోవడానికి ప్రభుత్వం ఎంత మొత్తంలో రుణాలు సమీకరించిందన్నది విత్తలోటు సూచిస్తుంది. ఇంకా వివరంగా చెప్పాలంటే ఒక దేశం ఆర్థిక పురోగతిని, రుణభారాన్ని మదింపు చేయడానికి ప్రత్యేకించి ఆ దేశ పౌరుల ఆర్థిక స్వస్థతను తెలుసుకునేందుకు విత్తలోటు ఒక సూచికగా నిలుస్తుంది. ప్రభుత్వాల రుణసమీకరణ కోణంలో ప్రభుత్వ నిధుల స్థితిపై ఒక సమగ్ర చిత్రాన్ని ఇది ఆవిష్కరిస్తుంది.

## విత్తలోటు ధోరణులు–దాని ప్రభావం

ఎఫ్‌ఆర్‌బిఎంఏ అనంతర కాలంలో (2004-05 నుంచి 2016-17 వరకు) విత్తలోటు ధోరణులు పరిశీలించడం వల్ల ఆర్థిక వ్యవస్థపై దాని తక్షణ ప్రభావం ఏ విధంగా ఉన్నదనేదే కాకుండా వర్తమాన, భవిష్యత్ అవసరాలపై కూడా దృష్టి పెట్టవచ్చు. ఆర్థిక స్థిరీకరణ సాధనలో ఒక సాధనంగా ఎఫ్‌ఆర్‌ఎంబిఏని ప్రవేశపెట్టడంతో 2004-05 విత్తలోటు 4.4 శాతం (2004-05), 4.3 శాతం (2005-06), 3.8 శాతం (2006-07), 3.3 శాతం (2007-08), 2.5 శాతం (2008-09) స్థాయిలకు క్రమంగా దిగుతూ వచ్చింది. కాని అంతర్జాతీయ ఆర్థిక మాంద్యం పరిస్థితులను దీటుగా ఎదుర్కొనేందుకు దేశంలో ఆర్థిక ఉద్దీపనలు ప్రకటించడంతో 2009-10 సంవత్సరంలో ఇది జిడిపిలో 6.8 శాతానికి దూసుకుపోయింది.


తిరిగి విత్తలోటు 2010-11 లో 5.5 శాతానికి, 2011-12లో 4.6 శాతానికి దిగివచ్చింది. మళ్ళీ 2012-13లో యూరో సంక్షోభం, దేశీయ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న మాంద్యపరిస్థితుల కారణంగా 5.1 శాతానికి చేరింది. ఆ తర్వాత మళ్ళీ అధోగమనం పట్టి 4.8 శాతం (2013-14), 4.1 శాతం (2014-15) స్థాయిలకు దిగివచ్చింది. 2016-17 సంవత్సరానికి ఆర్థికమంత్రి ఇటీవల ప్రతిపాదించిన బడ్జెట్‌లో కేల్కర్ కమిటీ సిఫారసులకు పాక్షికంగా కట్టుబాటును ప్రకటిస్తూ విత్తలోటును 2015-16 సంవత్సరంలో 3.5 శాతానికి కుదించగలిగినట్టు ప్రకటించారు.

కాగా ద్రవ్యోల్బణ వత్తిడులు, ఇతరత్రా కారణాలు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్న మాటను అంగీకరించాల్సి ఉన్నప్పటికీ విలువపరంగా ప్రభుత్వ రుణ సమీకరణ కొన్ని రెట్లు పెరగడం ఆందోళన కలిగించే అంశం. 2008-09 నుంచి 2015-16 సంవత్సరాల మధ్య కాలంలో వాస్తవ విత్తలోటు 1,33,287 కోట్ల రూపాయల నుంచి 5,55,649 కోట్ల రూపాయలకు పెరిగింది. అంటే ఏడు సంవత్సరాల కాలంలో ఇది నాలుగు రెట్లకు పైబడే పెరిగిందన్న మాట. కాని ఈ సారి బడ్జెట్‌లో ప్రభుత్వం విత్తలోటును జిడిపిలో శాతంగానే కాకుండా వాస్తవ గణాంకాల రూపంలో కూడా 5,33,904 కోట్ల

రూపాయలకు దించనున్నట్టు నిజాయతీతో కూడిన చిత్తశుద్ధిని ప్రకటించింది. ముందు సంవత్సరాలతో పోల్చితే ఇది అత్యంత సంతృప్తికరమైన స్థితి. ప్రభుత్వ ఆర్థిక విచక్షణ, బాధ్యతలు రెండింటి కోణంలో చూసినా విత్తలోటును జిడిపిలో శాతంగానే కాకుండా వాస్తవ విలువ పరంగా కూడా అదుపులోకి తేవాలన్న చిత్తశుద్ధికి ఇది దర్పణం పడుతోంది. ఈ రెండింటినీ సాధించ గలిగినప్పుడే విత్తపరమైన క్రమశిక్షణ సాధ్యం అవుతుంది.

### విత్తలోటు–రెవిన్యూలోటు మధ్య అనుబంధం

రెవిన్యూలోటు, పెట్టుబడుల వ్యయం రెండూ విత్తలోటులో ప్రధానమైన విభాగాలు.




ఆదాయాల్లో లోటును పూడ్చుకునేందుకే కాకుండా పెట్టుబడి వ్యయాల కోసం కూడా ప్రభుత్వం రుణాలు సమీకరిస్తుంది. అంటే రెవిన్యూలోటును ప్రభుత్వం ఎంత సమర్థవంతంగా నిర్దేశిత స్థాయిలకు అదుపు చేయగలిగిందన్న అంశం పైనే విత్తపరమైన విచక్షణ ఆధారపడి ఉంటుంది. వ్యయాలకు కోత విధించకుండా ఆదాయాలు పెంచుకోవడం ద్వారా మాత్రమే ఆర్థిక స్థిరీకరణ సాధ్యమవుతుంది. జాతి సామాజిక–ఆర్థిక సంక్షేమానికి తిలోదకాలిచ్చి వ్యయాలను తగ్గించడం ద్వారా విత్తలోటును నిర్దేశిత స్థాయిలకు కుదించడం ఏ విధంగాను సమర్థనీయం కాదు. ఈ కోణంలో చూస్తే పన్నుల పరిధిని విస్తరించడం ద్వారా పన్నుల ద్వారా సమకూరే ఆదాయాలు పెంచుకోవడం ఒక్కటే లోటును తగ్గించేందుకు సరైన ప్రత్యామ్నాయం.

రెవిన్యూ లోటు, విత్తలోటు మధ్య ఎప్పుడూ అవినాభావ సంబంధం ఉంటుంది. ఈ దిగువన ఇచ్చిన పట్టికలో దాన్ని స్పష్టంగా చూడవచ్చు. 2009–10 నుంచి 2016–17 మధ్య కాలంలో రెవిన్యూలోటు 4.8 శాతం నుంచి 2.3శాతానికి దిగివచ్చినా విత్తలోటుపై దాని ప్రభావం అధికంగానే ఉంది.

అంటే వ్యయాలకు ఎలాంటి కోత విధించకుండానే రెవిన్యూలోటును తగ్గించడం ద్వారా మాత్రమే విత్తలోటును తగ్గించడం సాధ్యం. ఆదాయాలు పెంచుకోవడం, వ్యయాలను హేతుబద్ధీకరించడం ఇందులో ప్రధానం. ఆర్థిక స్థిరీకరణ సాధించాలంటే సమర్థవంతమైన, ఆచరణీయమైన వ్యయ నిర్వహణ కీలకం. ఈ లక్ష్యంతోనే ప్రణాళికేతర రెవిన్యూ వ్యయాల్లో ప్రాధాన్యతలను పునర్ నిర్వచించేందుకు ప్రభుత్వం 'వ్యయ సంస్కరణల కమిషన్'ను ఏర్పాటు చేసింది. వివిధ పద్దుల కింద సమర్థవంతంగా నిధుల కేటాయింపు, లోటుపాట్లు సరిదిద్దడం ద్వారా లీకేజిల నివారణకు మార్గాలను ఈ కమిషన్ నిర్దేశించాల్సి ఉంది.

### ఆర్థిక సుస్థిరత–నాణ్యత అంచనా

ప్రణాళికా పెట్టుబడులు ఎంత భారీగా ఉన్నాయనే దాని కన్నా బడ్జెట్‌లో నిర్దేశించుకున్న లక్ష్యాలను ఏ మేరకు సాధించారు, స్థూలంగా ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం ఎలా ఉంది అన్నదే బడ్జెట్ సమర్థతకు గీటురాయిగా నిలుస్తుంది. విత్తలోటును నిర్దేశిత స్థాయికి కుదించడం అనేది గణాంకాలకే పరిమితం కాకుండా దాని నాణ్యత, పరిణామాలు కూడా ప్రధానమే. 2016–17 సంవత్సరపు బడ్జెట్ విత్తలోటుకు ఒక స్థిరమైన నమూనా ఆవిష్కరించింది. వ్యయాలకు కోత విధించకుండానే మూలధన ఆస్తుల పైన, వివిధ సంక్షేమ పథకాల పైన వ్యయాలను పెంచడం ప్రధానాంశాలుగా విత్తలోటును కుదించడం ఈ నమూనాలో ప్రత్యేకంగా చెప్పుకోదగిన అంశం. ఆదాయాలను ఏయే వనరుల ద్వారా ఎంతమేరకు పెంచుకో గలుగుతారన్న అంశంపై విత్తలోటు, రెవిన్యూలోటు రెండింటినీ పూడ్చుకోవడం అనేది ఆధారపడి ఉంటుంది. దీన్నే 'ఎం3 నమూనా'గా (ఎం3: మరింత వ్యయం, మరింత ఆదాయం నమూనా) వ్యవహరిస్తున్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఇది స్పష్టంగా ప్రతిబింబించింది. గౌరవనీయులైన మన ఆర్థికమంత్రి ఆదాయాలను పెంచుకోవడం, కీలక రంగాలపై అధికంగా వ్యయం చేయడం వంటి ధోరణి అనుసరిస్తూ విత్తలోటును జిడిపిలో 3.5 శాతానికి కట్టడి చేసే దిశగా అతి జాగ్రత్తగా చర్యలు తీసుకున్నారు. 2015–16 సవరించిన అంచనాలతో పోల్చితే ప్రణాళికా పెట్టుబడిని 15.3 శాతం, ప్రణాళికేతర పెట్టుబడిని 9 శాతం పెంచేందుకు బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

ఇక ఆదాయాల విషయానికి వస్తే ఆధారనీయమైన పన్ను విధానాలు అమలుపరచాలని ఆర్థికమంత్రి కట్టుబాటు ప్రకటించారు. సమాజంలో అసమానతలు తగ్గించేందుకు అధికాదాయ వర్గాలపై అధిక

పన్నులు ప్రతిపాదించారు. పర్యావరణపై ప్రతికూల ప్రభావం చూపుతున్న, మానవ ఆరోగ్యం, జీవితానికి ప్రమాదకరంగా పరిగణిస్తున్న వస్తుసేవలపై పన్నులు పెంచారు. అదే సమయంలో వ్యవసాయం, గ్రామీణ రంగాలకు, నిరాదరణకు గురవుతున్న, నిస్సహాయులైన ప్రజల సంక్షేమానికి అధికంగా దోహదపడే పథకాలపై కేటాయింపులు విశేషంగా పెంచారు. అంతే కాదు విదేశాల నుంచి ఎదురయ్యే ఎలాంటి ప్రతికూలతలు, ఆర్థిక అస్థిరతలు తట్టుకోగల వెసులుబాటు ఉంచుకుంటూనే విత్తలోటును నిర్దేశిత పరిధిలో నిలువరించాలన్న కట్టుబాటును ప్రకటించారు.

## ఆర్థిక స్థిరీకరణకు ప్రభుత్వ చర్యలు

కేల్కర్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా రూపొందించిన ఎ.ఎఫ్.ఆర్. బి.ఎం.ఏ నిర్దేశించిన మేరకు విత్తలోటును 2016-17 సంవత్సరం నాటికి జిడిపిలో మూడు శాతానికి కట్టడి చేయాలన్న లక్ష్యసాధనలో మనం ఒక ఏడాది వెనుకబడి ఉన్నప్పటికీ అందుబాటులో ఉన్న పరిమిత అవకాశాల పరిధిలోనే ఆర్థిక స్థిరీకరణ సాధించేందుకు ప్రస్తుత ప్రభుత్వం గట్టిగానే కృషి చేస్తోంది. ఆర్థిక కార్యకలాపాలను, పన్నుల పరిధిని విస్తరించడం, పన్ను వసూళ్ళు పెంచడం, పన్ను విధానాల మెరుగైన నిర్వహణ, జిడిపిలో పన్నుల వాటా పెంపు, వ్యయ సమర్థత వంటి చర్యలు అనుసరించడం, స్థూల ఆర్థిక వాతావరణం మెరుగుపరచడం, సత్పరిపాలన ద్వారా ఈ ఆర్థిక లక్ష్యాలు సాధించవచ్చు.

నిర్దేశిత పరిధిలో విత్తలోటును కట్టడి చేసేందుకు తీసుకోదగిన కొన్ని సార్వత్రిక చర్యలు పరిశీలిద్దాం...

## 1. వ్యయహేతుబద్ధీకరణ


విత్తలోటును నిర్దేశిత స్థాయిలకు కట్టడి చేయాలంటే ప్రభుత్వం వ్యయాలను హేతుబద్ధీకరించడం తప్పనిసరి. అలాగే విలువైన వనరులను పొదుపుగా వినియోగించుకోవాలంటే వివిధ పద్దుల కింద నిధుల కేటాయింపు న్యాయబద్ధంగాను, సమతూకంగాను ఉండేలా చూసుకోవడంతో పాటు లీకేజిలు నివారించుకోవడం, లోటుపాట్లేవైనా ఉంటే వాటిని తొలగించడం కూడా తప్పనిసరి. అంతే కాదు సమాజంలోని అట్టడుగు, అల్పాదాయ వర్గాల సంక్షేమంతో రాజీ పడకుండానే ప్రాధాన్యతలను పునర్ నిర్వచించుకోవాలి. సమర్థతలు పెంచుకోవడం, అవినీతి అదుపులోకి తేవడం, పాలనాపరమైన నష్టాలను తగ్గించుకోవడమే ఇందుకు మార్గం. ఆదాయాలు, మూలధన వనరుల మధ్య అసమతుల్యతను తొలగించడం ద్వారా మాత్రమే వ్యయాల హేతుబద్ధీకరణ సుసాధ్యమవుతుంది.

## 2. ఆదాయాల పెంపు


ఖజానాకు వచ్చే ఆదాయాలను పెంచుకోవడం ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన ధ్యేయం. పన్నుల ద్వారాను, ఇతరత్రా మార్గాల ద్వారాను మరింతగా ఆదాయాలను ఆర్జించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంది. పన్నుల పరిధిని విస్తరించడం, పన్ను వసూళ్ళను పెంచడం, పన్ను వ్యవస్థ మెరుగైన నిర్వహణ చర్యల ద్వారా జిడిపిలో పన్నుల శాతాన్ని పెంచనున్నట్టు ప్రతిపాదించింది. ఈ చర్యలన్నీ విత్తలోటును గణనీయంగా తగ్గించడానికి, ఎఫ్ఆర్బిఎం చట్టం పరిధిలో విత్త క్రమశిక్షణ సాధించడానికి సహాయకారిగా ఉంటాయి.

## వ్యాసంలోని అంశాల సమీక్ష

బడ్జెట్ ఎంత భారీగా ఉంది అనే కన్నా అందులో నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎంత మేరకు సాధించగలిగారు, జాతి విస్తృత సంక్షేమాన్ని, సమాజంలోని అట్టడుగు వర్గాల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకుని రూపొందించిన వివిధ పథకాలు, కార్యక్రమాల అమలు తీరు ఎలా ఉంది, ఆయా పథకాల సమర్థతను ప్రభుత్వం ఏ విధంగా పర్యవేక్షిస్తోంది అన్న అంశాల పైనే బడ్జెట్ విజయం ఆధారపడి ఉంటుంది. వ్యయాలను సమర్థవంతంగాను, ఆచరణీయంగాను అదుపులోకి తేవాలి. పన్నుల పరిధిని విస్తరించాలి. అవే విత్త నిర్వహణ, ఆర్థిక స్థిరీకరణకు మూలంగా నిలుస్తాయి. పన్నేతర విభాగాలకు సంబంధించిన వ్యయాలను కూడా శాస్త్రీయంగా రూపొందించాలి. అప్పుడే ఆ విభాగాల సమర్థనీయత పెరుగుతుంది. సామర్థ్యాలను పెంచడం, అవినీతిని, నిర్వహణాపరమైన వ్యయాలను అదుపు చేయడం ద్వారా పిఎస్యుల నిర్వహణను మెరుగుపరచాలి. ఇవి సాధిస్తే రెవిన్యూలోటు, విత్తలోటు వాటికవే అదుపులోకి వస్తాయి. ఎఫ్ఆర్బిఎం చట్టం నిర్దేశించిన పరిధిలో ఆర్థిక స్థిరీకరణ సాధించి ఆర్థిక సుస్థిరతకు మార్గం సుగమం అవుతుంది.



# మౌలిక సదుపాయాలకు బడ్జెట్ కేటాయింపులు



**పీపీపీ విధానంలో రైల్వే స్టేషన్ల అభివృద్ధి చేయాలనే అంశం పై దృష్టిని కేంద్రీకరించడం మంచి ముందడుగు. విధాన రూపకల్పన – అమలు ప్రక్రియలను వేరు చేయడంపై దృష్టిని కేంద్రీకరించ వలసిఉంది. ఇదిలా ఉంటె మరో వంక జాతీయ జలమార్గాలు, సముద్ర తీర నౌకాయానం పై సమగ్ర విధానం విషయంలో లక్ష్య శుద్ధి లోపం కనిపిస్తోంది.**

## పరిచయం:

దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి 2016–17 సంవత్సరపు కేంద్ర బడ్జెట్ సరైన దిశలోనే అడుగులు వేసింది. ఈ బడ్జెట్ లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ. 220 కోట్లను కేంద్ర వాటాగా కేటాయించారు. ఇందులో అత్యధికంగా రూ.70,000 కోట్లు జాతీయ రహదారులకు కేటాయించారు. ఈ మొత్తంలో రూ. 15000 కోట్లు బాండ్ల ద్వారా సమకుర్చుకుంటారు.

ఇక ఇతర మౌలిక అంశాలకు విభాగాల (డొమెన్ల)కు నిధుల కేటాయింపునకు సంబంధించి ఇంకా పూర్తి స్పష్టత రాలేదు. పత్రికలలో వచ్చిన వివరాలలో ఆ స్పష్టత కనిపించలేదు. ఇతర విభాగాలకు సంబంధించిన అంకెలు కేవలం, కేంద్ర బడ్జెట్ కేటాయింపులా, లేక వాటిలో రైల్వే బడ్జెట్ కేటాయింపులు, రాష్ట్రాల బడ్జెట్ కేటాయింపులు కూడ ఉన్నాయా? అన్న విషయంలో స్పష్టత కొరవడింది. అయితే, ఏ పద్దు (హెడ్) నుంచి ఎంతెంత నిధులు వస్తాయి అనే అంచనాలు, లెక్కలన్నీ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తయారు చేసినవే కాబట్టి, ఆర్థిక మంత్రిత్వ శాఖ వద్ద ఆ వివరాలన్నీ ఉండే ఉంటాయని నా నమ్మకం. బయటకు వచ్చిన అంకెలు కొంచెం గందరగోళంగా ఉన్నా, వాస్తవ అంకెలు, సంఖ్యలు ఇంకా ఎక్కువగానే ఉంటాయి. ఎందుకంటే, ఈ కేటాయింపులకు అదనంగా రాష్ట్రాలు ఖర్చు చేసే మొత్తాలుంటాయి, స్థానిక సంస్థలు ఖర్చు చేసే నిధులుంటాయి. అదే విధంగా కేంద్ర బడ్జెట్లో రైల్వేలకు చేసిన కేటాయింపు రూ. 45,000 కోట్లే అయినా, అందుకు అదనంగా రైల్వే సమకూర్చుకునే అంతర్గత వనరులు, బాండ్స్ రూపంలో, ఇతర రుణ సదుపాయ మార్గాలలో వచ్చేనిధులు, ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)ల ద్వారా సమకూరే నిధులు అన్ని కలుపుకుంటే అసలు మొత్తం అధికంగా ఉంటుంది.

ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన వంటి కొన్ని కేటాయింపులకు సంబంధించి రాష్ట్రాల వాటాలను కలుపుకుంటే బడ్జెట్ కేటాయింపుల కంటే వాస్తవ వ్యయం ఎక్కువగా ఉంటుంది. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజనకు కేంద్ర బడ్జెట్ కేటాయింపులు రూ. 19,000 కోట్లు. మరో రూ. 8000 కోట్లు రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేస్తాయి. అదే విధంగా మెట్రో ప్రాజెక్టులు. ఈ పద్దు కింద కేంద్ర బడ్జెట్లో రూ.10 వేల కోట్లు కేటాయించారు. ఇది కేంద్రం వాటా మాత్రమే. దీనికి రాష్ట్రాల వాటా

---

**జి. రఘురాం,** ప్రొఫెసర్, పబ్లిక్ సిస్టమ్స్ గ్రూప్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్, అహ్మదాబాద్.

కలుస్తుంది. సంఖ్య పెరుగుతుంది. ఇతర ప్రధాన మౌలిక సదుపాయాల రంగ ప్రాజెక్టుల, కేటాయింపులు ఇలా ఉన్నాయి.

| వరుస సంఖ్య. | రోడ్లు, రైలు, మెట్రోలను మినహాయించి మిగిలినవి | బడ్జెట్ అంచనాలు 2016-17 (రూ.లు కోట్లలో) |
|---|---|---|
| 1. | ప్రధానమంత్రి ఆవాస్ యోజన | 20075 |
| 2. | స్వచ్ఛభారత్ అభియాన్ | 11300 |
| 3. | దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన, సమీకృత ఇంధన అభివృద్ధి పథకం | 8500 |
| 4. | పట్టణ పునరుజ్జీవన పథకం (అమృత్ మరియు 100 స్మార్ట్ సిటీల అభివృద్ధి పథకం) | 7296 |
| 5. | జాతీయ గ్రామీణ తాగునీటి పథకం | 5000 |
| 6. | జాతీయ పెట్టుబడి, మౌలిక సదుపాయల పథకం | 4000 |
| 7. | అణు విద్యుదుత్పత్తి | 3000 |
| 8. | జాతీయ పారిశ్రామిక వాడలు | 1448 |
| 9. | దేశీయ జల రవాణా మార్గలు | 800 |
| 10. | సాగరమాల | 450 |
| 11. | 160 విమానాశ్రయాల పునురుద్ధరణ | 50 నుంచి 100 |

బడ్జెట్ కేటాయింపుల్లో. రోడ్డు, రైలు అభివృద్ధికి అధిక ప్రాధన్యత ఇచ్చారు, ఆతర్వాత వరసగా గృహ నిర్మాణం, స్వచ్ఛ భారత్ అభియాన్, మెట్రో, విద్యుత్, పట్టణాభివృద్ధి రంగాలు నిలిచాయి. కేటాయింపులు ఇంత గణనీయంగా ఉన్నా సవాళ్లు కూడా అలాగే ఉన్నాయి. ముఖ్యంగా సామర్థ్యం, భాగస్వాముల సామర్థ్యాలకు సబంధించి కూడా సవాళ్లు ఉన్నాయి.

**సవాళ్లు :**

అవసరాలకు అనుగుణంగా నిధుల విడుదల, పర్యవేక్షణకు అవసరమైన సామర్థ్యం సదపాయాన్ని సమకూర్చే సామర్థ్యం ప్రభుత్వం వద్ద ఉందా, అనేది మొదటి సవాలు. రహదారుల నిర్మాణం విషయానికి వస్తే, ఈ రంగంలో వేగంగా ముందడుగు వేసేందుకు, జాతీయ రహదారుల సంస్థ (ఎన్ హెచ్ ఎ ఐ), జాతీయ గ్రామీణ రోడ్డు అభివృద్ధి సంస్థ (ఎన్ అర్ అర్ డీ ఎ) లు అందించే చక్కని సంస్థాగత అనుభవం ఉంది. అయితే జలమార్గల సంస్థ, (ఐ.డబ్ల్యు.ఎ.ఐ.) విషయంలో అలాంటి అనుభవం లేదు. ఈ రంగానికి అంతగా నిధులు కేటాయించక పోవడం కూడా దీన్నే సూచిస్తోంది. సాగరమాల విషయంలోనూ అదే పరిస్థితి. ప్రణాళికలు అయితే చాలానే ఉన్నాయి, కానీ, సంస్థాగత స్వరూప స్వభావాల విషయం వచ్చేసరికి పరిస్థితి భిన్నంగా ఉంది. సంస్థాగతంగా లోపాలు, కొరతలు చాలానే ఉన్నాయి. అయితే, 2016 మార్చ్ 4వ తేదీన, రోడ్డు రవాణా నైపుణ్య పురస్కారాల కార్యక్రమంలో, రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖలతో పాటుగా షిప్పింగ్ మంత్రిత్వ శాఖను కూడా నిర్వహిస్తున్న కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరి, ఆశ్చర్యకరంగా జల, రైల్, రోడ్డు మౌలిక సదుపాయాల కల్పనకు అదే క్రమంలో ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, పేర్కొన్నారు. పర్యావరణ ప్రభావం విషయంగా ఆయన ఈ ప్రాధాన్యతలను ప్రకటించినా అది ఆశ్చర్యంగొలిపే అంశమే అవుతుంది. రహదారుల రంగంలో గత అనుభవాలను, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, పెట్టుబడి దారులను ఆకర్షించేందుకు ఒక మిశ్రమ (హైబ్రిడ్) విధానాన్ని అభివృద్ధి చేశారు. అయితే, జాతీయ జల మార్గాలు, రైల్వేలకు సంబంధించి ఆకర్షణీయమైన ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానం ఇంకా సిద్ధం కాలేదు. అందుకోసం ఇంకా చాలా కసరత్తు చేయవలసిన అవసరం ఉంది.

ఇక రెండవ సవాలు విషయానికి వస్తే, ఈ లక్ష్యాలను సాధించగల సామర్థ్యం, ఉత్సాహం ఉన్న కంట్రాక్టర్లు పీపీపీ ప్రమోటర్లు ఉన్నారా, అన్నది చాలా పెద్ద ప్రశ్న. చాలా పెద్ద సవాలు. గడచిన ఐదు సంవత్సరాల కాలంలో రోడ్డు, మెట్రో పనులను చేపట్టిన అనేక మంది కంట్రాక్టర్లు, పర్యావరణ, భూ సేకరణ వంటి సమస్యలు, రాయతీల వివాదాల కారణంగా వెనకడుగు వేశారు. అయితే ఇప్పుడు రోడ్ల నిర్మాణం విషయంలో సవరించిన నూతన హైబ్రిడ్ విధానం చాలా ఆకర్షణీయంగా ఉంది. చాలా మంది కాంట్రాక్టర్లను ఆకట్టుకునేలా ఉంది. అయిత ఇతర రంగాల విషయంలో ఆ పరిస్థితి లేదు. ఎల్ అండ్ టీ లాంటి కొందరు కంట్రాక్టర్లు నిర్మాణం వైపే మొగ్గు చూపుతున్నారు. నిర్మాణ - నిర్వహణ వైపు చూడడం లేదు. అదే విధంగా, వివాదాలను సమర్ధంగా, శీఘ్రంగా పరిష్కరించేందుకు అవసరమైన లీగల్, జ్యుడిషియల్ సామర్థ్యం ఉందా అనేది మూడవఅతి పెద్ద సవాలు. చాలా వరకు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు న్యాయ పరమైన చిక్కుల కారణంగానే అలస్యమ వుతున్నాయి. ఇందుకు సంబంధించి మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల వివాదాల పరిష్కారానికి ప్రజోపయోగ (వివాద పరిష్కార) బిల్లును ప్రవేశ పెడతామని ఆర్ధిక మంత్రి ప్రకటించారు. అంతే కాకుండా రాయితీ ఒప్పందాల సమీక్షకు కూడా అవకాశం కల్పించారు. అనేక రోడ్డు నిర్మాణ ప్రాజెక్టుల విషయంలో న్యాయపరమైన చిక్కులను పరిష్కరించి, ఆగిపోయిన అనేక ప్రాజెక్టులను తిరిగి పట్టాల పైకి తెచ్చిన ఘనత ప్రస్తుత ప్రభుత్వానికే దక్కుతుంది.

ఇక నాల్గవ సవాలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు రుణ సదుపాయం.

ముఖ్యంగా బ్యాంకులు, అదికూడా ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి లభించే రుణసదుపాయం విషయంలో సందేహాలు ఉన్నాయి. ఇప్పటికే చాలా వరకు బ్యాంకులలో నిరర్థక ఆస్తులు పేరుకు పోయాయి. ఇలాంటి నిరర్థక ఆస్తులలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ఆర్థిక మంత్రి ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ 25 వేల కోట్లు పునః పెట్టుబడి నిధిని ప్రకటించారు. అయితే, బ్యాంకులు ముందుకొచ్చి తిరిగి రుణాలు ఇచ్చేందుకు ఇది సరిపోదు. సంస్థాగత సామర్థ్యం, ఇదో సవాలు. ఈ విషయానికి వస్తే, శిక్షణ, విద్య, పరిశోధన కీలక అంశాలు. గత కొన్నిసంవత్సరాలుగా మేనేజిమెంట్ సంస్థలతో సహా అన్ని సంస్థలలోనూ శిక్షణ సామర్థ్యాన్ని పెంచినప్పటికీ, ఉత్తమ విద్యా సదుపాయాల కొరత ఇంకా అలాగే ఉంది. నాకు తెలిసినంత వరకు, ముంబై విశ్వవిద్యాలయం, కొన్ని ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, అదాని ఇన్స్టిట్యూట్ అఫ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మేనేజిమెంట్ లో మాత్రమే మౌలిక సదుపాయాల శిక్షణ కోర్సులు ఉన్నాయి. ఇంతకు మించి, పరిశోధన, అభివృద్ధి విషయంలో చాలా పెద్ద వెలితి ఉంది. ప్రపంచంలో ఎక్కడా లేనంతగా మన దేశంలో పీపీపీ మార్కెట్ విస్తరించింది. అయితే అనుభవ పాఠాల విషయంలో మాత్రం ఆశించిన ఫలితాలు రాలేదు. 2015 నవంబర్ లో 'పీపీపీ మౌలిక సదుపాయాల విధాన పునః సమీక్ష, పునరుత్తేజం' అనే అంశంపై కేల్కర్ కమిటీ ఒక నివేదికను ఇచ్చింది.

### ఈ నివేదిక ప్రకారం :

మినహాయింపు అనేది లేకుండా, భాగస్వామ్యులందరూ, అంతకు ముందు బడ్జెట్ లో పేర్కొన్న విధంగా, పీపీపీల కోసంగా ప్రత్యేక సంస్థను తక్షణమే ఏర్పాటు చేయాలని గట్టిగా నొక్కి చెప్పారు. ఈ నేపధ్యంలో కమిటీ, '3పీఐ' గట్టిగా సమర్థించింది. ఇది, పీపీపీల నైపుణ్య సంస్థగా పని చేయడంతో పాటుగా, పరిశోధన, సమీక్ష, సామర్థ్య నిర్మాణ కార్యక్రమాల అమలుకు వేదికగా నిలుస్తుందని, దానితో పాటుగా కాంట్రాక్టు వివాదాల పరిష్కార సాధనంగా, యంత్రాంగంలా, పనిచేస్తుందని కమిటీ పేర్కొంది. క్రియాశీలకంగా పనిచేసే 3పీఐ, మౌలిక సదుపాయాల ప్రక్రియలో 'నిర్మాణం-నిర్వహణ' అనే విధాన రూపకల్పనకు దోహదం చేస్తుంది. అలాంటి ప్రక్రియ ప్రజలకు విశ్వసనీయ మౌలిక సేవలను అందిచేందుకు బాటలు వేస్తుంది. నా అధ్యయనం మేరకు మౌలిక సదుపాయాల రంగంలో, ప్రాజెక్ట్ స్ట్రక్చర్, రిస్క్ అంచనా. మేనేజిమెంట్, సోషల్ కాస్ట్-బెనిఫిట్ ఎనాలిసిస్, ఆర్థిక ప్రయోజనాలు, లాభ - నష్టాల అంచనా, బీడ్ డాక్యుమెంట్ తయారీ. టెండర ప్రక్రియ, రాయితీ ఒప్పందాలు, ఆర్థిక క్రమశిక్షణ, నియంత్రణ వంటి పరిశోధన అంశాలు అనేకం ఉన్నాయి.

### విధి విధానాలు:

సవాళ్ళ పరిష్కారానికి, బడ్జెట్ కు మద్దతుగా నిలిచి ఖర్చు చేసిన సొమ్ముకు తగిన ప్రతిఫలం వచ్చేదుకు వీలైన విధి విధానాలున్నాయి. మనం ఇంతకు ముందే పేర్కొన్నట్లుగా ప్రాధాన్యతల విషయంలో ప్రభుత్వానికి స్పష్టత ఉంది, అయితే, వాస్తవంలో సులభంగా, మరింత స్పష్టంగా కనిపిచే పనులు మరింత సులభంగా, శీఘ్రంగా పూర్తవుతాయి. ఉదాహరణకు, జాతీయ రహదారుల పొడవును ప్రస్తుతమున్న 96 వేల కిలో మీటర్ల నుంచి 2 లక్షల కిలోమీటర్లకు పెంచే ప్రతిపాదనతో సహా, జాతీయ రహదారులపై దృష్టిని కేంద్రీ కరించడం వలన మొత్తం రోడ్ల పొడవులో జాతీయ రహదారుల ప్రస్తుత వాటా 2 శాతం నుంచి 4 శాతానికి పెరిగింది. ఇది స్వాగతించదగిన పరిణామం. ఇదిలా ఉంటె మరో వంక జాతీయ జలమార్గాలు, సముద్ర తీర నౌకాయానం పై సమగ్ర విధానం విషయంలో లక్ష్య శుద్ధి లోపం కనిపిస్తోంది. బహుళ విధానాలు, నియంత్రణల సరళీకరణ, సుంకాల తగ్గింపు సమగ్ర విధానంలో ఉండవలసిన కీలక అంశాలు. అదే విధంగా, ఈ రంగంలో కార్యకలాపాల శ్రీకారానికి సామర్థ్య ఆధారిత సబ్సిడీలు కూడా చాలా అవసరం. నా దృష్టిలో, జాతీయ జల మార్గ దృక్కోణం కనిపించే దాని కంటే చాలా విశాల మైనది. సేతు భారతం పథకం ద్వారా జాతీయ రాహదారులపై రైల్వే లెవెల్ క్రాసింగులు అన్నింటిని తొలిగించాలనే ప్రతిపాదన మంచి ప్రతిపాదన. ఇక రైల్వే విషయానికి వస్తే, పీపీపీ విధానంలో రైల్వే స్టేషన్ల అభివృద్ధి చేయాలనే అంశం పై దృష్టిని కేంద్రీకరించడం మంచి ముందడుగు. అయితే, ఇప్పటికి, బిడ్డింగ్ విధానం, ఒప్పందం విషయంలో సమస్యలు ఉన్నాయి. ఇంతవరకు, రైల్వే స్టేషన్ల డెవలప్మెంట్ కార్పొరేషన్ వెబ్ సైట్‌లో ఏడు రైల్వే స్టేషన్లల పేర్లున్నాయి. ఇందులో మూడింటికి సంబంధించి మాత్రమే కొన్ని పత్రాలున్నాయి. నాలుగు వందలకు పైగా రైల్వే స్టేషన్లను స్విస్ ఛాలెంజ్ విధానంలో అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలున్నాయి. ఈ విధానంలో వేరొకరు ప్రతిపాదించిన ఏ ప్రాజెక్టును అయినా ఎవరైనా అభివృద్ధి చేయవచ్చును. అయితే, ఇక్కడ యంత్రంగానికి సంబందించిన సమస్యలున్నాయి. ఈ సమస్యలను కేల్కర్ కమిటీ నివేదికలో కూడా ప్రస్తావించారు. చివరకు స్విస్ ఛాలెంజ్ విధానం ఈ సమస్యలకు పరిష్కారం కాదని కమిటీ సిఫార్సు చేసింది. విధాన రూపకల్పన, నియంత్రణలను నిర్వహణ, నియంత్రణలను వేరు చేసేందుకు వీలుగా, స్వతంత్ర ప్రతిపత్తిగల రైల్వే డెవలప్మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాలని కమిటి సూచించింది. ఇందుకు సంబందించిన విధి విధానాలు, అధికారాలు, స్వయం ప్రతిపత్తి, పరిధి ఎలా ఉంటాయన్నది బిల్లు తయారై పార్లమెంట్ ఆమోదం పొందిన తర్వాత గానీ తెలియదు. అంతవరకు వేచి చూడవలసిందే. విధాన రూపకల్పన - అమలు ప్రక్రియలను వేరు చేయడంపై దృష్టిని కేంద్రేకరించ వలసిఉంది.

నూటికి నూరు శాతం గ్రామీణ విద్యుదీకరణ విధానంలో 2018 మే 1 వ తేదీ నాటికీ మిగిలిన 13,010 గ్రామాల

*తరువాయి 19వ పేజిలో...*

# సరైన అంచనా - అసలైన ప్రాధాన్యాలు



**వివిధ మంత్రిత్వశాఖల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఇటు ఆర్థిక సర్వేని, అటు బడ్జెట్‌ను తన భావజాలంతో ప్రభావితం చేసింది. తాజా ఆర్థిక సర్వే... ప్రపంచ ఆర్థిక వృద్ధి ఒక్క శాతం తగ్గితే భారత్‌లో దాని ప్రభావం 0.2 శాతంగా మాత్రమే ఉంటుందని స్పష్టం చేసింది. వృద్ధి రేటును సంరక్షించుకోవడానికీ, వేగవంతం చేయడానికీ ఎలాంటి విధానపరమైన చర్యలు తీసుకోవాలన్నదే ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది.**

సాధారణ బడ్జెట్ 2016 రూపకల్పన నేపథ్యాన్ని ఆర్థిక సర్వే రేఖా మాత్రంగా సూచించింది. ఆర్థిక సర్వే వాస్తవానికి అతి దగ్గరగా ఉంటూ ప్రస్తుత దేశ ఆర్థిక పరిస్థితిని సమీక్షిస్తూ, ఆర్థిక రంగాన్ని బలోపేతం చేయడానికి అవలంభించాల్సిన విధానాలను విస్తృతస్థాయిలో చర్చించింది. అయితే బడ్జెట్ ఆర్థిక అంశాలను దాటి రాజకీయ అంశాలకు ప్రభావితమైనట్లు, వ్యయ ప్రాధాన్యతలు, వనరుల సమీకరణలకు ప్రాముఖ్యత ఇచ్చినట్లు కనిపిస్తోంది. వివిధ మంత్రిత్వశాఖల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఇటు ఆర్థిక సర్వేని, అటు బడ్జెట్‌ను తన భావజాలంతో ప్రభావితం చేసింది. ఈ ఏడాదిలో తన అంచనాల మేరకు 2016–17 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటుని 7–7.5 శాతం ఉంటుందని పేర్కొనడం సత్యదూరమేమో అని భావించాల్సి వస్తుంది. ఎందుకంటే అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం రానున్న ఆర్థిక సంవత్సరంలో ఎలా ఉంటుందో ఇప్పుడే ఊహించడం సాధ్యం కాదు. ఈ అనిశ్చితి నేపథ్యంలో కూడా భారత్ సుస్థిరమైన, సాపేక్షికంగా అధికాభివృద్ధిని సాధించింది. దీంతో దీర్ఘకాలిక వ్యవధిలో భారత్‌కి 8–10 శాతం వృద్ధి సాధించే సత్తా ఉన్నట్లు నిరూపితమైంది. ఇతర దేశాల్లో ఇలాంటి పరిస్థితి లేదు. ఇప్పటికే జపాన్, యూరోప్ ఆర్థిక మాంద్యం అంచున నిలబడ్డాయి. ఇక అమెరికా అభివృద్ధి 2015 చివరి త్రైమాసికంలో కుదించుకొనిపోయింది. బ్రిక్స్ దేశాలు కూడా సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. గతంలో 10 శాతం వృద్ధిని నమోదు చేసిన చైనా తాజాగా కేవలం 6.5 శాతం వృద్ధితో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

ఏ ఒక్క దేశం కూడా ప్రపంచ ఆర్థిక పరిస్థితి ప్రభావం నుంచి తప్పించుకోలేదు. అన్ని దేశాలు ఒక దానితో ఒకటి వాణిజ్యం, పెట్టుబడుల పరంగా అనుసంధానమై ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏ దేశమైతే వృద్ధి రేటును పరుగులు పెట్టించడానికి ఎగుమతులను సాధనంగా చేసుకుంటుందో ఆ దేశం ఆర్థిక పరుగు పందెం నుంచి వైదొలగాల్సి వస్తుంది. భారత్ తొలినాళ్లలో తన అభివృద్ధి వ్యూహానికి దిగుమతులను ఆధారం చేసుకుంది. అయితే 1999 నాటి ఆర్థిక సంస్కరణల ఫలితంగా ఇందులో మార్పులు వచ్చినప్పటికీ ఎగుమతులను పెంచుకోవడంలో పెద్దగా ప్రగతి సాధించలేదు. మేక్

**ప్రొఫెసర్ డి.హెచ్. పాయ్ పణందికర్,** ప్రెసిడెంట్, ఆర్.సి.జి. ఫౌండేషన్.

ఇన్ ఇండియా వంటి వైవిధ్యభరితమైన కార్యక్రమాన్ని నాడు అవలంభించలేక పోయింది. దేశీయ చోదకశక్తుల మీద ఎక్కువగా ఆధారపడడంతో మిగిలిన ప్రపంచంతో భారత్‌కి ఆర్థికపరమైన అనుసంధానం పెద్దగా లేదని చెప్పాలి. అందుకనే తాజా ఆర్థిక సర్వే... ప్రపంచ ఆర్థిక వృద్ధి ఒక్క శాతం తగ్గితే భారత్‌లో దాని ప్రభావం 0.2 శాతంగా మాత్రమే ఉంటుందని స్పష్టం చేసింది. అయితే 2008-09 నాటి తీవ్రమైన ప్రపంచ ఆర్థిక సంక్షోభం భారత్‌నూ తాకింది. అయినా అలాంటి అంతర్జాతీయ ఆర్థిక విపత్కర పరిస్థితుల నుంచి భారత్ ఎలా తట్టుకొని సుస్థిరత సాధించింది? ఇక కేంద్రంలో అవినీతి నిర్మూలన, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు మరిన్ని అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ వ్యవహారాల్లో వ్యయాన్ని నియంత్రించడం, జన ధన యోజన తదితర సాంఘిక సంక్షేమ పథకాలపైనా ఆర్థిక సర్వే దృష్టి పెట్టింది. అయితే ఈ చర్యలేవీ పెట్టుబడులను పెంచడానికి దోహదపడవనే వాస్తవాన్ని గుర్తించాల్సి ఉంటుంది.

మొత్తం జీడీపీలో 15 నుంచి 16 శాతం వాటాతో భారతీయ పారిశ్రామిక రంగం ఎగుడూ దిగుడూ లేకుండా ఉండిపోయింది. దేశంలో కార్పొరేట్ రంగం పనితీరును బాగానే కనబర్చినా ఈ ఆర్థిక సంవత్సరంలో పెద్దగా లాభాలను సాధించలేక పోయింది. వస్తూత్పత్తికి డిమాండ్ లేకపోవడంతో అధిక సామర్థ్యం దేశీయ కార్పొరేట్ రంగానికి గుదిబండగా మారింది. దీంతో కార్పొరేట్ రంగం, రుణాల నిచ్చిన బ్యాంకులూ నిర్థక ఆస్తులతో తీవ్ర ఒత్తిడికి లోనయ్యాయి. అయితే కొన్ని రంగాలు మాత్రం నిస్సందేహంగా గొప్ప ప్రగతిని సాధించాయని అంగీకరించాలి. సేవా రంగం వృద్ధి రేటుకు ఇంధనాన్ని అందించగా, ఫైనాన్స్, పంపిణీ రంగాలు ఇతోధికంగా దోహదపడ్డాయి. గత సంవత్సరాల్లో దేశంలోకి ప్రవహించిన అధిక పెట్టుబడుల ప్రభావమే ఆర్థిక పరిస్థితిని స్థిరంగా ఉంచిందని చెప్పాలి. మరోసారి దేశ ఆర్థిక రంగాన్ని కదం తొక్కించడానికి వస్తూత్పత్తికి తగిన డిమాండ్‌ను తీసుకొని రావడం అత్యవసరం. దీని కోసం ప్రభుత్వమే మౌలిక సౌకర్యాల రంగంలో పెట్టుబడులను పెంచాలి. దీని ప్రభావం ఇతర రంగాలపైనా పడుతుంది. ఇక్కడ ప్రయివేటు రంగం నుంచి పెట్టుబడులు తగ్గడానికి అధిక వడ్డీలే కారణంగా చెప్పాలి. 2010-11 నుంచి వరసగా నాలుగేళ్ల పాటు దేశీయ ఆర్థిక రంగంపై పెను ప్రభావాన్ని చూపించిన అధిక ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి భారతీయ రిజర్వు బ్యాంకు వడ్డీ రేట్లను పెంచాల్సి వచ్చింది. ఈ కాలంలో పెట్టుబడులు ఎక్కువగా ఉన్నప్పటికీ అవి ఆర్థిక వృద్ధికి చేసింది ఏమీ లేదు. అప్పట్లో ద్రవ్యోల్బణానికి వ్యవసాయ ఉత్పత్తులు మరీ ముఖ్యంగా హార్టీ కల్చర్ నుంచి దిగుబడులు తగ్గిపోవడమే కారణంగా భావించాలి. అయితే గత రెండేళ్లుగా ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతూ వచ్చింది. హోల్‌సేల్ స్థాయిలో ద్రవ్యోల్బణం ప్రభావం రుణాత్మంగా ఉంటూ రిటైల్ స్థాయికి వచ్చేటప్పటికీ అది 6 శాతానికి చేరుకుంది. పర్యావసనంగా ఆర్బీఐ రెపో రేటును 6.75 శాతానికి తగ్గించినా దీని ఫలితాలను వాణిజ్య బ్యాంకులు వినియోగదారులకు చేరవేయడంలో విఫలమయ్యాయి. పాలసీ రేటును తగ్గించడం, లిక్విడిటీకి అనుకూలమైన పరిస్థితులను కల్పించడం ద్వారా ఆర్థిక రంగం పరుగులు తీస్తుందని ఆర్థిక సర్వే సూచించింది.

అయినప్పటికీ భారత్ ఎగుమతులను ఒక చోదక శక్తిగా మార్చుకోలేకపోతోంది. ఎందుకంటే దేశీయ పారిశ్రామిక ఉత్పత్తుల విక్రయాలను సగటున 12 శాతానికి పెంచే సామర్థ్యం ఒక్క ఎగుమతులకు మాత్రమే ఉంది. గడిచిన 14 నెలల కాలంలో ఎగుమతుల్లో గణనీయ క్షీణత నమోదు కావడంతో విదేశీ మారక ద్రవ్య ఆర్జన పడిపోయింది. దీంతోపాటు, అమెరికా ఫెడరల్ బ్యాంకు వడ్డీ రేట్లను పెంచడం, భవిష్యత్‌లో కూడా ఇదే విధానాన్ని అవలంభిస్తున్నట్లు ప్రకటించడంతో దాదాపు అన్ని దేశాల కరెన్సీలపై ప్రభావం ఎక్కువగానో తక్కువగానో పడింది. దీంతో గతంలో క్షీణ స్థాయికి రూపాయి విలువ పడిపోయినా ఇక ఎంతమాత్రమూ ఎగుమతులు చేయజాలని పరిస్థితి ఏర్పడింది. అందువలన ఇతర దేశాల కరెన్సీ విలువ కూడా పడిపోయినా మనకు అది పెద్దగా లాభించలేదు. సరిగ్గా ఈ నేపథ్యంలో ఆర్బీఐ రంగప్రవేశం చేసి ఈ కరెన్సీ యుద్ధంలో మన నష్టాన్ని కనీస స్థాయికి పరిమితం చేసే విధంగా చర్యలు చేపట్టింది. అయితే అలాంటి ప్రమాదభరితమైన పరిస్థితుల్లోకి దేశ ఆర్థిక వ్యవస్థ ప్రవేశించడంలోని కష్టనష్టాలపై ఆర్థిక సర్వే ఆందోళన వెలిబుచ్చింది.

వాణిజ్యపరమైన ఎగుమతులు తగ్గుముఖం పట్టినప్పటికీ కరెంటు ఖాతా లోటు కేవలం 1.1 శాతం మాత్రమే ఉండడం గమనార్హం. దీనికి సేవ ఉత్పత్తుల (ఐటీ, ఐటీ సంబంధ సేవలు) ఎగుమతులు కారణంకాగా అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం కూడా మరో కారణం భావించాలి. ఈ ఆర్థిక సంవత్సరంలో ముడి చమురు బ్యారెల్ 45 డాలర్లు ఉండగా రానున్న ఏడాదిలో అది బ్యారెల్‌కి 35 డాలర్లకు పడిపోతుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది.

వృద్ధి రేటును సంరక్షించుకోవడానికీ, వేగవంతం చేయడానికి ఎలాంటి విధానపరమైన చర్యలు తీసుకోవాలన్నదే ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. ఇప్పటి వృద్ధి రేటు ఇలానే ఉంటుందని భరోసా పెట్టుకోవడానికి వీల్లేదు. పరస్పర ప్రభావాలు చెదిరిపోవచ్చు, పెట్టుబడులు తగ్గుముఖం

పట్టవచ్చు. జీడీపీలో 3.5 శాతానికి లోటు బడ్జెట్‌ను పరిమితం చేస్తూ బడ్జెట్‌ను కట్టుదిట్టం చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ గట్టి పట్టుదలతో ఉంది. అయితే ఇప్పుడు ప్రభుత్వ రంగం మౌలిక వసతుల రంగంలో పెట్టుబడులను పెంచడం ద్వారా వస్తూత్పత్తికి డిమాండ్ పెంచడం, సంస్కరణలను వేగవంతం చేయడం తక్షణావసరంగా ఉంది. 2016-17 బడ్జెట్ 'ఒన్ ర్యాంకు, ఒన్ పెన్షన్' అమలుకి, ఏడవ పే కమిషన్ సిఫార్సుల మేరకు వేతనాల పెంపుదలకు నిధులు కేటాయించాల్సి ఉంటుంది. దీంతోపాటు అభివృద్ధి పనులకు వ్యయం కూడా గణనీయంగానే ఉంటుంది. బడ్జెట్‌లో తప్పనిసరిగా నిధులు కేటాయించాల్సిన మూడు రంగాలపై వ్యయం పెంచాలని ఆర్థిక సర్వే గట్టిగా సిఫార్సు చేసింది. మొదటిది విద్యా రంగం. విద్య లేని కార్మికుల పనితీరుతో ఉత్పాదకత తక్కువగా ఉండడంతో వేతనాలు కూడ తక్కువగా ఉంటాయి. రెండవది ఆరోగ్యం. ఆరోగ్యవంతుడైన కార్మికుడు ఎక్కువ ఉత్పాదన సాధిస్తాడు. దీంతో వైద్య ఖర్చుల వ్యయం తగ్గుతుంది. ఫలితంగా కొనుగోలు శక్తి పెరుగుతుంది.

విద్య, ఆరోగ్యం రెండూ సంయుక్తంగా అభివృద్ధికి కీలక అంశాలుగా మారతాయని ఆర్థిక సర్వే పేర్కొంటూ తద్వారా అభివృద్ధికి రాచబాట ఏర్పడుతుందని స్పష్టం చేసింది. అనేక దేశాల అనుభవాలు కూడా దీన్నే నిరూపించాయి. మూడవది వ్యవసాయం. మెరుగైన సాగునీటి వ్యవస్థ, వ్యవసాయ యాంత్రాంగం, మార్కెట్లు, ఇన్‌పుట్లుతో పాటు జన్యుపరంగా మెరుగుపర్చిన పంటలు ఉత్పాదనను, ఆహార భద్రతను మెరుగు పరుస్తాయని ఆర్థిక సర్వే గుర్తించింది. అయితే తక్కువ ఉత్పాదన లేదా నిరుపయోగమైన వ్యయాలు ప్రత్యేకించి సబ్సిడీల విషయంలో బడ్జెట్ ఎలాంటి కోతలు విధించలేదు. ఈ అంశాన్ని గుర్తించిన ఆర్థిక సర్వే, లక్షిత బలహీన వర్గాలకు ఏ విధంగానూ లాభదాయంగా లేని సబ్సిడీలను ఎత్తి వేయాలని సిఫార్సు చేసింది. ఈ దిశగా రెండు కీలక సిఫార్సులు చేసింది. మొదటిది, ఉన్నత వర్గాలకు కూడా ఉపయోగపడే అనేకానేక సబ్సిడీలను ఎత్తివేయాలని సూచించింది. చిన్న పొదుపు మొత్తాల్లో పన్ను రాయితీలు, వంట గ్యాస్ సబ్సిడీలు, రైల్వే, విద్యుత్, వైమానిక ఇంధనం, బంగారం, కిరోసిన్ వంటి వాటికి ఇస్తున్న మినహాయింపులు దాదాపు లక్ష కోట్లుగా ఉంటాయని ఆర్థిక సర్వే అంచనా వేసింది

రెండవది, వ్యవసాయ ఆదాయంపై మరీ ముఖ్యంగా ధనికు రైతుల ఆర్జనపై ఆదాయన పన్ను విధించడం, ఎరువుల సబ్సిడీలను హేతుబద్దం చేయడం. అయితే ఈ సలహాలు కేంద్ర ఆర్థిక మంత్రికి పెద్ద రుచించవనే చెప్పాలి. పార్లమెంటులో విపక్షాల నుంచే కాకుండా సమీపంలో కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు కూడా ఉన్న నేపథ్యంలో సొంత పార్టీ నుంచి కూడా పెద్ద పెద్ద యెత్తున వ్యతిరేకత వ్యక్తమవుతుంది. అయితే కొన్ని ముఖ్యమైన ప్రగతిశీలక సంస్కరణలను జాతీయ ప్రయోజనాల దృష్ట్యా అమలు చేయాల్సి ఉన్నప్పటికీ రాజ్యసభ అంగీకరించకపోవడంతో వెనుకడుగు వేయాల్సి వచ్చింది. పన్ను ఆదాయం నుంచి వీలైనంత వరకు ప్రభుత్వ వ్యయానికి నిధులు సమకూర్చుకుంటూ అనివార్యమైన పరిస్థితి తలెత్తినప్పుడు ఇతరత్రా రుణంగా తీసుకోవాలి. ఇక సర్వేలో అభివర్ణించిన విధంగా అతి తక్కువ పన్నులున్న దేశంగా భారత్ నిలుస్తుంది. మొత్తం జీడీపీలో పన్ను ఆదాయం 16.6 శాతం ఉండగా అదే బ్రిక్ దేశాలైన చైనాలో 19.4శాతం, రష్యాలో 22 శాతం, దక్షిణాఫ్రికాలో 28.8, బ్రెజిల్‌లో 35.6 శాతంగా ఉంది. అయితే తలసరి ఆదాయంతో పోలిస్తే పన్ను నిష్పత్తి పెద్దగా లేకపోవడం విశేషం. గడిచిన పాతికేళ్లుగా తలసరి ఆదాయం కన్నా పన్ను మినహాయింపు వేగంగా పెరిగిందని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది.

దేశ ఆర్థికాభివృద్ధికి ఈ నాలుగు ప్రధాన సంస్కరణలు కీలకపాత్ర పోషిస్తాయని ఆర్థిక సర్వే స్పష్టం పేర్కొంది. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల పెట్టుబడులు పెరగడానికి భూసేకరణ చట్టం అడ్డుగా నిలుస్తోంది. భూసేకరణలో సమస్యల కారణంగా 25 శాతం ప్రాజెక్టులు ఆగిపోయాయి. ఇక జీఎస్‌టీ బిల్లుపై సుదీర్ఘంగా చర్చ జరుగుతోంది. ఆ బిల్లు చట్టరూపం దాల్చకపోవడంతో అభివృద్ధి వెనుకడుగు వేస్తోంది. జీఎస్‌టీ చట్టరూపం దాలిస్తే జీడీపీ కనీసంగా ఒక శాతం వృద్ధి చెందుతుంది. ఇక ఎఫ్‌డీఐల విరమణ విధానం కూడా అడ్డంకిగా మారుతోంది. స్వేచ్ఛగా దేశంలోకి ప్రవహించే విదేశీ పెట్టుబడులు అంతే స్వేచ్ఛగా నిష్క్రమించే అవకాశం ఉండాలి. నిష్క్రమణలో అడ్డంకులతో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రవేశం కూడా వృద్ధి చెందడం లేదు. చివరగా, ఆర్థిక సర్వే పేర్కొన్న విధంగా కార్మిక విధానాన్ని సమూలంగా మార్చివేయడం ద్వారా మెరుగైన ఉపాధి కల్పన సాధ్యమవుతుంది. వృద్ధిరేటు పరుగులు పెట్టించడానికి, సుస్థిరతను సాధించడానికి ఆర్థిక సర్వే కొన్ని కీలక విధానపరమైన చర్యలను గుర్తించింది:

÷ దేశీయ డిమాండ్ ఆధారంగానే ఎక్కువగా వృద్ధి ఉంటూ ప్రధానంగా మౌలిక రంగంపై ఎక్కువ వ్యయం చేయడం ద్వారా సాధించాలి.

÷ ఉన్నత వర్గాలకు కూడా లాభదాయంగా ఉండే బంగారం, పెన్షన్లు, చిన్నమొత్తాల పొదుపుపై రాయితీలు వంటి వాటి కారణంగా లక్ష కోట్ల భారాన్ని తగ్గించుకోవాలి.

÷ పన్ను పరిధిలోకి తీసుకొచ్చే వర్గాలను పెంచుకుంటూ అదే సమయంలో వ్యక్తిగత ఆదాయం పన్నుపై మినహాయింపులను పెంచరాదు.

÷ విద్య, ఆరోగ్యం, వ్యవసాయాన్ని కీలక రంగాలుగా గుర్తించి వాటికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలి.

÷ ధనిక రైతుల వ్యవసాయ ఆదాయంపై పన్నులు విధిస్తూ వ్యవసాయ ఆదాయాన్ని కూడా పన్నుల పరిధిలోకి తీసుకొని రావాలి.

÷ ధనిక రైతులకు కూడా లాభం చేకూరుతున్నందున ఎరువు సబ్సిడీలను హేతబద్ధం చేయాలి.

÷ ఆర్బీఐ తన ఈక్విటీ కేపిటల్‌ను 16 శాతానికి తగ్గించుకొని తద్వారా వచ్చిన నిధులను బ్యాంకింగ్ రంగంలో పెట్టుబడులుగా పెట్టాలి.

÷ మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించడానికి కార్మిక విధానాలను సమూలంగా మార్చాలి.

సుదీర్ఘకాల వ్యవధిలో లబ్ధి చేకూరే రీతిలో ప్రాథమిక అంశాలపై ఆర్థిక సర్వే దృష్టి పెట్టింది. అయితే పైన సూచించిన చర్యలు అమలు కావడానికి దీర్ఘకాలం పట్టినప్పటికీ వీటి ద్వారానే సుస్థిరమైన, అధిక వృద్ధి రేటు సాధ్యమవడానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. అయితే ఆర్థిక సర్వే అంచనా వేసిన 7 నుంచి 7.1 వృద్ధి రేటు సాధించడానికి ఈ చర్యలు అమలుకు నోచుకుంటాయని భావించలేదు. ఈ చర్యల ద్వారా మరింత వృద్ధి సాధ్యమవుతుందని మాత్రమే పేర్కొంది. అందుకనే ఈసారి ఆర్థిక సర్వే ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్త పడింది.

■

*15వ పేజి తరువాయి...*

## మౌలిక సదుపాయాలకు బడ్జెట్ కేటాయింపులు

విద్యుద్దీకరణను పూర్తి చేయడంలో, అదే విధంగా గ్రామీణ రోడ్ల అనుసంధానం (ముందు అనుకున్న 2021 కంటే ముందుగా 2019 నాటికే 65 వేల గ్రామాల రోడ్డు అనుసంధానం పూర్తి చేయడం) కోసంగా బడ్జెట్లో తగిన విధంగానే వనరుల ఆధారిత కేటాయింపులు చేయడం మరో మంచి పరిణామం. అదే విధంగా గృహ నిర్మాణం. అయితే స్వచ్ఛ భారత్ అభియాన్, స్మార్ట్ సిటీస్, ఎయిర్ పోర్ట్ పునరుద్ధరణ నిధుల కేటాయింపుకు సంబంధించి నాకు అంత నమ్మకం కుదరడం లేదు. ఎందుకంటే వీటి అమలుకు అవసరం అయిన విధానాలు ఇంకా పదును తేలవలసి ఉంది. స్వచ్ఛ భారత్ అభియాన్ విషయంలో ప్రవర్తనలో పరివర్తన తీసుకురావలసిన అవసరం ఉంది. స్మార్ట్ సిటీ భావన, లక్ష్యాలు ఇంకా పరిణామక్రమ దశలోనే ఉన్నాయి. అదే విధంగా, దేశం ఇన్ని విమానాశ్రయాలను ఎందుకు పునరుద్ధరించాలనే విషయంలో స్పష్టత లేదు. ముఖ్యంగా ప్రస్తుతమున్న వాటినే పూర్తిగా వినియోగించుకోవడం లేదు. చాలా వరకు అవి నష్టాల్లో నడుస్తున్నాయి. అలాంటప్పుడు, ఈ పునరుద్ధరణ ఎందుకన్నది స్పష్టత రావలసి ఉంది.

పర్మిట్ రాజ్ నిర్మూలన మన మధ్యంతర లక్ష్యం. మోటారు వాహనాల చట్టానికి ప్రభుత్వం అవసరమైన సవరణలు చేస్తుంది. రోడ్డు రవాణా రంగాన్ని ప్రయాణీకుల విభాగంలోకి తీసుకొస్తుంది. నూతన పర్యావరణ విధానం రూపొందిస్తారు. ఇందులో చట్ట ప్రమాణాలను పాటించే విషయంలో రాష్ట్రాలకు స్వేచ్ఛ ఉంటుంది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వివిధ రూట్లలో బస్సులు నడుపుకునేందుకు, కొన్ని సామర్థ్య, సురక్ష షరతులకు లోబడి అనుమతిస్తారు. రవాణా వ్యవస్థలో పెనుమార్పులకు సంకేతంగా నిలిచే, ఈ విధానంలో ప్రముఖంగా పేర్కొనవలసిన విషయం ఏమంటే, మరింత సమర్ధ వంతమైన రవాణా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. ప్రజలకు మరింత మరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయి. ఈరంగంలోకి కొత్తగా పెట్టుబడులు వస్తాయి. కొత్త ఉద్యోగాలు వస్తాయి. అంకుర పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. ఇవిగాక ఇంకా అనేకానేక ప్రయోజనాలు చేకూరతాయి. ఈ చర్యలు అభివృద్ధి వేగాన్ని పెంచి మన దేశాన్ని త్వరగా లక్ష్యాలను చేరుస్తాయి. ఈ విధానంలో రాష్ట్రాలకు ఎంపిక స్వేచ్ఛ ఉన్నా, అందులో కొత్తగా వచ్చింది లేదు. ఇది రాష్ట్రాల పరిధిలోని అంశం కాబట్టి ఇప్పటికే ఈ స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉంది. ఈ విధానం కేవలం దాన్ని గుర్తిస్తోంది. గతంలో అనేక ఆలోచన రహిత విధానాలున్నాయి. ఇందుకు రెండు ఉదాహరణలు మొదటిది 2జీ కేటాయింపుల్లో ముందొచ్చిన వారికి ముందస్తు అవకాశం ఒకటి. అది ఒక భారీ కుంభకోణానికి దారి తీసింది. తదనంతరం పోర్ట్ టెర్మినల్స్‌కు సమర్ధ బిడ్డింగ్ విధానాన్ని ప్రవేశ పెట్టారు. అది చట్ట పరమైన చిక్కుల్లో చిక్కుకుని విపరీత జాప్యానికి దారి తీసింది.

### సమీక్ష:

మొత్తంగా చూస్తే, ఆర్థిక సర్వే వార్షిక ప్రాతిపదికన ఆర్థిక పరిస్థితిని తెలియ చేస్తుంది. అంతే గానీ, గత సంవత్సరం బడ్జెట్ లోతుల్లోకి పోదు. అంత లోతుగా సమీక్షించదు. అదే విధంగా స్థూలంగా సవరించిన అంచనాలు, బడ్జెట్ – వాస్తవ గణాంకాల మధ్య వ్యత్యాసాలపై దృష్టి కేంద్రీకరిస్తే ప్రత్యేక పద్దుల కింద కేటాయింపులు, వాటిని సమర్ధించే విధానాలను తెల్సుకునే అవకాశం బలపడుతుంది. ఎంత కేటాయించారు, ఎంత ఖర్చు చేశారు అనేది స్పష్టమవుతుంది. ఉదాహరణకు, గత బడ్జెట్లో జాతీయ జల మార్గాలకు అధికంగా నిధులను కేటాయించారు. అయితే అందులో ఎంత ఖర్చు చేశారు అనే దానిపై స్పష్టత లేదు. అదలా ఉంటే, మౌలిక సదుపాయాల రంగంలో ప్రత్యక్ష ఖర్చుకు అవకాశం కల్పించేందుకు బడ్జెట్ సాధించిన లక్ష్యాల పై నిరంతర సమీక్ష అవసరం.

■

# కేంద్ర బడ్జెట్ 2016-17: విత్త సంఘటితానికి ఓ యత్నం




**ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ (ఎఫ్ ఆర్ బిఎం) బిల్లు రాష్ట్రపతి ఆమోదంతో 2003లో చట్టంగా రూపొందింది. జిడిపిలో విత్త లోటు మూడు శాతానికి మించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవడాన్ని ఈ చట్టం సూచిస్తోంది. అలాగే పార్లమెంటు ఉభయ సభల్లో ప్రభుత్వం ప్రతి ఆర్థిక సంవత్సరం మూడు నివేదికలు ప్రవేశపెట్టాలని తెలిపింది. ఆర్థిక మంత్రి క్రమం తప్పకుండా బడ్జెట్‌లో పొందు పర్చిన ప్రభుత్వ వసూళ్లు, ఖర్చుల త్రైమాసిక నివేదకలు పార్లమెంటు ఉభయ సభల్లో ప్రవేశపెట్టాలని సూచించింది.**

### లోటు బడ్జెట్ : ఒక అవలోకనం

లోటు బడ్జెట్ అంటే మొత్తం ప్రభుత్వం యొక్క వసూళ్లు మరియు ఖర్చుల మధ్యబేధంగా అభివర్ణిస్తారు. అంటే ఒక ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఖర్చు దాని వసూళ్ల కంటే హెచ్చుగా ఉండడం. రాబోయే సంవత్సరంలో లోటును అంచనా వేయడం అన్నమాట. విత్తలోటు మొత్తం వసూళ్లు, మొత్తం ఖర్చుల మధ్య బేధాన్ని ప్రతిబింబిస్తుంది. సంయుక్త విత్తలోటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లోటుకు ఉద్దేశించింది. మాంద్యం సమయాల్లో లోటు బడ్జెట్ లేదా లోటు ఫైనాన్స్ అనే భావనను ప్రసిద్ధ ఆంగ్ల ఆర్థశాస్త్రవేత్త జాన్ మేనార్డ్స్ కీన్స్ ప్రతిపాదించారు. ఉపాధి, వడ్డీ, ధనం అనే సాధరణ సిద్ధాంతాన్ని ఆయన 1936లో ప్రవేశపెట్టారు. లోటు బట్జెట్ ద్వారా స్థిర వృద్ధి మరియు ఉపాధి సాధించే అవసరాన్ని సూచించారు. ఇది గతంలో ఆర్థిక వ్యవస్థ సమతుల్యంగా ఉండేదనే భావనకు వ్యతిరేకం. వస్తువుల ఉత్పత్తి సామర్థ్యం, సేవలకంటే వినియోగదారుల అవసరాలు ఎప్పుడు ఎక్కువగా ఉంటాయనే భావన. ధరలు గరిష్ఠస్థాయికి చేరినప్పుడు అన్ని ఉత్పత్తులు, సేవలు పూర్తిగా వినియోగించబడతాయి. అయితే అన్ని వస్తు,సేవలను పూర్తిగా వినియోగించుకోకపోవడంతోనే నిరుద్యోగ సమస్య ఉత్పన్న మవ్వడమే కాకుండా ఆర్థిక వ్యవస్థ మందంగా ఉంటుందని తెలిపారు. వ్యక్తిగత పొదుపులను వస్తు,సేవలకు వినియోగించకపోవడంతో ఆర్థిక వ్యవస్థ తన ఉత్తేజాన్ని కోల్పోతోందని వాదించారు. ప్రభుత్వ వ్యయాలు సమష్టి డిమాండ్‌ను తగ్గించాలని అలాగే నిరుద్యోగాన్ని తగ్గించాలని కీన్స్ వాదించారు. వడ్డీల రేట్ల తగ్గింపు (కోశ విధానం) మరియు ప్రభుత్వ వ్యయం (విత్త విధానం) ఆర్థ వ్యవస్థను ఒక గాడిలో పెట్టే సాధనాలు. ఈ విధానాలను 1937లో రూజ్‌వెల్ట్ అమెరికాలో తరువాత ఇతర దేశాలు అవలంభించాయి.

### లోటు మంచిదా? చెడ్డదా?

దీనిపై స్పష్టమైన సమాధానం ఇవ్వడం కష్టం. అయితే లోటు బడ్జెట్ మాత్రం డిమాండ్‌ను పెంచడం ద్వారా ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరుస్తుందనేది వాస్తవం. ఏది ఏమైనా వ్యయ విత్త విధానం వల్ల ప్రభుత్వాల వ్యయం పెరిగి అధిక వడ్డీలకు రుణాలు తీసుకోవాల్సి వస్తోంది. దీంతో మార్కెట్‌లో వడ్డీల ధరలు పెరగడంతో పాటు ప్రైవేటు రంగానికి పరపతి లభ్యత పెరుగుతోంది. వ్యయ విత్త విధానం ఫలితాలు చాలా దీర్ఘకాలంలోనే కనిపిస్తాయి. దీనికి ప్రత్యామ్నాయంగా పన్నుల తగ్గింపు లాంటి ప్రత్యేక్ష పరిణామాలతో ధరలను

**బి.వి.మధుసూదన్‌రావు,** పరిశోధన సలహాదారు, సెంటర్ ఫర్ బడ్జెట్ & పాలసీ స్టడీస్, బెంగుళూరు.

తగ్గించడం, వ్యాపారాలను లాభాదాయకతవైపు మళ్లించడం, ఉపాధిని పెంపొందిచడం ప్రభుత్వానికి సులభమార్గం.

## ఆర్థిక సంక్షోభం


లాటిన్ అమెరికా దేశాలు 1980 ప్రాంతంలో తమ స్థాయికి మించి అంతర్జాతీయ రుణాలు పొంది పెట్టుబడులను పెట్టకుండా స్వంతగా వినియోగించుకున్నాయి. దీంతో ఐఎంఎఫ్ మరియు ప్రపంచ బ్యాంక్ జోక్యం కల్పించుకుని వివిధ వ్యయాల్లో (సామాజిక వ్యయాలు, వేతనాలు, ఉద్యోగాలు, సబ్సిడీలు) కోతలను ప్రవేశ పెట్టాయి. వాణిజ్య సరళీకరణ, ధరల నియంత్రణ తొలగింపు, దేశీయ, విదేశీయ పెట్టుబడులు లాంటి సర్దుబాటు విధానాలను ప్రవేశపెట్టాయి. విత్త దర్శనీయతకోసం చట్టబద్ధ విధానం అవశ్యకత తెలియవచ్చింది. భారతదేశంలో కూడా 1991లో ఆర్థిక సంక్షోభం తలెత్తింది. జాతీయ, రాష్ట్ర సంయుక్త విత్త లోటు జిడిపిలో 11.24 శాతానికి పెరిగింది. చెల్లింపుల సమస్య ఎక్కువైంది. రూపాయి విలువ పడిపోవడంతో సంస్థాగత సంస్కరణలు చేపట్టాల్సి వచ్చింది. దీంతో 1996-97లో జిడిపిలో 8.17లోటు వచ్చింది. 1997లో ఐదవ ఆర్థిక వేతన సంఘం అవార్డు తరువాత ఈ లోటు 11శాతానికి పెరిగింది. రెవెన్యూ వ్యయాలు పెరగడంతో రాష్ట్రాల రెవెన్యూ లోటు 1999-2000ల మధ్య 3 నుంచి 4.6 శాతానికి చేరింది. సబ్సిడీల పెరుగుదల, జీతాల పెరుగుదలతో రెవెన్యూ లోటు 60శాతానికి పెరిగింది. దీంతో చట్టబద్ధ విధానాన్ని చేపట్టవలసిన అవశ్యకత ఎదురైంది.

## మాస్ట్రీచ్ ఒప్పందం మరియు విత్తలోటు లక్ష్యం


ఐరోపా దేశాలు 1992లో నెదర్లాండ్స్‌లోని మాస్ట్రీచ్‌లో సమావేశమై ఐరోపా యూనియన్‌గా ఏర్పడ్డాయి. దీంతో ఐరోపా దేశాల్లో యూరో ఏక కరెన్సీ ప్రవేశపెట్టబడింది. ఏక కరెన్సీతో సభ్యదేశాలు సిగ్నోరేజ్ ( కరెన్సీ ముద్రించుకునే హక్కు లేదా కేంద్ర బ్యాంకు నుంచి తీసుకోవడం) మరియు ద్రవ్య విధానాలలో యూనియన్ సభ్యదేశాల మధ్య ప్రతిష్ఠ నిబంధనలు ఉన్నాయి. ఈయూ సభ్య దేశాలు విత్తలోటు, ద్రవ్యోల్బణం తగ్గింపు మరియు మొత్తం రుణాలకు సంబంధించి స్థిర లక్ష్యాలను విధించుకున్నాయి. సభ్యదేశాలు ద్రవ్యోల్బణాన్ని 1.5 శాతానికి నియంత్రించు కోవడం అంటే మూడు సభ్యదేశాల కనిష్ఠ ద్రవోల్బణం శాతానికి సగటు. అలాగే సభ్యదేశం యొక్క ప్రభుత్వ రుణం జిడిపిలో 60 శాతానికి పెరగకూడదు మరియు విత్తలోటు జిడిపిలో మూడు శాతానికి పరిమితమై ఉండాలనే నిబంధనను తయారు చేసుకున్నాయి. రంగరాజన్ మరియు సుబ్బారావు (రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్లు)ల అభిప్రాయం ప్రకారం భారతదేశ పొదుపు 13 శాతం మాత్రమే ఇందులో ఐదు నుంచి రెండు శాతం కార్పొరేట్ మరియు పబ్లిక్ రంగాలు వినియోగించుకుంటున్నాయి. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆరు శాతం పైగా లోటు ఏర్పడుతోంది.


## విత్త బాధ్యత, బడ్జెట్ నియంత్రణ చట్టం-2003 మరియు దాని తరువాత...

భారత ప్రభుత్వం విత్త బాధ్యతపై చట్టాన్ని తీసుకురావడానికి ముసాయిదాను తయారు చేయడానికి ఒక కమిటీని నియమించింది. దీని సిఫారసులకు అనుగుణంగా విత్త బాధ్యత, బడ్జెట్ నియంత్రణ బిల్లు 2000ను ప్రవేశపెట్టారు. దీనిపై అభిప్రాయాలను తెలియజేయడానికి పార్లమెంటరీ స్థాయీ సంఘానికి దీన్ని నివేదించారు. స్థాయీ సంఘం సిఫారసులతో ఈబిల్లును 2003 ఏప్రిల్‌లో లోక్‌సభలో, ఆగస్టులో రాజ్య సభలో ప్రవేశ పెట్టారు. ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ (ఎఫ్ ఆర్ బిఎం) బిల్లు రాష్ట్రపతి ఆమోదంతో 2003లో చట్టంగా రూపొందింది. జిడిపిలో విత్త లోటు మూడు శాతానికి మించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవడాన్ని ఈ చట్టం సూచిస్తోంది. అలాగే రెవెన్యూ లోటును 31 మార్చి,2008 నాటికి రూపుమాపి, మిగులు రెవెన్యూ ఉండేలా చూడాలని సూచించింది. అలాగే పార్లమెంటు ఉభయ సభల్లో ప్రభుత్వం ప్రతి ఆర్థిక సంవత్సరం మూడు నివేదికలు ప్రవేశపెట్టాలని అంటే అవి వరుసగా 1) మధ్యంతర విత్త విధాన నివేదిక 2) విత్త విధాన ప్రణాళిక నివేదిక 3) స్థూల ఆర్థిక చట్రం నివేదిక. అలాగే ఆర్థిక మంత్రి క్రమం తప్పకుండా బడ్జెట్‌లో పొందు పర్చిన ప్రభుత్వ వసూళ్లు, ఖర్చుల త్రైమాసిక నివేదకలు పార్లమెంటు ఉభయ సభల్లో ప్రవేశపెట్టాలని సూచించింది.రాష్ట్రాలు కూడా ఇదే విధమైన చట్టాలను రూపొందించాయి. ఎఫ్ఆర్‌బిఎం చట్టం ప్రభావంతో రాష్ట్రాలు మిగులు సాధించాయి. వివిధ రాష్ట్రాల్లో మూడు శాతం విత్తలోటు లక్ష్యాలను ఈ క్రింది పట్టికల్లో చూడవచ్చు.




ఆధారం: రిజర్వు బ్యాంకు.




## రాష్ట్ర స్థాయిలో ఆర్థిక సంఘటితానికి యత్నాలు

రాష్ట్రాల స్థాయిలో ఆర్థిక సంఘటితం అనేది వివిధ అంచెలుగా ఉండడమే కాకుండా ఇది కేంద్ర ప్రభుత్వ, ఫైనాన్స్ కమిషన్‌లపై ఆధారపడి ఉంటుంది. చట్టంలో పొందుపర్చిన రుణమార్పిడి పథకం (డెబిట్ స్వాపింగ్ స్కీం) ద్వారా రాష్ట్రాలు తక్కువ వడ్డీరేట్లకు మార్కెట్ నుంచి రుణాలు పొందవచ్చు లేదా 13 శాతం వరకూ కేంద్ర నుంచి తీసుకోవచ్చు. 2002-03 నుంచి 2004-05 వరకూ రూ.1.03 లక్షల కోట్ల రుణాలను రాష్ట్రాలు తిరిగి చెల్లించాయి. అలాగే 12 వ ఫైనాన్స్ కమిషన్ రుణ స్థిరీకరణ మరియు రిలీఫ్ సౌకర్యం (డిసిఆర్ఎఫ్)ను సిఫారస్ చేసింది. దీని ద్వారా రాష్ట్రాలు తమ రుణాలను 20 వాయిదాల్లో 7.5 శాతం వడ్డీతో కేంద్రానికి తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. కొన్ని రాష్ట్రాలు కూడా సంఘటిత నిధుల ఖాతా (సిఎస్ఎఫ్), తప్పనిసరిగా తిరిగి చెల్లించే నిధి (జిఆర్ఎఫ్) లాంటి రుణాలను తిరిగి చెల్లించే పథకాలను రూపొందించాయి.

## 2016-17లో కేంద్ర ప్రభుత్వ విత్త సంఘటిత యత్నాలు

బడ్జెట్ 2016-17లో కేంద్ర ప్రభుత్వం ఒక స్థిరమైన మార్గంలో విత్త సంఘటితత్వాన్ని సాధించడానికి యత్నించింది. జిడిపిలో 2015-16లో ద్రవ్యలోటు లక్ష్యం 3.9గా ఉండగా ఇది 2016-17లో 3.5 శాతం లక్ష్యంగా పెట్టింది. సైనికుద్యోగులకుఒకే ర్యాంక్ ఒకే పింఛన్, ఏడవ వేతన సంఘం సిఫారసులు కేంద్ర ప్రభుత్వంపై ఆర్థిక భారాన్ని మోపాయి. అయితే ద్రవ్యలోటును స్థిరీకరించడానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించినట్టు ఇందులో కనిపించలేదు. రెవెన్యూ లోటు 66 శాతం(2016-17) ఉండగా ఇందులో చాలా మొత్తం పెట్టుబడులు, స్థిర ఆస్తులకు మళ్లించకపోవడం ఆందోళన కలిగించే విషయం. దీంతో ఆర్థిక మంత్రి ఎఫ్ఆర్‌బిఎం సాధించిన లక్ష్యాలను సంఖ్యల్లో తెలియజేయకపోవడమనేది, దీన్ని పునసమీక్షించేందుకు ఒక కమిటీ నియమించే ఆలోచనలో ఉన్నట్టు తెలియజేస్తుంది. అయితే విత్తలోటు ఒక శాపం మాత్రం కాకపోయినప్పటికీ, దీంతో పెద్ద ఎత్తున చేసే రుణాలు రానున్న సంవత్సరాల్లో వడ్డీల భారాన్ని మాత్రం మిగులుస్తాయి. వడ్డీల చెల్లింపుతో 2014-15లో 79 శాతం ఉన్న విత్తలోటు 2016-17 నాటికి 92శాతానికి చేరుకుంది. ప్రణాళికేతర ఖర్చుల్లో వడ్డీల చెల్లింపు 37శాతం ఉంది, అంటే ఇది గతంలో 4 కంటే ఒక శాతం హెచ్చు. పన్నుల ఆదాయం 46.7శాతం పెరిగింది, ఇదే 2014-15లో 44.5శాతం మాత్రమే.

## కేంద్ర ప్రభుత్వ యత్నాలు

పద్నాలుగవ ఆర్థిక సంఘం సిఫారసులతో రాష్ట్రాల పన్నుల విభాజ్య నిధి వాటా పెరిగింది. కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాలను ప్రవేశపెట్టింది ( కేంద్ర ప్రాయోజిత పథకాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు). ఆధార్‌కు శాసన బద్ధత కల్పించడం ద్వారా ప్రభుత్వ రాయితీలను నేరుగా లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమాలకు ఊతమివ్వడం జరిగింది. 2016-17లో కొన్ని జిల్లాల్లో ఎరువుల రాయితీలను నేరుగా లబ్ధిదారులకు అందజేసే ప్రయత్నం చేశారు. బడ్జెట్‌లో రాయితీలు రూ.లక్ష కోట్లు దాటడంతో రానున్న కాలంలో వీటిని సవరించే అవకాశం ఉంది. విత్త సంఘటితం 2015-16లో అంతర్జాతీయ చమురు ధరలతో పూర్తిగా ప్రభావితమైంది. ప్రభుత్వం 8 నుంచి 10 సార్లు తన ఎక్సయిజ్ డ్యూటీని పెంచాల్సి వచ్చింది. ఇదే ఒరవడి 2016-17లో కూడా కొనసాగవచ్చు. అలాగే 2015లో రూ.56 వేల కోట్లు టెలికాం స్పెక్ట్రం వేలం ద్వారా వచ్చింది. ఈ లక్ష్యాన్ని 2016-17లో రూ.98995 కోట్లుగా నిర్ణయించారు. కార్ల కొనుగోలుపై 1 నుంచి 4 శాతం మౌలికసదుపాయాల సెస్, 0.5 శాతం కృషికల్యాణ్ సెస్, బొగ్గు మీద ప్రతి టన్నుకు 400 వందల రూపాయల క్లీన్ ఎనర్జీ సెస్, స్వచ్ఛ్ భారత్ సెస్ ద్వారా రూ.35వేల కోట్లు జమ అయ్యే అవకాశం ఉంది. రాయితీలను ఒక గాడిన పెట్టడం ద్వారా ఆర్థిక స్థిరత్వం సాధించడానికి యత్నాలు చేసినట్టు కనిపిస్తోంది. ఏది ఏమైనా అన్నింటా ప్రతిఫలించే అంశమైన స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) మార్పులకు లోనయ్యే అంశం. ఇటువంటి తరుణంలో ఎదురయ్యే సవాళ్లను ఎదురుకోవడానికి స్థిరమైన లక్ష్యాలను సాధించడానికి యత్నించాలి.

# 2016-17 రైల్వే బడ్జెట్‌పై ప్రతిస్పందనలు



**ప్రయాణీకులతో మరింత సాన్నిహిత్యాన్ని పెంచేవిధంగా వారి ప్రయాణాలను మరింత సులభసాధ్యం చేస్తూ అనేక సమాచార సాంకేతిక సౌలభ్యాలను (పొట్టి సందేశాలు వంటివి) ఉధృతం చేశారు. లెవెల్ క్రాసింగులన్నింటినీ తొలగించి బ్రిడ్జిలను నిర్మించాలనేది మరింత విభిన్నమైన ఆలోచన. దీనివలన ప్రమాదాలు 40 శాతం వరకూ తగ్గుతాయి. రైల్ రెగ్యులేటరీ అథారిటీ ఏర్పాటు వల్ల రవాణా మరింత సులభమవుతుంది కనుక వెంటనే దీనిని ఒక స్వతంత్ర సంస్థగా ఏర్పాటుచేయాలి.**

మూసధోరణి నుండి దారిమళ్ళి, రైల్వేల ప్రాథమిక సౌకర్యాలను పటిష్ట పరచడానికి సాహసం చేసిన రైల్వే మంత్రి సురేష్ ప్రభుకు ముందుగా అభినందనలు. ఈ మార్పు రైల్వేల పరిస్థితిని మెరుగు పరచడానికి మరిన్ని వనరుల ఆవశ్యకతను నొక్కి చెప్పడమే కాదు, అంత సులభంగా సాధించగలిగినదేమీ కూడ కాదు. అంతవరకూ రూ. 60,000 కోట్లుగా వున్న రైల్వేల పెట్టుబడులను 2015-16 లో లక్ష కోట్లకు పెంచడమేకాదు, నేటికి రూ. 1.21 లక్షలకోట్లకు చేర్చాలని లక్ష్యించారు. వర్తమాన పంచవర్ష ప్రణాళిక అంతానికి అంటే 2020-21 నాటికి ఈ పెట్టుబడులను మొత్తం రూ. 8.54 లక్షల కోట్లకు చేర్చాలనే లక్ష్యంలో ఇది ఒక భాగం మాత్రమే! ఈలక్ష్యం కనుక నెరవేరితే, గత పంచవర్ష ప్రణాళిక కన్నా, పెట్టుబడులు మూడు రెట్లు పెరిగినట్లు. ఈ బడ్జెట్ లో తీసుకున్న మరో ప్రధాన నిర్ణయమేమంటే, అందుబాటులోనున్న వనరులన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో మాత్రమే ఖర్చు చేయాలని! మిగిలిన అప్రాధాన్య అంశాలన్నింటినీ, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు తమవంతు వనరులను కూర్చి, ప్రాజెక్టుల అమలుకు ప్రత్యేక యంత్రాంగాలను (Special Purpose Vehicle) ఏర్పాటు చేసేంతవరకూ, పక్కన పెట్టాలనీ నిర్ణయించారు. మార్గాల నవీకరణ, ప్రత్యేక సరుకు రవాణా మార్గాల పూర్తి, ఓడరేవుల అనుసంధానము వంటి పనులన్నింటికీ కేటాయింపును ఇతోధికంగా పెంచారు. దీని ప్రకారం, వచ్చే మూడు సంవత్సరాల వరకూ రోజుకు 13 కిలోమీటర్ల మేర లైను పూర్తి చేయాల్సివుంటుంది.గత ఆరు సంవత్సరాలుగా ఈ లక్ష్యం రోజుకు కేవలం 4.3 కిలోమీటర్లుగా ఉన్నది.

**ఈ బడ్జెట్లోని మిగిలిన విశేషాంశాలు ఏమంటే:**

ప్రయాణీకులతో మరింత సాన్నిహిత్యాన్ని పెంచేవిధంగా వారి ప్రయాణాలను మరింత సులభసాధ్యం చేస్తూ అనేక సమాచార సాంకేతిక సౌలభ్యాలను (పొట్టి సందేశాలు వంటివి) ఉధృతం చేశారు. అలాగే రైల్వే స్టేషన్లలో ఎస్కలేటర్లు, ప్రయాణీకుల లాంజీల ఏర్పాటు వంటి అనేక సౌకర్యాలను కల్పించారు. రైల్వే ఆహార పదార్థాలు, పరిశుభ్రత వంటి అంశాలలో మరింత నాణ్యతతో కూడిన మెరుగుదల

**శాంతి నారాయణ్,** అంతర్జాతీయ సలహాదారు, ఆసియా అభివృద్ధి బ్యాంకు.

కోసం, ఈ సేవలను దశలవారీగా ఐ.ఆర్.సి.టి.సి. (Indian Railway Catering and Tourism Corporation Limited)కి బదలాయిస్తారు. దీనికి తోడు, ఈ-కేటరింగ్ అనేది మరో వినూత్న ఆలోచన! సిబ్బందితో కూడిన/లేని లెవెల్ క్రాసింగులన్నింటినీ తొలగించి బ్రిడ్జిలను నిర్మించాలనేది మరింత విభిన్నమైన ఆలోచన. దీనివలన ప్రమాదాలు 40 శాతం వరకూ తగ్గుతాయి. దీనికోసం సత్వర ఫలితాలను రాబట్టే ప్రత్యేక యంత్రాంగాన్ని రైల్వే బోర్డులో ఏర్పాటు చేశారు. ఏడు ప్రధాన మిషన్లను ఏర్పాటు చేసి, ఒక సంచాలకుని స్థాయి అధికారి నేతృత్వంలో పనిచేసేటట్లు నియమించారు. ఈ ఏడింటిలో ఒకటైన సామర్థ్య వినియోగానికి సంబంధించిన వర్గం, ముందుగా ప్రత్యేక సరుకు రవాణా మార్గాలను ఏర్పాటు చేసిన మరుక్షణం, వాటి సామర్థ్యాన్ని గరిష్టంగా ఎలా వినియోగించుకోవచ్చో ఒక నమూనా పత్రాన్ని సమర్పిస్తుంది. అంతర్గత వనరులను గరిష్టంగా వినియోగించుకుని సామర్థ్యాన్ని ఎలా గరిష్టం చేయవచ్చో దీనివల్ల తెలుస్తుంది. అదేవిధంగా మార్కెట్ ప్రణాళిక వర్గం, రైల్వే రవాణా సామర్థ్యాన్ని ఎలా గరిష్టం చేసుకోవచ్చో నేర్పుతుంది. ఇంకా క్రింద వివరించిన చర్యలను చేపట్టవచ్చు:

అ) సరసమైన ధరలను ప్రకటించడం ద్వారా, ప్రస్తుతం కేవలం 20 శాతంగానున్న కంటైనర్ కార్గో రవాణాను, 40-50 శాతానికి పెంచవచ్చు. ఎందుకంటే ప్రస్తుతం ఈ కంటైనర్ కార్గో రేట్లు అధికంగా ఉండటం వల్ల, రవాణా అవకాశాలు రోడ్డు మార్గానికి తరలి వెళ్తున్నాయి.

ఆ) చిన్న స్థాయిలో ఉండే ఇంటి సామాన్లను రోడ్డు ద్వారా రవాణా చేయడం నేడు అధిక ఖర్చుతో కూడుకుని ఉన్నది. దీనిని తిరిగి రైల్వేలు చేపట్టాలి.

ఇ) రోడ్లపై ట్రక్కుల ద్వారా తీసుకెళ్ళే సరుకులను, ట్రక్కులతో సహా రైళ్లలో తరలిస్తే, రోడ్లపై ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది.

ఈ) అదనపు వ్యయాలను పూర్తిగా వసూలు చేసే లక్ష్యంతో రవాణా రేట్లను సవరించాలి. అంతే కాదు గమ్యస్థానంలో సరుకులను దించిన తర్వాత, తిరిగి ఖాళీగా వచ్చే వేగన్ల ఖర్చును కూడ స్థిర వ్యయాలలో చేర్చాలి.

ఉ) రెగ్యులర్ కష్టమర్లుగానున్న వ్యాపార సంస్థలు, తాము రోడ్డు మార్గంలో చేసే సరుకు రవాణాను రైలు మార్గాలకు మళ్ళిస్తే, రాయితీలనివ్వాలి.

బడ్జెట్లోని పైన పేర్కొన్నటువంటి ప్రోత్సాహక చర్యలను మాత్రమే కాక, ఇంతవరకూ సరైన దృష్టి పెట్టని రవాణా విధానాన్ని, మరింత హేతుబద్ధం చేయాలి. ప్రయాణీకుల రవాణాలో వస్తున్న రూ. 30,000/- మొత్తం నష్టం, సరుకు రవాణాలో ఇస్తున్న రాయితీకి సమానమవుతున్నది. సబర్బన్ మరియు నాన్ సబర్బన్ రైళ్లలో ద్వితీయ శ్రేణి ప్రయాణీకుల ఛార్జీలను సవరించకపోవడం, దశాబ్దాలుగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం లాంటి నష్టాలతో మరింత కృంగిపోయి, బదులుగా సరుకు రవాణా ఛార్జీలను పెంచడం మినహా మరో మార్గం రైల్వేలకు లేకపోయింది. దీనితో భారతీయ పరిశ్రమలకు ప్రపంచ స్థాయిలో అనేక ఒడిదుడుకులు ఎదురయ్యాయి. ఈ సమస్యను పరిష్కరించేవిధంగా ఈ బడ్జెట్లో ప్రయాణీకుల సౌకర్యాలను మెరుగు పరుస్తూ, తగినంతగా ఛార్జీలను పెంచడానికి సమయం ఆసన్నమైంది. సేవల నాణ్యత పెరిగితే ఛార్జీలు కొంత పెరిగినా, ప్రజలు పెద్దగా పట్టించుకోరు. ఈ అవకాశాన్ని రైల్వే మంత్రి మరోసారి కోల్పోయారు. ఇప్పటికైనా మిగిలిన పది నెలల కాలంలో, పది శాతం వరకూ రైల్వే మంత్రి ఛార్జీలను పెంచవచ్చు. గత సంవత్సరం రైల్వే బడ్జెట్ లో ప్రకటించి కూడ అమలుకు నోచుకోని మరో నిర్ణయం, రైల్ రెగ్యులేటరీ అథారిటీ ఏర్పాటు. దీనివల్ల రవాణా మరింత సులభమవుతుంది కనుక వెంటనే దీనిని ఒక స్వతంత్ర సంస్థగా ఏర్పాటుచేయాలి.

మరో విధంగా చూస్తే, ప్రస్తుత ప్రభుత్వం రాయితీలన్నీ కేవలం పేదవర్గాలకే అందచేయడం వంటి అనేక సరైన ప్రోత్సాహక చర్యలను చేపట్టింది. పట్టణ ప్రాంతాల లోనయితే ఇలాంటి రాయితీలు కేవలం స్వయం ఉపాధి పొందినవారికే చెందాలి. మిగిలినవారందరికీ వారి ఎంప్లాయర్స్ నుండి ఈ రాయితీలు ఏదోవిధంగా అందుతూనే వుంటాయి. గ్రామీణ ప్రాంతాలలో కూడ, రైళ్ళ కన్నా నాలుగు రెట్లు అధిక ఛార్జీలు పెట్టుకుని బస్సులలో వెళ్ళే వారూ లేకపోలేదు. గ్రామీణ ప్రాతాల విధ్యార్థులు పాఠశాల/కళాశాలలకు వెళ్లడానికి రాయితీ పాసులున్నాయి. మరో నిరుత్సాహజనక విషయమేమంటే, 2014-15 లో88.2 శాతంగానున్న నిర్వహణా ఖర్చులు 2015-16 నాటికి 90 శాతానికి పెరిగాయి. ఇవి 2016-17 సంవత్సర అంతానికి 92శాతం కాగలవని అంచనా! అంటే ఖర్చులను నియంత్రించడానికి అంతర్గత వనరుల సమీకరణకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నమాట. ఆర్థిక పనితనం తగ్గటానికి తగిన కారణాలున్నా, అలాగని సంతృప్తి పడటానికి వీలు లేదు. సామర్థ్యానికి ప్రాధాన్యమిస్తూ, అదనపు వనరులన్నీ తగిన ప్రతిఫలాన్ని చూపాలి. దీనివల్ల వృథా ఖర్చు, అదనపు వ్యయం అనేవి వుండవు. నియంత్రణా వ్యవస్థలు మరింత పటిష్టంగా పని చేయాలి.

చివరగా, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా అదనపు వనరుల సమీకరణ, లేదా రైల్వే భూముల అమ్మకం

*తరువాయి 32వ పేజిలో...*

# గ్రామీణ మౌలిక సదుపాయాలూ, గ్రామీణ విద్యుదీకరణ



**వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం చేసే ఖర్చుల ప్రభావం బడ్జెట్‌పై ఉంటుంది. అదే విధంగా సంబంధిత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ ప్రణాళిక ఎలా ఉందీ అనే విషయంపై పెట్టుబడిదారులకు, భాగస్వాములకు ఒక అవగాహన కలుగుతుంది. 2015 ఏప్రిల్ ఒకటవ తేదీ నాటికి – 18 వేల 542 గ్రామాలకు విద్యుత్ సరఫరా లేదు. ప్రధానమంత్రి దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ – మిగిలిన గ్రామాలకు వెయ్యి రోజుల్లో – విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు ప్రకటించారు.**

2014 లో 3.4 శాతంగా ఉన్న అంతర్జాతీయ ఆర్థిక వృద్ధిరేటు 2015 లో 3.1 శాతానికి తగ్గిన నేపథ్యంలో భారత దేశ ఆర్థిక వృద్ధిరేటు దాదాపు 7శాతం మేర స్థిరంగా పెరుగుతోంది. 2014–15 మాదిరిగానే 2015–16లో కూడా దేశ ఆర్థికాభివృద్ధి స్థిరమైన పెరుగుదల నమోదు చేసింది. దేశీయ ఉత్పత్తుల అండతో మొత్తం మీద దేశాభివృద్ధి సానుకూలంగా ఉంది.

చాలా మంది ఆశించినట్లుగానే ఇటీవల ప్రకటించిన బడ్జెట్ ప్రణాళిక మంచి ప్రోత్సాహకంగానే ఉంది. వ్యవసాయం, గ్రామీణ రంగం, సామాజిక రంగం, మౌలిక సదుపాయాల రంగం, ఉపాధి కల్పన, బ్యాంకులకు ఆర్థిక చేయూత వంటి ప్రాధాన్యతా అంశాలకు కేటాయింపులు పెంచడంపై దృష్టి పెట్టింది. గతంలో ఇచ్చిన హామీలను నేరవేర్చడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయాలనే ఆలోచనతో సమూల మార్పుల కోసం కృషి చేస్తున్నామన్న విషయం తెలియజేయడానికి భారత ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకుంటోంది.

**2016–17 ప్రణాళిక :**

వచ్చే ఆర్థిక సంవత్సరానికి దేశంలో వ్యయం ఎలా ఉంటుందీ అనేది బడ్జెట్ ద్వారా మనకు తెలుస్తుంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం చేసే ఖర్చుల ప్రభావం బడ్జెట్‌పై ఉంటుంది. అదే విధంగా సంబంధిత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ ప్రణాళిక ఎలా ఉందీ అనే విషయంపై పెట్టుబడిదారులకు, భాగస్వాములకు ఒక అవగాహన కలుగుతుంది. దేశాభివృద్ధికీ, దేశ పురోగతికీ 2016–17 వార్షిక బడ్జెట్ లో తొమ్మిది ప్రధాన అంశాలను పొందుపరిచారు.

- ✳ వ్యవసాయం, రైతుల సంక్షేమం
- ✳ గ్రామీణ ఉపాధి, మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తూ గ్రామీణ రంగం
- ✳ ఆరోగ్య పరిరక్షణ తో సహా సామాజిక రంగం
- ✳ విద్య, నైపుణ్యాభివృద్ధి
- ✳ మౌలిక సదుపాయాలూ, పెట్టుబడి
- ✳ ఆర్థిక రంగంలో సంస్కరణలు
- ✳ పరిపాలన, వ్యాపారానికి అనువైన వాతావరణం
- ✳ ఆర్థిక క్రమశిక్షణ
- ✳ పన్ను విధింపులో సంస్కరణలు

**డా॥ హిరణ్మయ్ రాయ్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, యు.పి.ఈ.ఎస్. **డా॥ అనిల్ కుమార్,** ప్రొఫెసర్, హెచ్.ఒ.డి., యు.పి.ఈ.ఎస్.
**డా॥ ప్రసూం ద్వివేది,** సీనియర్ అసోసియేట్ ప్రొఫెసర్, యు.పి.ఈ.ఎస్.

**మౌలిక సదుపాయాల రంగం పాత్ర :**

ఏ ఆర్థిక వ్యవస్థ పురోగతికైనా, అభివృద్ధి కైనా మౌలిక సదుపాయాల రంగం వెన్నుముక లాంటిది. అమెరికా 42వ అధ్యక్షుడు విలియం జె క్లింటన్ ఒకసారి చెప్పిన ప్రకారం – "సమాన అవకాశాలు, ఆర్థిక సాధికారత – రెండూ – నైతికంగా సరైనవే. అలాగే ఆర్థిక వ్యవహారమే. ఎందుకంటే – వివక్ష / పక్షపాతం, పేదరికం, అమాయకత్వం మొదలైనవి అభివృద్ధిని అడ్డుకుంటాయి. కాగా – విద్య, మౌలిక సదుపాయాలు, శాస్త్ర, సాంకేతిక పరిశోధనల్లో పెట్టుబడి – అభివృద్ధిని పెంపొందిస్తాయి. అలాగే మనందరికీ – మరిన్ని మంచి ఉద్యోగాల కల్పనకూ – కొత్త సంపదల అభివృద్ధికీ – అవకాశం ఉంటుంది."

ఇది ప్రస్తుత భారతీయ పరిస్థితులకు కూడా వర్తిస్తుంది. ఎందుకంటే మౌలిక సదుపాయాలు ఇంకా తగినంత ప్రాధాన్యం సంతరించుకోలేదు కాబట్టి. కానీ సమీప భవిష్యత్తులో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో దీని ప్రాముఖ్యతను – గమనించవచ్చు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మౌలిక సదుపాయాల రంగం పాత్రను ఎంత మాత్రం తక్కువ చేసి చూడలేము. ఎందుకంటే – వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో రైల్వేలు, రహదారులు ఇతర మౌలిక సదుపాయాల రంగాలు అన్నింటికీ కలిపి – మొత్తం 2 లక్షల 21 వేల కోట్ల రూపాయల మేర ఆర్థిక కేటాయింపులు చేశారు. ఏ రంగం అభివృద్ధి చెందాలన్నా ప్రాథమిక మౌలిక సదుపాయాలు తప్పనిసరి – అందువల్ల అన్ని రంగాల్లో – మౌలిక సదుపాయాల పాత్ర అనివార్యం.

**భౌతిక మౌలిక సదుపాయాల కోసం బడ్జెట్ :**

స్థూల జాతీయోత్పత్తి (GDP)లో సుమారు 10 శాతం ఇన్‌ఫ్రా (INFRA) సెక్టార్‌లోని నిర్మాణ రంగం నుండే వస్తోంది. అయితే ఈ రంగంలో వచ్చే ఐదేళ్ళలో ఒక ట్రిలియన్ డాలర్ల వరకూ పెట్టుబడుల అవకాశం ఉంది. కాగా ఇందులో సగం ప్రయివేటు రంగం నుంచి పెట్టుబడులు రావలసిఉంది. అందువల్ల ఈ బడ్జెట్ వారికి ఎంతో కీలకమైనది. అదనపు పన్ను రాయితీలు, వడ్డీ రాయితీలు కల్పించడం ద్వారా గృహనిర్మాణ రంగాన్ని పునరుద్ధరించాలి.

**రహదారుల రంగం :**

రహదారుల రంగానికి మొత్తం 97 వేల కోట్ల రూపాయలు కేటాయించారు. ప్రభుత్వం 55 వేల కోట్ల రూపాయలను కేటాయించగా – భారత జాతీయ రహదారుల సాధికార సంస్థ (ఎన్.హెచ్.ఎ.ఐ.) 15 వేల కోట్ల రూపాయల మేర పన్ను లేని బాండ్లను జారీచేసుకోవచ్చు. వీటిలో – గ్రామీణ రహదారులకు ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పి.ఎమ్.జి.ఎస్.వై.) క్రింద 27 వేల కోట్ల రూపాయలు కేటాయించారు. మౌలిక సదుపాయాల రంగానికి సులువుగా నిధులు మంజూరు చేయడానికి వీలుగా – కొత్త క్రెడిట్ రేటింగ్ విధానాన్ని అభివృద్ధి చేయవలసి ఉంది.

2016–17 ఆర్థిక సంవత్సరానికి దాదాపు 10 వేల కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రహదారులపై ప్రయాణీకుల రాకపోకల నియంత్రణ కోసం మోటారు వాహనాల చట్ట సవరణ అనంతరం ఒక కొత్త సంస్కరణను తీసుకురావలసిఉంది. వివిధ మార్గాల మధ్య సేవల నిర్వహణకు సమర్థమైన, సురక్షితమైన నిబంధనలతో – ఈ సవరణ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తుంది. చిన్న పెట్రోలు కార్లు, LPG కార్లు, CNG కార్ల పై ఒక శాతం – నిర్ణీత సామర్థ్యం గల డీజిల్ కార్ల పై 2.5 శాతం – పెద్ద ఇంజను సామర్థ్యం గల వాహనాలు, స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాలు (SUV)ల పై 4శాతం మౌలిక సదుపాయాల సుంకం (infrastructure cess) విధించాలి. ఈ సుంకం చెల్లించడానికి – ఎటువంటి సెస్ క్రెడిట్ ఉండదు. అలాగే – ఇతర పన్నుల క్రెడిట్ కూడా ఉపయోగించకూడదు. ఈ విధానం – LPG, CNG, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తుంది.

**విద్యుత్తు, ఇంధన రంగం :**

దేశంలో ఏ పరిశ్రమ ఏర్పాటుకైనా విద్యుత్తు, ఇంధనం రెండూ కూడా ప్రాథమిక మౌలిక సదుపాయాల క్రిందకే వస్తాయి. వీటిని ఎంతమాత్రం విస్మరించలేము. గత రెండు దశాబ్దాలలో ప్రభుత్వం బొగ్గు ఉత్పత్తిలో – అత్యధిక పెరుగుదల సాధించినట్లు బడ్జెట్ పేర్కొంది. అదే విధంగా అత్యధిక సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి, విద్యుత్ సరఫరాలైన్లు గణనీయంగా పెరగడంతో పాటు–LED బల్బుల సరఫరా కూడా మెరుగైంది.

**గ్రామీణ విద్యుదీకరణ,**
**పునర్వినియోగ ఇంధనం :**

2015 ఏప్రిల్ ఒకటవ తేదీ నాటికి – 18 వేల 542 గ్రామాలకు విద్యుత్ సరఫరా లేదు. ప్రధానమంత్రి దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ – మిగిలిన గ్రామాలకు వెయ్యి రోజుల్లో – విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు ప్రకటించారు. 2018 మే నాటికి వంద శాతం గ్రామీణ విద్యుదీకరణపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందుకోసం దీన్ దయాళ్ గ్రామీణ విద్యుదీకరణ్ యోజన (DDGVY) క్రింద, సమగ్ర విద్యుత్ అభివృద్ధి పథకం (DPDS) కింద ఎక్కువ మొత్తంలో నిధులు సమీకరిస్తారు. దీనివల్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతుంది. వినియోగం పెరుగుతుంది. తద్వారా విద్యుత్ ఉత్పత్తి కంపెనీల సామర్థ్యం పెరుగుతుంది. వంద శాతం గ్రామీణ విద్యుదీకరణ లక్ష్య సాధన కోసం – దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామ్ జ్యోతి యోజనకూ, అలాగే సమగ్ర విద్యుత్ అభివృద్ధి పథకానికీ – 8 వేల 5వందల కోట్ల రూపాయలు కేటాయించారు.

పునర్వినియోగ ఇంధనానికి బడ్జెట్‌లో తరుగుదల పై మినహాయింపు లభించడంతో – దాని ప్రభావం వల్ల – పవన విద్యుత్ చార్జీలు – ముఖ్యంగా 2017 మార్చి తర్వాత నెలకొల్పే ప్రాజెక్టులకు పెరుగుతాయి.

**అణువిద్యుత్తు:**

రానున్న 15–20 సంవత్సరాలలో భారత్ లో అణు విద్యుత్తు సామర్థ్యాన్ని పెంపొందించడానికి లక్ష్యాన్ని నిర్ణయించారు. హరిత విద్యుత్ ప్రోత్సాహానికి ఈ చర్య ఒక ముందడుగుగా పనిచేస్తుంది. అలాగే థోరియం పుష్కలంగా ఉన్న భారతదేశంలో – ఇది ఒక స్థిరమైన విద్యుత్ ఉత్పత్తికి తోడ్పడుతుంది.

**స్వచ్ఛ ఇంధన సుంకం :**

బొగ్గుపై విధించిన “స్వచ్ఛఇంధన సుంకం / Clean Energy Cess” కు అదనంగా – లిగ్నైట్, పీట్ (Peat) పై ఈ సెస్‌ను “ స్వచ్ఛపర్యావరణ సుంకం / Clean Environment Cess” గా పేరు మార్చి – టన్నుకు రెండు వందల రూపాయల నుంచి నాలుగు వందల రూపాయలకు పెంచారు. దీనివల్ల బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్ల విస్తరణ తగ్గి ప్రత్యామ్నాయ ఇంధన వనరుల విస్తరణకు ప్రోత్సాహం లభిస్తుంది.

**చమురు, సహజ వాయువు రంగం :**

సముద్ర గర్భం నుంచీ, లోతైన జలవనరుల నుంచీ చమురు, సహజ వాయువు వెలికితీత అవకాశాలను పెంపొందించేందుకు – అన్వేషణను ప్రోత్సహిస్తున్నారు. దీనివల్ల దేశీయంగా చమురు, సహజవాయువు ఉత్పత్తికి ఎక్కువమంది ఉత్సాహం చూపిస్తున్నారు. తద్వారా ఆర్థిక వ్యవస్థ పై దిగుమతి భారం తగ్గుతుంది. దేశీయ చమురు, సహజవాయువు వనరులకు పోటీ ధరలు లభిస్తాయి.

**ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం (పీ.పీ.పీ.) :**

ప్రస్తుత బడ్జెట్ లో ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం ఒక ముఖ్యమైన భూమిక పోషిస్తున్నది. ప్రయివేటు వ్యక్తులు లేదా సంస్థల నుంచి పెట్టుబడులూ, అలాగే వారి నైపుణ్యం కూడా, భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల సత్వర అభివృద్ధికి దోహదపడతాయి. ప్రయివేటు రంగ పెట్టుబడులు చవకగానూ, అత్యంత సమర్థవంతంగానూ అందుబాటులో ఉండడంతో – పీ.పీ.పీ.విధానం వల్ల ఆర్థిక భారం కూడా తగ్గుతుంది. పీ.పీ.పీ.విధానం ఇంకా ప్రారంభ స్థాయి లోనే ఉండడం వల్ల – ఈ విధానాన్ని మరింత అనువుగా, సంప్రదింపులకు యోగ్యంగా చేసేందుకు భారత ప్రభుత్వం చర్యలను వేగవంతం చేస్తోంది.

**పీ.పీ.పీ.లను చైతన్య పరిచేందుకు చర్యలు :**

* 2016–17 లో ప్రజా వినియోగం (వివాదాల తీర్మానం) బిల్లు ప్రవేశపెట్టాలి
* పీ.పీ.పీ. రాయితీల ఒప్పందం, సంప్రదింపులకు మార్గదర్శక సూత్రాలు ఉండాలి.
* మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కొత్త పరపతి ప్రమాణ విధానాన్ని ప్రవేశపెట్టాలి (పీ.పీ.పీ.విధానాన్ని పరీక్షించి, చైతన్య పరిచేందుకు కేల్కర్ కమిటీ సమర్పించిన నివేదికలో ఈ చర్యలు కూడా ఉన్నాయి) గతంలో సమర్పించిన బిడ్స్ లో పేర్కొన్న ఆచరణ యోగ్యంకాని చార్జీల కారణంగానూ, దీర్ఘకాలంగా కొనసాగుతున్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కారణంగానూ నష్టపోయిన విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు ప్రస్తుత పీ.పీ.పీ.కాంట్రాక్టుల ప్రతిపాదిత మార్గదర్శక సూత్రాలు సానుకూలంగా ఉన్నాయి.
* మౌలిక సదుపాయాలు, విద్యుత్ రంగాల అభివృద్ధి కి మరింతగా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం 31 వేల 3 వందల కోట్ల రూపాయల మేర అదనపు ఆర్థిక సహాయం సమకూర్చుకోవడానికి అనుమతినిస్తుంది. 2016–17 లో బాండ్స్ ద్వారా ఈ నిధులను – NHAI, PFC, REC, IREDA, NABARD తో పాటు దేశీయ జలసాధికార సంస్థలకు అనుమతినిస్తారు.

**వివాదాల తీర్మానం :**

ప్రత్యేకంగా వివాదాల తీర్మానం వంటి న్యాయ పరిధి లో చర్యలను ప్రస్తుత బడ్జెట్‌లో ప్రవేశపెట్టాలని సూచించారు. పీ.పీ.పీ.తరహా ప్రాజెక్టుల్లో ఫిర్యాదుల పరిష్కార విధానం మరింత ఆమోదయోగ్యంగా, పారదర్శకంగా, వేగంగా పనిచేసేందుకు ఇది దోహద పడుతుంది.

**విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విధానాలు:**

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (FDI)ల విధానాలలో కూడా మార్పులు చేయాలని ప్రతిపాదించారు. ఆహార పదార్థాల ప్రోసెసింగ్, ఆహార పదార్థాలు నిల్వ చేసే పరిశ్రమల్లో వంద శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తారు. దీనివల్ల ప్రభుత్వానికి చవకగా పెట్టుబడి లభించడంతో పాటు ఇబ్బందులు తక్కువగా ఉంటాయి. భారత ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపే విదేశీ పెట్టుబడిదారులను కూడా ఇది ఆకర్షిస్తుంది.

**వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాలు :**

భారతదేశం లో దగ్గర దగ్గర 50 శాతం వరకూ ప్రజలు మత్స్య పరిశ్రమ, ఉద్యానవన సాగుతో సహా వ్యవసాయ రంగం పైనే ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. వ్యవసాయ రంగంలో అభివృద్ధికి మెరుగు పరచవలసిన మౌలిక సదుపాయాలు ఈ విధంగా ఉన్నాయి.

* ఆహార భద్రత కోసం గోదాములనూ, శీతల గిడ్డంగుల మౌలిక సదుపాయాలనూ మెరుగుపరచాలి.

* ఉత్పాదకతను పెంపొందించేందుకు జీవ సంబంధ ఎరువులను సేకరించాలి.
* భూగర్భ జలాల వాడకాన్ని తగ్గించేందుకు స్థిరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి.
* సాగులో లేని పొలాలను అభివృద్ధి చేసేందుకు వీలుగా – సాగునీటి వ్యవస్థలో మౌలిక సదుపాయాలను మెరుగు పరచాలి.
* రైతులు నేరుగా కొనుగోలు చేయడానికి వీలుగా మౌలిక సదుపాయాల వివరాలను అంతర్జాలం లో అందుబాటులో ఉంచాలి.
* ఎరువుల రాయితీ నగదు ప్రయోజనాన్ని నేరుగా రైతుల ఖాతాలో జమ చేయాలని ఈ బడ్జెట్ లో ప్రతిపాదించారు.

## గ్రామీణ రంగంలో మౌలిక సదుపాయాలు :

భారత దేశంలోని మొత్తం జనాభా లో 72.2 శాతం గ్రామీణ ప్రజలే ఉన్నారు. అయినా అనేక మౌలిక సదుపాయాలు వారికి అందుబాటులో లేవు. ఎందుకంటే – ఇటువంటి మౌలిక సదుపాయాలు నిర్మించుకుని, నిర్వహించుకోడానికి అవసరమైన ఆర్థిక వెసులుబాటు వారికి లేదు. అదే పట్టణాల్లో అయితే – జనాభా సాంద్రత ఎక్కువగా ఉంటుంది. వారిలో అక్షరాస్యులు కూడా ఎక్కువగా ఉంటారు. అయితే గ్రామ పంచాయితీలు ఇప్పుడు ఆర్థికంగానూ, నిర్వహణ పరంగానూ సాధికారత కలిగి ఉన్నాయి.

* శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ గ్రామీణ, పట్టణ మిషన్ కింద మూడు వందల గ్రామీణ పట్టణ క్లస్టర్ల ను అభివృద్ధి చేశారు.
* 2018 మే నెల ఒకటవ తేదీ నాటికి వంద శాతం గ్రామాలను విద్యుదీకరిస్తారు.
* వచ్చే మూడేళ్ళలో 6 కోట్ల మందిని అదనంగా ఒక కొత్త డిజిటల్ అక్షరాస్యతా మిషన్ (DISHA) పరిధిలోకి తెస్తారు.
* కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో అమలు చేసే పథకాలకు ప్రాధాన్యత ప్రాతిపదికన కేటాయింపులు చేసి – వలసలు లేని గ్రామాలకు బహుమతులు ఇస్తారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా భారత దేశంలో ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన (PMGSY) అమలౌతోంది. సరైన నిధులు సమకూర్చని కారణంగా గతంలో ఈ పథకం అనేక ఇబ్బందులకు గురైంది. 2012–13 లో 8 వేల 885 కోట్ల రూపాయలు కేటాయించగా, 2013–14 లో 9 వేల 805 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారు. గత రెండేళ్లలో ప్రభుత్వం ఈ కేటాయింపులను గణనీయంగా పెంచింది. ప్రస్తుతం 2016–17 లో ఇందుకోసం 19 వేల కోట్ల రూపాయలను కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వాల వాటాతో కలిసి 2016–17 లో ఈ పథకానికి దాదాపు 27 వేల కోట్ల రూపాయులు ఖర్చు చేయనున్నారు. ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం ఈ కార్యక్రమ లక్ష్యాన్ని 2021 లో పూర్తిచేయవలసి ఉండగా – దీన్ని మరింత ముందుకు తీసుకు వచ్చి 2019 లోనే లక్ష్యాన్ని చేరుకోవాలన్నది ఇప్పటి ధ్యేయం. ఇందుకోసం 2 లక్షల 23 వేల కిలోమీటర్ల రహదారులను నిర్మించడం ద్వారా – మిగిలిన 65 వేల ఆవాసాలను అనుసంధానించవలసి ఉంది. అదేవిధంగా 2011–14 కాలంలో రోజుకు సరాసరి 73.5 కిలోమీటర్లు గా ఉన్న రహదారుల నిర్మాణ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచి – ప్రస్తుతం రోజుకు వంద కిలోమీటర్ల చొప్పున రహదారులు నిర్మిస్తున్నాము.

## ముగింపు :

మొత్తం మీద ఈ ఏడాది బడ్జెట్ మౌలిక సదుపాయాల రంగంతో పాటు గ్రామీణ రంగానికీ ప్రోత్సాహకరంగానే ఉంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికీ మౌలిక సదుపాయాల కల్పనకూ అవసరమైన పెట్టుబడులపై ప్రభుత్వ చిత్తశుద్ధిని ఈ బడ్జెట్ తేటతెల్లం చేస్తోంది. నిజానికి ప్రభుత్వ వ్యయం పెంచడం, కొత్తగా మౌలిక సదుపాయాల కోసం నిధులు కేటాయించడం, పటిష్టమైన, మరింత పారదర్శకమైన పీ.పీ.పీ.విధానాలకు శంకుస్థాపనలు చేయడం వంటి చర్యల ద్వారా – జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు లేవనెత్తిన కీలక సవాళ్ళను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్న విషయం తెలుస్తోంది.

ప్రజాధనాన్ని దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం వెచ్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న విషయం ఈ బడ్జెట్ విశ్లేషణ ద్వారా మనకు అర్థమౌతోంది. అందువల్లే – మౌలిక సదుపాయాల్లో పెట్టుబడుల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విధాన నిర్ణయాలను మెరుగుపరచడం ద్వారా – పట్టణ ప్రాంత మౌలిక సదుపాయాలతో పాటు – గ్రామీణ ప్రాంత మౌలిక సదుపాయాలను కూడా మెరుగుపరచడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్న విషయాన్ని కూడా ఈ బడ్జెట్ మనకు స్పష్టం చేస్తోంది. గతంలో ఎన్నో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు వెలుగు చూడలేదు. లేదా ప్రయివేటు నిధుల కొరత వల్ల మధ్యలో ఆగిపోయాయి. మౌలిక సదుపాయాల పెట్టుబడుల కోసం ఈ బడ్జెట్ కూడా ప్రయివేటు రంగ సంస్థల ద్వారా ఒత్తిడిని పెంచింది. దాదాపు అన్ని అంశాలనూ ప్రస్తావించిన ఈ బడ్జెట్ ను ఒక సర్వతోముఖ బడ్జెట్‌గా పేర్కొనవచ్చు. రైతుల ప్రోత్సాహకాలపైన, గ్రామీణ, సామాజిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి పైనా – ఒక స్పష్టమైన అవగాహనతో – ఒక పరివర్తనతో కూడిన అజెండాను ఈ బడ్జెట్ ప్రతిపాదించింది. ■

# బ్యాంకింగ్ రంగాన్ని కేంద్ర బడ్జెట్ పునరుద్ధరించగలదా?



**ప్రస్తుతం భారతదేశం ఎదుర్కొంటున్న రెండు నష్టాలను ఆర్థిక సర్వే ప్రధానంగా ఎత్తి చూపుతోంది. ఒకటి, బ్యాంకింగ్ రంగంలో, ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకులలో బలహీనంగా ఉన్న బ్యాలన్స్ షీట్. రెండవది, కార్పొరేట్ రంగం. బ్యాంకులకు పెట్టుబడులు అవసరమున్నందున, మూలధన పునరుద్ధీ కరణలో (రీక్యాపిటలైజేషన్) భాగంగా 25,000 కోట్ల రూపాయలను కేంద్ర బడ్జెట్‌లో కేటాయించడం సరియైనదే.**

ప్రస్తుతం భారతదేశం ఎదుర్కొంటున్న రెండు నష్టాలను ఆర్థిక సర్వే ప్రధానంగా ఎత్తి చూపుతోంది. ఒకటి, బ్యాంకింగ్ రంగంలో, ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకులలో బలహీనంగా ఉన్న బ్యాలన్స్ షీట్. రెండవది, కార్పొరేట్ రంగం. ఈ జంట నష్టాలను చర్చించాలంటే ఈ రెండూ కొంతవరకు ఒకదానితో మరొకటి ముడిపడి వున్నాయి. అయితే ప్రభుత్వ రంగ బ్యాంకులలోని ఈ నష్టాలు కేంద్ర బడ్జెట్ - 2016-17లో ప్రస్తావనకు వస్తాయని ఆశించారు. తత్ఫలితంగా, వివిధ చర్యల ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకుల పునరుద్ధరణపై దృష్టి పెట్టేందుకు బడ్జెట్ ప్రయత్నించింది. వీటిలో కొన్ని ప్రత్యక్ష చర్యలు కాగా మరికొన్ని పరోక్ష విధాన చర్యలు. దీని గురించి చర్చించేముందు, సమస్యను తెలుసుకోవడం అవసరం.

## సమస్య


ప్రపంచ ఆర్థిక సంక్షోభం తర్వాత, అనేక ఇతర దేశాల మాదిరిగా భారతదేశం కూడా పెద్దస్థాయిలో ఉద్దీపన చర్యలు, ముఖ్యంగా ఆర్థిక రంగంలో, చేపట్టింది. ఆర్థిక వ్యవస్థ కోలుకోవడానికి ఈ చర్యలు తోడ్పడినప్పటికీ, ఆర్థిక చర్యల అనాలోచిత మిశ్రమం వల్ల భారతదేశం భారీ ఆర్థిక లోటులో మునిగిపోయింది. 2008-09లో ఎఫ్.ఆర్.బి.ఎం లక్ష్య సాధనకు అతి చేరువలో ఉన్న ఏకీకృత ఆర్థిక లోటు రెండంకెలకు పెరిగింది. ఇటువంటి భారీ ఆర్థిక లోటుపాట్లు, మాక్రో వేరియబుల్స్‌పై దాని పెను ప్రభావం పర్యవసానంగా, భారతదేశంలో జి.డి.పి ఎదుగుదల పడిపోవడం, భారీ ద్రవ్యోల్బణంతో పాటు కరెంటు ఖాతా లోటు గణనీయంగా పెరగడం వంటివి చోటుచేసుకున్నాయి. ఇది దీర్ఘ కాలం పాటు వడ్డీ రేట్ల సంకోచ ద్రవ్య విధానం వైపుకు దారితీసింది. దేశంలో ఆర్థిక దుర్బలత (అస్థిరత) పెరగడానికి ఈ కారణాలన్నీ దోహదపడ్డాయి. భవిష్యత్తులో అభివృద్ధికి పొంచివున్న ప్రమాదాలుగా మారాయి.

ఆర్థిక రంగాన్ని మోస్తున్న బలమైన స్తంభాలలో ఒకటైన బ్యాంకింగ్ రంగం ఆ వ్యవస్థను రియల్ రంగంతో జోడిస్తుండడం వలన, రియల్ రంగంలో అస్థిరత బ్యాంకింగ్ వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతున్నది. ఇది రెండు మార్గాల ద్వారా జరిగినట్లు తెలుస్తుంది. మొదటిది, భారీ ప్రభుత్వ రుణాలు, దానితో పాటు అధిక ఆర్థిక లోటు మరియు రెండవది అధిక వడ్డీ రేట్ల కారణంగా కార్పొరేట్ లాభదాయకతలో ఒత్తిడి. ఇది భారత ప్రభుత్వ

**ఎన్.ఆర్. భానుమూర్తి,** ప్రొఫెసర్, ఎన్.ఐ.పి.ఎఫ్.పి, **మనీష్ ప్రసాద్,** పరిశోధక విద్యార్థి, ఎన్.ఐ.పి.ఎఫ్.పి.

రంగ బ్యాంకులలో లీవరేజీ నిష్పత్తి దారుణంగా పడిపోవడానికి దారి తీసింది. భారత రిజర్వు బ్యాంక్ (ఆర్.బి.ఐ) 4.5 శాతం లీవరేజీ నిష్పత్తిని సూచిస్తుండగా, బేసిల్-3 నియమాల ప్రకారం ఈ నిష్పత్తి 3 శాతం ఉండాలి. అయితే చాలా బ్యాంకులు ఆర్.బి.ఐ సూచించిన పరిమితి కంటే చాలా తక్కువ శాతం దగ్గర ముగిసాయి. ముందే ఊహించినట్లుగా, ఈ నియమాల ఉల్లంఘన ప్రభావం బ్యాంకుల నిరర్ధక ఆస్థుల (ఎన్.పి.ఎ)పై చూపించింది.

సంక్షోభానికి ముందు నుంచి ఇప్పటి వరకు ప్రైవేటు మరియు ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థూల నిరర్ధక ఆస్థుల పోకడలను కింద పేర్కొన్న గ్రాఫ్‌లో చూపడం జరిగింది.




అధిక వృద్ధి కాలంలో రెండు రంగాల బ్యాంకులు 3 శాతం కన్నా తక్కువ ఎన్.పి.ఎను కలిగి ఉన్నాయి. అందులోనూ ప్రైవేటు రంగ బ్యాంకుల కన్నా ప్రభుత్వ రంగ బ్యాంకుల ఎన్.పి.ఎ కనీసం ఒక్క శాతం తక్కువ ఉంది. తక్కువ ఆర్థిక లోటుతో పాటు సంక్షోభానికి పూర్వం ప్రభుత్వం యొక్క అనుకూల పొదుపుల వల్ల ఇలా జరిగివుండవచ్చు. అయితే, సంక్షోభం తర్వాత కాలంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల ఎన్.పి.ఎలో గణనీయమైన పెరుగుదల మనం చూస్తున్నాం. అదే సమయంలో ప్రైవేటు రంగ బ్యాంకులు పరిమితిలోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్థిక సంవత్సరం మరియు ఆర్థిక రంగానికి మధ్య ఉన్న బలమైన బంధాన్ని స్పష్టం చేస్తూ, ఇది ఆర్థిక సూచికలలో ఎటువంటి క్షీణతనైనా దాని గణనీయమైన ప్రభావంతో ఆర్థిక మార్కెట్లకు బదిలీ చేయాల్సి అవసరాన్ని కూడా సూచిస్తుంది. అంచనాల మేరకు ప్రస్తుతం ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఎన్.పి.ఎ 6 శాతం కన్నా కొద్దిగా ఎక్కువగా ఉంది. ఇది నిజంగా ఆందోళనకరమైన విషయం. అంతేకాకుండా ఇది బ్యాంకుల లాభదాయకతను కూడా ప్రభావితం చేయొచ్చు. చాలా కాలం విరామం తర్వాత, దాదాపు 11 ప్రభుత్వ రంగ బ్యాంకులు 2016-17 త్రైమాసికంలో నష్టాలు వచ్చినట్లుగా ప్రకటించాయి. ఇటువంటి ప్రతికూల ధోరణులు పెట్టుబడులను పరిమితం చేస్తున్నట్లుగా కనిపిస్తుంది, దాంతోపాటు దేశంలో వృద్ధి పునరుద్ధరణను కూడా.

**స్థూల ఎన్.పి.ఎ తో స్థూల అడ్వాన్సుల శాతం**

నికర ఎన్.పి.ఎ తో పాటు పునర్వ్యవస్థీకరించిన ఆస్తులు మరియు మొండి బకాయిల విషయంలో కూడా ఇవే ధోరణులు కనిపించాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల లోపలే, స్థూల ఎన్.పి.ఎ మొత్తం, ఇప్పటికే పునర్వ్యవస్థీకరించిన ఆస్తులు మరియు మొండి బకాయిలతో కలిపి, 17 శాతం స్థూల అడ్వాన్సుకు పెరిగింది. ప్రైవేటు రంగ బ్యాంకులతో పోలిస్తే ఈ శాతం 6.7% మాత్రమే ఉంది. (పట్టిక 1 చూడండి)

పట్టిక 1 : ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగ బ్యాంకులలో ఆస్థుల ధోరణులు

| **పట్టిక 1** | ప్రభుత్వ రంగ బ్యాంకులు | | | | ప్రైవేటు రంగ బ్యాంకులు | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | మార్చి 13 | మార్చి 14 | మార్చి 15 | సెప్టెంబర్ 15 | మార్చి 13 | మార్చి 14 | మార్చి 15 | సెప్టెంబర్ 15 |
| స్థూల ఎన్.పి.ఎ (%) | 2.0 | 2.7 | 3.2 | 3.6 | 0.5 | 0.7 | 0.9 | 0.9 |
| పునర్ వ్యవస్థీకరించిన ఆస్థులు(%) | 7.2 | 7.2 | 8.1 | 7.9 | 1.9 | 2.3 | 2.4 | 2.4 |
| స్థూల + పునర్ వ్యవస్థీకరించిన ఆస్థులు(%) | 11.0 | 11.9 | 13.5 | 14.0 | 3.8 | 4.2 | 4.6 | 4.6 |
| స్థూల + పునర్ వ్యవస్థీకరించిన + మాఫీ చేసిన ఆస్థులు (%) | 13.4 | 14.1 | 16.1 | 17.0 | 5.4 | 6.4 | 6.7 | 6.7 |

ఎన్.పి.ఎలలో ఇటువంటి పెరుగుదలకు దారితీసే రంగాల గురించి తెలుసుకోవడం కూడా ఎంతో ముఖ్యం. సాధారణ అంచనాలకు వ్యతిరేకంగా, అభివృద్ధి నిదానంగా సాగుతున్న కాలంలో కూడా బ్యాంకుల ఎన్.పి.ఎలకు వ్యవసాయ రంగ సహకారం అత్యంత తక్కువగా ఉండడమే కాకుండా మరింతగా క్షీణించిన విషయాన్ని పట్టికలో గమనించవచ్చు. 2015-16లో వ్యవసాయ రుణాలు పెరిగాయి. బహుశా దేశంలో రెండుసార్లు వరసగా వచ్చిన కరువు వల్ల ఇలా జరిగివుండవచ్చు. కానీ పారిశ్రామిక రంగంలో, ముఖ్యంగా చిన్న-మధ్య తరహా రంగంలో పరిశ్రమల నిరర్థక ఆస్తులు గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది. పారిశ్రామిక రంగంలో కొనసాగిన మందగింపు బహుశా ఇందుకు దోహదం చేసివుండవచ్చు.

### పట్టిక - 2

| పట్టిక-2 అన్ని బ్యాంకులు (స్థూల+పునర్వ్యవస్థీకరించిన+మాఫీ చేయబడిన ఆస్తులు (%)) | | | | |
|---|---|---|---|---|
| | మార్చి 13 | మార్చి 14 | మార్చి 15 | సెప్టెంబర్ 15 |
| వ్యవసాయం | 8.2 | 7.4 | 7.5 | 7.9 |
| పరిశ్రమలు (మైక్రో) | 10.2 | 10.0 | 10.5 | 12.3 |
| (చిన్న) పరిశ్రమలు | 13.2 | 13.3 | 14.8 | 16.8 |
| (మధ్యతరహా) పరిశ్రమలు | 20.2 | 23.6 | 27.0 | 31.5 |
| (పెద్ద) పరిశ్రమలు | 16.3 | 19.0 | 23.0 | 23.7 |
| ఆర్.బి.ఐ వెబ్‌సైట్ నుంచి | | | | |

క్రమాంకన పద్ధతిలో 125 బేసిస్ పాయింట్ల మేరకు తగ్గించింది. అయితే, బ్యాంకులు (ప్రభుత్వ మరియు ప్రైవేటు బ్యాంకులు కూడా) రుణాలపై వడ్డీ రేట్లను 40 బేసిస్ పాయింట్లు మాత్రమే తగ్గించాయి. తమ లీవరేజీ నిష్పత్తిని పెంచేందుకు ఎక్కువ పొదుపును కూడగట్టుకోవాల్సిన నేపథ్యంలో బ్యాంకులు ఈసారి డిపాజిట్ రేట్లను కూడా పరిమితంగానే తగ్గించాయి. రెపో నుంచి పెట్టుబడుల వరకు ద్రవ్య విధాన ప్రసార యంత్రాంగంలో అవరోధాలున్నట్లు ఇది సూచిస్తుంది. మరో విధంగా చెప్పాలంటే, రెపో రేటు తగ్గింపు పెట్టుబడుల చక్రం పునరుద్ధరణకు దారితీయదు. ప్రస్తుతం బ్యాంకులకు వాటి బ్యాలన్స్ షీట్స్ సరిచేసుకునేందుకు ద్రవ్యం (పెట్టుబడులు) ఎంతో అవసరం. వడ్డీ రేట్లు - పెట్టుబడుల లింకేజీలు విడిపోయిన నేపథ్యంలో, ప్రైవేటు పెట్టుబడులతో పాటు

### ప్రభావం:

మొత్తం ఆర్థిక వ్యవస్థలో బ్యాంకింగ్ రంగంపై ఎన్.పి.ఎ ప్రభావం ఎలా ఉంటుంది? దీన్ని క్రెడిట్ మరియు వడ్డీ రేట్ల విధానాల ద్వారా తెలుసుకోవచ్చు. ఇటీవల ద్రవ్యోల్బణ లక్ష్యాల మార్పు అంతర్జాతీయంగా ముడిచమురు ధరల తగ్గుదల వల్ల, దేశీయ ద్రవ్యోల్బణం 5.6 శాతానికి క్షీణించింది. ఈ నేపథ్యంలో, వడ్డీ రేట్లు తగ్గిపోతాయని ఎదురుచూశారు. నిజంగానే ఆర్.బి.ఐ డిసెంబర్, 2014 నుంచి రెపో రేటును

వృద్ధిని కూడా నియంత్రిస్తున్న వడ్డీ రేట్లను మరింత తగ్గించేందుకు ఆర్.బి.ఐ వెనకాడుతోంది.

అధిక ఎన్.పి.ఎల వల్ల జరిగే అనర్థాలను ఐ.ఎం.ఎఫ్ తన తాజా నివేదికలో స్పష్టంగా వివరించింది. ఈ నివేదిక మేరకు, భారత ఆర్థిక వ్యవస్థలో దుర్బలత్వాలు పెరిగాయి. ఈ నివేదిక ఇంకా ఏమి చెప్తోందంటే, "భారతదేశంలో బాహ్య దుర్బలత్వాలను తగ్గించడం, అలాగే ఊహించిన దానికన్నా వేగంగా ద్రవ్యోల్బణం పడిపోవడం జరిగాయి. కానీ కొనసాగుతున్న అధిక ద్రవ్యోల్బణం అంచనాలు మరియు భారీ ఆర్థిక లోటు కీలకమైన స్థూల ఆర్థిక సవాళ్లుగా మారాయి. ద్రవ్యోల్బణం, ద్రవ్యోల్బణ అంచనాలలో తగ్గింపులు కొంతకాలం కొనసాగేలా ఉండేందుకు ద్రవ్య విధాన వైఖరి దృఢంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమగ్ర పన్ను సంస్కరణలు మరియు సబ్సిడీలలో మరింత తగ్గింపుల నియంత్రణలో ఆర్థిక స్థిరీకరణ కొనసాగాలి. గుర్తించకుండా వదిలేసినట్లయితే, కార్పొరేట్ ఆర్థిక పరిస్థితులు మరియు ప్రభుత్వ బ్యాంకు ఆస్థుల నాణ్యతలోని దుర్బలత్వాలు ఆర్థిక స్థిరత్వానికి ముప్పుగా మారతాయి." (ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్, 2016)

### కేంద్ర బడ్జెట్ ఏమి చేసింది?

బ్యాంకులకు పెట్టుబడులు అవసరమున్నందున, మూలధన పునరుద్ధీకరణలో (రీక్యాపిటలైజేషన్) భాగంగా 25,000 కోట్ల రూపాయలను కేంద్ర బడ్జెట్ సరిగ్గానే కేటాయించింది. అదే సమయంలో, అవసరమైతే కేంద్ర ప్రభుత్వం మరిన్ని నిధులు సమకూరుస్తుందని కూడా సూచించింది. ఇది ప్రత్యక్ష చర్య కాగా, బ్యాంకులపై పరోక్షం ప్రభావం చూపించే మరికొన్ని చర్యలు కూడా ఉన్నాయి. అవి ఏమిటంటే -

1. ఆర్థిక సంస్థల తీర్మానాలపై ఒక సమగ్ర కోడ్‌ని ప్రవేశపెట్టడం.
2. ఒక స్పాన్సర్ ఎ.ఆర్.సిలో 100 శాతం వాటాను కలిగివుండేందుకు అనువుగా ఎస్.ఎ.ఆర్. ఎఫ్.ఎ.ఇ.ఎస్.ఐ చట్టం 2002 లో సవరణలు చేయడం. సెక్యూరిటైజేషన్ రిసీట్లలో పెట్టుబడులు పెట్టేందుకు సంస్థాగతేతర పెట్టుబడుదారులను అనుమతించడం.
3. రుణ వసూళ్ల ట్రిబ్యునల్ చట్టాలను సవరించి, వాటిని ఆన్‌లైన్‌లో పనిచేసేలా చేయడం.

4. అక్రమంగా డిపాజిట్ తీసుకునే పథకాల బెడదను తొలగించేందుకు ఒక సమగ్ర కేంద్ర చట్టాన్ని ప్రవేశపెట్టడం.
5. సెక్యూరిటీస్ అపిలేట్ కోర్టు సభ్యులు, న్యాయాధిపతులను పెంచడం.
6. ప్రధాన మంత్రి ముద్రా యోజన పథకం క్రింద మంజూరయిన మొత్తాన్ని 1,80,000 కోట్ల రూపాయలకు పెంచడం.

రియల్ రంగంలో రుణాల పెరుగుదలకు మరియు దానికున్న అడ్డంకులను తొలగించడంలో పైన పేర్కొన్న చర్యలు తోడ్పడుతాయి. అయితే, ప్రభుత్వ రంగంలో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించడానికి ఇవి సరిపోతాయా? బ్యాంకింగ్ రంగాన్ని తిరిగి ఆరోగ్యవంతంగా చేయడానికి మా ఉద్దేశ్యంలో మరెంతో చేయాల్సి ఉంది. ఇక్కడ తప్పకుండా పేర్కొనాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే, బ్యాంకింగ్ రంగంలో సమగ్ర పాలన ఉండడం. ఈ సమయంలో పి.జె. నాయక్ కమిటీ సిఫార్సులను జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవసరముంది. కొన్ని ముఖ్యమైన సిఫార్సులను క్రింద బాక్సులో పేర్కొనడం జరిగింది.

భారతదేశంలోని బ్యాంకు బోర్డుల పాలనను సమీక్షించేందుకు నాయక్ కమిటీ చేసిన కొన్ని ముఖ్యమైన సిఫార్సులు :

1. బ్యాంక్ జాతీయ చట్టాలు 1970 మరియు 1980, ఎస్.బి.ఐ చట్టం, ఎస్.బి.ఐ (అనుబంధ బ్యాంకులు) చట్టాలను తొలగించడం.
2. కంపెనీల చట్టం క్రింద అన్ని బ్యాంకులను విలీనం చేయడం. బ్యాంకులలో ఉన్న ప్రభుత్వ వాటాలను బదిలీ చేసేందుకు వీలుగా బ్యాంక్ పెట్టుబడి కంపెనీ (బి.ఐ.సి)ని ఏర్పాటు చేయడం.
3. బ్యాంక్ బోర్డ్స్ బ్యూరో (బి.బి.బి) సహాయంతో పూర్తికాలం డైరెక్టర్లను మూడు దశలుగా నియమించడం.
4. 50 శాతం కన్నా తక్కువకి ప్రభుత్వ వాటాలను తగ్గించడం.
5. ఉన్నతస్థాయి పాలకవర్గంలో యువతను నియమించేలా హెచ్.ఆర్ విధానానికి సూచనలు చేయడం.
6. అధిక వ్యూహాత్మక దృష్టిని అందించేందుకు వీలుగా బోర్డు ఆలోచనల పరిధిని మెరుగుపరచడం.
7. అభివృద్ధి లక్ష్యాల ముసుగులో పి.ఎస్.బిలకు సూచనలు ఇవ్వడం ప్రభుత్వం మానుకోవాలి.
8. ద్వంద్వ నియంత్రణ వివక్షాపూరితం కావడం వల్ల, పి.ఎస్.బిలకు మాత్రమే వర్తించే నియంత్రణ సూచనలను ఇవ్వడం కూడా ప్రభుత్వం మానుకోవాలి.

పైన పేర్కొన్న చర్యలతో పాటు, ఆస్తుల పునర్నిర్మాణ కంపెనీల పాత్ర మరియు వాటి నియంత్రణపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాల్సిన ఆవశ్యకత గురించి చెప్పుకోవాలి. జాతీయ ఆస్తుల నియంత్రణ కంపెనీ (నేషనల్ అసెట్స్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఎన్.ఎ.ఎం.సి.ఓ)ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు వచ్చాయి. ఈ కంపెనీ ద్వారా మొండి ఆస్తులను సరైన ధరకు సరైన సమయానికి అమ్మేయవచ్చు. దీనికి తోడు, బ్యాంకులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను అర్థం చేసుకుని, వాటికి పరిష్కారాలు కనుగొనేందుకు, గ్యాన్ సంగం (బ్యాంకులు, ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్.బి.ఐకి చెందిన ఉన్నతాధికారుల వార్షిక తిరోగమనం) ద్వారా ప్రభుత్వం మరియు ఆర్.బి.ఐ బ్యాంకులతో చర్చలు జరుపుతోంది. కేంద్ర బడ్జెట్ 2016-17 తర్వాత వెంటనే జరిగిన గ్యాన్ సంగం, బ్యాంకుల స్థిరీకరణ మరియు రుణ వసూళ్ల చట్టాలకు సంబంధించి కొన్ని ప్రతిపాదనలు చేసింది.

బడ్జెట్ కొన్ని ప్రత్యక్ష చర్యలు సూచించిన నేపథ్యంలో, ఈ రంగం వీలైనంత త్వరగా ఎన్.పి.ఎ సమస్య నుంచి బయటపడేందుకు, ఇప్పటికే ప్రభుత్వ అందుబాటులో ఉన్న కొన్ని ప్రతిపాదనలలోని స్పష్టత మరియు వాటి అమలుకు ఎంతో సహాయపడతాయి. ప్రస్తుతం పెట్టుబడి చక్రం కోలుకోవడం అనేది ప్రధానంగా బ్యాంక్ బ్యాలన్స్ షీట్ల బలంపై ఆధారపడిఉంది. ■

*24వ పేజి తరువాయి...*

## 2016-17 రైల్వే బడ్జెట్‌పై ప్రతిస్పందనలు

వంటి చర్యల ద్వారా అదనపు వనరుల సమీకరణలో వైఫల్యాల కారణాలను మాత్రం, సూక్ష్మంగా పరిశీలించాలి. ప్రధానమైన ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలలో మధ్యతరగతివారికి కూడ అందుబాటులో ఉండే బడ్జెట్ హోటళ్ల ఏర్పాటు ఎంతో లాభదాయకమైన ఆలోచన! గత దశాబ్దన్నర కాలంగా, సంబంధిత విభాగాల చిన్నచూపుకు గురై, ఈ ఆలోచన అమలుకు నోచుకోలేదు. అత్యున్నత స్థాయి అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరచి, తగిన చర్యలు చేపట్టాలి. తగిన అనుమతుల మంజూరుకు, ఏక గవాక్ష పద్ధతిని ఏర్పాటు చేసి, దానికి ఐ. ఆర్. సి.టి.సి. కి (ఈ సంస్థకు ఇప్పటికే వాణిజ్య కార్యకలాపాల అనుభవం వున్నందున) నోడల్ సంస్థగా బాధ్యతలను కట్టబెట్టాలి. ఏ సంస్థకు బాధ్యతనిచ్చినా, అది వేగంగా జరగాలి. అదేవిధంగా రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ మరో ప్రధానాంశము. ఇక్కడకూడ ఒకే సంస్థ, బహుముఖ ప్రజ్ఞను చూపాల్సిన అవసరం ఉన్నది. ■

# బడ్జెట్ 2016-17లో పన్నుల హేతుబద్ధీకరణ ప్రతిపాదనలు




**2016-17 కేంద్ర బడ్జెటు కొంత ఆశాజనకంగానే వుందని చెప్పవచ్చు. ఎందుకంటే, ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పన్నుల హేతుబద్ధికరణను ఈ బడ్జెట్‌లో చేపట్టారు. వేగవంతమైన ఆర్థిక సంస్కరణల గురించి బడ్జెట్‌లో ప్రస్తావించనప్పటికీ, మరింత హేతుబద్ధీకరణతో పన్నులు తగ్గే అవకాశముంది. రాబోవు సంవత్సరాల్లో పన్ను మినహాయింపులను పూర్తిగా ఎత్తివేసే సూచనలున్నాయి.**

2016-17 కేంద్ర బడ్జెటు కొంత ఆశాజనకంగానే వుందని చెప్పవచ్చు. ఎందుకంటే, ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పన్నుల హేతుబద్ధికరణను ఈ బడ్జెట్‌లో చేపట్టారు. వేగవంతమైన ఆర్థిక సంస్కరణల గురించి బడ్జెట్‌లో ప్రస్తావించనప్పటికీ, మరింత హేతుబద్ధీకరణతో పన్నులు తగ్గే అవకాశముంది. రాబోవు సంవత్సరాల్లో పన్ను మినహాయింపులను పూర్తిగా ఎత్తివేసే సూచనలున్నాయి.

ముడి చమురు ధరలు అత్యంత కనిష్ట స్థాయికి చేరుకున్న ఈ తరుణంలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి పన్నులపై సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం లభించింది. ఎందుకంటే, ముడిచమురు ధరలు పడిపోవడంతో వివిధ రాయితీల భారం గణనీయంగా తగ్గింది. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం నెలకొన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడానికీ, వృద్ధి రేటు పెరగడానికీ ఇది తోడ్పడింది. గత కొన్నేళ్లుగా కార్పొరేటు, వ్యక్తిగత పన్నులను తగ్గించడం, పన్నులు విధించడానికి వున్న ఆదాయ పరిమితిని పెంచడంతో ద్రవ్యోల్బణం వేగంగా పెరిగింది.

పన్నులు చెల్లించే ప్రతి తరగతికీ 2016-17 బడ్జెట్‌లో ఎంతో కొంత వూరట లభించింది.

**వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులకు ఊరట:**

అద్దె ఇంట్లో నివాసముంటూ అద్దె భత్యం పొందలేని సన్నకారు పన్ను చెల్లింపుదారులకు కొంత పన్ను మినహాయింపును ఈ బడ్జెట్‌లో కల్పించారు. వార్షిక ఆదాయం అయిదు లక్షలకు మించని వారికి నెలకు 2 వేల నుంచి 5 వేల రూపాయల వరకు పన్ను మినహాయింపు లభిస్తుంది. దీనితో పాటు, 2016-17లో తొలిసారిగా ఇల్లు కొనుగోలు చేసే వారికి ప్రతి ఏటా అదనంగా 50 వేల రూపాయల వరకు గృహరుణాల వడ్డీపై రాయితీ ఇస్తారు. దీనివల్ల ఇప్పటికే నిరాశాజనకంగా వున్న భవన నిర్మాణ రంగానికి, కొత్త ఇళ్ల కొనుగోలు దారులకు ఊరట లభిస్తుంది. కొత్తగా కొనుగోలు చేసే ఇంటి ధర 50 లక్షల రూపాయలకు మించకూడదని, ఇళ్ళు కొనుగోలు కోసం తీసుకునే రుణం 35 లక్షల రూపాయలకు మించకూడదని బడ్జెట్‌లో నిర్దేశించారు.

**జయంత రాయ్ చౌదరి,** సీనియర్ ఎడిటర్, ద టెలిగ్రాఫ్, లండన్.
E-mail: jrchowdhury@yahoo.com

### సంపన్నులపై పన్ను:

కోటిరూపాయలకు మించి వార్షిక ఆదాయం వున్న వారి పై విధించే సర్ చార్జిని 12 నుంచి 15 శాతానికి పెంచారు. సంవత్సరానికి 10 లక్షల రూపాయలకు పైగా డివిడెండ్లు పొందే వ్యక్తులు, అవిభాజ్య హిందూ కుటుంబాలు, సంస్థల నుంచి 10 శాతం పన్ను వసూలు చేస్తారు. కార్ల పై పెరుగుతున్న మోజును దృష్టిలో పెట్టుకొని 10 లక్షల రూపాయలకు పైబడి ఖరీదున్న కారుపై ఒక శాతం పన్నువేస్తారు. రెండు లక్షల రూపాయల పైగా నగదు కొనుగోలు చేసే వస్తు సేవలపై కూడా ఇదే విధంగా పన్ను విధిస్తారు. 10 నుంచి 15 లక్షల రూపాయల వరకు ఖరీదు చేసే కార్లను విలాసవంతమైన కార్లుగా పరిగణించడం సరైంది కాదని ఆర్థిక వేత్తలు చెబుతున్నప్పటికీ, రెండుపూటలా కడుపునిండా తిండి దొరకని వారు అనేక మంది వున్న భారత్ లాంటి దేశంలో ఇది సమంజసమేననే వాదన వుంది.

### నల్లధనం పై పన్ను:

దేశ ఆర్థిక వ్యవస్థలో నల్ల ధనాన్ని తగ్గించాలనే లక్ష్యంతో ప్రభుత్వం "ఆదాయ ప్రకటన పథకం 2016" (Income declaration scheme 2016)ను ప్రకటించింది. పన్ను చెల్లింపుదారులు ఇప్పటివరకు వెల్లడించని తమ ఆదాయంపై 30 శాతం పన్ను, ఏడున్నర శాతం సర్ చార్జి మరో ఏడున్నర శాతం అపరాధ రుసుము మొత్తంగా 45 శాతం పన్ను చెల్లించాలని, దీన్ని ఒక్క సారి మాత్రమే అనుమతించే అవకాశంగా ప్రభుత్వం పేర్కొంది. విదేశాల్లో దాచిన నల్లధనంపై ప్రభుత్వం గత ఏడాది బడ్జెట్ లో ఇటువంటి అవకాశాన్ని కల్పించిన సంగతి తెలిసిందే.

### ఉద్యోగుల భవిష్య నిధి (EPFO)కి చెందిన నిధులు:

ఉద్యోగులు తమ భవిష్య నిధి (ఈపిఎఫ్)ని వెనక్కి తీసుకునే సమయంలో పన్ను విధించాలన్న ప్రతిపాదనను కేంద్రం ఉపసంహరించింది. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మార్చి 8న లోక్‌సభలో ప్రకటించారు. యాజమాన్యాలు చెల్లించేవాటాకు ఒక పరిమితి (లక్షా 50 వేల రూపాయలు) విధించాలని 2016-17 బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదనను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటున్నట్లు వెల్లడించింది. జాతీయ పింఛన్ పథకం (ఎన్ పి ఎస్)లో ఉన్న వారు ఆ మొత్తాన్ని వెనక్కి తీసుకునేటప్పుడు దానిలో 60 శాతంనిధులపై పన్ను చెల్లించాలన్న ప్రతిపాదనపై సమగ్ర సమీక్ష జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్ పి ఎస్ చందా దారుల మొత్తాల ఉపసంహరణ సమయంలో 40 శాతానికి ఇచ్చిన మినహాయింపును కొనసాగిస్తున్నారు. ప్రైవేటు, లేదా ప్రభుత్వరంగ సంస్థల్లో పీ ఎఫ్‌ను స్వచ్ఛందంగా చెల్లించే సభ్యులు కొందరు వుంటారని వారు పదవి విరమణ సమయంలో 60 శాతం మొత్తాన్ని వార్షిక పెట్టుబడుల్లో దాచుకుంటే ఎలాంటి పన్ను వుండదని ప్రభుత్వం తెలిపింది. యాన్యూటీలో దాచుకోరాదని నిర్ణయించుకుంటే మాత్రం 40 శాతం మొత్తానికే పన్ను మినహాయింపు వర్తిస్తుంది. నెలకు 15 వేల రూపాయల వరకు వేతనం పొందుతున్న ఉద్యోగులు తమ ఈ.పీ.ఎఫ్. ఖాతాలోంచి తీసుకునే నిధులపై పన్ను వుండదు. ప్రస్తుతం వున్న 3.7 కోట్ల మంది ఈ. పీ. ఎఫ్. ఖాతాదారుల్లో సుమారు 3 కోట్ల మంది ఈ కోవకు చెందిన వారే.

### కార్పొరేట్ పన్ను లెక్కలు :

కార్పొరేట్ సంస్థల పట్ల ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతమున్న పరిస్థితులకు అనుగుణంగా పన్ను విధింపులో సానుకూల ధోరణిని 2016-17 బడ్జెట్లో ప్రకటించారు. చిన్న చిన్న సంస్థలకు కార్పొరేటు పన్నును తగ్గించారు. 2014-15 ఆర్థిక సంవత్సరంలో 5 కోట్ల రూపాయాల కంటే తక్కువ టర్నోవరు వున్న సంస్థల నుంచి 29 శాతం పన్ను వసూలు చేస్తారు. ఏప్రిల్ 2016 నుంచి 2019 మధ్య ఏర్పాటు చేసే అంకుర కంపెనీలకు మూడు సంవత్సరాల పాటు పన్ను మినహాయింపు ప్రకటించారు. అయితే, ఈ అంకుర సంస్థలు పెట్టుబడులపై పన్ను మినహాయింపు తదితర రక్షణలను ఆశించ కూడదని తెలిపారు. కేంద్రం వివిధ ప్రాంతాల్లో పలు పరిశ్రమలకు పెట్టుబడులపై పన్ను మినహాయింపులు అమలు చేస్తోంది. ముఖ్యంగా, ఈశాన్య రాష్ట్రాలు, జమ్ము కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఏర్పాటుచేసే విద్యుత్తు ఉత్పత్తి, పంపిణీ, సరఫరాసంస్థలు, ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, టెలీకమ్యూనికేషన్లు, తయారీ సంస్థలకు పన్ను మినహాయింపునిస్తోంది. సాధారణంగా ఈ సంస్థలపై 30 నుంచి 33 శాతం పన్ను విధించాల్సి వుండగా ఇప్పుడు కేవలం 23 శాతం పన్ను మాత్రమే వసూలు చేస్తున్నారు. ఇలా పన్ను మినహాయింపుల వల్ల 62 వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని ప్రభుత్వం ప్రతి ఏటా కోల్పోతోంది.

విదేశీ సంస్థలకు కనీస ప్రత్యామ్నాయ పన్ను (MAT): భారత్‌లో లేకపోయినప్పటికీ వివిధ ఒప్పందాల వల్ల మూల ధన లాభాలు పొందుతున్న విదేశీ సంస్థలకు కనీస ప్రత్యామ్నాయ పన్ను (MAT)పై వివాదాలకు తెరపడింది. భారత్ తో ఒప్పందం చేసుకోని దేశానికి చెందిన సంస్థలు లేదా మన దేశ చట్టాల పరిధి లో ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులు లేని విదేశీ కంపెనీలకు MAT నిబంధనల వర్తింపును మినహాయిస్తూ 2016-17 బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేశారు. దీన్ని ఏప్రిల్ 1,2001 నుంచి అమలయ్యేలా ప్రతిపాదించారు.

### గూగుల్ పన్ను:

ఆశ్చర్యకరంగా, 2016–17 బడ్జెట్‌లో సమానత్వ లెవీ (Equalisation levy)ని ప్రవేశపెట్టారు. ఇది యునైటెడ్ కింగ్ డమ్ లో ప్రవేశపెట్టిన 'గూగుల్ పన్ను' లా వుంది. దీంతో భారత కు చెందిన సంస్థలు ఆన్ లైన్ ప్రకటనల వంటి సేవలకు ఈ– కామర్స్ ప్లాట్ ఫారాలతో సహ విదేశీ సంస్థల నుంచి ఆన్ లైన్ లో పొందే సేవలకు జరిపే చెల్లింపులపై 6 శాతం పన్ను విధిస్తారు.

### శిక్షలు:

తమ ఆదాయాన్ని తక్కువ చేసి చూపించే వ్యక్తుల నుంచి అపరాధ రుసుము వసూలు చేసేలా ఓ కొత్త నిబంధనను 2016 ఏప్రిల్ 1 నుంచి అమలు చేయనున్నారు. దీని ప్రకారం ఆదాయాన్ని తక్కువ చేసి చూపించే వ్యక్తుల నుండి చెల్లించాల్సిన పన్ను కంటే 50 శాతం ఎక్కువ వసూలు చేస్తారు. తమ ఆదాయం గురించి వాస్తవాలను దాచిపెట్టే వారిపై 200 శాతం వరకు అపరాధ రుసుము విధించవచ్చు. ప్రస్తుతం ఈ అపరాధ రుసుమును ఆదాయ పన్ను అధికారులు వంద నుంచి 300 శాతం వరకు విధిస్తున్నారు.

### రాష్ట్రాల ఆదాయం:

ఆర్థిక ఫెడరలిజానికి పూతమిస్తూ, 2016–17 బడ్జెట్ అంచనాల ప్రకారం రాష్ట్రాలకు బదిలీ చేసే అన్ని ఆర్థిక వనరులను 12 శాతం పెంచారు. అయితే, సెస్ ల విధింపు వల్ల వచ్చే ఆదాయాన్ని కేంద్రం రాష్ట్రాల తో పంచుకోదు. నూతనంగా ప్రవేశపెట్టిన కృషి కళ్యాణ్ సెస్ ద్వారా వచ్చే 5 వేల కోట్ల రూపాయల ఆదాయం కేంద్రానికే చెందుతుంది . దీనితో పాటు, విలాసవంతమైన కార్ల పై విధించే మౌలిక వసతుల సెస్ ద్వారా వచ్చే 3 వేల కోట్ల రూపాయలు కూడా కేంద్రానివే. ఈ విధంగా సెస్ ల ద్వారా 2016–17 ఆర్థిక సంవత్సరం లో 1.9 లక్షల కోట్ల రూపాయలు వస్తాయని అంచనా. ■

# సంతాపం

कर्नल राज्यवर्धन राठौड़ (रिटा.) एवीएसएम
Col Rajyavardhan Rathore (Retd.), AVSM

सूचना और प्रसारण राज्य मंत्री
भारत सरकार
MINISTER OF STATE FOR
INFORMATION & BROADCASTING
GOVERNMENT OF INDIA

6th March, 2016

డియర్ డా॥ సాధన జీ,

మన ప్రచురణల విభాగంలో సహాయ సంచాలకునిగా పనిచేస్తున్న శ్రీ షాహిద్ అన్వర్ అకాల మరణం నన్ను తీవ్రంగా బాధించింది.

భారతీయ సమాచార సేవకు చెందిన శ్రీ షాహిద్ అన్వర్ ప్రచురణల విభాగానికి అందచేసిన అనన్య సేవలు నన్నెంతో ముగ్దణ్ని చేశాయి. నాటక రచయితగా కూడ అతను సుప్రసిద్ధుడు.

అతని కుటుంబానికీ, సహోద్యోగులకు నా ప్రగాఢ సంతాపాన్ని తెలియ చేయగలరు.

Yours sincerely,

(Col Rajyavardnan Rathore)

**Dr. Sadhna Rout,**
ADG (I/C), Publications Division.
Soochna Bhawan, CGO Complex,
New Delhi.

119 'ए' विंग, शास्त्री भवन, नई दिल्ली-110001
119 'A' WING, SHASTRI BHAWAN, NEW DELHI-110001
E-mail : mosib@gov.in, Website : www.rajyavardhanrathore.in
Tel. : 011-23381194, 23381193, / Ra_THORe

సహచరుని అకాల మరణానికి యోజన తెలుగు పత్రిక తీవ్ర సంతాపం తెలియచేస్తున్నది.

– యోజన తెలుగు సంపాదకవర్గం



# విజ్ఞాన విపంచి

ప్రాతూరి పోతయ్య శర్మ

1. ఆదిత్య – L1 వివరాలేవి?
   ఎ) 2019–20లో సూర్యుడి అధ్యయనానికి ఇస్రో పంపే 400 కిలోగ్రాముల బరువున్న స్పేస్ క్రాఫ్ట్.
   బి) L1 అనే స్థానంలో (లాగ్రాంగియన్ పాయింట్) ఉండి పరిశీలిస్తుంది.
   సి) తర్వాత కాలంలో L5 అనే చోటికి మరో స్పేస్ క్రాఫ్ట్ పంపిస్తారు.
   డి) పైవన్నీ (రెండు స్పేస్ క్రాఫ్ట్‌లు సూర్యుని అధ్యయనం చేస్తాయి.)
2. భారతదేశంలో బడ్జెట్‌ని 7–4–1860 నాడు తొలిసారిగా ప్రవేశపెట్టారు. తొలి ఇండియన్ ఫైనాన్స్ మెంబర్ ఎవరు?
   ఎ) జేమ్స్‌విల్సన్ బి) లియాఖత్ అలిఖాన్
   సి) C.D. దేశ్‌ముఖ్ డి) షణ్ముగం చెట్టి
3. 73వ గోల్డెన్ గ్లోబ్ అవార్డులు, ఈ క్రింది వాటిల్లో వేటికి ఎవరికి వచ్చాయి.
   ఎ) "దిరెవెనెంట్" ఉత్తమ డ్రామా ఫిల్మ్.
   బి) లియోనార్డోడి కాప్రియో–ఉత్తమ నటుడు
   సి) "సన్ ఆఫ్ సౌల్" ఉత్తమ విదేశీ భాషా చిత్రం
   డి) పైవన్నీ (USAలో ఇచ్చారు)
4. 2016 ఆస్ట్రేలియా ఓపెన్ పురుషుల విజేత ఎవరు?
   ఎ) నోవాక్ డి జోకోవిఛ్. బి) ఆండీముర్రే
   సి) రాడ్ లావర్ డి) B. బోర్గ్
5. నేషనల్ బొటానికల్ రెసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఎక్కడుంది?
   ఎ) లక్నో. బి) న్యూఢిల్లీ.
   సి) కోల్‌కత్త డి) చెన్నయ్
6. భారత రాజ్యాంగంలో ఎన్నవ ఆర్టికల్‌లో "డిగ్నిటితో జీవించే హక్కు" ఉంది?
   ఎ) ఆర్టికల్ 14 బి) ఆర్టికల్ 21
   సి) ఆర్టికల్ 19 డి) ఆర్టికల్ 13
7. ప్రాకృతం భాషలో శాసనాలున్న ప్రాచీన బౌద్ధ ప్రదేశాలు ఫణిగిరిలో ఉన్నాయి. ఫణిగిరి ఏ జిల్లాలో ఉంది, తెలంగాణలో?
   ఎ) నల్గొండ జిల్లా బి) ఆదిలాబాద్ జిల్లా
   సి) వరంగల్ జిల్లా డి) నిజామాబాద్ జిల్లా
8. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
   ఎ) "సిమ్మర్ ఎమాంగ్ దిస్టార్స్" కనిష్కథరూర్
   బి) "కంబాటింగ్ హంగర్ & ఎఛీవింగ్ ఫుడ్ సెక్యూరిటి" M.S. స్వామినాథన్.
   సి) "దిరోమాన్స్ ఆఫ్ ఇండియన్ కాఫీ" P.T. బొపన్న డి) పైవన్నీ
9. ఆస్ట్రేలియా ఓపెన్ (మెల్‌బోర్న్ పార్క్ దగ్గర) మహిళల సింగిల్స్ 2016 విజేత ఎవరు?
   ఎ) ఆంజెలెక్ కెర్బర్ బి) సెరెనా విలియమ్స్
   సి) వీనస్ వియమ్స్ డి) మార్టినా హింగిస్
10. పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న మార్షల్ దీవుల రాజధాని ఏది?
    ఎ) బికిని ఎటోల్ బి) మజూరో (Majuro)
    సి) విక్టోరియా డి) కీవ్
11. ట్రైటన్ దీవి, పారాసెల్ దీవులలో ఉంది. సౌత్ చైనా సముద్రం మీద ఆధిపత్యం కోరుతున్న దేశాలేవి?
    ఎ) చైనా బి) తైవాన్
    సి) వియత్నాం డి) పైవన్నీ
12. ప్రపంచంలో ఏ సంవత్సరాలలో వచ్చిన ఆర్థిక సంక్షోభాలను భారతదేశం అధిగమించినది?
    ఎ) 2001 బి) 2008
    సి) 2015 డి) పైవన్నీ
13. "ది టర్బులెంట్ ఇయర్స్ 1980–96" అనే పుస్తక రచయిత ఎవరు?
    ఎ) శ్రీ ప్రణబ్ ముఖర్జీ
    బి) డా॥ A.P.J. అబ్దుల్ కాలం
    సి) డా॥ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ (డి) V.V.గిరి
14. ఏ వైరస్ మీద ప్రపంచ ఆరోగ్య సంస్థ యిటీవల ప్రత్యేక దృష్టి పెట్టింది? వివరాలేవి?
    ఎ) జికా వైరస్ బి) బ్రెజిల్‌లో దీని వల్ల పసిపిల్లలు చిన్న చిన్న తలలతో పుట్టారు.
    సి) ఈ వైరస్ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుంది.
    డి) పైవన్నీ
15. IDBI బ్యాంక్‌లో కేంద్ర ప్రభుత్వానికి ఎంత శాతం యాజమాన్యపు హక్కులున్నాయి?
    ఎ) 76.5% బి) 55% సి) 40% డి) 60%
16. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
    ఎ) DX : డిజిటల్ ట్రాన్ ఫర్మేషన్
    బి) CAGR: కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్
    సి) STT: సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ టాక్స్ డి) పైవన్నీ
17. ఆస్ట్రేలియా ఓపెన్ మహిళల డబుల్స్ విజేతలు సానియా మీర్జా & మార్టినా హింగిస్ మొత్తం దీనితో వీరు ఎన్ని మ్యాచ్‌లు గెలిచారు?
    ఎ) 36 (బి) 20 (సి) 25 (డి) 24
18. "స్మార్ట్ సిటీస్ మిషన్"లో 97 నగరాల నుండి 20 నగరాలను ఎంపిక చేశారు. ఇవి కేంద్రం నుండి తొలిదశలో లభించిన రూ. 200 కోట్లతో "స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్" నిర్మించాలి. ఈ క్రింది వాటిల్లో ఏది ప్రథమ స్థానంలో నిలిచింది?
    ఎ) భుబనేశ్వర్ బి) పూనే
    సి) జైపూర్ డి) విశాఖపట్నం
19. స్మార్ట్ సిటీస్ మిషన్ వివరాలేవి?
    ఎ) దీని కోసం "బాటమ్–అప్ ఎప్రోచ్" అవలంబిస్తోంది, ప్రభుత్వం.
    బి) "ఇన్‌క్లూజివ్ గ్రోత్" సాధించడమే లక్ష్యంగా "సమగ్ర సిటీ ప్లానింగ్" ఉంటుంది. (స్వచ్ఛ భారత్ మిషన్, అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ & అర్బన్ ట్రాన్స్‌ఫార్మేషన్ వంటివి కూడ అంతర్భాగాలౌతాయి)
    సి) దీనికోసం స్పెషల్ పర్పస్ వెహికల్ (SPV) అనే ఏజెన్సీ ఏర్పాటు చేశారు. డి) పైవన్నీ
20. భారతదేశంలో ఉన్న 688 జిల్లాల్లో ప్రతి జిల్లాకు 8 నుండి 10 బ్లాకులుంటాయి వీటి వాతవరణాన్ని పరిశీలించే,భారతదేశ వాతవరణ డిపార్ట్‌మెంట్ (IMD) డైరెక్టర్ జనరల్ ఎవరు?
    ఎ) లక్ష్మణ్ రాథోడ్ బి) శేఖర్ బసు
    సి) U.R. రావు డి) A.S. కిరణ్ కుమార్
21. చైనా నుండి ఇరాన్‌కు వెళ్ళే రైలు ఏ ప్రాంతాలు /నగరాలగుండా పోతుంది? (14 రోజుల ప్రయాణంలో 10,399 కి.మీ. దూరండుంది)
    ఎ) ఈవు (అలాటాపాస్) బి) కజకిస్తాన్
    సి) తుర్క్‌మెనిస్తాన్ డి) పైవన్నీ
22. ఆస్ట్రేలియాడే, జనవరి 26. (1788 సంవత్సరంలో తొలివిడత (బ్రిటీష్ షిప్‌లు, ఆస్ట్రేలియా చేరాయి) దీనికి బ్రిటీష్ క్వీన్ ఎలిజబెత్‌ని తమ రాజ్యాంగ అధిపతిగా పెట్టారు. ఆస్ట్రేలియాకి ఆమె రిప్రెజెంటేటివ్ ఎవరు?
    ఎ) గవర్నర్–జనరల్ బి) గవర్నర్
    సి) ప్రెసిడెంట్ డి) ఛాన్సలర్
23. భరతపు ఋనది ఎక్కడుంది? ఈనదిలో పెరిగే "కోరా" గడ్డితో చాపలు అల్లుతారు.
    ఎ) షోరనూర్ దగ్గర, కేరళ బి) గోవా
    సి) అస్సాం డి) మణిపూర్
24. US $ 5,000 కోల్బీ అవార్డ్ లభించిన "మిడ్ నైట్స్ ఫ్యూరీస్ – ది డెడ్లీ లెగసీ ఆఫ్ ఇండియాన్ లెగసీ" పుస్తక రచయిత ఎవరు?
    ఎ) నిసీద్‌హజారీ బి) జాన్ మీఛామ్
    సి) డెక్స్‌టర్ ఫిల్ కిన్స్ డి) విలియం డార్లింపైర్
25. చదరంగం లాంటి ఆట "గో" అనే ఆట ఒక అట్టమీద నలుపు, తెలుపు రంగులో ఉన్న రాళ్ళను

కదుపుతూ ఆడతారు. ఇది ఏ దేశంలోని ప్రాచీన ఆట?

ఎ) చైనా బి) ఇంగ్లాండ్

సి) ఫ్రాన్స్ డి) జర్మనీ

26. ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్‌లో ఉన్న 188 సభ్యదేశాలు ఇచ్చిన US $ 329 బిలియన్ల మూలధనం, సుమారు ఎంతకు పెరగవచ్చును అనుకుంటున్నారు? (US $ బిలియన్లలో) యిటీవల తీసుకున్న నిర్ణయాలవల్ల?

ఎ) 659 బి) 500 సి) 350 డి) 250

27. IMF లో ఉన్న 10 పెద్ద సభ్య దేశాలలో ఏవి చేరనున్నాయి?

ఎ) ఇండియా, చైనా బి) బ్రెజిల్

సి) రష్యా డి) పైవన్నీ

28. అరవింద్ వీరమణి దీని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్?

ఎ) IMF బి) వరల్డ్ బ్యాంక్

సి) ఏషియన్ డవలప్‌మెంట్ బ్యాంక్

డి) BRICS బ్యాంక్

29. "రెంకోజి టెంపుల్" ఎక్కడుంది? (దీనిలో నేతాజి చితాభస్మం ఉంటుందంటారు)

ఎ) టోక్యో, జపాన్ బి) చైనా

సి) కంబోడియా డి) సింగపూర్

30. సశస్త్ర సీమా బల్ (SSB), భారతదేశ ఏ సరిహద్దు కాపలాకాస్తుంది?

ఎ) నేపాల్ & భూటాన్ బి) పాకిస్తాన్

సి) శ్రీలంక డి) బంగ్లాదేశ్

31. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?

ఎ) అర్చనా రామసుందరం సశస్త్ర సీమా బల్ (SSB) బి) కె. దుర్గాప్రసాద్ – CRPF

సి) కె.కె. శర్మ – BSF

డి) పైవన్నీ (ఆయా దళాలకు డైరెక్టర్–జనరల్స్)

32. వరల్డ్ వెట్ లాండ్స్ డే ఎప్పుడు?

ఎ) ఫిబ్రవరి, 2 బి) డిసెంబర్, 1

సి) మే, 1 డి) జూలై, 1

33. ఒలింపిక్ క్రీడల పోటీలకి కావల్సిన గడియారాలు ఏ కంపెనీ సప్లై చేస్తోంది, 1992 నుండి?

ఎ) HMT బి) ఒమేగా (ఇది స్వాచ్ గ్రూప్‌లో ఉంది) స్విట్జర్లాండ్. సి) సీకో డి) ఇవేవికావు

34. క్రికెట్ బ్యాట్‌లను కాశ్మీర్‌లో దొరికే ఏ చెక్కతో చేస్తారు?

ఎ) విల్లో వృక్షం కలపతో బి) టేకుచెక్క

సి) రక్తచందనం డి) మంచిగంధం

35. 'టీకా' మందులు ఏ పద్ధతిలో తయారు చేస్తారు? వివరాలేవి?

ఎ) ఇన్‌యాక్టివేటెడ్ పద్ధతి & రికాంబినెంట్ DNA పద్ధతి బి) వైరస్‌ని శక్తిహీనంచేయటానికి / చంపటానికి రసాయనాలు గాని, ఉష్ణంగాని, రేడియేషన్ గాని ఉపయోగిస్తారు.

సి) ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ICMR) అనుమతి ఇస్తుంది. డి) పైవన్నీ

36. 'జికా' వైరస్ 1947లో ఉగాండాలో కనుగొన్నారు. 'జికా' వైరస్ దేనిద్వారా వ్యాపిస్తుంది?

ఎ) ఆనోఫిలీస్ దోమ

బి) ఈడీస్ ఈజిప్టీ అనే దోమ కాటు ద్వారా

సి) ఈగలు డి) ఎలుకలు

37. "భువన్" ఏ వెబ్‌పోర్టల్‌కి సంబంధించినది? వివరాలేవి?

ఎ) ఇస్రో/NRSA కి చెందినది

బి) దీనిద్వారా 1.5 మీటర్స్ ఇమేజ్ రిజొల్యూషన్స్ లభ్యమౌతున్నాయి.

సి) భారత అంతరిక్ష ఉపగ్రహాలుతీసే చిత్రాల ద్వారా, మన స్వంత GPS (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం) ఏర్పాటుచేసుకోనే అవకాశం లభిస్తుంది.

డి) పైవన్నీ

38. ప్రి కాన్సెప్షన్ & ప్రి–నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ (PCP NDT) చట్టం ప్రకారం గర్భస్థ శిశువు/ పిండ పరీక్షలు నేరం. అయినా కూడా ఏ రాష్ట్రంలో సెక్స్–సెలెక్టివ్ గర్భస్రావాలు ఎక్కువ?

ఎ) పంజాబ్&హర్యానా బి) మహరాష్ట్ర

సి) కేరళ డి) తమిళనాడు

39. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?

ఎ) NMP : నేషనల్ మాన్యు ఫాక్చరింగ్ పాలసి

బి) IPR : ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్

సి) CL: కంపల్సరీ లైసెన్సింగ్ (డి) పైవన్నీ

40. అటల్ పెన్షన్ యోజన కోసం ఎకౌంట్‌లు ఎక్కువగా ఓపెన్ చేసినందుకు ఏ బ్యాంక్‌కి అవార్డు ఇచ్చారు?

ఎ) SBI బి) ఇండియన్ బ్యాంక్

సి) ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

డి) అలహాబాద్ బ్యాంక్

41. 2015లో US $ 5 బిలియన్ విలువ గల పెట్టుబడులతో, ప్రతిరోజు 3 నుండి 4 స్టార్ట్ అప్ కంపెనీలు ప్రారంభమవుతున్నాయి. ప్రపంచంలో అత్యధిక స్టార్ట్ అప్ కంపెనీలు ఉన్న దేశాలలో 3వ స్థానంలో ఉన్న దేశం ఏది?

ఎ) USA బి) భారతదేశం

సి) జర్మనీ డి) ఫ్రాన్స్

42. భారతదేశం ఇప్పటివరకు ఎప్పుడెప్పుడు సౌత్‌ఏషియా గేమ్స్ (SAG) నిర్వహించింది?

ఎ) 1987లో కోల్‌కత్తాలో

బి) 1995లో చెన్నయ్‌లో

సి) 2016లో గౌహతి & షిల్లాంగ్‌లో

డి) మొత్తం 3 సార్లు

43. జియోగ్రాఫికల్ ఇండికేషన్ (GI) రిజిస్టర్ అయిన ఉత్పత్తులు / వస్తువులేవి, భారతదేశంలో?

ఎ) డార్జిలింగ్ టీ, మైసూర్ సిల్క్

బి) మైసూర్‌పాక్ (స్వీట్స్)

సి) తంజావూర్ వీణ డి) పైవన్నీ

44. నేపాల్ సరిహద్దులో ఉన్న "రాక్సాల్" ఏ రాష్ట్రంలో ఉంది?

ఎ) బీహార్ బి) ఒడిషా

సి) పశ్చిమబెంగాల్ డి) హిమచల్‌ప్రదేశ్

45. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌వెస్ట్‌మెంట్ బ్యాంక్ సంబంధించి ఏది కరెక్ట్?

ఎ) ప్రధానకార్యాలయం–బీజింగ్, చైనా

బి) ప్రెసిడెంట్– జిన్ లిక్వన్

సి) ఛీఫ్ ఇన్‌వెస్ట్‌మెంట్ ఆఫీసర్ – డా. జె. పాండ్యన్ డి) పైవన్నీ

46. BCCI పనితీరు మెరుగుపరచటానికి నియమించిన కమిటీ ఏది?

ఎ) A.P.షా కమిటీ బి) జస్టిస్ R.M లోధాకమిటీ

సి) L. నర్సింహారెడ్డి కమిటీ డి)GEAC పానెల్

47. గ్రామ పంచాయితీకి ఎన్నికైన అభ్యర్థులకు లభించే పోస్టులలో ఇప్పటివరకు ఎంత శాతం మహిళలకు రిజర్వేషన్ చేశారు?

ఎ) 33% బి) 45% సి) 50% డి) 60%

48. కన్‌వెన్షన్ ఆన్ సప్లిమెంటరీ కాంపెన్సేషన్ ఫరన్యూక్లియర్ డామేజ్ (CSC)ని భారతదేశం రాటిఫికేషన్ చేసి, ఎవరికి అప్పచెప్పింది?

ఎ) జువాన్‌కార్లోస్ లెంటి జో (యాక్టింగ్ డైరెక్టర్ జనరల్,IAEA, వియన్నా) బి)వరల్డ్ బ్యాంక్

సి) IMF డి) UNESCO

49. భారతదేశ ఆర్మీ కాపలాకాసే నార్తరన్ సియాచిన్ గ్లేషియర్ ఎంత ఎత్తులో ఉంది? (అడుగులలో)

ఎ) 19600 బి) 8848

సి) 8000 డి) 4000

50. కేంద్ర ఆర్థికమంత్రి ఛైర్మన్‌గా ఉండే టాక్స్ పాలసి రిసెర్చ్ యూనిట్ (TPRU)లో ఎవరెవరు మెంబర్లు?

ఎ) CBDT & CBEC ఆఫీసర్లు

బి) నీతిఆయోగ్ వైస్–ఛైర్మన్

సి) ఛీఫ్ ఎకనామిక్ ఎడ్వైజర్ డి) పైఅందరూ

51. 12వ దక్షిణ ఆసియాక్రీడలు (SAG) వివరాలేవి?

ఎ) స్లోగన్–ప్లేఫర్‌పీస్, ప్రోగ్రెస్ & ప్రాస్పెరిటి

బి) మాస్కట్ (బొమ్మ) టిఖోర్ (ఖడ్గమృగం)

సి) దాదాపు 4,500 క్రీడాకారులు పాల్గొన్నారు గౌహతి & షిల్లాంగ్‌లలో నిర్వహించే పోటీలలో.

డి) పైవన్నీ

52. గోల్డ్ మానిటైజేషన్ స్కీం ద్వారా బంగారం సేకరించే బ్యాంకులకు, గవర్నమెంట్ ఎంత కమిషన్ ఇస్తానన్నది?

ఎ) 2.5% బి) 8% సి) 9% డి) 10%

53. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?

ఎ) AKIC: అమృత్‌సర్–కోల్‌కత్తా ఇండస్ట్రియల్ కారిడార్

బి) BMEC: బెంగళూరు– ముంబాయి ఎకనామిక్ కారిడార్

సి) CBIC: చెన్నయ్–బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్

డి పైవన్నీ (ప్రతి పాదిత రహదారులు)

54. UNDP విడుదల చేసిన హ్యూమన్ డవలప్‌మెంట్ ఇండెక్స్‌లో, దక్షిణ ఆసియా దేశాలలో ఏది ముందు స్థానంలో ఉంది?

ఎ) శ్రీలంక బి) మాల్దీవులు
సి) భూటాన్ డి) ఇరాక్

55. యిటీవలి UNDP, HDR లో భారతదేశ స్థానం ఏది?
ఎ) 147 బి) 130 సి) 138 డి) 104

56. నిజామ్స్ గ్యారంటీడ్ స్టేట్ రైల్వే (NGSR) వివరాలేవి?
ఎ) దాదాపు 1870 సం॥లో ఇది మొదలయ్యింది
బి) నిజాం రాజు దీనికోసం రూ. 7 కోట్లు పెట్టుబడి పెట్టాడు.
సి)ఈ రైలు తెలంగాణ రాష్ట్రంలో అనేక రకాలుగా అభివృద్ధి కారణం అయ్యింది. డి) పైవన్నీ

57. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్? (IRNSS-1E చెందినవి)
ఎ) ఉపగ్రహం బరువు: 1,425 కిలోగ్రాములు దీని జీవితకాలం: 12 సంవత్సరాలు.
బి) PSLV-C 31 రాకెట్ ద్వారా పంపించారు.
సి) దీనిలో నావిగేషన్ & రేంజింగ్ పేలోడ్స్, రుబిడియం ఆటమిక్‌క్లాక్, లేజర్ రేంజర్ కోసం కార్నర్ క్యూబ్ రెట్రో రిఫ్లెక్టర్ ఉన్నాయి.
డి) పైవన్నీ.

58. "గహరిమాత" ఎక్కడుంది?
ఎ) దేవి & రుషిక్యులనదీముఖ ద్వారం వద్ద (పూరి దగ్గర, ఒడిషా రాష్ట్రం)
బి) కృష్ణానది ముఖద్వారం వద్ద
సి) గోదావరినది ముఖద్వారం వద్ద
డి) కావేరినది ముఖద్వారం వద్ద

59. నేషనల్ పవర్ టారిఫ్ పాలసీ, సవరణలు చేస్తు కేంద్ర కేబినెట్ తెలిపిన అంశాలేవి?
ఎ) ఎలక్ట్రిసిటి ఫర్ ఆల్, ఎఫిషియన్సీ, ఎన్విరాన్‌మెంట్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనే నాలుగు E అంశాలమీద ఆధారపడిఉన్నాయి
బి) 2021-22 నాటికి విద్యుచ్ఛక్తి అందరికి.
సి) CERC మల్టిస్టేట్ పవర్ ప్రాజెక్ట్ టూరిఫ్‌లు నిర్ధారిస్తుంది. బి) పైవన్నీ

60. "స్నో జిల్లా" అనేపేరున్న మంచు తుఫాను, యిటీవల ఎక్కడవచ్చింది?
ఎ) దక్షిణాఫ్రికా
బి) USA (అర్కన్‌సాస్ నుండి న్యూయార్క్ వరకు)
సి) అంటార్కిటికా డి) ఆస్ట్రేలియా

61. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
ఎ) NICA: నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ అధారిటి. బి) CPTC: కలెక్షన్ & ప్యూరిటి టెస్టింగ్ సెంటర్ (బంగారంకోసం)
సి) JBIC: జపాన్ బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ కోపరేషన్ డి) పైవన్నీ

62. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
ఎ) "వెన్ ది రివర్ స్లీప్స్" ఈ స్టరన్ క్రైర్
బి) బ్రెడ్ బ్యూటీ రివల్యూషన్ – ఖ్వాజా అహమ్మద్ అబ్బాస్ సి) ఏ కారీర్ ఆఫ్ ఈవిల్ – రాబర్ట్ గాల్‌బ్రెయిత్ డి) పైవన్నీ

63. "రాక్‌గార్డెన్" ఎక్కడుంది? దీన్ని యిటీవల ఫ్రాంకాయిస్ హోలెండ్ దర్శించారు.
ఎ) చండీఘర్ బి) పుదుచ్చేరి
సి) మాహే డి) యానాం

64. భారతదేశం ఫ్రాన్స్ నుండి 36 రాఫేల్స్‌ను కొనదల్చింది. రాఫేల్స్ ఏమిటి?
ఎ) జలాంతర్గాములు బి) యుద్ధవిమానాలు
సి) నౌకలు డి) క్షిపణులు

65. చండీఘర్ నగరాన్ని డిజైన్ చేసిన ఫ్రెంచ్ ఆర్కిటెక్ట్ ఎవరు?
ఎ) లి కార్బూసియర్ బి) నేక్‌చంద్
సి) విలియం డార్లింపైర్ సి) జెఫ్‌విలియమ్స్

66. ఆరు న్యూక్లియర్ రియాక్టర్లతో 9900 MW జైటాపూర్ ఫెసిలిటిని ఫ్రాన్స్ దేశ అరేవా కంపెనీ సాయంతో ఎక్కడ నెలకొల్పుతారు?
ఎ) మధ్యప్రదేశ్ బి) మహారాష్ట్ర
సి) గుజరాత్ డి) పశ్చిమ బెంగాల్

67. కృష్ణానదిమీద, గుర్జాపూర్, రాయచూర్ జిల్లా, కర్ణాటకలో బారేజ్ నిర్మించటం వలన ఏ ఏ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లోకి నీళ్ళు రావటం కష్టమని భావిస్తున్నారు?
ఎ) జూరాల బి) శ్రీశైలం
సి) నాగర్జునసాగర్ డి) పైవన్నీ

68. నాగోబా జాతరలో చేసే కార్యక్రమాలలో ముఖ్యమైనవిఏవి?
ఎ) భేటింగ్ బి) తూం
సి) ట్రైబల్ దర్బార్ డి) పైవన్నీ

69. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రెవ్యూ 2016, విశాఖపట్నం విశేషాలేవి?
ఎ) దాదాపు 24 విదేశీనౌకలు,65 ఇండియన్ నావీ నౌకలు, జలాంతర్గాములు పాల్గొన్నాయి.
బి) భారత రాష్ట్రపతి రెవ్యూచేశారు
సి) భారతనావికా దళానికి ఉన్న వైమానిక శక్తి కూడ ప్రదర్శించారు. డి) పైవన్నీ

70. NJ 9842 అనే పాయింట్ ఎక్కడుంది?
ఎ) సియాచిన్ (గ్లేషియర్ దగ్గర) J&K
బి) అరుణాచల్ ప్రదేశ్
సి) మణిపూర్ డి) నాగాలాండ్

71. ఈ క్రింది వాటిల్లో దేన్ని చైనా దేశపు సెంట్రల్ బ్యాంక్ అంటారు?
ఎ) పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా (PBOC)
బి) ఫెడ్‌రిజర్వ్ సి) DBS బ్యాంక్
డి) HSBC

72. కేంద్ర ప్రభుత్వం యిటీవల వేటి మీద మినిమం ఇంపోర్ట్ ప్రైస్ (MIP) అనే పద్ధతి విధించింది?
ఎ) 173 HS కోడ్స్ (ఐరన్ & స్టీల్ ఉత్తత్తులు)
బి) కాఫీ సి) తేయాకు డి) రబ్బర్

73. యిటీవల నిర్వహించిన IPL వేలంపాటలో ఎవరికెంత ధర పలికింది?
ఎ) షేన్‌వాట్సన్–9.5 కోట్ల రూపాయలు
బి) పవన్‌నేగి–8.5 కోట్ల రూపాయలు
సి) యువరాజ్‌సింగ్– 7 కోట్ల రూపాయలు
డి) పైవన్నీ

74. 1773 సం॥లో జరిగిన బక్సర్ యద్ధంలో ఓడిపోయిన అవధ్‌నవాబ్ ఎవరు?
ఎ) షూజా ఉద్దౌలా బి) వాజిద్ ఆలిషా
సి) నవాబ్ సాదత్ ఆలీఖాన్ II
డి) నవాబ్ సాదత్ ఖాన్

75. డా॥ సలీం ఆలి పేరు, యిటీవల ఏ పక్షికి పెట్టారు?
ఎ) నెమలి బి) హిమాలయన్ ఫారెస్ట్ థ్రష్, జూథెరా సలీంఆలీ (Zoothera Salimali)
సి) బట్టమేక పక్షి డి) పాలపిట్ట

## జవాబులు (మార్చి - 2016)

| | | | |
|---|---|---|---|
| 1-డి | 20-ఎ | 39-డి | 58-ఎ |
| 2-ఎ | 21-డి | 40-ఎ | 59-డి |
| 3-డి | 22-ఎ | 41-బి | 60-బి |
| 4-ఎ | 23-ఎ | 42-డి | 61-డి |
| 5-ఎ | 24-ఎ | 43-డి | 62-డి |
| 6-బి | 25-ఎ | 44-ఎ | 63-ఎ |
| 7-ఎ | 26-ఎ | 45-డి | 64-బి |
| 8-డి | 27-డి | 46-బి | 65-ఎ |
| 9-ఎ | 28-ఎ | 47-ఎ | 66-బి |
| 10-బి | 29-ఎ | 48-ఎ | 67-ఎ |
| 11-డి | 30-ఎ | 49-ఎ | 68-డి |
| 12-డి | 31-డి | 50-డి | 69-డి |
| 13-ఎ | 32-ఎ | 51-డి | 70-ఎ |
| 14-డి | 33-బి | 52-ఎ | 71-ఎ |
| 15-ఎ | 34-ఎ | 53-డి | 72-ఎ |
| 16-డి | 35-డి | 54-ఎ | 73-డి |
| 17-ఎ | 36-బి | 55-బి | 74-ఎ |
| 18-ఎ | 37-డి | 56-డి | 75-బి |
| 19-డి | 38-ఎ | 57-డి | |

సాంకేతిక కారణాల వలన ఫిబ్రవరి–2016 విజ్ఞాన విపంచి సమాధానాల్లో తప్పులు దొర్లాయి. సరైన సమాధానాలు ఈ సంచికలో ఇస్తున్నాం. పాఠకులు మన్నించగలరు. అసౌకర్యానికి చింతిస్తున్నాం.

## జవాబులు (ఫిబ్రవరి - 2016)

| | | | |
|---|---|---|---|
| 1-డి | 19-ఎ | 37-డి | 55-ఎ |
| 2-ఎ | 20-బి | 38-ఎ | 56-డి |
| 3-ఎ | 21-డి | 39-డి | 57-బి |
| 4-ఎ | 22-డి | 40-ఎ | 58-ఎ |
| 5-డి | 23-ఎ | 41-ఎ | 59-డి |
| 6-ఎ | 24-బి | 42-ఎ | 60-ఎ |
| 7-ఎ | 25-డి | 43-ఎ | 61-ఎ |
| 8-డి | 26-ఎ | 44-ఎ | 62-ఎ |
| 9-ఎ | 27-డి | 45-బి | 63-డి |
| 10-ఎ | 28-ఎ | 46-ఎ | 64-ఎ |
| 11-ఎ | 29-బి | 47-డి | 65-బి |
| 12-ఎ | 30-ఎ | 48-డి | 66-డి |
| 13-డి | 31-బి | 49-బి | 67-బి |
| 14-ఎ | 32-ఎ | 50-డి | 68-ఎ |
| 15-ఎ | 33-బి | 51-ఎ | 69-డి |
| 16-బి | 34-ఎ | 52-ఎ | 70-ఎ |
| 17-డి | 35-ఎ | 53-ఎ | 71-బి |
| 18-బి | 36-డి | 54-ఎ | 72-ఎ |

### హైదరాబాద్ వాటర్ ఏటీఎంలు రూపాయికే లీటరు నీరు



రూపాయికే లీటర్ నీటిని అందించేందుకు వాటర్‌బోర్డు కసరత్తు చేస్తోంది. వేసవి నేపథ్యంలో పౌరుల దాహార్తి తీర్చేందుకు వినూత్నంగా వాటర్ కియోస్కులు ఏర్పాటుచేయాలని భావిస్తున్నారు. ఎనీ టైం మనీ (ఏటీఎం) కేంద్రాల తరహాలో ఎక్కడైనా అతి తక్కువ ధరకే నీటిని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. రూ. 1 కే లీటర్ నీటిని అందించే కియోస్కుల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని బోర్డు మెనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బీ. జనార్ధన్ రెడ్డి ఇటీవల జరిగిన సమావేశంలో అధికారులను అదేశించారు. సాధ్యాసాధ్యాలు పరిశీలించి త్వరలో ఓ నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ కేంద్రాలు అందుబాటులోకి వస్తే రూపాయి కాయిన్ వేసి లీటరు నీటిని తీసుకునే వెసులుబాటు ఉంటుంది. వేసవిలో అక్కడక్కడా స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు చలివేంద్రాలు ఏర్పాటుచేసి ఉచితంగా నీటిని అందుబాటులో ఉంచుతాయి. కొన్ని ప్రాంతాల్లో నిర్వహణ లోపం, ఇతర కారణాల నేపథ్యంలో ఎక్కువ మంది ఆ కేంద్రాల వద్ద నీళ్ళు తాగేందుకు ఇష్టపడరు. గ్రేటర్‌లో సరఫరా చేస్తున్న నీటిని పరిశుభ్ర వాతావరణంలో ఈ కియోస్కులలో ఒక్క రూపాయికే విక్రయించాలని యోచిస్తున్నారు. ఆ రూపాయి కూడా అక్కడ ఏర్పాటుచేసి సిబ్బంది, నిర్వహణ ఖర్చు కోనమే అని బోర్డు అధికారులు చెబుతున్నారు. ప్రధాన రహదారులు, ఫుట్‌పాతులు విశాలంగా ఉన్న చోట కియోస్కులు నిర్మించే అవకాశం ఉంది. తాగేందుకు తప్ప... లీటర్ల కొద్ది నీళ్లు ఇంటికి తీసుకెళ్లేందుకు అనుమతి ఉండదని ఓ అధికారి చెప్పారు. ఇప్పటికే ఢిల్లీలో ఈ తరహా విధానం అమల్లో ఉంది. అక్కడ తాగడంతో పాటు రూ. 3కు 20 లీటర్ల చొప్పున తీసుకెళ్లే అవకాశం కూడా ఉంది.

### జికా వైరస్‌కి వ్యాక్సిన్ కనిపెట్టిన హైదరాబాద్ సైంటిస్టులు!



ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు జికా వైరస్‌కి వ్యాక్సిన్ కనిపెట్టే ప్రయత్నాల్లో ఉండగా హైదరాబాద్‌కి చెందిన ఒక బయోటెక్ కంపెనీ దాన్ని సాధించిది. భారత్ బయోటెక్ ఇంటర్ నేషనల్ లిమిటెడ్ అనే కంపెనీ తాము జికా వైరస్‌కి వ్యాక్సిన్ కనిపెట్టి, పేటెంట్ కోసం అప్లై చేశామని ప్రకటించింది. ఇప్పటికే 20కి పైగా లాటిన్ అమెరికా దేశాల్లో జికా విజృంభిస్తున్న నేపథ్యంలో, గర్భంలో ఉండగానే ఇది పిల్లలపై ప్రభావం చూపుతుందని తేలడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ అత్యవసర చర్యలకై పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాలు జికా వైరస్‌కి వ్యాక్సిన్‌ని కనిపెట్టె పనిలో ఉన్నాయి. వాటి ప్రయత్నాలు తొలి దశల్లో ఉండగానే హైదరాబాద్ కంపెనీ తాము ఇందులో విజయం సాధించామని ప్రకటించింది. కాండిడేట్ వ్యాక్సిన్ (పరీక్షలకు నిలిచిన వ్యాక్సిన్) పేటెంట్ కోసం తొమ్మిది నెలల క్రితమే దరఖాస్తు చేశామని, ఇలా ధరఖాస్తు చేసుకున్న కంపెనీల్లో తమదే మొదటిది కావచ్చని భారత్ బయోటెక్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణా ఎల్లా అన్నారు. అధికారంగా జీవించిన ఉన్న జికా వైరస్‌ని విదేశాల నుండి దిగుమతి చేసుకుని దానిపై పరిశోధనలు చేసి వ్యాక్సిన్‌ని రూపొందించామని, నిజానికి రెండు రకాల కాండిడేట్ వ్యాక్సిన్లను తయారుచేశామని ఆయన అన్నారు. అయితే వ్యాక్సిన్‌ని జంతువుల మీద, మనుషుల మీద ప్రయోగించాల్సిన క్రమంలో ఇది బయటకు రావడానికి సమయం పడుతుందని ఆయన అన్నారు. ఇందుకోసం ప్రభుత్వం, భారతీయ వైద్య పరిశోధన మండళ్లను తగిన సహాయం కోరారు. కంపెనీకి నాలుగు నెలల్లో పది లక్షల డోసులు వ్యాక్సిన్ తయారుచేయగల సామర్థ్యం ఉందని ఇప్పుడే తెలిసిందని, దాన్ని శాస్త్రీయంగా పరిశోధించి, ముందుకు తీసుకువేళ్లే అవకాశాలు ఎంతవరకు ఉన్నాయో పరిశీలించాల్సి ఉందని పిల్లల వైద్యనిపుణులు, భారతీయ వైద్య పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ సౌమ్య స్వామినాథన్ పెర్కొన్నారు. ఇది 'భారత్‌లో తయారీ' ఉత్పత్తులకు ఊతం ఇచ్చేలా ఉందని ఆమె అభినందించారు.

### అధ్యయనం, పరిశ్రమ, నాయకత్వం ద్వారానే మహిళలకు మోక్షం



నిరంతర అధ్యయనం, కృషి, యాజమాన్య నైపుణ్యాలే మహిళల సమస్యలకు అంతిమ పరిష్కారమని అంతర్జాతీయ ద్రవ్య నిధి అధినేత్రి క్రిస్టీన్ లగార్డ్ అభిప్రాయం. వర్తమాన శతాబ్దంలో మహిళలు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రపంచ పరిస్థితులు కూడ వేగంగా మారుతున్నాయి. అయినప్పటికీ మహిళలు, మొత్తం జనాభాలో


సగంగా ఉన్నప్పటికీ, అవకాశకాలను అందిపుచ్చు కోవడంలో మాత్రం, చాలా వెనుకబడి ఉన్నారని అన్నారు. అక్షరాస్యత లేకపోతే వచ్చే నష్టం సమాజానికి అమ్మాయి వల్లనైనా ఒకటే, అబ్బాయివల్లనైనా ఒక్కటే! ప్రపంచవ్యాప్తంగా 60 దేశాలలో జరిపిన ఒక సర్వే ప్రకారం, ఈ నష్టం సాలుకు, 90 మిలియన్ల అమెరికన్ డాలర్ల మేరకు ఉండవచ్చు. అంతేకాదు, ఒక పురుషుని ఆదాయంలో కేవలం 30-40 శాతం మాత్రమే, కుటుంబానికి ఖర్చు చేస్తే, అదే ఒక మహిళ 90 శాతం వరకూ వెచ్చిస్తుంది. అర్హతలూ, సామర్థ్యం సమానంగా ఉన్నా, మహిళ ఆదాయం, పురుషుని ఆదాయంలో 75 శాతంగా మాత్రమే ఉంటున్నది. నేడు సమాజంలో అత్యంత వెనుకబడిన వర్గం మహిళలే! ఈ పరిస్థితి మారాలి అనేది, ఆవిడ అభిప్రాయం.

### ఆమె వివక్షతను జయించింది



ముంబైకి చెందిన రౌషన్ జవ్వాద్ కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్ మెడికల్ కాలేజి నుండి, ఎంబిబియస్ ప్రథమశ్రేణిలో పాసయ్యింది. ఇది ప్రత్యేక విషయం కాకపోవచ్చు కానీ, అంతకు ఎనిమిది సంవత్సరాల ముందు, అంధేరీ లోకల్ స్టేషన్‌లో ఒక ప్రమాదంలో ఆమె రెండూ కాళ్ళనూ పోగొట్టుకుంది. నేటికి ఈ విజయాన్ని సాధించడానికి ఆమె ఎంతో పోరాటం చేసింది. మొదట ఆమెను 88 శాతం వైకల్యంతో ఉన్నదని వైద్యవిద్యకు అనర్హురాలివన్నారు. ఆర్థోపెడిక్ సర్జన్ డా. సంజయ్ కంధారియా ఆమెకు వైద్యపరంగా కొండంత అండగా నిలవడమే కాదు, విద్యాభ్యాసంలో కూడ సహాయం చేసి, చివరకు తనకు జరిగిన అన్యాయానికి న్యాయస్థానాన్ని ఆశ్రయించమని సలహా కూడ ఇచ్చారు. ముంబై హైకోర్టులో లీడింగ్ లాయర్ పిళ్లై గారు ఉచితంగా ఆమె కేసును వాదించడానికి ముందుకు వచ్చారు. కేసు వివరాలు విన్న న్యాయ మూర్తి జస్టిస్ మోహిత్ షా ఆమెను చేర్చుకోవాలని మెడికల్ కళాశాలను ఆదేశించారు. జోగేశ్వరిలో కూరగాయలు అమ్ముకునే జవ్వాద్ షేక్ మూడవ కూతురుగా రౌషన్ ఒక ఆడపిల్ల సత్తా ఏమిటో చూపింది. ప్రస్తుతం ద్విగుణీ కృతమైన ఉత్సాహంతో ఆమె పోస్టు గ్రాడ్యుయేషన్‌కు సన్నద్ధమౌతున్నది.

### ఎలక్ట్రానిక్స్ డవలప్‌మెంట్ ఫండ్





ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ - నానో టెక్నాలజీ - ఎలక్ట్రానిక్స్ రంగంలో సృజనాత్మక కార్యక్రమాలకు నిధులనందించేందుకు ఈ-ఎలక్ట్రానిక్స్ డవలప్‌మెంట్ ఫండ్‌ను కేంద్రం ఏర్పాటు చేసింది. ప్రధాని నరేంద్రమోడి గత జులై ఒకటవ తేదీన ప్రకటించిన విధంగా ప్రభుత్వం కేన్ బ్యాంక్ వెంచర్ క్యాపిటల్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ సెప్టెంబర్ 04, 2015 నుండి ఉనికిలోకి వచ్చింది. ఈ రంగంలో నూతన పరిశోధనలకూ, ఆలోచనలకూ ఈ నిధి ద్వారా ప్రోత్సహిస్తారు. వివరాలకు http://deity.gov.in/esdm/edf వైబ్ సైట్‌ను చూడవచ్చు.

### ఇంటి నిర్మాణ నియంత్రణకు ఒక యాప్



ఇది యాప్‌ల యుగం, జీవితంలో ప్రతిదానికీ ఒక యాప్, నేడు రోజువారీ విధి నిర్వహణలో తీరికలేకుండా ఉండే వారికి ఇల్లు కట్టు కోవలంటే సమయం దొరకడంలేదని బాధ పడాల్సిన పని లేదు. మనం ఏ వూళ్ళో వున్నా, మరో వూళ్ళో ఇంటిని కట్టుకుంటూ దానిని ఎంతవరకూ వచ్చిందో చక్కగా పరిశీలించుకోవచ్చు. HOMEDRIFT యాప్‌ను ఉపయోగించడం ద్వారా నిర్మాణ ప్రగతినే కాదు, అవసరమైన సిమెంటు, ఇనుము వంటి వాటి ధరలలో వచ్చిన మార్పులను కూడ గమనించవచ్చు. బెంగుళూరు ప్రధాన కేంద్రంగా ఉన్న ఎనిమిది మంది సాఫ్ట్‌వేర్ నిపుణులు ఈ యాప్‌ను అభివృద్ధి చేసి అవసరమైన వారికి homedrift1@gmail.com ఈమెల్ ద్వారా తగిన సూచనలను ఇస్తారు. అయితే మొదటిసారిగా ఖాతాదారులు రూ. 500 నుండి 1500ల వరకూ చెల్లించాల్సి ఉంటుంది.

### మలేరియా నిర్మూలనకు జాతీయ ప్రణాళిక




కేంద్ర ప్రభుత్వం 2030 నాటికి మలేరియాను సమూలంగా నిర్మూలించడానికి ఒక కార్యచరణ ప్రణాళికను రూపొందించింది. ఈ మేరకు ఒక కార్య ప్రణాళికను (National Framework for Malaria Elimination NFME) విడుదల చేస్తూ కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జె.పి. నడ్డా దశల వారీగా ఈ మహమ్మారిని సమూలంగా నిర్మూలించడానికి, మొదటి దశలో వ్యాధి తక్కువగా ఉండే కేటగిరీ-1 ప్రాంతాలనుండి 2022 నాటికి సమూలంగానూ, మిగిలిన ప్రాంతాలలో దశలవారీగా 2030 నాటికి నిర్మూలించడం లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు చెప్పారు. వ్యాధి తీవ్రంగా ఉండే ప్రాంతాలలో ముందుగా సెరిబ్రల్ మలేరియాకు కారణమయ్యే వైవాక్స్ క్రిమిపై దృష్టిని సారిస్తామన్నారు. దక్షిణసియాలో ఈ వ్యాధిన పడేవారిలో 70 శాతం మంది మనదేశంలోనివారే!

సహకార స్ఫూర్తి

విశిష్ట వ్యాసం

# "భారత్ లో తయారీ" కి పటిష్టమైన విధానం




సహకార సమాఖ్య స్ఫూర్తితో పాటు – భారత్ ఇప్పుడు పోటీ సమాఖ్య స్ఫూర్తితో ముందుకు వెడుతోంది. ఎందుకంటే ఇప్పుడు భవిష్యత్తు అంతా పోటీ సమాఖ్యతోనే ముడిపడి ఉంది. ఇప్పుడు కావలసింది – కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు కాదు, పెట్టుబడులను ఆకర్షించడానికి – రాష్ట్రాలకీ – రాష్ట్రాలకీ మధ్య పోటీగా ముందుకు వెళ్ళాలి. నైపుణ్యాభివృద్ధి సర్టిఫికేషన్ కోసం పరిశ్రమల రంగం, విద్యారంగాల భాగస్వామ్యంతో ఒక జాతీయ మండలిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

''రోమ్ నగరం ఒక్క రోజులో నిర్మించబడలేదు" అనేది – అందరికీ తెలిసిన ఒక సామెత. అదేవిధంగా – ఒక పటిష్టమైన విధానం కలిగి అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే అవకాశం ఉన్నప్పటికీ – అంకుర సంస్థలు, పారిశ్రామిక యూనిట్లు లేదా ఇతర వాణిజ్య సంస్థలు తక్కువ సమయంలో తమ లక్ష్యాలను సాధించలేవు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఇటీవల తన బడ్జెట్ గురించి వివరణ ఇస్తూ – భారత దేశ ఆశయాలనూ, ప్రాధమిక అవసరాలనూ దృష్టిలో ఉంచుకుని – వాస్తవాలకు, సవాళ్లకు తగ్గట్టుగా ప్రస్తుత ప్రభుత్వం తెలివిగా ముందుకు వెడుతోందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యం, ఆర్థిక లావాదేవీలు బాగా దెబ్బతిని – ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన సంక్షోభంలో ఉన్న సమయంలో – ప్రస్తుతం చేపట్టిన పని చాలా భారమైందే. ప్రపంచ వాప్తంగా ఇటువంటి ఒడిదొడుకులు రాజ్యమేలుతున్న సమయంలో తన స్థానాన్ని సుస్థిర పరచుకొని భారతదేశం ఉజ్వలమైన కేంద్రంగా నిలబడిందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (IMF) మన దేశాన్ని ప్రశంసించింది. 2016-17 బడ్జెట్ ప్రతిపాదనలను ఆర్థికమంత్రి వెల్లడిస్తూ దేశ ఆర్థిక పరిస్థితిని – అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితితో పోల్చి సమీక్షించారు. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితి తిరోగమనంలో అస్తవ్యస్తంగా వున్నప్పటికీ "స్టార్టప్ ఇండియా", "మేక్ ఇన్ ఇండియా" "నైపుణ్యాభివృద్ధి" ఉపాధి కల్పన వంటి ప్రాధాన్యతా పథకాలతో సహా అసంఖ్యాకంగా వున్న ఇతర పథకాలను కూడా సకాలంలో అమలుచేయడానికి – నరేంద్ర మోదీ సారథ్యంలోని జాతీయ ప్రజాతంత్ర కూటమి (NDA) ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం కలిగించే ప్రయత్నం చేసారు .

''స్టార్టప్ ఇండియా'', ''స్టాండప్ ఇండియా'' అనేవి తన మంత్రాలని ప్రధానమంత్రి స్పష్టంగా ప్రకటించారు. ''స్టార్టప్'' అంటే అంకుర సంస్థలకు సానుకూల, పటిష్టమైన విధానాన్ని కల్పించడం కోసం పన్నుల ప్రణాళికను బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఇప్పుడు మన దళిత యువకులు, గిరిజన యువకులు – పారిశ్రామిక వేత్తలు కావాలని కోరుకుంటున్నారు. వారు ఎంత మాత్రం ఉద్యోగాలు కావాలని కోరుకోవటం లేదు.

**నీరజ్ బాజ్ పాయ్,** సీనియర్ జర్నలిస్ట్, ప్రెస్ కౌన్సిల్ సభ్యుడు.

ఉద్యోగాలు కల్పించే వారిగా కావాలని కోరుకుంటున్నారు. వారి కలలను సాకారం చేసెందుకు ఒక పారిశ్రామిక కేంద్రాన్ని నెలకొల్పాలని ప్రభుత్వం నిర్ణయించింది. భవిష్యత్ ఆర్థిక ప్రణాళికను ప్రధానమంత్రి మెచ్చుకున్నారు. "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమాన్ని పెద్దగా ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం – ఉపాధి కల్పనకు ప్రాధాన్యతనిస్తూ – స్వదేశీ తయారీని పెంపొందించాలనే ఉదేశ్యంతో – పన్ను ప్రోత్సాహకాలను ప్రకటించిందని చెప్పారు. సులువుగా వ్యాపారం చేసుకోవడం కోసం – నిబంధనలను సరళతరం చెయ్యడం, పన్ను రాయితీలను ప్రకటించడంతో పాటు ఇతర ప్రోత్సాహకాలను ప్రకటించారు. ఈ నిబంధనలు చిన్న పరిశ్రమలకు అధిక సౌకర్యాలు కలిగిస్తాయి. అంతే కాదు – ఎటువంటి వివాదాలనైనా తక్షణమే పరిష్కరించడానికి వీలుకలుగుతుంది. ఒకవేళ విఫలమైన పక్షంలో వారు సురక్షితంగా వైదొలగడానికి కూడా అవకాశం ఉంటుంది. "మేక్ ఇన్ ఇండియా" ప్రణాళికలో ఉన్న – I.T. హార్డ్ వేర్, వస్త్రాలు, రక్షణ పరికరాల ఉత్పత్తి మొదలైన సంస్థలకు – ఈ సవరించిన ఎక్సైజ్, కస్టమ్స్ డ్యూటీ రేట్లు – ఆయా సంస్థల ఉత్పత్తి వ్యయం తగ్గడానికి ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఉదాహరణకు – టెలికాం రంగంలో మొబైల్ ఫోన్లకు సంబంధించిన విడిభాగాల దిగుమతిని అరికట్టేందుకు – వాటిపై గతంలో ఇచ్చిన కస్టమ్స్ డ్యూటీతో పాటు ఇతర సుంకాల రాయితీలను ఉపసంహరించడం జరిగింది. ఈ చర్య వల్ల మొబైల్ ఫోన్లు, వాటి తయారీకి కావలసిన ఇతర విడిభాగాల ఉత్పత్తి పై ప్రోత్సాహకరమైన ప్రభావం పడింది. ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ – " స్టార్టప్", "మేక్ ఇన్ ఇండియా" వంటి పథకాల ప్రోత్సాహంతో దేశీయ పరిశ్రమలకు అవసరమైన పెట్టుబడులను ఆకర్షించడానికి అనుకూల వాతావరణాన్ని కలుగజేస్తున్నాయి. ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. బడ్జెట్‌లో హామీ ఇచ్చిన రాయితీలు ఆర్థిక, సామాజికాభివృద్ధిపై సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. దేశంలోనూ, ఇతరదేశాల్లో కూడా పెట్టుబడిదారుల సదస్సులు నిర్వహిస్తున్నాము. ఈ విధంగా ఇటీవల హర్యానాలో జరిగిన ఒక సదస్సులో ఆర్థికమంత్రి మాట్లాడుతూ – ఎక్కడైతే విధానాలు నచ్చక, అనుకూల వ్యాపార, రాజకీయ వాతావరణం కోసం పెట్టుబడిదారులు ఎదురు చూస్తున్నారో – అక్కడ – ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు తగిన సంస్కరణలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

సహకార సమాఖ్య స్ఫూర్తితో పాటు – భారత్ ఇప్పుడు పోటీ సమాఖ్య స్ఫూర్తితో ముందుకు వెడుతోంది. ఎందుకంటే ఇప్పుడు భవిష్యత్తు అంతా పోటీ సమాఖ్యతోనే ముడిపడి ఉంది. ఇప్పుడు కావలసింది – కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు కాదు, పెట్టుబడులను ఆకర్షించడానికి – రాష్ట్రాలకీ – రాష్ట్రాలకీ మధ్య పోటీగా ముందుకు వెళ్ళాలి. ఏ రాష్ట్రాలైతే – సంస్కరణలు చేపట్టలేదో – ఆ రాష్ట్రానికి చెందిన ప్రజలు తమ అవకాశాలను అందుకోలేని పరిస్థితిలో ఉంటారు. అదేవిధంగా మరోవైపు – ఏ రాష్ట్రాలైతే – పెట్టుబడిదారులకు మరింత అనుకూలమైన ఆర్థిక, వ్యాపార, రాజకీయ వాతావరణాన్ని నెలకొల్పుతాయో – ఆ రాష్ట్రాల ప్రజలు ప్రయోజనం పొందుతారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మనకు మనం సంస్కరించుకుంటేనే – ఈ పోటీ ప్రపంచంలో నిలబడగలం. లేకపోతే మనల్ని ఎవరూ పట్టించుకోరు – అని ఆర్థికమంత్రి వ్యాఖ్యానించారు. అరుణ్ జైట్లీ ఇటీవల లోక్ సభలో సాధారణ బడ్జెట్ ప్రవేశపెడ్తున్న సందర్భంగా ప్రసంగిస్తూ – "స్టార్ట్ అప్" (అంకుర) సంస్థలు ఉద్యోగాలు కల్పిస్తాయనీ, కొత్త మార్పు తీసుకువస్తాయనీ – "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమంలో కీలక పాత్ర పోషిస్తాయనీ నొక్కి చెప్పారు. 2016 ఏప్రిల్ నుంచి 2019 మార్చి లోపల నెలకొల్పిన అంకుర సంస్థలకు మొదటి 5 సంవత్సరాల్లో – మూడు సంవత్సరాల లాభాలపై ఆదాయపన్ను నుంచి పూర్తి మినహాయింపు ఇచ్చి ప్రోత్సహించాలని ప్రతిపాదించారు. వీటి విషయంలో MATను పరిగణ లోకి తీసుకుంటారు. అదేవిధంగా గుర్తింపు పొందిన అంకుర సంస్థల్లో – గుర్తింపు పొందిన నిధి లేదా ఫండ్ లేదా వ్యక్తులు అధిక వాటా పెట్టుబడి పెడితే వారు మూలధనం మీద పొందే లాభం పైన కూడా పన్ను భారం ఉండదు. మనదేశంలో అభివృద్ధి చేసి, నమోదు చేసిన "పేటెంట్" (హక్కు)పై ప్రపంచవ్యాప్తంగా పొందిన ఆదాయంలో కేవలం 10 శాతం మీద మాత్రమే పన్ను విధించాలని కూడా ఆర్థికమంత్రి ప్రతిపాదించారు. "మేక్ ఇన్ ఇండియా" ప్రచారంలో భాగంగా దేశీయ ఉత్పత్తుల విలువలను నిర్ధారించడంలో కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాలు కీలక ప్రాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి చెందిన హార్డ్ వేర్, ముడి సరుకులు, రక్షణ ఉత్పత్తులు, వస్త్రాలు, ఖనిజ ఇంధనాలు, ఖనిజ తైలాలు, రసాయనాలు, పెట్రో రసాయనాలు, కాగితం, పేపర్ బోర్డు, న్యూస్ ప్రింట్, విమానాలు, ఓడల మరమ్మత్తు, నిర్వహణ మొదలైన రంగాల్లో స్వదేశీ పరిశ్రమల పోటీని వృద్ధి చేసి, నిర్వహణ, తయారీ ఖర్చులు తగ్గించేందుకు వీలుగా వీటికి అవసరమైన ముడి సరుకులు, ఇతర పదార్థాలు, విడిభాగాలపై విధించే కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాలలో తగిన మార్పులు చేయాలనీ – విధి విధానాలను సరళతరం చేయాలనీ

కూడా ప్రభుత్వం ప్రతిపాదించింది. అభివృద్ధి చెందుతున్న పరిశ్రమల రంగానికి అవసరమైన నిపుణులను అందించేందుకూ, వారికి ఉపాధి కల్పించేందుకూ, దేశవ్యాప్తంగా 15 వందల బహుముఖ నైపుణ్య శిక్షణా సంస్థలను నెలకొల్పాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం బడ్జెట్‌లో 17 వందల కోట్ల రూపాయలను కేటాయించింది. ప్రధానమంత్రి కౌశల్ వికాశ్ యోజన (PMKVY) ద్వారా పారిశ్రామిక వేత్తగా రూపొందే విధానాన్ని యువత ఇంటి ముందుకు తీసుకురావాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ఉన్న వైవిధ్య భరితమైన అవకాశాలను – పెట్టుబడి రూపంలోకి మార్చాలన్నదే " స్కిల్ ఇండియా మిషన్ "ఆలోచన అని ఆయన తెలిపారు. జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రారంభమైన నాటినుంచి ఇంతవరకూ – ఉత్తమమైన నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తూ – దాదాపు 76 లక్షల మంది యువజనులకు శిక్షణ ఇచ్చింది. నైపుణ్యాభివృద్ధి సర్టిఫికేషన్ కోసం పరిశ్రమల రంగం, విద్యారంగాల భాగస్వామ్యంతో ఒక జాతీయ మండలిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. "ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన"ను మరింత పటిష్ట పరిచి, వచ్చే మూడేళ్ళలో కోటి మంది యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇవ్వాలని ప్రతిపాదించారు. వచ్చే మూడేళ్ళ కాలంలో కోటి మంది నైపుణ్యం కలిగిన యువజనులు అందుబాటులో ఉంటే ఉద్యోగ కల్పనలో ఒక నూతన శకం ఆవిర్భవించినట్లే అవుతుందనీ – దేశవ్యాప్తంగా ఉత్పాదకత గణనీయంగా పెరుగుతుందనీ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. భారీ సార్వత్రిక అంతర్జాల పాఠ్య ప్రణాళిక ద్వారా పారిశ్రామికవేత్తలకు అవసరమైన విద్యా, శిక్షణా కార్యక్రమాలను దేశంలోని 2,200 కళాశాలలు, 3 వందల పాఠశాలలు, 5 వందలకు పైగా ప్రభుత్వ I.T.I.లతో పాటు, 50 వృత్తి శిక్షణా కేంద్రాల ద్వారా నిర్వహిస్తారు. పారిశ్రామిక వేత్తలు కావాలనుకునేవారు ముఖ్యంగా దేశంలోని మారుమూల ప్రాంతాలకు చెందినవారిని ఈ కేంద్రాల ద్వారా నిపుణులతో అనుసంధానం చేస్తారు. ఈ రంగంలో కొత్త ఉద్యోగాల కల్పనను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఈ సంస్థల్లో చేరిన ఉద్యోగులకు మొదటి మూడు సంవత్సరాలు ప్రభుత్వం ఉద్యోగుల పించన్ పథకం కింద 8.33 శాతం వాటాను ప్రభుత్వమే ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (EPFO)కు జమ చేస్తుంది. నెలసరి వేతనం 15 వేల రూపాయల వరకూ పొందుతున్న ఉద్యోగులకు ఈ పథకం వర్తిస్తుంది. ఇందుకోసం వెయ్యి కోట్ల రూపాయల మేర నిధులను బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దీనికి అదనంగా ఆదాయ పన్ను చట్టంలోని 80 JJAA సెక్షన్ కింద ఉద్యోగాలు కల్పించే వారికి ఇచ్చే ప్రోత్సాహకం పరిధిని మరింత విస్తరించి సరళతరం చేయాలని 2016 ఆర్థిక బిల్లులో ప్రతిపాదించారు. ఉపాధి కల్పన కోసం ప్రభుత్వ ప్రణాళికను ఆర్థిక మంత్రి వివరిస్తూ – "నేషనల్ కెరీర్ సర్వీస్" ను 2015 జూలై నెలలో ప్రారంభించినట్లు చెప్పారు. ఇప్పటికే 3 కోట్ల 50 లక్షల మంది నిరుద్యోగులు ఇందులో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. 2016–17 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి వంద మోడల్ కెరీర్ సెంటర్ల సేవలను అందుబాటులోకి తేవాలని కొత్త బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

రాష్ట్రాలలోని ఉపాధి కల్పనా కేంద్రాలను ఈ జాతీయ కెరీర్ సర్వీస్ కేంద్రాలతో అనుసంధానం చేయాలని కూడా ప్రతిపాదించారు. కంపెనీల చట్టం 2013 ను సవరించడానికి ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే ఒక బిల్లును ప్రవేశపెట్టవలసి ఉంది. సులువుగా వ్యాపారంచేయ్యడానికి అవరోధంగా ఉండే ఇబ్బందులను ఈ సవరణ తొలగిస్తుందని ఆయన చెప్పారు. "స్టార్టప్" అంటే అంకుర సంస్థలకు అనువైన వాతావరణాన్ని కూడా ఈ బిల్లు మెరుగుపరుస్తుంది. ఈ కంపెనీల రిజిస్ట్రేషన్ కూడా ఒక రోజులోనే పూర్తవుతుంది. ఆర్థికాభివృద్ధి ద్వారా ఉపాధి కల్పనను మెరుగు పరచడమే ఈ ప్రతిపాదనల వెనుక ప్రధానమైన ఉద్దేశ్యమని ఆర్థికమంత్రి చెప్పారు. "మేక్ ఇన్ ఇండియా" అంటే భారత్‌లో తయారీని ప్రోత్సహించడం, ఆర్థికంగా మెరుగైన సమాజం కోసం అవసరమైన చర్యలు తీసుకోవడం, అందుబాటులో గృహ నిర్మాణాన్ని ప్రోత్సహించడం వంటి ఉద్దేశ్యాలు కూడా ఈ బిల్లులో పొందుపరచినట్లు ఆయన వివరించారు. 2016 ఏప్రిల్ నుంచి 2019 మార్చి నెల మధ్య కాలంలో నెలకొల్పిన అంకుర సంస్థలకు 5 సంవత్సరాల్లో – మూడు సంవత్సరాల లాభానికి వంద శాతం ఆదాయపన్ను నుంచి మినహాయింపు వంటి ప్రతిపాదనల ద్వారా ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగౌతాయి.

ఇదేవిధంగా మన దేశంలో అభివృద్ధి చేసి, నమోదు చేసిన "పేటెంట్" (హక్కు)పై ప్రపంచవ్యాప్తంగా పొందిన ఆదాయంలో కేవలం 10 శాతం మీద మాత్రమే పన్ను విధించాలని కూడా ప్రతిపాదించారు. తిరిగిరాని మొండి బాకీలపైనా, అనుమానాస్పద బాకీలపైనా వచ్చిన ఆదాయంలో 5 శాతం పన్ను విధించడానికి బ్యాంకులు కానీ ఇతర ఆర్థిక సంస్థలు, కంపెనీలకు అవకాశం కల్పించారు. 2015 మార్చి నెలాఖరుకు ముగిసే ఆర్థిక సంవత్సరంలో 5 కోట్ల రూపాయలు కంటే తక్కువగా టర్నోవర్ ఉన్న చిన్న కంపెనీలకు – వచ్చే ఆర్థిక సంవత్సరం లో కార్పోరేట్ ఆదాయపన్నును 29 శాతానికి తగ్గించాలని ప్రతిపాదించారు. 2016 మార్చి ఒకటవ తేదీ తర్వాత స్థాపించిన కొత్త ఉత్పత్తి

కంపెనీలకు 25 శాతం పన్ను, సర్ చార్జ్, సెస్ కట్టేలా అవకాశం ఇవ్వాలని ప్రతిపాదించారు. అయితే వారు లాభాలతో కూడిన లేదా పెట్టుబడితో కూడిన ఇతర రాయితీలనూ, అలాగే పెట్టుబడి భత్యం, పెరిగిన తరుగుదల వంటి సౌకర్యాల ద్వారా కూడా ప్రయోజనం పొందకూడదు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన ద్వారానూ నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక వేత్తల మంత్రిత్వ శాఖ ద్వారా పొందే సేవలపై సేవాపన్ను (సర్వీస్ టాక్స్) మినహాయించాలని కూడా ప్రతిపాదించారు. సేవా రంగంలో ఉపాధి కల్పించే విషయంలో రిటైల్ రంగం అతిపెద్దది. ఈ రంగంలో చాలా ఎక్కువ సంఖ్య లో ఉద్యోగాలు కల్పించవచ్చునని ప్రభుత్వం భావిస్తోంది. అయితే నియమ నిబంధనలను సరళీకరించవలసి ఉంది. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్‌ను వారంలో ఏడూ రోజులూ తెరచి ఉంచుతున్నపుడు చిన్న, మధ్య తరహా దుకాణాలు కూడా ఆ పద్ధతి ఎందుకు పాటించకూడదు? అని ఆర్థికమంత్రి ప్రశ్నించారు. ఈ దుకాణాలు కూడా వారంలో ఏడు రోజులూ స్వచ్ఛందంగా తెరచి ఉంచే అవకాశం కల్పించాలి. అయితే తప్పనిసరి వారాంతపు సెలవు, రోజుకూ పనిచేసే పని గంటలు వంటి విషయంలో కార్మికుల హక్కులకు పూర్తి రక్షణ కల్పించాలి. రాష్ట్రాలు అమలు చేయడానికి వీలుగా ఒక ప్రతిపాదిత నమూనా "షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్ మెంట్స్" బిల్లును ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు పరిశీలన నిమిత్తం పంపాలి. భారతదేశ జనాభాలో 35 ఏళ్ల కంటే తక్కువ వయస్సు కలిగిన వారు దాదాపు 65 శాతం మందిఉన్నారు. వీరికి ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. అయితే అత్యధిక సంఖ్య లో ఉన్న నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం ఒక భారీ సవాలు. దీనికి తగినంత స్థలం, సమయం కావాలి.

ఉద్యోగుల భవిష్య నిధి పై వడ్డీ విధించాలన్న బడ్జెట్ ప్రతిపాదన – కోట్లాది మంది ఉద్యోగుల మనస్సుల్లో ఎన్నో అనుమానాలకు తావిచ్చింది. అయితే ప్రభుత్వం ఈ ప్రతిపాదనను ఇప్పుడు విరమించుకోనుంది. పరిశ్రమలకు వెన్నుముకగా ఉన్న కార్మికులకు – ఆరోగ్యవంతమైన వాతావరణం కల్పించడానికి, అభివృద్ధి చేయడానికీ ఇదొక మంచి చర్య. పదవీ విరమణ అనంతరం సురక్షితమైన జీవితం గడపడానికి వీలుగా పించను పథకాలలో పెట్టుబడి పెట్టడానికి P.F. ఖాతాదారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో పన్ను విధించాలనే ప్రతిపాదన తీసుకువచ్చినట్లు ఆర్థికమంత్రి వివరించారు. అయితే పలువురు పార్లమెంటు సభ్యులు, అనేక సంస్థలు – ఈ ప్రతిపాదన విరమించుకోవాలని విజ్ఞప్తి చేయడంతో ఆయన ఈ ప్రతిపాదనను ఉపసంహరించారు. అయితే జాతీయ పించను పథకంపై పన్ను విధింపు ప్రతిపాదన యథావిధిగా ఉంచినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి ఉద్యోగుల భవిష్య నిధి ఖాతా లో జమ చేసిన మొత్తం లో 60 శాతం నిల్వపై విత్ డ్రా చేసిన సమయంలో పన్ను విధించాలని మిగిలిన 40 శాతం మొత్తంపై పన్ను ఉండదని కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించారు. అయితే, ప్రజల నుండి వచ్చిన ఒత్తిడి కారణంగా ఉపసంహరించారు. వచ్చే ఐదు సంవత్సరాల్లో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, గ్రామీణ ఉపాధి మౌలిక సదుపాయాలూ, ఆరోగ్య పరిరక్షణ, విద్యా, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాలూ, పెట్టుబడి, ఆర్థిక రంగంలో సంస్కరణలు, సుపరిపాలన, వ్యాపారానికి అనువైన వాతావరణం, ఆర్థిక క్రమశిక్షణ, పన్ను సంస్కరణలు వంటి చర్యల ద్వారా భారత్ రూపురేఖలను మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ■

## గమనిక

**వ్యాసకర్తలకు సూచన:** యోజన మాస పత్రికకు వ్యాసాలు రాసేవారు తమ వ్యాసాల సాఫ్ట్‌కాపీని పేజిమేకర్ 6.5 లేదా 7 "అను" ఫాంట్ 7లో టైప్‌చేసి పంపుతూ, వ్రాత ప్రతిని కూడా తప్పనిసరిగా హామిపత్రంతో జత చేసి పంపాలి. హామి పత్రంలో ఇది తమ స్వంత రచన అనీ, దేనికీ అనువాదము అనుకరణ కాదని మాత్రమే కాక, ఈ వ్యాసాన్ని మరే పత్రికకు పంపలేదు / పుస్తకంగా ముద్రించలేదు అని కూడా పేర్కొనాలి. వ్యాసాలకు పేజిమేకర్ మరియు పిడిఎఫ్ ఫార్మెట్‌లోనూ అలాగే యూనికోడ్‌లో టైప్‌చేసి వర్డ్ ఫార్మెట్‌లోనూ అందజేయాలి. రచనలు 15వ తేదిలోపు హామీ పత్రంతో యోజన కార్యలాయనికి పంపాలి. ప్రచురణకు నోచుకోని వ్యాసాలు తిరిగి పంపబడవు. ఈ విషయంలో ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు. వ్యాసకర్తలు గమనించగలరు.

*సీనియర్ ఎడిటర్*

# కేంద్ర బడ్జెట్ 2016-17 : విద్యారంగానికి కేటాయింపులు




**2016-17కు బడ్జెట్ ప్రతిపాదనల్లో విద్యారంగానికి ప్రభుత్వ వ్యయాన్ని స్థూలదేశీయోత్పత్తి (జిడిపి)లో 0.48%గా సిఫార్సు చేసారు. మానవ వనరుల అభివృద్ధిశాఖకు ఈ ఏడాది బడ్జెట్‌లో రు.72,394 కోట్లు కేటాయించారు. దీనిలో 60% పాఠశాల విద్య, అక్షరాస్యతల విభాగానికి, 40% ఉన్నతవిద్యకు కేటాయించారు. అంటే దీన్ని విశ్లేషిస్తే, పోనుపోను ప్రాధాన్యతలు మారిపోయి ఉన్నత విద్య వైపు మొగ్గు ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నది.**

ఆర్థిక విధానాల పరంగా చూసినప్పుడు 2015-16 భారత ఆర్థికవ్యవస్థకు కీలకమైనదిగా భావించవచ్చు. రాష్ట్రాలకు కేంద్రపన్నుల వాటా పెంచడం, రాష్ట్రాలకిచ్చే ప్రణాళికా గ్రాంట్ల తగ్గింపు, ప్రణాళికా సంఘం రద్దువంటి వాటికి సంబంధించి 14వ ఆర్థిక సంఘం చేసిన సిఫార్సులవంటి వాటిలో కొన్నింటిని ఆమోదించడం మొత్తం ఆర్థిక వ్యవస్థనిర్మాణాన్నే ప్రభావితం చేసింది. విశిష్టమైన ఈ మార్పుల నేపథ్యంలో 2016-17వ సంవత్సరానికి ప్రతిపాదించిన కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగం పరిస్థితిని విశ్లేషించడం ముఖ్యం.

**1.విద్యారంగానికి కేటాయింపులు :**

కేంద్ర ఆర్థికమంత్రి శ్రీ అరుణ్ జైట్లీ లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ విశిష్ఠమైన 9 స్తంభాలపై ఉజ్వల భారత్ నిర్మాణం ఆధారపడి ఉందని తెలిపారు. మూడో స్తంభమైన సామాజికరంగంలో భాగంగా చేర్చవలసిన 'విద్య, నైపుణ్యం, ఉపాధి' అంశాన్ని వేరుచేసి నాలుగో స్తంభంగా పేర్కొన్నారు.


2016-17కు బడ్జెట్ ప్రతిపాదనల్లో విద్యారంగానికి ప్రభుత్వ వ్యయాన్ని స్థూలదేశీయోత్పత్తి (జిడిపి)లో 0.48%గా సిఫార్సు చేసారు. 2015-16లో ఇది 0.50%గా ఉంది. మొత్తం బడ్జెట్‌గా చూస్తే విద్యారంగంవాటా 3.8% నుండి 3.7%కి తగ్గింది (పట్టిక-1 చూడండి)




**ఆధారం కేంద్ర బడ్జెట్ 2016-17** **పట్టిక-1 విద్యారంగానికి కేంద్ర వ్యయం (శాతంలో)**

**ప్రోవిత కుందు,** సీనియర్ రిసెర్చి ఆఫీసర్, సి.బి.జి.ఎ., సెంటర్ ఫర్ బడ్జెట్ గవర్నెన్స్ ఆకౌంట్‌బిలిటి.

విద్యారంగానికి కేంద్రం చేసే కేటాయింపుల్లో దాదాపు 70% మానవ వనరుల శాఖ (MHRD) నుంచి లభిస్తుంది. ఈ శాఖకు 2016-17లో రు.72,394 కోట్లు కేటాయించారు. దీనిలో 60% పాఠశాల విద్య, అక్షరాస్యతల విభాగానికి, 40% ఉన్నతవిద్యకు కేటాయించారు. అంటే దీన్ని జాగ్రత్తగా విశ్లేషిస్తే, పోనుపోను ప్రాధాన్యతలు మారిపోయి ఉన్నత విద్య వైపు మొగ్గు ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నది.




**పట్టిక -2 కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ విభాగాలవారీ కేటాయింపుల శాతం**


## 2. పాఠశాల విద్య :

తదుపరి వెయ్యబోయే భారీ ముందడుగు-ప్రామాణిక విద్య. ఈ దిశగా ప్రాథమిక విద్యను సార్వత్రీకరించినట్లు ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగం సందర్భంగా చెప్పారు. అయితే ఆశ్చర్యకరంగా దీనిలో విద్యా హక్కు లేదా మాధ్యమిక విద్య ఊసేలేదు. బడికి వెళ్లే (1-4 తరగతులు) పిల్లలకు సంబంధించి ప్రపంచస్థాయి లక్ష్యాలను భారత్ సాధించినప్పటికీ వాస్తవాలు మరో రకంగా కనిపిస్తున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 6-14 మధ్య వయస్సున్న పిల్లలు 4.3కోట్లమంది ఉన్నారు. వీరెవరూ బడికిపోవడం లేదు. మొత్తం పిల్లల్లో వీరు 18%. బడిలో చేరే పిల్లల సంఖ్యేకాదు, గత కొన్నేళ్ళుగా పాఠశాల విద్యా ప్రమాణాలు కూడా ముఖ్యంగా ప్రభుత్వం చేస్తున్న ఖర్చుతోపోలిస్తే తారెత్తిస్తున్నాయి.

సమాచార హక్కు చట్టం, 2009 (RTE) ప్రకారమైతే పిల్లలందరికీ నిర్ణీత కాల వ్యవధిలో ఉచిత, నిర్బంధ, ప్రామాణిక విద్యను అందించాల్సి ఉంటుంది. అది అమల్లోకి వచ్చిన దాదాపు అర్థదశాబ్దం తరువాత కూడా చట్టప్రకారం మౌలిక సదుపాయాలున్న పాఠశాలలు కేవలం 8% మాత్రమే. ప్రభుత్వ పాఠశాలల్లో 9.4లక్షల మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. 8.3% ప్రాథమిక పాఠశాలు-ఏకోపాధ్యాయ పాఠశాలలే. ఇక ఉన్న ఉపాధ్యాయుల్లో కూడా 20%మంది సుశిక్షితులు కారు. అర్హులైన, సుశిక్షితులైన ఉపాధ్యాయుల నిష్పత్తి కూడా దాదాపు 5 ఏళ్లుగా ఎక్కడిదక్కడ నిలిచిపోయి ఉంది. ఈ చట్టాన్ని విజయవంతంగా అమలు చేయాలంటే ప్రాథమిక విద్యారంగంలోని పలు అంశాలకు తగినన్ని నిధులు కేటాయించాల్సి ఉంది. అయినా 2015-16 కంటే ఇప్పుడు పాఠశాల విద్యకు కేవలం నామమాత్రంగా 3.2%మాత్రమే పెంచారు.

## 3. విద్యా హక్కు చట్టం అమలకు ఆర్థిక చేయూత :

2009లో ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత దీని నిర్వహణలో సర్వశిక్షా అభియాన్ (SSA) ప్రధాన పాత్ర పోషిస్తున్నది. ఈ ఏడాది దీనికి రు.22,500 కోట్లు కేటాయించారు. 2015-16కంటే ఇది కేవలం 2.2% మాత్రమే ఎక్కువ. దీనిలో 65% నిధులను విద్యా పన్ను ద్వారా (ప్రారంభిక్ శిక్షా కోష్) (పట్టిక-3ను చూడండి) సేకరించి సమకూరుస్తారు. 29% బడ్జెట్ నుండి లభిస్తుంది. 6% బయటి ఎయిడెడ్ ప్రాజెక్టులనుండిసేకరిస్తారు. ఇటీవలి కాగ్ ఆడిట్ నివేదిక చూస్తే 2014-15లో రు.5256 కోట్లు తగ్గించినట్లు ఈ నివేదిక వెల్లడిస్తున్నది. కేంద్ర పథకాల(CSS) హేతుబద్ధీకరణ పై నీతి ఆయోగ్ ఉపసంఘం సిఫార్సులకు అనుగుణంగా సర్వశిక్షా అభియాన్‌కు కేంద్రం,రాష్ట్రాలకిచ్చే వాటాను 65నుండి 60%కి తగ్గించింది. అందువల్ల విద్యా హక్కు చట్టం అమలు సామర్థ్యం రాష్ట్రాలు పెంచే వాటి వాటాపై ఆధారపడి ఉంది. అయితే ఆ వాటా ఎంత స్థిరంగా ఉంటుందన్నది అనుమానం. ఫలితాలూ ఆందోళనకరమే.




**పట్టిక -3 సర్వశిక్షా అభియాన్‌కు సెస్సు నుంచి ఆర్థిక మద్దతు (శాతంలో)**

మాధ్యమిక స్థాయిలో విద్యా ప్రమాణాల అంశాన్ని మరింత శ్రద్ధగా చేపట్టాల్సి ఉంటుంది. ప్రాథమికస్థాయికి, ఉన్నతస్థాయికి మధ్య అనివార్య అనుబంధాన్ని సమకూర్చేది అదే. బడిలో చేరే పిల్లలకు సంబంధించి ప్రపంచ లక్ష్యాలను అందుకున్నప్పటికీ 15–18 ఏళ్ళ వయసున్న పిల్లలను చేర్చుకునే మాధ్యమిక స్థాయిలో (9–12 తరగతులు) 62% మాత్రమే ప్రవేశాలు నమోదవుతున్నాయి. మాధ్యమిక విద్య ప్రమాణాలను పెంచడానికి ప్రవేశపెట్టిన రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (RMSA)కు రు.3700కోట్ల కేటాయింపులు లభించాయి. అంటే 2015–16కంటే రు.135కోట్లు ఎక్కువ. ఈ అభియాన్‌నుకూడా జాతీయ విద్యా మిషన్ (NEM) పరిధిలోకి తెచ్చినా కేంద్రంవాటా 75నుండి 60%కి తగ్గింది. దీనివల్ల ఈ పథకానికి రాష్ట్రాలు తమ మ్యాచింగ్ గ్రాంట్ కింద ఇప్పుడు 25%కి బదులు 40% కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఒకవక్క పాఠశాల స్థాయిలో సుశిక్షితులైన,అర్హులైన ఉపాధ్యాయుల కొరత ఉన్నా, ఉపాధ్యాయ శిక్షణ, వయోజన విద్యలో కోత బాగానే విధించారు. మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా మదరసాల్లో విద్యను అందించే పథకాల్లో కూడా కోత విధించారు..

**4. ఉన్నత విద్యకు కేటాయింపులు :**

బడ్జెట్ ప్రసంగం సందర్భంగా దేశంలో ఉన్నత విద్యాసంస్థల అభివృద్ధి ఆవశ్యకతను మంత్రి నొక్కి చెప్పారు. దీనికి రు.28,440కోట్లు కేటాయించారు. 2015–16తో పోలిస్తే ఇది 13.5% ఎక్కువ. కొత్త ఐఐటిలు, కొత్త ఐఐఎంలకు తగినంతగా కేటాయింపులు పెంచడంతో మౌలికంగా సాంకేతిక విద్యకు నిధులు పెరిగినట్లయింది.

విద్యార్థులకిచ్చే ఆర్థిక సహాయంలో– విద్యారుణాలపై పేదపిల్లలకు ఇచ్చే సబ్సిడీ, కళాశాల,విశ్వ విద్యాలయ స్థాయిలో విద్యార్థులకిచ్చే ఉపకారవేతనాలు, హిందీయేతర రాష్ట్రాలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులకిచ్చే స్కాలర్‌షిప్‌లు 2015–16తో పోలిస్తే 2.7% పెరిగాయి.

రాష్ట్రీయ ఉచ్చతర శిక్షా అభియాన్ (RUSA) రాష్ట్ర ఉన్నత విద్యాసంస్థలకు వ్యూహాత్మక నిధుల సహాయం కింద 2013లో ప్రారంభించిన కార్యక్రమం ఇది. దీనిని కూడా జాతీయ విద్యా మిషన్ (NEM) పరిధిలోకి తెచ్చారు. ఈ మార్పుల ప్రక్రియలో భాగంగా కేంద్రం దాని వాటాగా (గతంలో 65:35గా ఉండేది) రు.1300కోట్లు కేటాయించింది. 2015–16తో పోలిస్తే (పట్టిక –4ను చూడండి) ఇది రు.245కోట్లు ఎక్కువ. అయితే ఉన్నత విద్యకు సమకూర్చే నిధుల్లో పన్నులద్వారా సమకూరిన నిధులనుంచి ఇచ్చే వాటా ఎంత అనేది తేలలేదు. మాధ్యమిక, ఉన్నత విద్యా పన్ను కింద లభించే నిధులను ఎక్కడా డిపాజిట్ చేయడంలేదు. దీనికి ప్రత్యేక ఖాతాకూడా ఏదీ లేదు. లేదా ఈ నిధులతో ఫలానా కార్యక్రమాలు చేపట్టాలని కూడా ఎక్కడా నిర్దేశించలేదు. ఈ విషయంలో పారదర్శకత లేకపోవడంతో వీటిని మరే ఇతర ఖర్చులకైనా మళ్ళించే అవకాశముంది.

**5. విద్యకంటే నైపుణ్యాలకే ఎక్కువ ప్రాధాన్యత :**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ "మనం మన దేశాన్ని అభివృద్ధి చేయాలంటే మనముందున్న తక్షణ కర్తవ్యం –నైపుణ్యాల అభివృద్ధి, నైపుణ్యాల భారత్ " అని చెప్పారు. ఈ దిశగా ప్రభుత్వం నాలుగు కార్యక్రమాలను ప్రారంభించింది. జాతీయ నైపుణ్య అభివృద్ధి మిషన్, జాతీయ నైపుణ్య అభివృద్ధి– వ్యవస్థాపకత విధానం, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన(PMKVY), నైపుణ్యాల రుణపథకం. బడ్జెట్ ప్రసంగంలో కూడా వీటినే ప్రముఖంగా ప్రస్తావించారు. PMKVY కింద 1500 బహుళ నైపుణ్యాల శిక్షణా సంస్థల ఏర్పాటుకు రు.1700కోట్లు కేటాయించారు.

వాస్తవానికి మన దేశంలో పెరుగుతున్న శ్రామికుల సంఖ్యను చూస్తే నైపుణ్యాల అభివృద్ధి తక్షణావసరం. అయితే ఈ నైపుణ్యాలు అలవర్చుకోవాలంటే ప్రాథమిక స్థాయి విద్యలో పునాదులు బాగా పడాలి. ప్రాథమిక విద్య సార్వత్రీకరణ లక్ష్యాల సాధనే అనుమానాస్పదంగా కనబడుతున్నప్పుడు చదివిన తరగతుల్లో విద్యా ప్రమాణాలు సంతృప్తికరంగా కనబడనప్పుడు 5–29 ఏళ్ళ మధ్య వయస్కుల్లో దాదాపు 40%కిపైగా ఏ శిక్షణా సంస్థకు వెళ్ళడం లేదని ఎన్ఎస్ఎస్–2015 నివేదిక తెలియచేస్తున్నప్పుడు ఉపాధి అవకాశాలు సృష్టించడంకోసం నైపుణ్యాల అభివృద్ధి మీద దృష్టి పెడితే అరాకొరా నైపుణ్యాలతో తక్కువ జీతాలతో పనిచేసే సిబ్బంది మాత్రం ఇబ్బడిముబ్బడిగా దొరుకుతుంటారు. కానీ ఇది కాదు కదా మనం కోరుకుంటున్నది.

**ముగింపు :**

1966లోనే కొఠారీ కమిషన్ సిఫార్సు చేసినట్లు స్థూల దేశీయోత్పత్తిలో 6% విద్యారంగానికి ఖర్చుచేయాలన్న డిమాండ్ తరచూ వినిపిస్తూ ఉంటుంది. నిజానికి ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 4%కన్నా తక్కువే దీనికి ఖర్చు పెడుతున్నాయి. దేశం మొత్తం మీద విద్యారంగానికి చేస్తున్న కేటాయింపులు పరిశీలిస్తే రాష్ట్రాలకంటే కేంద్రం వాటా తక్కువగా ఉంటున్నది. క్రమేణా రాష్ట్రాలమీద భారం మోపుతూ కేంద్రం తన వాటా తగ్గించుకుంటూ పోతున్నది. ఇప్పుడు మారిన ఆర్థిక వ్యవస్థ నిర్మాణ ప్రభావం రాష్ట్రాల స్థాయిలోని విద్యారంగం మీద పడుతుంది. ఇప్పుడు చూడాలి రాష్ట్ర

ప్రభుత్వాలు దీనికి వాటి బడ్జెట్‌లలో ఎంత ప్రాధాన్యత నిస్తాయో ! వాస్తవానికి 'విద్య' అన్న అంశం ఉమ్మడి జాబితాలోనిది. అంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఉమ్మడి బాధ్యత ఉంటుంది. అందువల్ల విద్యారంగంపై ప్రభుత్వ నిధులను కేంద్రం, రాష్ట్రాలు రెండూ ప్రామాణిక విద్యపై శ్రద్ధపెట్టి పెంచుకుంటూ పోవాలి.

### కేంద్ర బడ్జెట్ 2016-17:

విద్యారంగానికి చేసిన ప్రధాన ప్రతిపాదనలు

* ప్రామాణిక విద్యను అభివృద్ధిపరచడానికి 62 కొత్త నవోదయ విద్యాలయాల ఏర్పాటు.
* రు.1000కోట్ల ప్రారంభ మూలధనంతో ఉన్నత విద్య ఆర్థిక సహాయ సంస్థ ఏర్పాటు. దీనికి మార్కెట్‌నుంచి నిధులు సేకరించడంతో పాటూ కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) కింద విరాళాలు స్వీకరిస్తారు.
* ఆన్‌లైన్ బోధన ద్వారా - 2200 కళాశాలల్లో, 300 పాఠశాలల్లో, 500 ప్రభుత్వ ఐటిఐలలో, 50వృత్తి శిక్షణా కేంద్రాల్లో కొత్త సంస్థల, వ్యాపారాల ఏర్పాటు పై తరగతుల నిర్వహణ, శిక్షణ ఉంటుంది.
* ప్రపంచ స్థాయి బోధన, పరిశోధనా సంస్థల ఏర్పాటుకు వీలుగా పది ప్రభుత్వ, పది సర్టిఫికేట్ శిక్షణా సంస్థలకు నియంత్రణతో కూడిన తోడ్పాటును అందిస్తారు.

నీతి ఆయోగ్ ఉపసంఘం సిఫార్సులకు అనుగుణంగా కేంద్ర ప్రాయోజిత పథకాల హేతుబద్ధీకరణ

* దీని కింద 1500 కేంద్ర ప్రణాళికా పథకాలలో 300 పథకాలు కేంద్రం పరిధిలో, 30 కేంద్ర ప్రాయోజిత పథకాలుగా పునర్ వ్యవస్థీకరిస్తారు. వీటిలో షెడ్యూల్డు కులాలు, తరగతులు, ఇతర వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, దివ్యాంగులకు సంబంధించిన విద్యా సంబంధ పథకాలన్నింటి విషయంలో వాటాల పద్ధతిలో ఎటువంటి మార్పులు చేయకుండా దీనిని అత్యంత ప్రాముఖ్యమైనదిగా గుర్తించి అమలు చేస్తారు.
* SSA, RMSA ఉపాధ్యాయ శిక్షణ, వయోజన విద్యతో సహా విద్యాభివృద్ధి పథకం RUSAలను జాతీయ విద్యా మిషన్‌గా ఒకే గొడుగు కిందికి చేర్చారు. ఇక మీదట దీనిలో కేంద్ర రాష్ట్రాలవాటా 60:40 నిష్పత్తిలో ఉంటుంది.

| అంశాలు | 2015-16(BE) | 2015-16(RE) | 2016-17(BE) |
|---|---|---|---|
| విశ్వవిద్యాలయాల గ్రాంట్ల సంఘం | 9615 | 9315 | 4491 |
| కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు గ్రాంట్లు | | | 6356 |
| విద్యార్థులకు ఆర్థిక సహాకారం | 2373 | 2163 | 2221 |
| ఐఐటిలు, ఐఐయంలకు | 4949 | 4463 | 5714 |
| NEM-RUSA | 1155 | 1055 | 1300 |

**పట్టిక - 4 ఉన్నత విద్యా రంగంలో పలు అంశాలకు బడ్జెట్ కేటాయింపులు (రూ. కోట్లలో)**


**యోజన చందా రేట్లు పెరిగాయి**

**యోజన** మాసపత్రిక చందా వివరాలు : సంవత్సర చందా రూ. 230/- , రెండు సంవత్సరాలకు రూ. 430/-, మూడు సంవత్సరాలకు రూ. 610/- ఈ నూతన రేట్లు ఏప్రిల్ 1వ తేది నుండి అమలులోకి వచ్చాయి. పాఠకులు గమనించగలరు

- సీనియర్ ఎడిటర్

**వివరాలకు: ఎడిటర్, యోజన (తెలుగు)**

**205, 2వ అంతస్తు, సి.జి.ఓ టవర్స్, కవాడిగూడ,**

**హైదరాబాద్ - 500 080. ఫోన్: 040-27546312, 13, 14**

E-mail: yojana_telugu@yahoo.co.in

# జెండర్ బడ్జెట్ - నిబంధనలు



**ప్రణాళిక, బడ్జెట్ మరియు ఆడిటింగ్ విధానాలన్నీ కూడా లైంగిక సమానత్వానికి దోహదం చేసేలా ఉండేందుకు సమిష్టి కృషి అవసరమని బడ్జెట్ 2016-17 నొక్కి వక్కాణించింది. భారతదేశం 2005లో లింగ బాధ్యతాయుత బడ్జెట్ (జెండర్ రెస్పాన్సివ్ బడ్జెట్ - జి.ఆర్.బి)ను స్వీకరించింది. ఇప్పటివరకు దేశంలోని 57 ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు / విభాగాలు జెండర్ బడ్జెటింగ్ సెల్‌ను ఏర్పాటు చేశాయి.**

"మహిళలు బలహీనులు, అబలలని అనడం పరువుతక్కువ; అది పురుషులు మహిళలకు చేసిన అన్యాయం. పశుబలమే నిజమైన బలం అనంటే, నిజమే, స్త్రీలు మగవారి కన్నా తక్కువ కిరాతకులు. నైతిక శక్తే బలం అనంటే, అప్పుడు స్త్రీలు ఖచ్చితంగా పురుషులకన్నా అపరిమితంగా అధికులే! ఆడవారికి అంతర్ జ్ఞానం లేదా? వారు మరింత ఆత్మ త్యాగం చేయడం లేదా? భూమికున్నంత ఓర్పు వారికి లేదా? స్త్రీలకు ఎక్కువ ధైర్యం లేదా? మహిళలు లేనిదే పురుషులు లేరు. మన ఉనికికి అహింస చట్టం అయితే, భవిష్యత్తు మహిళలతోనే ఉంది" **– మహాత్మా గాంధీ**

చిన్న, మధ్యతరహా వ్యాపారవేత్తలతో సహా, రైతులు, పేదలు, మహిళలు, మధ్యతరగతికి చెందిన కొన్ని ముఖ్యమైన వర్గాలను విస్తృత ప్రాతిపదికన చేర్చుకోవడానికి రూపొందించిన ప్రధాన మంత్రి కార్యక్రమంతో పాటు 2016-17 కేంద్ర బడ్జెట్ కొనసాగుతుంది. తొమ్మిది మూలస్తంభాల ఇతివృత్తంతో, ఆర్థికాభివృద్ధి పెంపుదలతో పాటుగా భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి లక్ష్యంగా పనిచేస్తుంది. మౌళిక పెట్టుబడులపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించి, సామాజిక, గ్రామీణ రంగాలలో పెట్టుబడులు, ఆరోగ్య బీమా, రైతులకు ఆదాయ పథకాలతో పాటు విద్య, నైపుణ్యాల పెంపుదల వంటి ఆర్థిక వ్యవస్థలోని అన్ని విభాగాలకు ఆర్థిక మంత్రి సమాన ప్రాధాన్యత నిచ్చారు. ప్రస్తుతం ఎంతో అవసరమైన ఆర్థిక సంస్కరణలు, వ్యాపారం చేయడం సులభతరం అయ్యేందుకు విధాన మార్పులు చేయడం, ఆర్థిక క్రమశిక్షణ మరియు పన్ను సంస్కరణలు వంటి ఆర్థిక మరియు నియంత్రణ చర్యలపై కూడా ఆయన దృష్టి పెట్టారు. ప్రణాళిక, బడ్జెట్ మరియు ఆడిటింగ్ విధానాలన్నీ కూడా లైంగిక సమానత్వానికి దోహదం చేసేలా ఉండేందుకు సమిష్టి కృషి అవసరమని బడ్జెట్ 2016-17 నొక్కి వక్కాణించింది.

లింగ అసమానత భారతదేశంలో ఒక ముఖ్యమైన అభివృద్ధి సవాలు విసిరింది. గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్ - 2014 ప్రకారం మొత్తం 142 దేశాలలో భారతదేశం 114వ స్థానంలో ఉంది. ఆర్థిక సంబంధిత విషయాలలో జోక్యం చేసుకోవడం మరియు అవకాశాలు; విద్య; రాజకీయ సాధికారత; ఆరోగ్యం మరియు మనుగడ - ఈ నాలుగు విషయాలలో లైంగిక అసమానతలను తగ్గించేందుకు ఆయా దేశాల సమర్ధత ఆధారంగా ర్యాంకులు ఇవ్వడం జరుగుతుంది.

**డా. షాహిన్ రజీ,** అర్థశాస్త్రవేత్త, విద్యావేత్త, ఎమిరిషస్ ఫెలో - యు.జి.సి; చరవాణి-09934359322;
E-mail: shahin.razi@gmail.com

ప్రైవేటు, బహిరంగ ప్రదేశాలలో మహిళలు, అమ్మాయిలపై హింసాకాండ కొనసాగుతూనే ఉంది.

ఈ సవాళ్లకు సమాధానంగా, భారతదేశం 2005లో లింగ బాధ్యతాయుత బడ్జెట్ (జెండర్ రెస్పాన్సివ్ బడ్జెట్ - జి.ఆర్.బి)ను స్వీకరించింది. అర్థమయ్యేలా చెప్పాలంటే, లైంగిక సమానత్వం మరియు మహిళా హక్కులను ముందుకు తీసుకెళ్లడానికి తోడ్పడేలా ప్రణాళిక, కార్యక్రమాలు మరియు బడ్జెట్‌లను రచించే ఒక విధానమే ఈ జి.ఆర్.బి. ఈ ఆశయాల సాధనకు కట్టుబడి ఉన్న దేశం నిబద్ధతకు ఒక సూచికలా కూడా పనిచేస్తుంది. ఇప్పటివరకు దేశంలోని 57 ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు / విభాగాలు జెండర్ బడ్జెటింగ్ సెల్‌ను ఏర్పాటు చేశాయి. కోట్లాది మంది మహిళల జీవితాలను ప్రభావితం చేయగలిగిన ఒక ముఖ్యమైన ప్రయత్నం ఇది. అభివృద్ధి ఫలాలు స్త్రీ పురుషులకు సమానంగా లభిస్తున్నాయని నిర్ధారించేందుకు వీలుగా లింగ ప్రధాన స్రవంతి సాధనకు జెండర్ బడ్జెటింగ్ ఒక శక్తివంతమైన పనిముట్టు. వనరుల కేటాయింపుల క్రమాన్ని బట్టి జాతీయ బడ్జెట్ స్త్రీ పురుషులపై భిన్న ప్రభావాన్ని చూపుతుందన్న వాస్తవం తెలిసిన తర్వాత జెండర్ బడ్జెటింగ్‌లో హేతువాదం వచ్చింది. భారతదేశ జనాభాలో 48 శాతం మహిళలే ఉన్నాయి. అయినప్పటికీ, ఆరోగ్యం, విద్య, ఆర్థికావకాశాలు వంటి ఎన్నో సామాజిక అంశాలలో మహిళలు పురుషుల కన్నా ఎంతో వెనకబడి ఉన్నారు. అందువలన, వారి దుర్బలత్వం మరియు వనరులు అందుబాటులో లేకపోవడం వల్ల మహిళల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుంది. ప్రభుత్వ బడ్జెట్‌లో వనరులను కేటాయించే విధానానికి లైంగిక అసమానతలను రూపుమాపే శక్తి ఉంది. ఈ జెండర్ బడ్జెటింగ్ లింగ ప్రధాన స్రవంతి సాధనకు ముఖ్యమైన సాధనంగా తెలుస్తోంది.

'భారతదేశంలో మార్పుకు' ఆర్థిక మంత్రి రూపొందించిన బడ్జెట్ ఎజెండా అమలుకు లింగ అసమానతను రూపుమాపడం ఎంతో అవసరం. బడ్జెట్ 2016-17 పట్ల లింగ ప్రతిస్పందనను అంచనా వేయడానికి మహిళా మంత్రిత్వ శాఖలకు కేటాయింపులు, జెండర్ బడ్జెట్ ప్రకటన (జి.బి.ఎస్) వంటి సూచనలు సహాయపడతాయి. మహిళాసాధికారత జాతీయ మిషన్ కేటాయింపులను రూ. 50 కోట్లుగా రెట్టింపు చేసారు. అలాగే, మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, మహిళా జాతీయ కమీషన్‌ల కేటాయింపులను కూడా అధికం చేశారు. వివిధ మంత్రిత్వ శాఖలు లింగ సంబంధిత అంశాలకు ఎటువంటి ప్రాధాన్యత నిచ్చాయో జి.బి.ఎస్ స్పష్టం చేస్తుంది. మహిళలు ఎదుర్కొంటున్న హింస వంటి ఎన్నో విపత్కర సమస్యలను బడ్జెట్ ప్రాధాన్యతలలో చేర్చాల్సిన అవసరముంది. యుక్తవయస్సులోని అమ్మాయిల అక్రమ రవాణాను నిరోధించడానికి, వారికి సాధికారత కల్పించడానికి ఉద్దేశించిన పథకాలకు కేటాయింపులు పెరిగాయి. శ్రామిక మార్కెట్‌లో మహిళల పాత్ర తగ్గిపోవడం మరొక ఆందోళనకరమైన విషయం. సామాజిక రంగ ఖర్చుల్లో కోతలు మహిళలను విపరీతంగా ప్రభావితం చేసి వారి సంరక్షణ భారాన్ని పెంచుతుంది. సమీకృత శిశు అభివృద్ధి సేవలు మరియు ఇందిరా గాంధీ మాతృత్వ సహయోగ్ యోజన (ఐ.జి.ఎం.ఎస్.వై) పథకాల కేటాయింపులకు కూడా ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. జాతీయ ఆహార భద్రతా చట్టం, 2013కు చెందిన కనీస ప్రసూతి హక్కుల సదుపాయాలకు అనుగుణంగా 2013లో, ఐ.జి.ఎం.ఎస్.వై కింద ఇచ్చే నగదు ప్రోత్సాహకాలను రూ. 4,000 నుండి రూ. 6,000కు పెంచడం జరిగింది. ప్రసూతి హక్కులు సర్వత్రా ఉండాల్సిన అవసరం దృష్ట్యా, ప్రస్తుత నిధుల కేటాయింపులు (రూ. 400 కోట్లు) ఇవ్వడం జరిగింది. ప్రస్తుత ప్రతిపాదనను 200 పైలట్ జిల్లాలలో అమలు చేయాల్సి ఉంది.

55 శాతం మహిళా కార్మికులతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎ) మహిళల పాలిట ఉపాధి కల్పించే ఒక ముఖ్యమైన వరప్రసాదినిగా మారింది. ఈ చట్టం బడ్జెట్ రూ. 38,500 కోట్లకు పెరిగింది. గత ఏడాది త్రైమాసికంలో అనేక రాష్ట్రాలలో ఈ గ్రామీణ ఉపాధి పథకం, ఎం.జి.ఎన్. ఆర్.ఇ.జి.ఎ మూసివేత దిశగా ఉన్నదని అనుకున్నారు. అయితే అ పథకానికి 2016-17 బడ్జెట్ కేటాయింపులు 11 శాతం పెరిగాయి. "2016-17లో ఎం.జి.ఎన్. ఆర్.ఇ.జి.ఎకు రూ. 38,500 కోట్లు కేటాయించారు. ఒకవేళ ఈ నిధులు మొత్తం ఖర్చు చేసినట్లయితే, ఇప్పటివరకూ ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎ కోసం ఖర్చు చేసిన అతి పెద్ద బడ్జెట్ ఇదే అవుతుంద,"ని ఆర్థిక మంత్రి అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి (ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎ) 2015-16లో కేటాయించిన రూ. 34,600 కోట్లు కన్నా ప్రస్తుతం రూ. 3,900 కోట్లు ఎక్కువ కేటాయించడం జరిగింది. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరం 2014-15లో, ప్రస్తుత ప్రభుత్వం రూ. 34,000 కోట్లు కేటాయించింది. నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళా సభ్యుల పేరు మీద ఎల్.పి.జి వంట గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ప్రకటించడం మహిళల పట్ల బడ్జెట్ అనుకూల దృక్పథాన్ని స్పష్టం చేస్తుంది. ఈ ఎల్.పి.జి కనెక్షన్లు ఇవ్వడానికి అయ్యే ప్రారంభ ఖర్చు నిమిత్తం 2016-17 బడ్జెట్‌లో, రూ. 2,000 కోట్లు కేటాయించడం జరిగింది. ఈ తొలి ప్రయత్నంతో రెండు క్లిష్టమైన సమస్యలను సాధించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. మొదటిది, మహిళలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ప్రతి దినం వంట చేసేందుకు కట్టెలు, పేడ

లేదా వ్యవసాయ నిలువలు వంటి సాంప్రదాయ బయోమాస్ ఇంధన వనరులను ఉపయోగించే మహిళల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడం. ఇక రెండవది, ప్రస్తుతం తీవ్ర స్థాయిలో ఉన్న గృహవాయు కాలుష్యాన్ని తగ్గించడం. ఈ చర్య మహిళలకు సాధికారత నివ్వడంతో పాటు వారి ఆరోగ్యాన్ని కూడా సంరక్షిస్తుంది. దీని వల్ల చాకిరీ తగ్గడంతో పాటు వంటకు కేటాయించే సమయం కూడా తగ్గుతుంది. పైగా దీని వలన వంట గ్యాస్ సరఫరా కార్యక్రమంలో గ్రామీణ యువతకు ఉపాధి లభిస్తుంది. భారతదేశంలో గృహవాయు కాలుష్యం వల్ల ప్రతి సంవత్సరం దాదాపు అయిదు లక్షల మంది మరణిస్తున్నారని ప్రభుత్వం మరియు వకాలతు వర్గాలు చేసిన వలు అధ్యయనాలు వెల్లడించాయి. భూగోళశాస్త్రం మరియు వాతావరణ మార్పు విభాగం, తెరి, లో పరిశోధకుడు డా. అరిందమ్ దత్తా ఇలా అన్నారు. "దారిద్ర్య రేఖకు దిగువన (బి.పి.ఎల్) ఉన్న గ్రామీణ కుటుంబాలకు ఎల్.పి.జి సబ్సిడీ సులువుగా లభించేలా చేయాలని నొక్కి చెప్పడం ద్వారా కేంద్ర బడ్జెట్ 2016-17 గ్రామీణ గృహాలలో గృహవాయు కాలుష్యమనే ముఖ్యమైన సమస్యను ఎదుర్కొంటోంది"

ఈ కార్యక్రమం 2016-17లో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న దాదాపు 1.5 కోట్ల గృహాలకు లబ్ది చేకూరుస్తుందని ప్రభుత్వ అంచనా. అయిదు కోట్ల బి.పి.ఎల్ కుటుంబాలకు లబ్ది చేకూర్చేందుకు ఈ పథకం కనీసం మరో రెండు సంవత్సరాలు కొనసాగుతుంది. సాధారణంగా గ్యాస్ సిలెండర్లు ఎగువ మధ్య తరగతివారికి మాత్రమే చెందిన ఒక విలాసవస్తువని భావించే దేశంలో వంట గ్యాస్ సర్వత్రా వినియోగంలోకి వచ్చేలా చేస్తుంది. ఈ విలాస వస్తువు నిదానంగా మధ్యతరగతి ప్రజలకు పాకుతోంది. అయితే పేదవారికి ఇంకా వంట గ్యాస్ అందుబాటులోకి రాలేదని ఆర్థిక మంత్రి అన్నారు. అయితే, ఇప్పుడు ప్రభుత్వ సబ్సిడీపై వంట గ్యాస్ కనెక్షన్‌ను బి.పి.ఎల్ కుటుంబాలకు ఇస్తున్నారు. 2016-17లో బి.పి.ఎల్ కుటుంబాలకు చెందిన 1.5 కోట్ల మహిళలకు శుభ్రమైన ఇంధన కనెక్షన్లు ఇవ్వడం కోసం ప్రవేశపెట్టిన రూ. 2,000 కోట్ల **'ఉజ్వల' పథకం** మహిళలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో నివసించేవారి ఆరోగ్యాన్ని, మరియు పర్యావరణాన్ని మెరుగుపరుస్తుంది. పేదవారికి సబ్సిడీ ఎల్.పి.జి కనెక్షన్లు ఇవ్వడం కోసం బడ్జెట్ మొదటిసారి నిధులు కేటాయించింది. ప్రభుత్వం ఒక్కో కనెక్షన్‌కు సబ్సిడీ కింద రూ. 1,600 అందచేస్తుంది. అది కూడా బి.పి.ఎల్ కుటుంబానికి చెందిన మహిళ పేరు మీద ఇస్తారు.

ఇప్పటివరకు ఇదంతా ప్రభుత్వ ఇంధన విక్రయదారులకు చెందిన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి.ఎస్.ఆర్) నిధులతో జరిగింది. 2018-19 నాటికి కనీసం అయిదు కోట్ల బి.పి.ఎల్ కుటుంబాలకు లబ్ది చేకూరేందుకు ఈ పథకం కనీసం మరో మూడు సంవత్సరాలు కొనసాగుతుంది. బి.పి.ఎల్ కుటుంబాలకు కొత్త కనెక్షన్లు ఇచ్చేటప్పుడు, ఈ పథకం పరిధిలోకి రాని రాష్ట్రాలు, ముఖ్యంగా తూర్పు ప్రాంతంలోని వాటికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. పి.ఎ.హెచ్.ఎ.ఎల్ - వంట గ్యాస్ కోసం నేరుగా సబ్సిడీ బదిలీ పథకం - ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఈ ఏకైక పథకం ద్వారా ప్రభుత్వం గిన్నీస్ రికార్డులోకి ఎక్కింది. భారతదేశంలో అపరిశుభ్రమైన వంట ఇంధన వనరుల కారణంగా దాదాపు అయిదు లక్షల మహిళలు ప్రాణాలు కోల్పోతున్నారన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల నేపథ్యంలో, ప్రస్తుతం 60 శాతం ఉన్న ఎల్.పి.జి వినియోగాన్ని మరింత పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది.

వ్యవస్థాపకత ద్వారా షెడ్యూల్డ్ కులాలు (ఎస్.సి) మరియు షెడ్యూల్డ్ తెగల (ఎస్.టి)ను బలోపేతం చేయడానికై బడ్జెట్ 2016-17 'స్టాండప్ ఇండియా' పథకం కింద రూ. 500 కోట్లు కేటాయించింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖలో జాతీయ షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగల హబ్ ఏర్పాటుకు ప్రతిపాదించడం జరిగింది. ''వ్యాపార సంస్థలను ప్రారంభించడం మరియు వాటిని విజయవంతంగా నడపడంలో ఎస్.సి, ఎస్.టి పారిశ్రామికవేత్తలు గొప్ప సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నార"ని ఆర్థిక మంత్రి అన్నారు. కనీసం 2.5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలకు ఇది లబ్ది చేకూరుస్తుంది. ఒక్కో బ్యాంక్ శాఖ కనీసం రెండు ప్రాజెక్టులైనా అందిస్తుంది. పారిశ్రామిక సంఘాల భాగస్వామ్యంతో ఏర్పాటు చేయబడే ఈ ప్రతిపాదిత హబ్, కేంద్ర ప్రభుత్వ సేకరణ విధానం, 2012కి చెందిన బాధ్యతలను పూర్తి చేయడంలో ఎస్.సి / ఎస్.టి పారిశ్రామికవేత్తలకు వృత్తిపరమైన తోడ్పాటు నందిస్తుంది.

మనం డా. బి.ఆర్. అంబేద్కర్ 125వ జయంతిని జరుపుకుంటున్నాం. కాబట్టి, ఈ సంవత్సరంలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు మరియు మహిళా పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సాధికారత లభించేలా కృషి చేయాలి. చివరగా, సకాలంలో అన్నీ సరిదిద్దే పర్యవేక్షకుడిలాగా ఈ బడ్జెట్ ఉపకరిస్తుంది. కీలక సంస్థల బలోపేతం, లింగ సంబంధిత సమస్యలను పరిష్కరించే పథకాలకు తగినన్ని పెట్టుబడులు మరియు ఆయా పథకాల సమర్థవంతమైన అమలు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది.

ఆర్థిక మాంద్యంతో కొట్టుమిట్టాడుతున్న ప్రపంచంలో భారతదేశం ఒక ప్రకాశవంతమైన వెలుగుచుక్క మాదిరిగా ఉండేలా చేయాలన్నది బడ్జెట్ 2016-17 లక్ష్యం. అభివృద్ధి సాధనకు మహిళా సాధికారత మరియు లింగ సమానత్వాన్ని సాధించడం కన్నా ఎక్కువ ప్రభావితమైన పరికరాలు ఏవీ లేవు. ■

జనశక్తికి పుష్టి

# ఆరోగ్య బడ్జెట్-2016



**భారత్‌తో సమానంగా తలసరి ఆదాయంగల ఇతర వర్ధమాన దేశాలతో పోలిస్తే మన దేశంలో ఆరోగ్య రంగంపై మొత్తం వ్యయం జీడీపీలో సుమారు 5 శాతం కాగా, ప్రభుత్వ వ్యయం మాత్రం 1.3 శాతం స్థాయిని దాటలేదు. దేశంలోని కుటుంబాలు తమ సొంత వనరులు, ఆదాయం, పొదుపుల నుంచి 70-80 శాతం మేర భారీగా ఆరోగ్యం కోసం వెచ్చించాల్సి వస్తున్నదని అర్థం. ఒక్కసారి ఆస్పత్రిపాలైతే గ్రామీణ ప్రాంతాల్లో వైద్య, వైద్యేతర సగటు వ్యయం రూ.16,956 కాగా, పట్టణ ప్రాంతాల్లో రూ.26,455గా ఉంది.**

"భారతదేశ ప్రజానీకానికి విద్య, ఆహారం, సంరక్షణ సంపూర్ణస్థాయిలో అందనిదే రాజకీయంగా ఎంతచేసినా నిష్ప్రయోజనమే" అన్న స్వామి వివేకానందుని బోధనను ఆర్థిక మంత్రి ఇటీవల ఉటంకించారు. అభివృద్ధికి విద్య, ఆరోగ్యాలే మూలమన్న ఈ వాస్తవం ఆయన ప్రవేశపెట్టిన 2016-17 బడ్జెట్‌లో ప్రతిఫలించింది. అయితే, ఈ వాస్తవానికి భిన్నంగా గడచిన దశాబ్ద కాలంలో దేశీయ స్థూలోత్పత్తి (GDP)లో ఈ రంగాల వాటా కింద ప్రభుత్వ వ్యయం 1.3 శాతంగానే కొనసాగింది. కేంద్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి కేటాయింపులు జీడీపీలో 0.25 శాతంగా ఉండటంతో అదే పరిస్థితి దాదాపు స్థిరంగా ఉన్నట్లయింది. ఆరోగ్య రంగంపై జీడీపీలో ప్రభుత్వ వ్యయం 2.5 శాతంగా ఉండాలని 2015లో రూపొందించిన జాతీయ ఆరోగ్య విధానం కింద నిర్దేశించుకున్న లక్ష్యం ఇంకా సుదూరంగానే కనిపిస్తోంది. ఇక పొరుగు దేశాలైన చైనా, శ్రీలంకలలో ప్రజారోగ్య రంగానికి కేటాయింపుల విషయంలో భారత్ బాగా వెనుకబడి ఉంది. చైనాలో 2013లో ఆరోగ్యరంగంపై వ్యయం జీడీపీలో 5.4 శాతం కాగా, అందులో ప్రభుత్వం ఖర్చు చేసింది 3.1శాతం. భారత్‌తో సమానంగా తలసరి ఆదాయంగల ఇతర వర్ధమాన దేశాలతో పోలిస్తే మన దేశంలో ఆరోగ్య రంగంపై మొత్తం వ్యయం జీడీపీలో సుమారు 5 శాతం కాగా, ప్రభుత్వ వ్యయం మాత్రం 1.3 శాతం స్థాయిని దాటలేదు. ఆరోగ్య రంగం గురించి బడ్జెట్ దృక్పథమేమిటో అంచనా వేయాలంటే ప్రధానంగా మూడు విస్తృత ప్రశ్నలను మనకు మనం సంధించుకోవాల్సి ఉంది. మొదటిది... ఆరోగ్య రంగంలో అధ్వాన ఫలితాలకు కారణమవుతున్న అంశాలను ఎలా ఎదుర్కోవాలన్నదానిపై బడ్జెట్ ఎంచుకున్న విధానమేమిటి? రెండోది... అందుబాటులోని ఆరోగ్య సంరక్షణను మెరుగుపరిచేందుకు చేపట్టిన చర్యలేమిటి? మూడోది... పరిశోధనతోపాటు వైద్యులు తదితర వృత్తి నిపుణులు, రోగవాహకాల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణ సౌకర్యాల అందుబాటు తదితరాలతో కూడిన ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాల స్థితిగతులు ఎలా ఉన్నాయి? ఇవన్నీ వేటికవిగా కాకుండా ప్రజారోగ్యం, శ్రేయో జీవనంపై సామూహికంగా ప్రభావం చూపే అంశాలే.

**ఉర్మి ఎ.గోస్వామి,** అసిస్టెంట్ ఎడిటర్, ది ఎకనమిక్ టైమ్స్

పేదరికాన్ని తగ్గించే కృషిలో ఆరోగ్యాన్ని మెరుగుపరచటం, ఆరోగ్య సంరక్షణ కల్పన అత్యంత కీలకం. పేదరికపు కోరల నుంచి కుటుంబాలు బయటపడాలంటే ప్రజారోగ్యంపై వ్యయమే ఏకైక ప్రాముఖ్యాంశం. ఇది సవ్యంగా లేకపోతే పేదలను మరింత పేదరికంలోకి నెట్టడమే అవుతుంది. తగువిధంగా ఆరోగ్య సంరక్షణ అందకపోయినా, అరకొరగా మాత్రమే అందుబాటులో ఉన్నా అంతంతమాత్రపు ప్రజారోగ్యం మరింత క్షీణిస్తుంది. ఫలితంగా ఉత్పాదకత, ఆర్థిక ఫలితాలు, జన జీవన ప్రమాణాల మెరుగుదలవైపు ఈ క్షీణత భారీ స్థాయిలో వ్యాపిస్తుంది.

ప్రజారోగ్యంపై తక్కువస్థాయి వ్యయం తీవ్ర ప్రతికూల పరిణామాలకు దారితీస్తుంది. అదే సమయంలో అనారోగ్యాన్ని, వ్యాధులను నిరోధించే దిశగా ప్రాణవాయు నాణ్యత, తాగునీరు, పారిశుధ్యం వంటి సాధారణ పరిస్థితుల మెరుగుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడమూ ముఖ్యం. ఆరోగ్య సంరక్షణపై వ్యయం నుంచి ప్రభుత్వాన్ని ఇది తప్పించకపోయినా, ప్రజల అనారోగ్యానికి దారితీసే ఇలాంటి పరిస్థితుల నుంచి ఉపశమనం కోసం ఖర్చు చేయడం అవసరమే. ప్రస్తుతం తగినంతగా అందుబాటులో లేని ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై ఒత్తిడిని తగ్గించగలగడమన్నది దీనివల్ల కలిగే అదనపు ప్రయోజనం. ఈ అంశాల దృష్టికోణంతో చూస్తే ఈ బడ్జెట్ ఓ కీలక ముందడుగు వేసిందనవచ్చు. సంక్షేమంతోపాటు జీవన ప్రమాణాలు, ఉత్పాదకత, ఆరోగ్యం మెరుగుదలకుగల సహసంబంధాన్ని ఇది ప్రస్ఫుటం చేస్తోంది. "వంట గదిలో కట్టెల పొయ్యి ముందు కూర్చోవడమంటే ఓ గంటలో ఏకంగా 400 సిగరెట్లు కాల్చడంతో సమానం" అంటూ బడ్జెట్ సమర్పణ సందర్భంగా ఆర్థికశాఖ మంత్రి వ్యాఖ్యానించారు. వంటింటి పొగ ఒక శాపంగా పరిణమించిందన్న ఆయన మాటలు ఈ సహసంబంధాన్ని మరింత స్పష్టం చేస్తున్నాయి. ఈ శాపం నుంచి తప్పించేందుకు రానున్న మూడేళ్లలో దారిద్ర్య రేఖ దిగువనున్న 5 కోట్ల కుటుంబాలకు మహిళల పేరిట వంటగ్యాస్ కనెక్షన్ ఇవ్వనున్నట్లు ఆయన ప్రతిపాదించారు. ఇది ఆరోగ్య రంగానికి కేటాయింపులలో భాగం కాకపోయినా, ప్రజారోగ్యం మెరుగుదిశగా ఇదో ప్రధానమైన చర్యగా పేర్కొనవచ్చు. పెట్రోలు, సహజవాయువుతో నడిచే చిన్న కార్లపై 1 శాతం, డీజిల్ వాహనాలపై 2.5 శాతం, భారీ ఇంజిన్ సామర్థ్యంగల ఎస్‌యూవీ వంటి వాహనాలపై 4 శాతం వంతున శిస్తు విధిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. పట్టణ ప్రాంతాల్లో వాయు కాలుష్యాన్ని అదుపుచేసేందుకు చేపట్టిన ఈ చర్య కూడా ప్రజారోగ్యానికి దోహదపడేదే. ఇంటాబయటా కూడా వాయు కాలుష్యం ఆరోగ్యంపై అత్యంత ప్రతికూల, దుష్ప్రభావాన్నే చూపుతుందనడంలో సందేహం లేదు.

స్వచ్ఛభారత్ అభియాన్‌కు కేటాయింపులు పెంచడం కూడా ప్రజారోగ్యం మెరుగుకు తోడ్పడేదే. రక్షిత మంచినీరు, పారిశుధ్యానికీ ప్రజారోగ్యంతో అవినాభావ సంబంధముంది. దేశంలోని గృహాల సంఖ్యలో 4.9 శాతానికి మాత్రమే ఇళ్లలో మరుగుదొడ్డి సదుపాయం ఉందని 2011నాటి జనాభా లెక్కలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో 2015-16తో పోలిస్తే ప్రస్తుత బడ్జెట్‌లో స్వచ్ఛభారత్‌కు కేటాయింపులను రూ.6,525 కోట్ల నుంచి రూ.9000 కోట్లకు పెంచారు. దీన్ని ప్రజారోగ్యం దిశగా చేపట్టిన కీలక ప్రతిపాదనగా పరిగణించాలి. ఇది శుభవార్తేగానీ, ఇళ్లలో మరుగుదొడ్లు కట్టించడం, వినియోగపు అలవాటును మెరుగుపరచటం, ప్రవర్తనలో పరివర్తనతో సరిపెట్టకుండా వీటికి ఆవలి పరిధిలోనూ ఆలోచించాలి. అంటే... మరుగుదొడ్లకు నిరంతర నీటి సరఫరా సదుపాయం, నిర్వహణ కూడా అత్యంత అవసరం. మరుగుదొడ్డి వినియోగం పెరగటమంటే ఆరోగ్యావగాహన కలిగినట్లేనన్నది స్పష్టమవుతుంది. ఇక జాతీయ గ్రామీణ తాగునీటి సరఫరా కార్యక్రమానికి నిరుడు రూ.4,373 కోట్లు కేటాయించగా, 2016-17 బడ్జెట్‌లో స్వల్పంగా పెంచి రూ.5000 కోట్లుగా ప్రకటించారు. అయితే, గ్రామీణ ప్రాంతాల్లో నీటి నాణ్యత, లభ్యత తీవ్ర సమస్యలుగా పరిణమిస్తున్న నేపథ్యంలో ఇది సరిపోదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందునా రాష్ట్రాలు కరువుతో సంక్షోభంలో పడిన పరిస్థితుల్లో ఇదెంతమాత్రం ఉపశమనం ఇవ్వగలదని సందేహం వెలిబుచ్చుతున్నారు. ఇక జల, వాయు నాణ్యత పెంపు, పారిశుధ్యం మెరుగుదలద్వారా వ్యాధుల వ్యాప్తిని నియంత్రించటమొక్కటే చాలదు. జనాభాలో పేదల సంఖ్య అత్యధికంగనుక ఆరోగ్య సంరక్షణను అందుబాటులోకి తేవడంపై దృష్టి సారించడం అత్యంత అవశ్యం. ఆరోగ్యంపై ప్రభుత్వ వ్యయం తక్కువగా ఉందంటే- దేశంలోని కుటుంబాలు తమ సొంత వనరులు, ఆదాయం, పొదుపుల నుంచి 70-80 శాతం మేర భారీగా వెచ్చించాల్సి వస్తున్నదని అర్థం. ఒక్కసారి ఆస్పత్రిపాలైతే గ్రామీణ ప్రాంతాల్లో వైద్య, వైద్యేతర సగటు వ్యయం రూ.16,956 కాగా, పట్టణ ప్రాంతాల్లో రూ.26,455గా ఉంది. ఇక వ్యాధులతో బాధపడుతున్నవారు ఇంటివద్ద ఉండి వైద్యం చేయించుకోవడానికి అయ్యే సగటు వ్యయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.509, పట్టణ ప్రాంతాల్లో రూ.639గా ఉంది. అలాగే అతి తక్కువ ప్రభుత్వ వ్యయం అంటే- జనాభాలో అధికశాతం ప్రైవేటు రంగ

ఆరోగ్యసంరక్షణ సేవలపైనే ఆధారపడాల్సి వస్తున్నదని అర్థం. సాధారణ వైద్యంతోపాటు ఆస్పత్రి వైద్యసేవలు అందించడంలో ప్రైవేటు రంగమే గణనీయ పాత్ర పోషిస్తున్నదని జాతీయ నమూనా అధ్యయన సంస్థ (NSSO) "సామాజిక వినిమయ కీలక సూచికలు–ఆరోగ్యం" (71వ దఫా.. 2014 జనవరి–జూన్) శీర్షికన 2015నాటి నివేదిక కూడా పేర్కొంటోంది. సాధారణ వైద్యసేవలలో ప్రభుత్వరంగ ఆరోగ్య సంస్థల సేవలు కేవలం 11.5 శాతమేనని పేర్కొంది. ఆస్పత్రి సేవల వ్యయంలో ప్రభుత్వ రంగంతో పోలిస్తే ప్రైవేటు రంగంలో వ్యయం నాలుగు రెట్లు అధికం. ఆస్పత్రిలో ఉండి చికిత్స తీసుకోవాలంటే ప్రభుత్వ రంగంలో అయ్యే సగటు వ్యయం రూ.6,120 కాగా, ప్రైవేటు రంగంలో రూ.25,850గా ఉండటం ఇందుకు నిదర్శనం.

అటు ప్రైవేటు వైద్యసేవలపై ఎక్కువగా ఆధారపడాల్సి రావటం, ఇటు సొంత వనరుల నుంచి అలవిమీరిన ఖర్చు చేయాల్సి రావడంతో తీవ్ర వ్యాధులకు గురైన పేదలు మరింత పేదరికంలో కూరుకు పోవడానికి దారితీస్తోంది. తీవ్ర అనారోగ్యం పాలైతే పేదలు ఆర్థికంగా చితిపోయి దుర్భర పరిస్థితుల్లోకి జారిపోతున్నారు. ఈ దుస్థితిని బాగుచేయడానికి 2016 బడ్జెట్ పరిష్కారం అన్వేషించింది. ప్రజారోగ్య బీమా ఆధారంగా పేదల, ఆర్థికంగా బలహీనవర్గాల అవసరాలపై దృష్టి సారించింది. అనూహ్య భారీ వ్యయం నెత్తిమీద పడితే దాన్ని తట్టుకునేందుకు బీమా ధీమా ఇవ్వాలని ప్రతిపాదించింది. ఆ మేరకు ఆర్థికశాఖ మంత్రి కుటుంబానికి రూ.లక్ష వంతున ఆరోగ్య బీమాను ప్రకటించారు. వృద్ధ పౌరులకు అదనంగా మరో రూ.30వేల సదుపాయం కల్పించారు. ఆ మేరకు ఆరోగ్య బీమా కోసం 2016–17బడ్జెట్‌లో రూ.1,500 కోట్లు కేటాయించారు. ఆ మేరకు 2015–16 బడ్జెట్‌లో చూపిన రూ.595 కోట్ల అంచనాలను సవరించారు. మెరుగైన ప్రజారోగ్య బీమాతో వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. ముఖ్యంగా తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో సేవలు పొందాల్సిన సందర్భాల్లో అదెంతో ప్రయోజనకరం. అయితే, భారీ జనాభా, అందులోనూ అల్పాదాయ, రేఖకు దిగువనగలవారు అధికశాతం ఉన్న భారత్‌వంటి దేశంలో మెరుగైన, ప్రభావశీల ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు ప్రత్యామ్నాయం లేదు. ఈ దిశగా కొన్ని సానుకూల సంకేతాలు కనిపిస్తున్నాయి. జాతీయ నమూనా అధ్యయన సంస్థ 2004నాటి నివేదిక (60వ దఫా) పేర్కొన్నదానితో పోలిస్తే 2015 నివేదిక (71వ దఫా)లో స్వల్పంగానే అయినా గ్రామీణ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో గణనీయ మార్పు కనిపించింది. ప్రజారోగ్య రంగంవైపు ప్రజల మొగ్గు 60వ దఫా నివేదిక ప్రకారం 22 శాతం కాగా, 71వ దఫా అధ్యయనంలో అది 28.3 శాతానికి చేరిందని నిరుటి నివేదిక పేర్కొంది. కానీ, ఈ రెండు నివేదికల నడుమ పదేళ్ల వ్యవధి, ఆ కాలంలో పెరిగిన జనాభాతో సరిపోలిస్తే ఈ పెరుగుదల పరిగణనార్హం కాదు. ఇదే వ్యవధిలో అవసరమైన స్థాయిలో కాకపోయినా ప్రభుత్వ వ్యయం కూడా పెరిగింది. గడచిన ఆర్థిక సంవత్సరం (2015–16) తొలి ఎనిమిది నెలల్లో ఆరోగ్య రంగంలో ప్రభుత్వ వాస్తవ వ్యయం 9 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఆ మేరకు 2012–13లో రూ.27,884 కోట్లుగా ఉన్న కేటాయింపులు స్థిరంగా పెరుగుతూ 2015–16నాటికి రూ.34,597 కోట్లకు చేరగా, తాజా బడ్జెట్ (2016–17)లో మరింత పెరిగి రూ.39,533 కోట్లకు చేరాయి. దేశం ఎదుర్కొంటున్న ఆరోగ్య సంరక్షణ సమస్యలు ఈ రంగంలో కనిపిస్తున్న రవంత కాంతిని మసకబారుస్తున్నాయి. భారత్‌లో వార్షిక మరణాలు 52 లక్షలుగా ప్రకటించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), పట్టణ ప్రాంతాల్లో 2021నాటికి 42 శాతం పెరుగుతాయని అంచనా వేసింది. మెదడుకు రక్తసరఫరా నిలిచిపోవడం వల్ల భారత్‌లో నిమిషానికొకరు మరణిస్తుండగా, 40 ఏళ్లలోపు రోగులలో ప్రతి ఆరో వ్యక్తి కేన్సర్ లేదా గుండెజబ్బుతో బాధపడుతున్నారు. దేశంలో 2016–30 మధ్య అసాంక్రమిక వ్యాధులవల్ల ఆర్థిక భారం 62 లక్షల కోట్ల డాలర్లకు చేరగలదని అంచనా. దీన్నిబట్టి ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వ వ్యయం, కేటాయింపులు భారీగా పెరగాలన్నది వాస్తవమని అర్థమవుతోంది. ఈ ఆరోగ్యంపై తలసరి ప్రభుత్వ వ్యయం కేవలం 44 డాలర్లు కాగా, ఈ విషయంలో భారత్ ప్రపంచంలో 157వ స్థానంలోఉంది. కాబట్టి ఆస్పత్రిలో చేరాల్సినంతటి తీవ్ర అనారోగ్యం నుంచి బయటపడాలంటే మెరుగైన ఆరోగ్య బీమా ఆసరాగా నిలుస్తుంది. అయితే, ఆరోగ్య సంరక్షణ చర్యలు మెరుగైన ఫలితాలివ్వాలంటే ప్రాథమిక–ఉప ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు విప్లవాత్మక స్థాయిలో మెరుగుపడాలి. ఇందుకోసం సుశిక్షితులైన సిబ్బంది నియామకంతోపాటు అవసరమైన ఔషధాలను అందుబాటులో ఉంచాలి. సామాన్యులకు చౌకధరల్లో ఔషధ అందుబాటుకోసం ప్రభుత్వం 2008లో 'జనౌషధి' పథకాన్ని ప్రవేశపెట్టినా దానికింద కేవలం 164 దుకాణాలు ఏర్పాటు చేయగా, వాటిలో ఇప్పుడు పనిచేస్తున్నవి 87 మాత్రమే. ఈ నేపథ్యంలోనే తాజా బడ్జెట్‌లో 3వేల దుకాణాలు ఏర్పాటు చేస్తామని ఆర్థికమంత్రి ప్రకటించారు. వీటికోసం 2015–16లో రూ.16.9 కోట్లు కేటాయించగా ఈసారి రూ.35కోట్లకు పెంచారు. ఇది హర్షణీయమే అయినా ఈ పథకాన్ని పీడిస్తున్న అసలు

సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం శ్రద్ధ చూపాల్సి ఉంది. వీటిలో మొదటిది... డాక్టర్లు ఈ మందులు సిఫారసు చేయకపోవడం. రెండోది... చౌకరకం మందులు అందుబాటులో లేకపోవడం. అన్నిటికన్నా అతిపెద్ద సమస్య ప్రాథమిక, మాధ్యమిక స్థాయి ఆరోగ్యం సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినా, అవి దాదాపు అలంకారప్రాయంగా తయారయ్యాయి. ఖాళీలు భర్తీ చేయకపోవడం, తీవ్రస్థాయిలో ఆరోగ్య సంరక్షణ వృత్తి నిపుణుల కొరత ఈ వ్యవస్థను పట్టిపీడిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య నిపుణులు, నర్సులు, ఇతర సాంకేతిక సిబ్బంది కొరత ఆరోగ్య సంరక్షణ సేవల అందుబాటును ప్రశ్నార్థకం చేస్తోంది. ఆరోగ్య సిబ్బంది, మౌలిక సదుపాయాల మధ్య తీవ్ర అసమతౌల్యమనే విషమ పరిస్థితి కూడా కొనసాగుతోంది.

జాతీయ గ్రామీణ ఆరోగ్య కార్యక్రమం (NRHM)లో భాగంగా 2011లో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఒడిషా, అసోం, జమ్ముకశ్మీర్, తమిళనాడు రాష్ట్రాల్లో ఒక అధ్యయనం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో నిపుణులైన ఆరోగ్య సిబ్బంది కొరత ఏకంగా 95 శాతం ఉన్నట్లు ఇందులో తేలింది. ఇక 2015నాటి గ్రామీణ ఆరోగ్య గణంకాల ప్రకారం అఖిలభారత స్థాయిలో సామాజిక ఆరోగ్య కేంద్రాలకు అవసరమైన శస్త్రచికిత్స నిపుణుల కొరత 83 శాతంగా నమోదైంది. మరోవైపు ఆయా కేంద్రాలకు మంజూరుచేసిన ప్రత్యేక వైద్య నిపుణుల సంఖ్యలో భర్తీ చేసింది కేవలం 27 శాతమేనని తేలింది. సరైన వైద్య సదుపాయాల్లేనప్పుడు మెరుగైన బీమా పథకాలు, నిండుగా నిల్వలతో జనౌషధి దుకాణాలు ఉన్నా నిరర్థకమే. భారత ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ అందుబాటులో ఉంటూ ప్రభావశీలంగా, సమర్థంగా సేవలు అందించాలంటే ప్రజాధనంతో నడిచే సంస్థలన్నీ పూర్తిస్థాయిలో పనిచేయడం అత్యంత అవశ్యం. లేనిపక్షంలో జనాభాలోని అధికశాతం వర్గాలు అధికవ్యయం భరించక తప్పని దుస్థితిలోకి నెట్టబడతాయి. భారత్‌వంటి దేశానికి ఇదెంతమాత్రం తగినది కాదు... అలాగే ప్రభుత్వం బీమా వ్యవస్థవైపు అడుగులు వేయడం కూడా గరిష్ఠ పరిష్కారం కాగల అవకాశం లేదు. జాతీయ గ్రామీణ ఆరోగ్య కార్యక్రమానికి 2015-16లో రూ. 19,226 కోట్లు కేటాయించగా, ఈసారి స్వల్పంగా పెంచి రూ. 20,037 కోట్లుగా ప్రకటించారు. కానీ, ప్రభుత్వం ఎక్కువగా దృష్టి సారించాల్సింది ఈ విషయంలోనే. తొలి పరిష్కారంగా మొదట ఆరోగ్య కేంద్రాలలో ఖాళీలన్నిటినీ భర్తీ చేయాలి. తద్వారా అన్ని స్థాయిల ఆస్పత్రులు పూర్తిగా పనిచేసేలా చూడాలి. అంబులెన్సు వాహనాలు, సంచార ఆరోగ్య కేంద్రాలు, భవనాలు తదితర అత్యవసర మౌలిక సదుపాయాలు కల్పించాలి.

దేశ జనాభాలో 70 శాతం మేర 2025నాటికి పనిసామర్థ్యంగల వయసులో ఉంటారని అంచనా. దీన్నే మన రాజకీయ నాయకులు తరచూ "జనశక్తి లబ్ధి"గా అభివర్ణిస్తుంటారు. సానుకూలాంశంగా పేర్కొనే ఈ అంశం అవకాశాలనేగాక సవాళ్లనూ మనముందుకు తెస్తుంది. ఈ జనశక్తి లబ్ధిని సద్వినియోగం చేసుకోవాలంటే సామాజిక రంగంలో ప్రభుత్వ వ్యయం పెరగాలి. ప్రత్యేకించి విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం వంటి కీలకాంశాలపై శ్రద్ధ అవసరం. ఈ దిశగా 2016-17 బడ్జెట్ కొన్ని ముఖ్యమైన ముందడుగు చర్యలు ప్రకటించింది. కాకపోతే ఈ ప్రగతి పయనం అడుగులతో కాకుండా పెద్దపెద్ద అంగలతో సాగాల్సి ఉంది. 'జనశక్తి'ని వాస్తవ అవకాశంగా మలచుకోవాలంటే ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను సమర్థంగా, ప్రభావశీలంగా, అందుబాటులో సేవలందించేలా మెరుగుపరచాలి. సమ్మిళిత-సుస్థిర అభివృద్ధి కోసం నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ, దాని ఫలితాలు అత్యవసరం. ఆరోగ్య నాణ్యతను పెంచడం అనేది అభివృద్ధి సూచికలలో అత్యంత ప్రధానమైనది. ఉన్నతస్థాయి సమ్మిళిత, సుస్థిర ఆర్థిక వృద్ధిని సాధించడంలో అది తగినంత ఊపునిస్తుంది. ఆరోగ్యకర జనాభా అంటే మెరుగైన ఉత్పాదకతకు మరో పేరు. కానీ... సామాజిక రంగంలో వ్యయాన్ని ప్రత్యేకించి విద్య, ఆరోగ్య రంగంలో వెచ్చించేదంతా వనరులను తరిగించేదిగా మాత్రమే భావించే ధోరణి ఉంది. ఈ రంగాల్లో ప్రభుత్వ వ్యయాన్ని పరిమితం చేయడంలో ఆరోగ్యరంగాన్ని మరింతగా ప్రైవేటీకరించాలని వాదించే వర్గాల ఒత్తిడి కూడా ఉంది. అయితే, ఈ రంగాల నుంచి ప్రభుత్వం వెనక్కుమళ్లడమంటే పెద్ద తప్పిదమే కాగలదు. ఆరోగ్యంపై వ్యయం అభివృద్ధికి కీలకం. సుమారు 170 ఏళ్ల కిందట "ప్రగతి ఒక్కటే లక్ష్యమైతే, మరి మన కృషి అంతా ఎవరికోసం? ఏదో ఒకరోజున నర్తించబోయేవారి కోసం నిర్మించిన వేదికకు ఆధార స్తంభాల పాత్రకు నేటి మానవాళిని పరిమితం చేయదలిచారా? లేక ఆజ్ఞ మేరకు మోకాళ్లమీద బురదలో మోకరిల్లి, 'భవిష్యత్ ప్రగతి' అనే ఆదర్శప్రాయ నినాదం రాసిన అంతుబట్టని నిధిగల నావను అత్యంత ప్రయాసకోర్చి ముందు కాలంలోకి లాక్కువెళ్లే ఖైదీ బానిసలుగా భావిస్తున్నారా?" అని రష్యా తత్త్వవేత్త అలెగ్జాండర్ హెర్జెన్ ప్రశ్నించాడు. దాదాపు రెండు శతాబ్దాలనాటి ఆ ప్రశ్నలకు అద్దంపట్టే పరిస్థితులు నేటికీ మన కళ్లముందు కదులుతుండటమే ఈనాటి వాస్తవం. ■

**హామీలకు ప్రాధాన్యం**

# ఆత్మవిశ్వాసంతో ఆంధ్రప్రదేశ్ బడ్జెట్...




**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన మూడవ బడ్జెట్‌ను పూర్తి ఆత్మ విశ్వాసంతో రూపొందించినట్టు స్పష్టంగా కనబడుతోంది. సంక్లిష్టమైన ఆర్థిక పరిస్థితులలోను రూ. 1.35 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశ పెట్టి భవిష్యత్తుపై కొత్త ఆశలు కలిగించడమే కాక రాష్ట్రం ఆర్థికంగా బలోపేతమవుతున్నదన్న సందేశాన్ని ఇవ్వగలిగింది. కేంద్రం చేయూతను అందించకపోతే ముందుకు వెళ్ళడం కష్టమని తెలిసినా ఉన్న వనరులతోనే స్వశక్తిని నమ్ముకుని లక్ష్యాలను చేరుకోవడం ఉత్తమమనే ప్రభుత్వ ఆలోచనను బడ్జెట్ ప్రతిబింబిస్తోంది.**

రాష్ట్ర విభజన జరిగిన తొలి రెండేళ్ళలో తడబాటుకు గురైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన మూడవ బడ్జెట్‌ను పూర్తి ఆత్మ విశ్వాసంతో రూపొందించినట్టు స్పష్టంగా కనబడుతోంది. సంక్లిష్టమైన ఆర్థిక పరిస్థితుల్లోనూ రూ. 1.35 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టి భవిష్యత్తుపై కొత్త ఆశలు కలిగించడమే గాక సమైక్య రాష్ట్రంలో నాలుగేళ్ల క్రితం ప్రణాళిక పద్దు కింద కేటాయించిన మొత్తానికి సమానమైన కేటాయింపులను జరిపి రాష్ట్రం ఆర్థికంగా బలోపేతమవుతోందన్న సందేశాన్ని ఇవ్వగలిగింది. ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు సమర్పించిన బడ్జెట్‌లో కొత్త వరాలేవీ ఇవ్వకుండా ఇచ్చిన హామీలను అమలుచేయడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం గమనార్హం.

బడ్జెట్ అంచనాలు గత ఏడాదితో పోలిస్తే పెరిగాయి. గత ఏడాది మొత్తం రూ. 1,13,049 కోట్లు... కాగా ఈ సారి లక్షా 35వేల కోట్ల రూపాయాలకు చేరింది. దాదాపు రూ. 22 వేల కోట్లు పద్దు పెరిగింది. ప్రణాళికేతర వ్యయం రూ. 78,637 కోట్ల నుంచి 86,554 కోట్లకు చేరండంతో దాదాపు రూ. 7,917 కోట్లు పెరగ్గా... ప్రణాళిక వ్యయం రూ. 34,412 కోట్ల నుంచి 49,134 కోట్లకు చేరడంతో రూ. 14,722 కోట్లు పెరిగింది. రెవిన్యూలోటు, ఆర్థికలోటు ఈసారి స్వల్పంగా పెరుగుతుందని భావిస్తున్నారు. రెవిన్యూలోటు రూ. 4,868 కోట్లు కాగా... ఆర్థికలోటు 20,497 కోట్లకు చేరుతుందని భావిస్తున్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 2.99 శాతం, రెవిన్యూలోటు 0.71 శాతం ఉంటుందని భావిస్తున్నారు.

ప్రజాధనం నిర్వహణలో చేపట్టిన పలు సంస్కరణాలలో భాగంగా ఇప్పటి వరకు వున్న త్రైమాసిక బడ్జెట్ విడుదల స్థానంలో సమగ్ర బడ్జెటును విడుదల చేయనున్నారు. దీనివల్ల ప్రభుత్వ శాఖలు ప్రతి మూడు నెలలకోసారి కార్యలయాల చుట్టూ తిరిగే పని తప్పింది. నిధులు అవసరానికి తగ్గట్లు లభిస్తున్నాయి. దీనితో పాటు ప్రస్తుతం వున్న డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంట్ ఆఫీసర్ల వ్యవస్థను రేషనలైజ్ చేయటం ద్వారా మొదటి నెలలోనే మొత్తం వార్షిక బడ్జెట్‌ను అందుబాటులోకి తెస్తారు. ఫలితంగా నెలవారి ఖర్చు అవసరాలకు తగ్గినట్టు నగదు అందుబాటులోకి వస్తుంది. దీంతోపాటు వాస్తవ పరిస్థితులను అంచనా వేసుకోవటానికి

**జీడిగుంట నాగేశ్వర రావు,** సీనియర్ జర్నలిస్ట్

ఈ సంవత్సరం 'ఈ నిధి' కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. 2022 నాటికి దేశంలో గరిష్ట ప్రగతిసాధక రాష్ట్రాలు మూడింటిలో ఒకటిగా ఆంధ్రప్రదేశ్‌ను నిలపాలని తర్వాత ఏడు సంవత్సరాల్లో అద్వితీయ వృద్ధికి మారుపేరై ఎదగాలన్నది ''విజన్ 2029'' మౌలిక లక్ష్యాలు. అందుకోసం ఎంచుకున్న ఐదుమార్గాలు – పేదరికం మీద పైచేయి, నైపుణ్యాభివృద్ధికి ప్రోత్సాహం, వ్యవసాయాన్ని లాభదాయకంగా మలచడం, ఆరోగ్య సూచీల మెరుగుదల, జనభాగస్వామ్యంతో జలసంరక్షణ ముఖ్యమైనవి.

### వార్షిక ప్రణాళికలో దేనికెంత?

1. వ్యవసాయం, అనుబంధ రంగాలు, గ్రామీణాభివృద్ధి 22.78 శాతం (రూ. 13,648.72 కోట్లు) నిరుటి బడ్జెట్‌తో పోలిస్తే దీన్ని రూ. 5,800 కోట్ల వరకు పెంచారు.
2. సాగునీరు 14.91 శాతం (రూ. 7,325.21కోట్లు)
3. విద్యుత్తు 0.26 శాతం (రూ. 128.13 కోట్లు).
4. సామాజిక సేవలు 43.87 శాతం (రూ. 21,556.97 కోట్లు)
5. రవాణా 6.48 శాతం (రూ. 3,185.66 కోట్లు)
6. ఇతరత్రా 6.70 శాతం (రూ. 3,289.75 కోట్లు)

### అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతూకం

అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతూకం పాటించేందుకు బడ్జెట్‌లో పెద్ద కసరత్తే జరిగింది. సంక్షేమ పథకాలతో పాటు, ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన కాపు, బ్రహ్మణ కార్పొరేషన్లకు కూడా నిధులు కేటాయించడం విశేషం. కాపు కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో రూ. 1,000 కోట్లు కేటాయించారు. అలాగే బ్రహ్మణ కార్పొరేషన్‌కు గత బడ్జెట్‌లో 35 కోట్లు ఈ సారి రూ. 65 కోట్లు కేటాయించారు. గతంలో బీసీల సంక్షేమానికి 3,231 కోట్లు కేటాయించగా ఈసారి బడ్జెట్‌లో రూ. 8,724 కోట్లు కేటాయించారు. ఎస్టీల అభివృద్ధికి రూ. 3,100 కోట్లు ప్రతిపాదించారు. ఐసిడిస్ కార్యక్రమానికి 45 శాతం గణనీయమైన పెరుగుదలతో రూ. 772 కోట్లు కేటాయించారు. గిరిజన ప్రాంతాల్లో 6 నెలల నుంచి 6 సంవత్సరాల మధ్య వయస్సుగల చిన్నారుల పౌష్టికాహార అవసరాలను తీర్చే నిమిత్తం 2015 ఆగస్టు 15న ప్రారంభించిన 'గిరి గోరుముద్దలు' పథకాన్ని కొత్త ఆర్థిక సంవత్సరంలో కూడా కొనసాగిస్తారు. బడ్జెట్‌లో మధ్యాహ్న భోజన పథకానికి రూ. 750 కోట్లు కేటాయించారు. ఇది 2015–16 కన్నా 67 శాతం ఎక్కువ. వెనుకబడిన తరగతుల సంక్షేమానికి, అభివృద్ధికి రూ. 8,832 కోట్లు కేటాయించారు. ఇది గత ఆర్థిక సంవత్సరం కేటాయింపుల కన్నా 31.5 శాతం ఎక్కువ. అల్పసంఖ్యాక వర్గంలో విద్యాపరంగా ఆర్థికంగా వెనుకబడివున్న లబ్దిదారులకు ఆర్థికాభివృద్ధి పథకాలు అమలు చేసేందుకు బడ్జెట్‌లో రూ. 250 కోట్లు కేటాయించారు. అలాగే అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు రూ. 710.57 కోట్లు ప్రతిపాదించారు. వృద్ధులు, వితంతవులు, వికలాంగులకు ఎన్.టి.ఆర్ భరోసా పథకం కింద ఫించన్లు పంపిణీ కోసం బడ్జెట్‌లో రూ. 2,998 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో 86 లక్షల మంది సభ్యులుగా గల 8.7 లక్షల స్వయం సహాయక బృందాల ఆర్థిక సాధికారితను వేగవంతం చేయడానికి రూ. 10,298 కోట్ల మేర పెట్టుబడులను సమకూర్చలని నిర్ణయించారు. ప్రాథమిక విద్య ఉపాధిహామీ రహదారులు అభివృద్ధి, సాంఘిక భద్రత తదితర పథకాల కింద ఉదార కేటాయింపుల ప్రభుత్వం నిబద్ధ తాను తెలియచేస్తున్నాము.

### వ్యవసాయం–కీలకం

వ్యవసాయ ప్రధాన రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వైపరిత్యాలను, వాతావరణ మార్పులను తట్టుకుని రైతులకు మేలు చేసేలా వ్యవసాయరంగాన్ని అభివృద్ధి పరచడం ప్రధాన వ్యూహంగా బడ్జెట్‌లో వ్యవసాయాభివృద్ధికు రూ. 5,838.65 కోట్లు ప్రతిపాదించారు. ఇది గత బడ్జెట్‌తో పోలిస్తే 24 శాతం ఎక్కువ. సాగునీటి పథకాలను త్వరితగతి పూర్తి చేయటం ద్వారా రాష్ట్రాన్ని కరువు నుంచి రక్షించడానికి చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం తెలిసింది. ఇప్పటికి అమలు చేస్తున్న 'పంట సంజీవని' 'రెయిన్ గన్స్' వంటి కార్యక్రమాలతో పాటు భూగర్భ జలనరుల పెరుగుదలకు మరిన్ని చర్యలు చేపడతారు. 35.15 లక్షల రైతు కుటుంబాలకు రుణ విముక్తి కలిగేలా రుణమాఫీ కోసం రూ. 3,512 కోట్లు ప్రత్యేకరించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రూ. 344 కోట్లు, నేషనల్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ అండ్ టెక్నాలజీ కింద రూ. 54 కోట్లు జాతీయ నూనెగింజలు, ఆయిల్‌పామ్ మిషన్ కింద రూ. 79 కోట్లు కేటాయించారు. పండ్ల తోటల పెంపకానికి ప్రస్తుత బడ్జెట్ రూ. 659 కోట్లు ప్రతిపాదించారు. గత బడ్జెట్ అంచనాల కన్నా ఇది 31 శాతం అధికం, మెట్ట ప్రాంతాల్లోని రైతులు సమస్యల నుంచి బయటపడడానికి పట్టు పరిశ్రమలను సమర్థమైన ప్రత్యామ్నాయంగా ప్రోత్సహిస్తారు. బడ్జెట్‌లో పట్టు పరిశ్రమలకు రూ. 147 కోట్లు ప్రతిపాదించారు. కోడిగుడ్ల ఉత్పత్తిలో ముందుండడమే కాకుండ మాంసం ఉత్పత్తిలో దేశంలో 4వ స్థానంలోనూ, పాల ఉత్పత్తిలో 6వ స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని మొదటి మూడు స్థానాల్లో ఒకటిగా నిలిపేందుకు బడ్జెట్‌లో రూ. 816 కోట్లు కేటాయించారు.

## మౌలికసదుపాయాలు-విజన్ 2029

విజన్ 2029లో భాగంగా మౌలిక సదుపాయాలను పెంపోందించేందుకు బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించారు. రాష్ట్రంలో విస్తారమైన తీరప్రాంతంలోని ఆర్థిక మండలాలను వస్తు ఉత్పత్తి కేంద్రాలుగా రూపొందించాలని నిర్ణయించారు. విశాఖపట్నం-చెన్నై, చెన్నై-బెంగుళూరు, కర్నూలు-బెంగుళూరు నగరాల మధ్య పారిశ్రామిక కారిడార్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ప్రకాశం జిల్లాలోని దొనకోండలోని పెనిన్సులార్ రీజియన్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కారిడార్, కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లులో మెగా ఇండస్ట్రీయల్ హబ్, విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు అనుబంధంగా విశాఖపట్నం, కాకినాడ, శ్రీకాళహస్తి-ఏర్పేడు, గన్నవరం-కంకిపాడు పారిశ్రామిక కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. మిగిలిన రెండు కారిడార్లకు కృష్ణపట్నం, కలికిరి, హిందూపురంలు ప్రధాన కేంద్రాలుగా ఉంటాయి. తూర్పు ఆసియా, ఆగ్నేయాసియా దేశాలతో వాణిజ్య సంబంధాలకు రాష్ట్ర తూర్పుతీరం కీలకం కాగలదని భావిస్తున్నారు. రాష్ట్రంలో విజయవాడ, రాజమండ్రి విమానాశ్రయాల విస్తరణతో పాటు భోగాపురం, దగదర్తి, ఓర్వకల్లు, నాగార్జున సాగర్, దొనకొండలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు ఏర్పాటు చేయాలని కూడా ప్రతిపాదించారు.

## జల కేటాయింపులు 57 శాతం అధికం

ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలకూ నీరందేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని బడ్జెట్‌లో పేర్కొన్నారు. జలవనరుల రంగం కోసం బడ్జెట్‌లో రూ. 7,325.21 కోట్లు కేటాయించారు. ఇది గతేడాది బడ్జెట్ కంటే 57 శాతం అధికం. కరువు కోరల్లో చిక్కుకున్న రాయలసీమ, ప్రకాశం సహా వెనుకబడిన శ్రీకాకుళం విజయనగరం జిల్లాలకు నిలకడగా సాగునీటి సదుపాయం కల్పించడానికి 7 నీటిపారుదల పథకాలను నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేయాలని నిర్ణయించారు. తోటపల్లి బ్యారేజి, పోలవరం కుడికాలువ, గాలేరు-నగరి సుజల స్రవంతి, హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టులను 2016-17 ఆర్థిక సంవత్సరంలో పూర్తిచేస్తారు. వంశధార 2వ దశ, పూల సుబ్బయ్య వెలుగొండ పథకం, గుండ్లకమ్మ రిజర్వాయర్ పోలవరం ఎడమ కాలువలు, పోలవరం మొదటిదశ పనులను జూన్ 2018కి పూర్తి చేయాలని తలపెట్టారు. ప్రపంచబ్యాంక్ సాయంతో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ బేస్డ్ టాంక్ మేనేజిమెంట్ ప్రాజెక్టును పూర్తి చేసి దీని ద్వారా రూ. 459 కోట్ల అంచనా వ్యయంతో 12 జిల్లాల్లో 1.2 లక్షల హెక్టార్ల ఆయకట్టుకు లబ్ది చేకూరుస్తారు. జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ సాయంతో ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్, లైవ్లీ హుడ్ ఇంప్రూమెంట్ ప్రాజెక్టు అమలు ద్వారా రూ. 291 కోట్ల అంచనా వ్యయంతో అదనంగా 49,330 హెక్టార్లకు సాగునీరు అందిస్తారు. ఎన్.టి.ఆర్ జలశ్రీ మొదటిదశలో భాగంగా రూ. 385.55 కోట్ల అంచనా వ్యయంతో 50 వేల మంది దళిత, గిరిజన రైతులకు చెందిన 2.19 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పిస్తారు. చిన్న నీటిపారుదల రంగానికి 23 శాతం అంటే రూ. 674 కోట్లు ప్రణాళిక కేటాయింపులు జరిపారు.

## అందరికీ విద్యుత్తు

అందరికీ విద్యుత్తు... లక్ష్యానికి అనుగుణంగా మూడేళ్లలో మరో 4,800 మెగావాట్ల అదనపు సామర్థ్యాన్ని సాధించాలని నిర్ణయించింది. వ్యవసాయానికి 7 గంటల విద్యుత్ సరఫరా కొనసాగిస్తామని భరోసా ఇచ్చింది. 2016 జూన్ నాటికి రాష్ట్రంలో 4.6 లక్షల గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తారు. సాంకేతికంగా, వాణిజ్యపరంగా సంభవించే విద్యుత్ నష్టాన్ని 2014-15లో 11.81 శాతానికి, 2015-16లో 10.29 శాతానికి తగ్గించారు. 2016-17లో ఆ నష్టాన్ని ఒక అంకెకు తగ్గించాలని భావిస్తున్నారు. 2016 చివర నాటికి అన్ని ఇళ్ళకు ఎల్ఇడీ బల్బులను పంపిణీ చేస్తారు. ప్రత్యామ్నాయ విద్యుత్ వనరులైన సౌర, పవన విద్యుత్‌లపై కూడా దృష్టి పెడతారు. 1000 మోగావాట్ల సామర్థ్యం గల 2 సోలార్ పార్కులు ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఉత్పత్తి మొదలుపెడతాయి.

## సాంకేతిక రంగానికి పెద్ద పీట

టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటే అభివృద్ధి సాధించవచ్చనే ఉద్దేశంతో బడ్జెట్‌లో సాంకేతిక రంగానికి పెద్ద పీట వేశారు. బడ్జెట్ అంచనాల్లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్‌లకు రూ. 360.22 కోట్లు ప్రతిపాదించారు. "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్"లో సంస్కరణలతో పాటు, పెట్టుబడులను ఆకర్షించడానికి ఎలక్ట్రానిక్స్ విధానాన్ని కూడా రూపొందించడంతో రూ. 3.780 కోట్ల మేర పెట్టుబడి ప్రతిపాదనలు, 8,700 ఉద్యోగ అవకాశాలు వివిధ దశల్లో అందగలవని ప్రభుత్వం ఆశిస్తోంది. వివిధ పరిపాలన, సాంకేతిక నిర్వహణ సంబంధమైన సేవలకోసం 12,359 ఖాళీలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయడానికి అనుమతి మంజూరు చేసినట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. దేశంలోనే తొలిసారిగా ఇంటింటికీ బ్రాడ్‌బాండ్ సేవలు అందించేందుకు రూ. 320 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఫైబర్‌గ్రిడ్ ద్వారా ఈ ఏడాది చివరికి 10 నుంచి 15 ఎంబీపిఎస్ సామర్థ్యం కలిగిన కనెక్టివిటీని అందించాలని ప్రభుత్వం భావిస్తోంది.

### విద్య-నైపుణ్యం

ప్రతి ఒక్క బిడ్డకు మెరుగైన విద్య అందించాల్సిన స్వప్నం సాకారమవడం కోసం సాంకేతిక, ఉన్నత విద్యల అభివృద్ధి కోసం 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ. 2,644 కోట్లు ప్రతిపాదించారు. సెకండరీ విద్య కోసం రూ. 17,502 కోట్లు ప్రతిపాదించారు. ఇది మొత్తం వార్షిక బడ్జెట్‌లో అంచనాలలో 12.9 శాతం కాగా 2015-16 బడ్జెట్ అంచనాల కన్నా 12.5 శాతం అధికం. ఉద్యోగావకాశాల కోసం టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌తో ప్రభుత్వం దీర్ఘకాల భాగస్వామ్యం కుదుర్చుకుంది. 2020 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశానికి నైపుణ్యాల రాజధానిగా రూపొందించాలన్నది ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. 2029 నాటికీ అంతర్జాతీయంగా పోటీకి నిలబడగల రెండు కోట్ల మంది నిపుణుల్ని తయారుచేయాలన్నది లక్ష్యం ఇందుకోసం తొలిసారిగా "రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి కార్పొరేషన్" కూడా నెలకొల్పారు. 2016-17లో ప్రతి జిల్లాలో ఒక మోడల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నెలకొల్పాలని, దీని ద్వారా ఏడాదికి 50 వేల మందికి శిక్షణ ఇవ్వాలని సంకల్పించారు.

### పర్యాటకం-ఉపాధి

పర్యాటక రంగం అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలను పెంచాలని భావిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో పర్యాటక రంగానికి 227.74 కోట్లు కేటాయించింది. 2016-17 సంవత్సరంలో ఈ రంగంలో రూ. 2,174 కోట్ల ప్రైవేటు పెట్టుబడులు పెట్టడం 7,992 మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించారు. గతంలో గోదావరి పుష్కరాలకు రూ. 1,368 కోట్లు కేటాయించగా ఈ ఏడాది ఆగస్టులో జరిగే కృష్ణా పుష్కరాలకు రూ. 250 కోట్లు కేటాయించారు. వివిధ జిల్లాల్లో జరుపుకునే జాతరలు, పండుగలు రాష్ట్రమంతా జరుపుకునేందుకు వీలుగా సాంస్కృతిక ఉత్సవాల పేరిట కొత్త పథకాన్ని ప్రకటించారు. పీపీపీ పద్ధతిలో తిరుపతి, విశాఖపట్నం, విజయవాడల్లో మూడు కన్వెన్షన్ సెంటర్‌లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

### పర్యావరణంపై దృష్టి

పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి వైపరిత్యాల ప్రభావాన్ని తగ్గించడంపై కూడా బడ్జెట్ దృష్టి పెట్టింది. ప్రస్తుతం ఉన్న హరితావరణాన్ని 23 శాతం నుంచి 33 శాతానికి పెంచేందుకు చర్యలు చేపట్టారు. పర్యావరణ, అటవీశాఖలకు బడ్జెట్‌లో రూ. 357 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో కంటే ఇది 26 శాతం అధికం. ఎర్ర చందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ బృందం, శేషాచలం అడవుల్లో నిఘా కోసం సీసీ కెమేరాలు, రక్షణ కోసం ట్రెంచ్ ఫెన్సింగ్, ఎర్ర చందనం వార్షిక విక్రయాలకు నిబంధనలకు అనుగుణంగా దీర్ఘకాలిక నిబంధనలు రూపకల్పన మొదలైన చర్యలను ప్రకటించారు.

### వ్యవసాయ బడ్జెట్

2016-17లో వ్యవసాయ రంగానికి సంబంధించి ప్రత్యేక బడ్జెట్‌ను కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వ్యవసాయాన్ని తక్కువ వ్యయంతో లాభసాటిగా మార్చడం, రాష్ట్రాన్ని కరువు రహితంగా తీర్చిదిద్దడం బడ్జెట్ ముఖ్యాంశాలు...

1. 2016-17 వ్యవసాయ బడ్జెట్ రూ. 16,250.58 కోట్లు.
2. వ్యవసాయ శాఖ ప్రణాళిక వ్యయం. రూ. 1,311 కోట్లు.
3. వ్యవసాయశాఖ ప్రణాళికేతర వ్యయం రూ. 4,474 కోట్లు.
4. ఉచిత విద్యుత్ రూ. 3,000 కోట్లు
5. ఉపాధి హామీ రూ. 5,094 కోట్లు.
6. రైతు బజార్లు, ఉద్యాన యాంత్రీకరణ రూ. 102 కోట్లు.
7. సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ రూ. 95 కోట్లు.
8. తుంపర సేద్యం రూ. 369 కోట్లు
9. పట్టు పరిశ్రమలో ప్రణాళికేతర వ్యయం రూ. 125 కోట్లు.
10. వడ్డీలేని రుణాలు రూ. 177 కోట్లు.
11. వాతావరణ ఆధారిత బీమా పథకం రూ. 344 కోట్లు.
12. శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం రూ. 139 కోట్లు
13. సేంద్రీయ, సహజ వ్యవసాయం రూ. 68.67 కోట్లు.
14. వ్యవసాయ యాంత్రీకరణ రూ. 161.25 కోట్లు.
15. వ్యవసాయశాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది సామర్థ్యం పెంపు, విస్తరణ కార్యక్రమాలు రూ. 61.71 కోట్లు.


### ముగింపు

రూ. 4,848 కోట్ల మేర రెవెన్యూ ఖాతలో సుమారు 21 వేల కోట్ల వరకు ద్రవ్య పద్దులో లోటు ఉన్నట్లు బడ్జెట్ అంచనాలు తెలియజేస్తున్నాయి. కాగా విభజన చట్టంలోని హామీలను కేంద్రం నిలబెట్టుకోవాల్సిఉంది.

మొత్తం మీద ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితితో అద్భుతాలు అసాధ్యమని, కేంద్రం చేయూతను అందించకపోతే ముందుకు వెళ్ళడం కష్టమని తెలిసినా ఉన్న వనరులతోనే స్వశక్తిని నమ్ముకుని లక్ష్యాలను చేరుకోవడం ఉత్తమమనే ప్రభుత్వ ఆలోచనను బడ్జెట్ ప్రతిబింబిస్తోంది.

■

# సాగునీటి ప్రాజెక్టులకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చిన తెలంగాణ బడ్జెట్




**ఈ బడ్జెట్‌లో నీటిపారుదల రంగానికి గణనీయమైన రీతిలో నిధులు అందించేందుకు ప్రతిపాదనలు చేశారు. సాగు నీటిపారుదల ప్రాజెక్టులకు ప్రాధాన్యమిస్తూ ప్రణాళికా బడ్జెట్ కింద 25 వేల కోట్ల రూపాయలను కేటాయించారు. నిధులను సద్వినియోగం చేసుకుంటూ నీటిపారుదల పథకాలను సత్వరం పూర్తిచేసుకోవలసి ఉంది. సంక్షేమ రంగాలకు గతంతో పోలిస్తే గణనీయంగానే నిధులు కేటాయించారు. సంక్షేమ రంగానికి 2016-17 బడ్జెట్‌లో 13,412 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టనున్నారు.**

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం మార్చి 14వ తేదీన శాసనసభలో ప్రవేశ పెట్టిన 2016-17 ఆర్థిక సంవత్సరపు వార్షిక బడ్జెట్ రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రతిఫలించే విధంగా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సాగింది. ప్రణాళికేతర వ్యయం కంటె ప్రణాళికా వ్యయానికే ప్రాధాన్యమిచ్చి సాగిన బడ్జెట్‌గా దీనిని చెప్పుకోవచ్చు.

1,30,415.87 కోట్ల రూపాయల బృహత్తర అంచనాలతో తయారైన 2016-17 బడ్జెట్‌లో ప్రణాళికా వ్యయం రు.67,630.73 కోట్లు కాగా, ప్రణాళికేతర వ్యయం 62,785.14 కోట్ల రూపాయలు. 2015-16 సంవత్సరం బడ్జెట్‌ను రూ,115,000 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రతిపాదించారు.

నోళ్లు తెరిచిన బీడు భూములను సస్యశ్యామలం చేసే దిశగా, సాగునీటి ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేసేందుకు అలాగే గొంతెండుతున్న గ్రామాల దాహార్తిని తీర్చేందుకు ఈ బడ్జెట్‌లో వివిధ పథకాలకు మొత్తం ప్రణాళికా వ్యయంలో మూడవ వంతు నిధులను ఖర్చు చేసేందుకు ప్రతిపాదించారు.

### పెరిగిన తలసరి ఆదాయం....

రాష్ట్ర తలసరి ఆదాయం 2015-16 సంవత్సరంలో 10.7 శాతం పెరిగి రూ 1,43,023 ఉండవచ్చని కూడా రాష్ట్ర బడ్జెట్ అంచనా వేసింది. ఇదే ఏడాది జాతీయ సగటు తలసరి ఆదాయం రూ 93,231లు ఉందని, రాష్ట్ర తలసరి ఆదాయం అంతకంటే ఎక్కువే ఉందని బడ్జెట్ స్పష్టం చేసింది. 2014-15 సంవత్సరంలోనే తలసరి ఆదాయం 12.7 శాతం మెరుగై రూ 1,29,182గా లెక్కతేలినట్టు బడ్జెట్ సందర్భంగా ప్రభుత్వం తెలిపింది. అలాగే రాష్ట్ర స్థూల ఉత్పత్తి గణనీయంగా మెరుగుపడినట్టు కూడా బడ్జెట్‌లో ప్రస్తావించారు. 2015-16లో తెలంగాణా రాష్ట్ర స్థూల ఉత్పత్తి ప్రస్తుత ధరల ప్రకారం 11.67 శాతం మెరుగైన వృద్ధి సాధించగలదని అంచనా. వ్యవసాయం అనుబంధ రంగాలలో గత సంవత్సరంకంటె వృద్ధి తగ్గినప్పటికీ, 11.67 శాతం వృద్ధి సాధ్యపడింది. జాతీయ సగటు 8.6 శాతం కంటె ఇది అధికం.

### నీటిపారుదలకు నిధుల వరద....

ఈ బడ్జెట్‌లో నీటిపారుదల రంగానికి గణనీయమైన రీతిలో నిధులు అందిం చేందుకు

**రేపూరు ఉమామహేశ్వరరావు,** ప్రిన్సిపాల్, రచన జర్నలిజం కళాశాల

ప్రతిపాదనలు చేశారు. గోదావరి, కృష్ణా నదులలో తెలంగాణా రాష్ట్ర వాటా 1250 టిఎంసిలు కాగా, మరో 150 టిఎంసిలకు పైగా మిగులు జలాలలో తెలంగాణా వాటా ఉంది. ఈ నీటిని సద్వినియోగం చేసుకునే దిశగా వివిధ సాగు నీటిపారుదల ప్రాజెక్టులకు ప్రాధాన్యమిస్తూ ప్రణాళికా బడ్జెట్ కింద 25 వేల కోట్ల రూపాయలను కేటాయించారు. ఇందులో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 7861 కోట్ల రూపాయలు, కాళేశ్వరం ప్రాజెక్టుకు 6286 కోట్ల రూపాయలు, సీతారామ, భక్తరామదాసు ఎత్తిపోతల సాగునీటి ప్రాజెక్టులకు 1152 కోట్ల రూపాయలు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. గత ఏడాది సాగునీటి రంగానికి ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయం కన్నా సుమారు 15 వేల కోట్లరూపాయలు సాగునీటి రంగానికి అధికంగా ప్రతిపాదించారు.

2014-15 సంవత్సరంలో సాగునీటి రంగానికి 8100 కోట్ల రూపాయలు, 2015-16లో 11,271.42 కోట్ల రూపాయలు ప్రతిపాదించారు. వాటితో పోలిస్తే ఈ ఏడాది నీటిపారుదల రంగానికి గణనీయంగా నిధులు కేటాయించి నట్టయింది.

నీటిపారుదల పథకాలలో ముఖ్యంగా ఆయా ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ సమస్య ప్రధానంగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని సాగునీటి నిధులలో 5వేల కోట్ల రూపాయలను భూ సేకరణకు ప్రత్యేకించారు.

తెలంగాణా రాష్ట్రంలో ఎక్కువగా బోరుబావులపై ఆధారపడి వ్యవసాయం సాగుతోంది. భూగర్భజలాలు అడుగంటి పోకుండా చిన్న నీటి వనరులను పునరుద్ధరించుకునే చర్యలకూ ఈ బడ్జెట్‌లో మంచి ప్రోత్సాహమే కనిపించింది.

చిన్న నీటి వనరులకు ప్రస్తుత బడ్జెట్‌లో ప్రతిపాదించింది 2452.52 కోట్లరూపాయలు కాగా ఇందులో మిషన్ కాకతీయకు ఇవ్వనున్నది 1500 కోట్ల రూపాయలు.

రాష్ట్రంలో 46.54 లక్షల హెక్టార్ల సాగుభూమి ఉండగా ఇందులో 17.74 లక్షల హెక్టార్ల విస్తీర్ణానికి మాత్రమే సాగునీటి సదుపాయం ఉంది. వర్షపాతంపై ఆధార పడకుండా వ్యవసాయం కొనసాగించాలంటే నీటిపారుదల ప్రాజెక్టులు సత్వరం పూర్తి కావలసి ఉంది. ఇందుకు ప్రస్తుత బడ్జెట్ ఊతంగా నిధులను సద్వినియోగం చేసుకుంటూ నీటిపారుదల పథకాలను సత్వరం పూర్తిచేసుకోవలసి ఉంది.

**సంక్షేమానికి సంబరం.....**

ప్రస్తుత తెలంగాణా రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమ రంగాలకు గతంతో పోలిస్తే గణనీయంగానే నిధులు ఖర్చుచేసేందుకు ప్రభుత్వం ప్రతిపాదించింది. సంక్షేమ రంగానికి 2016-17 బడ్జెట్‌లో 13,412 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాలని సంకల్పించినట్టు ప్రభుత్వం తెలిపింది. గిరిజనుల అభివృద్ధికి ఈ బడ్జెట్‌లో 3752 కోట్ల రూపాయలు ఖర్చుచేసేందుకు ప్రతిపాదించారు. గత బడ్జెట్‌తో పోల్చిచూసినపుడు ఇది 874 కోట్ల రూపాయల మేరకు పెరిగింది. దళితుల అభివృద్ధికి 7,122 కోట్ల రూపాయలు ఖర్చుచేసేందుకు ప్రతిపాదించారు. దళితుల ఉప ప్రణాళికకు 2560 కోట్ల రూపాయలు సమకూర్చనున్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ప్రస్తుత బడ్జెట్‌లో 2538 కోట్ల రూపాయలు ప్రతిపాదించింది. గత ఏడాది కేటాయింపుల కంటే ఇది సుమారు 366 కోట్ల రూపాయలు అధికం.

మైనారిటీలకు 2015-16 బడ్జెట్‌లో 1104 కోట్ల రూపాయలు ప్రతిపాదించిన ప్రభుత్వం ఈ సారి 1204 కోట్ల రూపాయలను ప్రతిపాదించింది.

**వైద్య రంగానికి మహర్దశ...**

ఏ రాష్ట్రమైనా పురోభివృద్ధి సాధించాలంటే ప్రజారోగ్యం, వైద్య సదుపాయాలు సామాన్యులకు సైతం అందుబాటులో ఉండాలి. ఇందుకు అనుగుణంగా తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం పలు దీర్ఘకాలిక చర్యలతోపాటు సత్వర ఫలితాలనివ్వగల కార్యక్రమాలనూ చేపడుతోంది.

ఈ బడ్జెట్‌లో ఆరోగ్యరంగంలో తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం 5966.89 కోట్ల రూపాయలు ఖర్చు చేసేందుకు ప్రతిపాదించింది. 2015-16 ఆర్థిక సంవత్సరంలో ప్రణాళిక, ప్రణాళికేతర నిధులను కలుపుకుని 4,931.55 కోట్లు రూపాయలు కేటాయించింది. ప్రస్తుత బడ్జెట్‌లో సుమారు 1035 కోట్ల రూపాయలు పెంచింది. రాష్ట్రంలో మెరుగైన ఆరోగ్య పరిస్థితులు కల్పించడానికి ఇలాంటి చర్యలు దోహదపడతాయి.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు బలోపేతమైతే గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు సత్వరం అందుబాటులో ఉంటాయి. ఇందుకు అనుగుణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయి పెంచేందుకు 68 కోట్ల రూపాయలను ఖర్చుచేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 చోట్ల రక్త శుద్ధి కేంద్రాలు, 40 చోట్ల వ్యాధి నిర్ధారణ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. వరంగల్ ఎంజిఎం ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధికి సంకల్పించడం వల్ల ఆ ప్రాంత ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. ఖమ్మం, కరీంనగర్‌లలో అధునిక సౌకర్యాలతో కొత్త ఆస్పత్రులు, హైదరాబాద్ నగరంలో మరో నాలుగు బహుళ ప్రత్యేక వైద్య సేవలు కలిగిన వైద్యశాలలు ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు.

మహిళా శిశు సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో 1553 కోట్ల రూపాయలు కేటాయించారు.

ఈ చర్యలన్నింటితో రాష్ట్రంలో ఆరోగ్య సేవలు మెరుగయ్యేందుకు అవకాశం ఉంటుంది. ఆరోగ్య రంగంలో సాధించే అభివృద్ధి

ఆర్థిక అభివృద్ధిలో ప్రతిఫలిస్తుందని వేరుగా చెప్పనవసరం లేదు.

## సంస్కరణల పథంలో విద్యారంగం.....

విద్యపై పెట్టేపెట్టుబడి సమాజాన్ని సరైన దిశగా నడిపించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. విద్య దేశాభివృద్ధికి మౌలికమైనది. ప్రజల జీవన ప్రమాణాలు పెరగడానికి, ఇది ఉపయోగపడుతుంది. వ్యక్తిఎదగడానికి తద్వారా సమాజానికి ఇది ఎంతగానో దోహదపడుతుంది. ప్రాథమిక విద్యను పటిష్టం చేయడంతోపాటు మాధ్యమిక, ఉన్నత విద్యారంగాలపై పెద్దఎత్తున నిధులు ఖర్చుచేయాల్సిన అవసరాన్ని గుర్తిస్తూనే అందుకు ముందస్తుగా విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న పలు సమస్యలను గుర్తించి అందులో పెద్దఎత్తున సంస్కరణలుతెచ్చే ఆలోచనను ప్రభుత్వం వెల్లడించింది. ఇందుకు అనుగుణంగా విద్యాశాఖకు ప్రణాళికా వ్యయం కింద 1694 కోట్ల రూపాయలు, ప్రణాళికేతర వ్యయం కింద 9,044 కోట్ల రూపాయలు ప్రత్యేకించారు. పాఠశాల విద్య, ఉన్నత విద్య, సాంకేతిక విద్యలకు సంబంధించి మాత్రమే ఈ పద్దు. మెడికల్, అగ్రికల్చర్, వెటర్నరీ, మైనారిటీ విద్యకు, ఉపకార వేతనాలకు, ఎన్‌సి,ఎన్‌టి గురుకులాలకు వసతి గృహాలకు కేటాయింపులు ఇందుకు అదనం.

## ప్రత్యేక అభివృద్ధినిధి....

వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు అయ్యే వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని కేటాయింపు ప్రతిపాదనలు చేసినప్పటికీ ముందు ముందు ఆకస్మికంగా వచ్చే అవసరాలను దృష్టిలో ఉంచుకుని తక్షణం స్పందించి నిధులు సమకూర్చేందుకు ప్రత్యేక అభివృద్ధినిధి కింద 4,675 కోట్ల రూపాయలను కేటాయించారు.

## పారిశ్రామిక రంగానికి నిధులు.....

పారిశ్రామిక రంగానికి బడ్జెట్‌లో 967 కోట్ల రూపాయలు కేటాయించారు. రాష్ట్రంలో కొత్త పారిశ్రామిక విధానం అమలులోకి వచ్చినప్పటినుంచి 1609 యూనిట్లకు అనుమతులు ఇచ్చారు. ఈ పరిశ్రమల ద్వారా 33,101 కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. హైదరాబాద్ నగరంలో ఫార్మాసిటీ, వరంగల్‌లో టెక్స్‌టైల్ హబ్, మెదక్‌లో నేషనల్ ఇన్‌వెస్ట్‌మెంట్ మాన్యుఫాక్చరింగ్ జోన్‌ను ప్రారంభించనున్నట్టు కూడా ప్రభుత్వం ప్రకటించింది. దీనితో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి. అలాగే ఐటి కమ్యూనికేషన్ రంగానికి 254 కోట్ల రూపాయలను కేటాయించారు. తెలంగాణాలో 1300 ఐటి యూనిట్లు నమోదు కాగా, 2014-15లో ఐటి ఎగుమతుల విలువ 68,258 కోట్ల రూపాయలుగా ప్రభుత్వం వెల్లడించింది.

## రహదారుల అభివృద్ధితో ప్రగతి.....

రహదారులు అభివృద్ధికి రాచబాటలుగా చెప్పుకోవచ్చు. మండల కేంద్రాలను, జిల్లా కేంద్రాలకు, జిల్లా కేంద్రాలనుంచి రాష్ట్ర రాజధానికి రహదారుల విస్తరణ ద్వారా ఆయా ప్రాంతాలనుంచి సరకులు సత్వరం మార్కెట్లకు చేరడానికి, ప్రజా రవాణా సౌకర్యాలు మెరగు పడడానికి వీలుంటుంది. మూడేళ్ల వ్యవధిలో పదివేల కిలోమీటర్ల రహదారులను నిర్మాణం చేపట్టాలన్నది ప్రభుత్వ సంకల్పం. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం తెలంగాణా రాష్ట్రంలో 1600 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులను అభివృద్ధి చేయనున్నట్టు ప్రకటించింది. ఇందుకు సంబంధించి రహదారులు భవనాల శాఖకు ప్రభుత్వం 2016-17 సంవత్సరానికి 3790 కోట్ల రూపాయలు కేటాయించగా అందులో 457 కోట్ల రూపాయలు భవనాల నిర్మాణానికి కేటాయించారు.

ఇక 2015-16 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణా రాష్ట్ర స్వంత ఆదాయం 54,256.71 కోట్లుగా ఉంటుందని అంచనా. 2016-17 సంవత్సరంలో ఇది 72,412.23 కోట్లకు పెరగగలదని భావిస్తున్నారు. అలాగే 2016-17 సంవత్సరం బడ్జెట్‌లో రెవిన్యూ మిగులు 3,718.37 కోట్లుగా , ద్రవ్యలోటు 23,467.29 కోట్ల రూపాయలుగా ఉండవచ్చని అంచనా. ఇది తెలంగాణా రాష్ట్రస్థూల ఉత్పత్తిలో 3.5 శాతం. సాగునీటి రంగానికి కేటాయించిన నిధులను నిర్మాణ వ్యయంగా పరిగణించి నందువల్ల రెవిన్యూ మిగులును అధికంగా అంచనా వేశారు.

మొత్తంమీద ఏ ప్రభుత్వ బడ్జెట్ అయినా రాబోయే ఆర్థికసంవత్సరానికి చేయబోయే ఖర్చు, ఆ ఖర్చుకు సంబంధించి తమ ప్రభుత్వ ప్రాధాన్యతలను ఆవిష్కరిస్తుంది. బడ్జెట్‌లో ప్రతిపాదిత స్థాయిలో నిధులను సమకూర్చు కోవడం ఒక ఎత్తు అయితే, అలా సమకూర్చిన నిధులను, ఎప్పటికప్పుడు ఆయా రంగాల వారీగా సమీక్ష నిర్వహించుకుంటూ గరిష్ఠ ప్రయోజనం సాధించే దిశగా ఖర్చుచేసినప్పుడు బడ్జెట్‌లు సత్ఫలితాలను ఇవ్వగలుగుతాయి. ■


# యోజన


**యోజన** ఏప్రిల్, 2016 సంచిక **'ఈశాన్య భారతం'** ప్రధానాంశంగా వెలువడుతుంది.

**యోజన** (తెలుగు) పత్రిక చందా వివరాలు, చిరునామా మార్పు, పత్రిక అందకపోవడం వంటి విషయాలపై ఫోన్ నెం. 040-27546313కు నేరుగా సంప్రదించవచ్చు. **యోజన** పత్రిక చందాకు సంబంధించిన వివరాలకోసం yojana_telugu@yahoo.co.in మెయిల్ ద్వారా కూడా సంప్రదించవచ్చు.

*- సీనియర్ ఎడిటర్*

ముందు జాగ్రత్తలు

# ప్రపంచ ఆర్థిక సమస్య - భారత్‌లో సంస్కరణల ప్రభావం



**ఆహార దినుసుల ధర 10 శాతం పెరిగితే, దారిద్ర్య రేఖ దిగువనున్న వారి సంఖ్య 2.5 శాతం పెరుగుతుంది. అంటే మన ఆకాశ హర్మ్యాలు, మాల్‌లు, సూపర్ మార్కెట్లు, ఐమాక్స్‌ల జిలుగు వెలుగుల ధగధగలు మనలను గుడ్డివాళ్లను చేశాయి. భారతదేశం లాంటి ఆర్థిక వ్యవస్థల్లో స్థిరమైన ఆర్థిక విస్తరణకు ఉత్పాదక ఉపాధి ముఖ్యసాధనం లాంటిది. ఆదాయ సమాన పంపిణీ, పేదరిక నిర్మూలనకు ఉపాధి కల్పనల ప్రాధాన్యత ఎంతో ఉంది. కానీ, భారత ఆర్థిక వ్యవస్థలో ఎంచుకొన్న కొన్ని రంగాల్లోనే శ్రామిక ఉత్పాదకత, ఉపాధికి ప్రాధాన్యత నిచ్చినందువల్ల ఆర్థికాభివృద్ధి సాధ్యం కాలేదు.**

"ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సమస్య అత్యంత ప్రాధానాన్ని సంతరించుకుంటోంది. గతంలోలాగా ఏ ఒక్క దేశానికో, ఖండానికో పరిమితం కాక, విషక్రిమి శరీరం నరనరానా పాకినట్టు ఈ ఆర్థిక సమస్య అన్ని దేశాలకూ పాకుతోంది. అభివృద్ధిని అడ్డుకుంటోంది. ప్రజల జీవితాలను దుర్భరం చేస్తోంది. కొద్దికాలం కిందటివరకు విచ్చలవిడిగా మార్కెట్లో పొంగి పొర్లిన డబ్బు ఇప్పుడు కరవై ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.

అమెరికా ఆర్థిక సంక్షోభాన్ని గమనిస్తే, ప్రపంచంలో ఇతర దేశాల ఆర్థిక సమస్యల స్వరూపం స్పష్టమౌతుంది. అమెరికా ఆర్థిక అభివృద్ధి, ప్రజల కొనుగోలు శక్తి ఆధారంగా ఎదిగింది. కార్లు, టీవీలు, ఫ్రిజ్‌లు ఇలా విచ్చలవిడిగా కొనటంవలన అమెరికాలో డబ్బు చలామణి పెరిగింది. 1980లో అమెరికన్లు జాతీయాదాయంలో 63 శాతం వస్తువులు కొనటంలో ఖర్చు చేశారు. (ఇవి నిత్యావసర వస్తువులు కావు), గత అయిదేళ్ళలో ఇది 70 శాతానికిచేరింది. అంటే సంవత్సరానికి ఒక ట్రిలియన్ డాలర్లకు పైగా కేవలం లగ్జరీ వస్తువుల కొనుగోలుకు ఖర్చు చేశారన్నమాట. ఇందువల్ల అమెరికన్లు డబ్బు నిల్వ చేయడం కన్నా ఖర్చు చేయడం ఎక్కువైంది. ఈ ఖర్చు ఆదాయాన్ని మించింది. అంటే అమెరికా ఆర్థిక వ్యవస్థ నిలబడాలంటే ప్రజల ఆదాయం అధికంగా ఉండాలన్నమాట. ఆర్థిక ఆదాయం వెల్త్ ఎఫెక్ట్‌కు దారితీస్తుంది అంటారు ఆర్థిక శాస్త్రవేత్తలు. వెల్త్ ఎఫెక్ట్ వల్ల వడ్డీ తగ్గుతుంది. కొనుగోలు పెరుగుతుంది. స్టాక్‌ల విలువ పెరుగుతుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరుగుతుంది. 1980లో 9.7 మిలియన్ల మంది అమెరికన్లు స్టాక్ వ్యాపారం చేసేవారు. 2000 కల్లా వీరి సంఖ్య 97.6 మిలియన్‌లకు పెరిగింది. ఇలా వచ్చిన ఆదాయన్ని కూడా ప్రజలు ఖర్చు పెట్టారు. పైగా స్టాక్‌లవల్ల వచ్చే ఆదాయాన్ని ఎల్లప్పటికీ అందే 'జీతం'గా భ్రమ పడి అనేక ఆర్థిక లావాదేవీల్లోకి దిగారు. 2004 కల్లా 75 శాతం అమెరికన్లు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్నారు. మానసిక శాస్త్రవేత్త స్టువర్ట్ వైన్ ఈ అప్పుల మనస్తత్వాన్ని 'గోయింగ్ బ్రోక్' అనే పుస్తకంలో చక్కగా వివరించాడు. దీన్ని ఆయన కలెక్టివ్ లాస్ ఆఫ్ సెల్ఫ్ కంట్రోల్ (సామూహిక ఆత్మ నియంత్రణ రాహిత్యం) గా అభివర్ణించాడు. ఇందువల్ల ఒక్కసారిగా ఆర్థిక

**జి. అనూష,** పరిశోధక విద్యార్థి, కాకతీయ విశ్వవిద్యాలయం,
చరవాణి - 9177513988. E-mail: lasya.anusha567@gmail.com

సంక్షోభం వచ్చి పడగానే ప్రజలు బెంబేలెత్తి పోయారు. ఆదాయం పడిపోవడంతో కంగారు పడ్డారు. ఆహార ధరలు, పెట్రోలు ధరలు పెరిగిపోవడంతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ఇళ్ల రుణాలు కట్టడం మానేశారు. క్రెడిట్ కార్డు అప్పులు ఎగవేయడం మొదలుపెట్టారు. అనవసర ఖర్చులు తగ్గించేశారు. ఇది ఒక్కసారిగా జరగటంతో అంతవరకూ లాభాల్లో ఉన్న సంస్థలు హఠాత్తుగా నష్టాల్లోకి దిగిపోయాయి. ప్రజలలో భయాందోళనలను పెంచింది. దీన్ని 'కాక్రోచ్ సిండ్రోమ్' అంటారు. ఇంట్లో ఒక బొద్దింక కనిపిస్తుంది. అంటే అర్థం, ఇంట్లో ఇంకా బోలెడన్ని బొద్దింకలు పొంచి ఉన్నాయని. అలాగే, ఒక సమస్య వెలికి వచ్చిందంటే అర్థం, ఇంకా అనేక సమస్యలు పొంచి ఉన్నాయని, ఆర్థిక వ్యవస్థకూ ఇది వర్తిస్తుంది. అందుకే పెద్దలంటారు, కష్టాలెప్పుడూ ఒంటరిగా రావని, వాటిని కలిసి ఎదుర్కోవా లంటే అందరూ కలికసిట్టుగా నిలబడాలని.

## పెరిగిన దారిద్ర్య రేఖ

అసలే ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు, వరల్డ్ బ్యాంకులు మార్చిన దారిద్ర్య రేఖ ప్రామాణాలు ఆసియా దేశాలలో దరిద్ర్యాన్ని మరింత పెంచాయి. వేర్వేరు దేశాలలోని ఒకే రకమైన వస్తువుల ధరలు, వాటి కొనుగోలు శక్తి ఆధారంగా ఆయా దేశాల దారిద్ర్య రేఖను నిర్ణయిస్తాయి. 1990 ప్రాంతాలలో, రోజుకు ఒక డాలర్, అంతకంటే తక్కువ సంపాదించే వారంతా దారిద్ర్య రేఖకు దిగువనున్న వారిగా పరిగణిస్తారని ప్రపంచ బ్యాంకు నిర్ణయించింది. ఆరోగ్యంగా ఉండేందుకు వ్యక్తికి సగటున 2100 కాలరీలు అవసరమ వుతాయన్న సూత్రం ఆధారంగా దారిద్ర్య రేఖను నిర్ణయించారు. కానీ, ప్రస్తుతం ఏడిబి, వరల్డ్ బ్యాంకులు వేర్వేరుగా జరిపిన సర్వేల ఫలితంగా దారిద్ర్య రేఖ విలువను పెంచారు. దాంతో ఆ రేఖ దిగువన ఉన్నవారి సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నూతన అంచనాల ప్రకారం రోజుకు 1.35 డాలర్లు అంతకన్నా తక్కువ సంపాదించే వారంతా దారిద్ర్య రేఖకు దిగువ వున్నట్టే. వరల్డ్ బ్యాంకు ప్రకారం ఇది 1.25 డాలర్లే! దారిద్ర్య రేఖను నిర్ణయించేందుకు ఏడిబి 16 దేశాల్లో విస్తృతమైన సర్వేలు జరిపింది. తక్కువ ధర బియ్యం, ఒక కిలో, అంతకన్నా తక్కువ చిన్న దుకాణాల నుంచి కొనేవారిని, సూపర్ మార్కెట్ల నుండి బియ్యం కొనేవారిని సర్వేచేసి, ఈ నిర్ణయానికి వచ్చింది ఏషియన్ బ్యాంకు. అయితే ఈ రెండు బ్యాంకుల ప్రామాణికాల ఆధారంగా చూస్తే, మన దేశంలో దారిద్ర్య రేఖ దిగువనున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. మన దేశంలో రోజుకు 1 డాలర్ కన్నా తక్కువ సంపాదించే వారి సంఖ్య 319 మిలియన్లు.

ఇప్పుడు ప్రామాణికాలను పెంచటం వల్ల వరల్డ్ బ్యాంకు ప్రకారం వీరి సంఖ్య 455 మిలియన్లు. ఏషియన్ బ్యాంకు ప్రకారం 622 మిలియన్లు అవుతుంది. బంగ్లాదేశ్, ఇండోనేషియా, ఫిలిప్పీన్లు మరింత పేద దేశాలుగా నిర్ధారణ అయింది. ఇప్పుడు పెరుగుతున్న ఆహార ధరలను పరిగణనలోకి తీసుకుంటే, ఈ సంఖ్యలు మరింతగా పెరుగుతాయి. ఆహార దినుసుల ధర 10 శాతం పెరిగితే, దారిద్ర్య రేఖ దిగువనున్న వారి సంఖ్య 2.5 శాతం పెరుగుతుంది. అంటే మన ఆకాశ హర్మ్యాలు, మాల్‌లు, సూపర్ మార్కెట్లు, ఐమాక్స్‌ల జిలుగు వెలుగుల ధగధగలు మనలను గుడ్డివాళ్లను చేశాయి. మనం కళ్లు తెరిచేసరికి ఆ వెలుగుల నీడన పొంచివున్న దారిద్ర్యం ప్రస్ఫుటమవుతుందన్న మాట. ఈ ధనికులు మరింత ధనవంతులవు తుంటే, మధ్య తరగతివారు కొత్త పేదలు అవుతున్నారన్నమాట.

ప్రపంచీకరణ, సరళీకృత విధానాల నేపథ్యంలో స్థూల ఆర్థిక సంస్కరణలు, శ్రామిక విధానాలు భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. భారతదేశం అధిక వృద్ధి రేటు సాధించడానికి ప్రపంచీకరణ దోహదపడింది. ఈ నేపథ్యంలో భారత్ అనేక రంగాల్లో సాధించిన విజయాలు అంతర్జాతీయ మీడియా వెలుగులోకి తెచ్చినప్పటికీ, వాస్తవ పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది.

## నిర్మాణాత్మక సర్దుబాట్లు, సరళీకరణ

ఆర్థిక సంస్కరణల్లో భాగంగా, నిర్మాణాత్మక సర్దుబాటు విధానాలు క్రింది లక్ష్యాలను కలిగి ఉంటాయి.

1) సామర్థ్య కల్పన, ఉత్పత్తి, ధరలపై నియంత్రణలను పూర్తిగా తొలగించడం.

2) అంతర్జాతీయ పోటీని అనుమతించడం, అంతర్జాతీయ సాపేక్ష ధరలు ఆర్థిక ఏజెంట్లు నిర్ణయాలను ప్రభావితం చేయడం.

3) సాధ్యమైన మేరకు ఉత్పత్తి, వాణిజ్యంలో రాష్ట్ర ఏజెన్సీల పాత్ర తగ్గించడం.

4) బ్యాంకింగ్ రంగంలో నియంత్రణలు తొలగించడం ద్వారా విత్త రంగాన్ని సరళీకరించడం.

భారతదేశం లాంటి ఆర్థిక వ్యవస్థల్లో స్థిరమైన ఆర్థిక విస్తరణకు ఉత్పాదక ఉపాధి ముఖ్యసాధనం లాంటిది. ఆదాయ సమాన పంపిణీ, పేదరిక నిర్మూలనకు ఉపాధి కల్పనల ప్రాధాన్యత ఎంతో ఉంది. కానీ, భారత ఆర్థిక వ్యవస్థలో ఎంచుకొన్న కొన్ని రంగాల్లోనే శ్రామిక ఉత్పాదకత, ఉపాధికి ప్రాధాన్యత నిచ్చినందువల్ల ఆర్థికాభివృద్ధి సాధ్యం కాలేదు. ఆర్థిక వృద్ధి మందగించడానికి ఎగుమతులలో తీవ్ర నిరాశావాదం, ప్రధాన కారణమని ఆర్థిక నిపుణుల ఆభిప్రాయం, ఆర్థిక వ్యవస్థలో

సరళీకృత విధానం ఎక్కువగా లభ్యమవుతున్న శ్రామిక వనరుల వినియోగాన్ని ప్రోత్సహిస్తుంది.

**మౌలిక సదుపాయల పట్ల నిర్లక్ష్యం**

1980ల్లో గ్రామీణ ఉపాధి కల్పన దృష్టి వ్యవసాయ రంగం, ప్రాథమిక కార్యకలాపాల నుంచి ద్వితీయ, సేవారంగాల వైపు మళ్లింది. తద్వారా దేశంలోని అనేక ప్రాంతాల్లో గ్రామీణ ఉపాధి పెరిగి గ్రామీణ పేదరికం తగ్గింది. 1990ల్లో ఈ విధానాలు సత్ఫలితాలనివ్వలేదు. 1991లో అవలంబించిన స్థూల ఆర్థిక వ్యూహాలవల్ల సంఘటిత రంగంలో ఉపాధి కల్పన స్తంభించడంతో పాటు ప్రభుత్వ రంగంలో ఉపాధి తగ్గింది. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వ రెవెన్యూ వ్యయం గ్రామీణాభివృద్ధిపై తగ్గింది. మౌలిక సౌకర్యాలు, ఇంధన రంగాలపై పెట్టుబడులు తగ్గాయి. ఈ కారకాలు గ్రామీణ ప్రాంత అభివృద్ధిపై రుణాత్మక ప్రభావాన్ని చూపాయి. ఉపాధి రంగాలకు ముఖ్యమైన విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్య రంగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఈ రంగాలపై తగ్గిన ప్రభుత్వ వ్యయం రెండు విధాలైన ప్రభావాలకు కారణమైంది. ఒకవైపు ఉద్యోగిత తగ్గడంతో పాటు సాంఘిక అవసరాలను నెరవేర్చడంలో విఫలమయ్యాం. విత్త రంగంలో సరళీకరణ గ్రామీణ పరపతి లభ్యత తగ్గడానికి గ్రామీణాభివృద్ధి క్షీణత కారణమైంది. 1990ల్లో ఉపాధి కల్పన రేటు పట్టణ ప్రాంతాల్లో తగ్గింది. మహిళలు, పురుషుల్లో పనిలో పాలుపంచుకొనే రేటులో ఒడిదొడుకులు ఏర్పడ్డాయి. మహిళల పని కల్పన రేటు గణనీయంగా తగ్గింది. ప్రభుత్వ రంగ ఉపాధి తగ్గినందువల్ల (సంఘటిత రంగంలో ఉపాధి) పారిశ్రామిక ఉత్పత్తి, సేవారంగాల్లో విస్తరణ సాధ్యమైంది.

**వేతన – ఉపాధి**

సమిష్టి డిమాండ్ లోపించినందువల్ల నిరుద్యోగిత ఏర్పడుతుంది. ఇది ఉత్పత్తి, శ్రామిక వినియోగ స్థాయిని నిర్ణయిస్తుందని ప్రముఖ ఆర్థిక వేత్తలు కీన్స్, కాల్సెకీ అభిప్రాయపడ్డారు. కీన్స్ కన్నా ముందున్న ఆర్థిక వేత్తల అభిప్రాయంలో శ్రామిక సంఘాలు రక్షితమైన, సమర్థమైన శ్రామిక చట్టాలు... యాజమాన్య వర్గాలకు వేతనాల వ్యయాన్ని పెంచుతాయని అన్నారు, వీరి అభిప్రాయంలో వాస్తవిక వేతనాలు, నిరుద్యోగితకు విలోమ సంబంధం ఉంటుంది. వేతనాల తగ్గుదలను అనుమతించినట్లయితే ఉపాధి పెరిగి తద్వారా పనిచేయడానికి ఇష్టపడే వారందరకీ ఉపాధి లభిస్తుంది. శ్రామిక మార్కెట్‌లో నియంత్రణలను తొలగించి స్వేచ్ఛగా పనిచేయడానికి అనుమతించినట్లయితే పూర్ణోద్యోగిత సాధ్యమవుతుందని కీన్స్ ముందున్న ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు. వీరి సిద్ధాంతానికి ఇటీవల కాలంలో మద్దతు పెరిగింది. వీరి వాదన 1990ల్లో భారతదేశ ఆర్థిక వ్యవస్థలో సరళీకృత విధానాల యుంగంలో ఉపాధి కల్పన ప్రగతి అధ్యయానానికి ఉపయోగపడింది. అయితే తయారీ రంగంలో ఉపాధి కల్పన రేటు తగ్గుదలను పరిశీలించనప్పుడు వాస్తవిక వేతనాలు ఉపాధి మధ్య విలోమ సంబంధం ఉన్నట్లు ఏలాంటి ఆధారం లభించలేదు. దీనికి బదులుగా ఉత్పత్తి వృద్ధి రేటు, సాంకేతిక ప్రగతి ఉపాధిని ప్రభావితం చేసినట్లుగా కనిపిస్తోంది. సాంకేతిక మార్పులు శ్రామిక ఉత్పాదన పెరిగి అధిక వేతనాలు సాధ్యమయ్యాయి. బడ్జెట్ అడ్డంకులు, వేతన బిల్లు తగ్గించుకోవాలనే ప్రభుత్వ దృక్పథం వల్ల ప్రభుత్వ రంగంలో వేతనాలు, ఉద్యోగిత మధ్య అంతరం ఏర్పడింది. ఈ స్థితి సంఘటిత రంగంలో ఉపాధి తగ్గడానికి కారణమైంది.

**మహిళా ఉపాధి**

1990ల్లోనూ, తర్వాత కాలంలోనూ తయారీ రంగంలో మహిళా ఉపాధి తగ్గింది. తయారీ రంగ ఉత్పత్తులకు అంతర్జాతీయ పోటీ పెరగడం, పారిశ్రామిక 'కాపిటలిస్ట్ ప్రొడక్షన్' ఒత్తిడి పెరగడం లాంటివి మహిళా ఉపాధి తగ్గడానికి కారణం.

పీస్ రేటు ఆధారంగా గృహ ఆధారిత సబ్ కాంట్రాక్టింగ్ కార్యకలాపాల్లో మహిళల ఉపాధి పెరిగింది. తయారీరంగం, కొన్ని పరిశ్రమలు... ముఖ్యంగా వినియోగతేర వస్తువుల విషయంలో సబ్ కాంట్రాక్టింగ్ పెరిగింది.

కేరళలో జీడి మామిడి, కొబ్బరి నార ప్రాసెసింగ్ పరిశ్రమ, తిరుపూర్‌లోని అల్లికల పరిశ్రమల్లో మహిళా ఉపాధి ఎగుమతి ఆధారిత ఉత్పత్తిదారులకు ఎక్కువగా లభ్యమవుతోంది. ఉత్పత్తిలో ఎక్కువ అనిశ్చితత్వం, డిమాండ్‌లో ఒడిదొడుకులు, సీజనల్ సంబంధ నిరుద్యోగం ముఖ్య లక్షణాలుగా ఉన్న ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమల్లో మహిళా ఉపాధి ఎక్కువ. ఎగుమతి ఆధార పరిశ్రమల్లో మహిళల ఉద్యోగిత తిరోగమనంలో ఉండటంతో వేతనాలు కూడా తక్కువగానే ఉన్నాయి. ఐటి, ఐటి ఆధారిత రంగాలు 1990ల్లో భారత ఎగుమతుల్లో అతివేగంగా వృద్ధి చెందుతున్న రంగాలుగా నిలిచాయి. విద్యావంతులకు ఉపాధి అందించే సామర్థ్యంతో పాటు ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో విద్యావంతులైన మహిళలకు లాభోపేతమైన టర్మ్‌లో ఉపాధిని ఈ రంగం అందించింది. 1990ల్లో పట్టణ విద్యావంతుల్లో నిరుద్యోగితా రేటు తగ్గడానికి ఈ రంగం సాధించిన వృద్ధి ప్రధాన కారణం. మరోవైపు సాఫ్ట్‌వేర్, ఐటీ ఆధారిత రంగాలు అందించిన ఉపాధి ముఖ్యంగా ధనికులు, పట్టణ ప్రాంతాల్లోని ఇంగ్లీష్ చదువుకున్న

*తరువాయి 68వ పేజీలో...*

# మహిళారోగ్యం - పౌష్టికాహార లోపం



**మహిళ గర్భం ధరించినప్పటి నుండి, బిడ్డకు రెండవ జన్మదినం వరకూ వుండే వెయ్యి రోజులకు ఎంతో ప్రాధాన్యమున్నది. గర్భవతిగా ఉన్నప్పుడు సరైన పౌష్టికాహారం బిడ్డ పెరుగుదలకు ఎంతో అవసరం. తల్లి గర్భవతిగా ఉన్నప్పుడు, బిడ్డ మొదటి సంవత్సరం నిండేవరకూ తీసుకునే బలమైన ఆహారమే బిడ్డ మెదడు సక్రమంగా వికసించడానికి, పటిష్టమైన రోగనిరోధక వ్యవస్థ ఏర్పడటానికి తోడ్పడుతుంది.**

"అనారోగ్యం, పౌష్టికాహార లోపం రెండూ పరస్పర ఆధారితాలు. ఐక్యరాజ్యసమితి వారి పౌష్టికాహార స్థాయిసంఘం వారి అంచనాల ప్రకారం, అనేక వ్యాధులకు పౌష్టికాహార లోపం ఒక్కటే ప్రధాన కారణంగా కూడ ఉన్నది. మరికొన్ని రోగాలకైతే, కేవలం పౌష్టికాహార లోపమే ప్రధాన కారణం. పిన్న వయస్సులోనే పౌష్టికాహార లోపం కలిగితే, పిల్లలకు శారీరక, మానసిక పెరుగుదల లోపిస్తుంది. ఉదాహరణకు, అభివృద్ధి చెందుతున్న దేశాలలో, 147 మిలియన్ల మంది పిల్లలు, ఇంకా బడిలో చేరకముందే, ఈ లోపం బారిన పడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా, ఈ మహమ్మారి పిల్లల మరణాలలో 45 శాతం వరకూ కారణమవుతున్నది. ఈ లోపం కనీస స్థాయిలో ఉన్నా సరే, వ్యాధులు వచ్చే అవకాశం రెట్టింపు అవుతున్నది. సూక్ష్మ పోషకాలలో ప్రధానంగా, విటమిన్ 'ఎ' లోపం వల్ల రోగ నిరోధక శక్తి తగ్గిపోయి, మరణాలు సంభవిస్తున్నాయి. దీనికారణంగా ప్రతి సంవత్సరమూ, పది లక్షల మంది పిల్లలు మరణిస్తున్నారు. మహిళల్లోనైతే, దీనికారణంగా ప్రతి సంవత్సరమూ, 60 వేలమంది మరణిస్తున్నారు. 'బి' విటమిన్ లోపం వల్ల, 2.5 లక్షల మంది లోపాలతో జన్మిస్తున్నారు. అంతేకాదు, ప్రతి సంవత్సరం, అయోడిన్ లోపం కారణంగా 18 మిలియన్ల మంది శిశువులు మానసికవైకల్యంతో (CRETINISM) జన్మిస్తున్నారు. ఐరన్ లోపం తల్లుల శరీరాన్ని, ముఖ్యంగా గర్భసంచీ, జనన మార్గాన్ని బలహీనపరచి, తల్లీ-బిడ్డల మరణాలకు కారణమవుతున్నది. (ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక-2000). పౌష్టికాహార లోపం దేశ ఆర్థిక వ్యవస్థను కూడ దెబ్బ తీస్తున్నది. ఉదాహరణకు, రక్తహీనత పిల్లల్లో నేర్చుకనే శక్తిని బలహీనపరచి, పెద్దలలో ఉత్పాదకతను దెబ్బతీస్తున్నది. దీనివల్ల కేవలం ఆసియాలోనే సాలుకు, ఐదు బిలియన్ల అమెరికన్ డాలర్లమేర నష్టం జరుగుతున్నది.

**ఆరోగ్యం-పౌష్టికాహార లోపాల మధ్య తరాలుగా కొనసాగుతన్న బంధం.**

తరతరాలుగా పెరుగుదల దెబ్బతినడం అనే లక్షణాన్ని మొదటగా 1992లో గుర్తించారు. అంటే తల్లి ఆరోగ్యం కృశిస్తే దాని ప్రభావం బిడ్డపై ఎలా పడుతుందో అధ్యయనం చేశారు. కనుక, మహిళల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. పోషకాహారలోపంతోవున్న అమ్మాయిలు యుక్త వయస్సు వచ్చినా ఈసురోమంటూనేవుంటారు. దీనివల్ల వారి

**మీరా మిశ్రా,** కంట్రీకోఆర్డినేటర్, UNIFAD
E-mail: m.mishra@ifad.org

మొత్తం ఆరోగ్యమే దెబ్బతిని, ముఖ్యంగా చిన్న వయసులోనే గర్భం ధరిస్తే, మరిన్ని అనారోగ్యాలకు దారితీస్తున్నది. పెరుగుదల నిలిచిపోయిన, లేదా రక్తహీనతతో ఉన్న టీనేజి తల్లులు, ప్రసవ సమయంలోగానీ, ప్రసవం తరువాత గానీ తీవ్ర అనారోగ్యాలకు గురవడమే కాక, పుట్టే పిల్లలు కూడ నెలలు తక్కువగా పుట్టడమో, లేదా తక్కువ బరువుతో పుట్టడమో జరుగుతున్నది. త్వరత్వరగా వచ్చే గర్భాలు, అధికశ్రమ, పౌష్టికాహారం తీసుకోకపోవడం, లింగవివక్షత మరియు ఆరోగ్యంపై శ్రద్ధ లేకపోవడం వంటి కారణాలతో, మహిళలు అధికంగా పౌష్టికాహార లోపానికి గురవుతున్నారు.

## మొదటి వెయ్యి రోజుల ప్రాధాన్యత


మహిళ గర్భం ధరించినప్పటి నుండి, బిడ్డకు రెండవ జన్మదినం వరకూ వుండే వెయ్యి రోజులకు ఎంతో ప్రాధాన్యమున్నది. గర్భవతిగా ఉన్నప్పుడు సరైన పౌష్టికాహారం బిడ్డ పెరుగుదలకు ఎంతో అవసరం. దీనివల్ల బిడ్డ తాను ఆరోగ్యంగా ఉండటమేకాక, సమాజానికి కూడ సక్రమంగా ఉపయోగ పడతాడు. తల్లి గర్భవతిగా ఉన్నప్పుడు, బిడ్డ మొదటి సంవత్సరం నిండేవరకూ తీసుకునే బలమైన ఆహారమే బిడ్డ మెదడు సక్రమంగా వికసించడానికి, పటిష్టమైన రోగనిరోధక వ్యవస్థ ఏర్పడటానికి తోడ్పడుతుంది. ఇలా సరైన పౌష్టికాహారం తీసుకోవడం వల్ల:

- బిడ్డ మెదడు ఆరోగ్యవంతంగా రూపొంది, సంపూర్ణవికాసానికి తోడ్పడుతుంది.
- పాఠశాలకు వెళ్ళే వయసునాటికి బిడ్డను చురుకుగా రూపొందిస్తుంది.
- ఆరోగ్యంలో, నేర్చుకోవడంలో, తరువాతి జీవితంలో సంపాదించడంలోనూ వ్యత్యాసాలను తొలిగిస్తుంది.
- వ్యక్తులు మధుమేహం, గుండె జబ్బులు వంటి దీర్ఘకాలిక అనారోగ్యల బారిన పడకుండా రక్షిసుంది.
- ప్రతి సంవత్సరమూ మిలియన్‌కు పైగా జీవితాలను రక్షిస్తుంది.
- దేశ స్థూల దేశీయోత్పత్తిని 12 శాతానికి పైగా పెంచుతుంది.
- తరాలమధ్య పేదరిక పీడను తొలగిస్తుంది.

## మనదేశంలో పరిస్థితి – స్పందన

పౌష్టికాహార లోపాన్ని తగ్గించి మరింత ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలనే నిశ్చయంతో ఉన్నప్పటికీ, మనదేశం అన్ని పౌష్టికాహార సూచికలలోనూ వెనుకబడింది. పిల్లలపై ఇటీవల నిర్వహించిన ఒక సర్వేలో ఐదు సంవత్సరాలకన్నా తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో 38.7 శాతం పెరుగుదల నిలిచిపోయినవారనీ, 42.5 శాతం మంది తక్కువ బరువుతో ఉన్నారనీ, తెలుస్తున్నది.

**పోషకాహారలోప జీవితచక్రం**




ACC/SCN-21వ శతాబ్దపు పోషణ సమస్యలపై నియమితులైన సంచాలకుల నుండి స్వీకరించిన విషయం

ఎదుగుదల ఆగిపోవడమంటే, దీర్ఘకాలిక పౌష్టికాహార లేమితో ఉన్నవారు, తీవ్ర పౌష్టికాహార లేమి వల్ల తక్కువ బరువుతో పుట్టినవారు అని అర్థం. ఈ రెండు సమస్యల తగ్గుదల 2006 వరకూ అతినెమ్మదిగా సాగింది. మూడవ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే తరువాత, వేగంపుంజుకుని, 2006–14 సంవత్సరాల మధ్య 2.3 శాతం తగ్గింది. ఈ పౌష్టికాహారలేమిని నియంత్రించడానికి అనేక చర్యలను తీసుకున్నారు. ప్రభుత్వంలోని అనేక విభాగాలు, మంత్రిత్వశాఖలు అనేకరాకాల కార్యక్రమాలలో ముందుకు వచ్చాయి. ముఖ్యంగా కేంద్ర మహిళ శిశు వికాస మంత్రిత్వశాఖలోని ఐసిడిఎస్ విభాగం, పౌష్టికాహారలోప నివారణకు విశేష కృషి చేస్తున్నది. దీనికోసం అదనపు పోషకాహారం, ఆరోగ్య పరీక్షలు, టీకాలు మొదలైన సేవలను సమగ్రంగా అందచేస్తున్నది. కేంద్ర ఆహార–పౌరసరఫరాల మంత్రిత్వశాఖ సరసమై ధరలకు ఆహారపదార్థాలను అందచేస్తున్నది. గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వశాఖ ఉపాధిహామీ వంటి పథకాల ద్వారా కుటుంబాలకు తగిన ఆదాయానికి హామీ ఇస్తున్నది. మానవ వనరుల మంత్రిత్వశాఖ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నది. వీటి వల్ల పేదవర్గాలలో ఆకలిని నియంత్రించడం కొంతవరకు సాధ్యపడింది. అలాగే ప్రైవేటు రంగంలో కూడ అనేక చర్యలను చేపట్టడం వలన, లక్ష్యసాధన మరింత సులువయింది.

## రాష్ట్రాల చర్యలు – ఉత్తరాఖండ్ ప్రస్తావన

ఈ రాష్ట్రంలో మహిళా సమాఖ్యలు, ఐసిడిఎస్ పాఠశాలలకు రాగులు వంటి చిరుధాన్యాలను సరఫరా చేస్తున్నాయి. వీటి గ్రేడింగ్ పనికోసం, సమాఖ్యలోని మహిళా సభ్యులకు పాకెట్‌కు ఒకరూపాయి చొప్పున కమీషన్ ఇస్తారు. ఒక్కొక్క సభ్యురాలు రోజుకు 4–5 గంటలు పనిచేసి, 150 నుండి 200

పాకెట్లను తయారుచేయగలదు. దీనిమీద ఆదాయం 10 శాతం లాభం రూపంలో ఉంటుంది. ఫెడరేషన్ రైతులకు, కిలో రాగులకు, 10 నుండి 15 రూపాయలు చెల్లిసుంది. దీనితో రైతులు కూడ ఉత్సాహంతో సంప్రదాయ పంటలవైపు మళ్లుతున్నారు. 2014–2015 సంవత్సరంలో ఐసిడిఎస్–మహిళ ఫెడరేషన్లు ఈ మేరకు ఒక అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఆ సంవత్సరం, రూ. 25.3 మిలియన్ల టర్నోవర్‌తో రూ. 2.3 మిలియన్న లాభాన్ని ఆర్జించాయి. ఏప్రిల్, 2014 నుండి డిసెంబర్, 2014 వరకూ, 7,500ల మంది గర్భవతులకూ, 22,430 మంది పాలిచ్చే తల్లులకు ప్రయోజనం కలిగింది.

**ముగింపు**

ఇటీవలే వెలుగుచూసిన ఇండియా హెల్త్ రిపోర్ట్ పౌష్టికాహారంపై ఆరు సూచనలను చేసింది. వారి నివేదిక ప్రకారం.

1) పిల్లలలో, ముఖ్యంగా గత దశాబ్ద కాలంలో, పిల్లలలో పెరుగుదల ఆగిపోవడం అనే సమస్య కొంతవరకూ నియంత్రించబడింది.
2) పౌష్టికాహార సమస్యను మెరుగుపరచడం అనేది, మన ఆర్థిక వ్యవస్థలో పెరుగుదలంత వేగంగా జరగడం లేదు.
3) ఈ పౌష్టికాహార పెంపు, పెరుగుదల సరిగా ఉండటం అనేవి, అన్ని రాష్ట్రాలలో సమానంగా లేదు.
4) ఈ తేడాల సమస్య అత్యంత క్లిష్టమైంది. శిశువులకు అదనపు ఆహారం, మహిళల ఆరోగ్యస్థితి, పారిశుధ్యం, కులాల తేడాలు వంటి ఆటంకాలు, ప్రధాన సవాళ్లుగా ఉన్నాయి.
5) భవిష్యత్ తరాలకు ఆర్థికాభివృద్ధిలో పెనుసవాలుగా మారే పౌష్టికాహారలోప సమస్యను మనదేశం ఒక సవాలుగా తీసుకుంది.
6) రాష్ట్రాల స్థాయిలో దీనికి పటిష్టమైన చర్యలు అవసరం.

రక్తహీనత, తత్సంబంధ పెరుగుదల లేకపోవడం, వంటి సమస్యలు మహిళల్లో ప్రసవ సమయంలో అనేక సమస్యలను తెస్తున్నది. గత దశాబ్ద కాలంలో పరిస్థితిలో ఎంతో మెరుగుదల కనిపించినప్పటికీ, గర్భవతులకు పౌష్టికాహారం వంటి కీలక అంశాలు ఇంకా ప్రాధాన్యతను సంతరించి కోనేలేదు. తల్లి బలమైన ఆహారం తీసుకుంటేనే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుంది. ఆడపిల్లలకు చిన్నప్పటినుండీ అక్షరాస్యత, పౌష్టికాహారం వంటి అంశాలను నిరంతరం జరగాల్సిన ఒక ప్రక్రియగా ప్రజలలో అవగాహన కల్పించాలి. మనదేశంలో ప్రతి సంవత్సరమూ జన్మిస్తున్న 26 మిలియన్ల మంది శిశువులకూ, సరైన జీవన పరిస్థితులను కల్పించడం మన బాధ్యత కదా!

■

*65వ పేజి తరువాయి...*

## ప్రపంచ ఆర్థిక సమస్య - భారత్‌లో సంస్కరణల ప్రభావం

వారిలోనే కేంద్రీకృతమైనట్లు విమర్శ ఉంది. అనుభవపూర్వక ఆధారాల ప్రకారం మహిళా శ్రామికులు ఎక్కువగా ఈ రంగాల్లోనే ఉపాధి పొందారు. కానీ ప్రస్తుత ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో ఈ రంగంలో తిరోగమనం భవిష్యత్తులో మహిళా ఉపాధిని ప్రభావితం చేయగలదు.

**ఉపాధి - పరిశీలన**

* మొత్తం మీద ఉద్యోగితా వృద్ధిలో తగ్గుదల కన్పిస్తుంది. 1980ల్లో ఉద్యోగితా వృద్ధిరేటు 1.55 శాతం కాగా 1990ల్లో 1.01 శాతం మాత్రమే.
* ఆర్థిక వ్యవస్థలో శ్రామికులకు రక్షణ చాలా తక్కువ. మొత్తం ఉద్యోగితలో 92 నుంచి 93 శాతం కాగా వీరికి ఏ విధమైన రక్షణ చట్టాలు లేవు.
* సంఘటిత రంగంలోని ఉపాధిలో పెరుగుదల లేదు.
* మొత్తం శ్రామిక శక్తిలో క్యాజువల్ శ్రామికుల వాటాలో పెరుగుదల ఎక్కువ. 1977–78లో స్వయం ఉపాధి పొందిన వారి శాతం 57 కాగా 1999–2000 నాటికి 53 శాతంకి తగ్గింది. కానీ క్యాజువల్ శ్రామికుల సంఖ్య 27 శాతం నుంచి 33 శాతంకి పెరిగింది. శ్రామిక శక్తి నాణ్యత మనదేశంలో పెద్ద సమస్యగా పరిణమించింది. స్కిల్ డెవలప్‌మెంట్, విద్య శ్రామికుల్లో తక్కువ. 1999–2000లో 44 శాతం శ్రామిక శక్తి నిరక్షరాస్యులు కాగా, 5 శాతం శ్రామికులు మాత్రమే వృత్తి విద్యా నైపుణ్యం కలిగినవారు.

ఉపాధి కల్పన, పేదరిక నిర్మూలన లాంటి సరళీకరణ, నియంత్రణలు లేని స్థూల ఆర్థిక వ్యూహాలు అవలంబించడం ద్వారా సాధించలేమని తెలుస్తున్నది. ప్రభుత్వమే ప్రత్యక్షంగా స్థూల ఆర్థిక విధాన రూపకల్పన ద్వారా మౌలిక సౌకర్యాలపై పెట్టుబడులు పెడుతూ సమిష్టి మూలధన సంచయనం పెంచడానికి చర్యలు తీసుకోవాలి.

కీన్స్ సూచించినట్టుగా మన దేశంలో డిమాండ్ రివైవెల్ విధానాలను అమలు చేయాలి. ప్రస్తుత ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో నిరుద్యోగ సమస్య ఏర్పడకుండా, వృద్ధితో కూడుకున్న ఉపాధి. వ్యూహాలను ప్రభుత్వం రూపొందించాలి.

■

# భారత్‌లో తయారీ రంగం (మేక్ ఇన్ ఇండియా)




**భారత్‌లో తయారీ కార్యక్రమంలో నాలుగు ప్రధాన రంగాలకు ప్రాధాన్యత నిచ్చారు. సులువుగా, వేగంగా, పారదర్శకతతో వ్యాపారం చేసే అవకాశాలను పెంపొందించడానికి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడానికి నిబంధనల సడలింపు, అన్వేషకులు లేదా తయారీదారులకు మేధో సంపత్తి హక్కుల పరిరక్షణ, దేశీయ తయారీ రంగాన్ని పెంపొందించడానికి ఇవి తోడ్పడతాయి.**

ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రారంభించిన భారత్‌లో తయారీ (మేక్ ఇన్ ఇండియా) కార్యక్రమం వల్ల విధాన పరమైన, కార్మిక, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో సంస్కరణలు చేపట్టడానికీ, పారిశ్రామిక రంగానికి ఉన్న విశ్వవ్యాప్త సవాళ్లను ఎదుర్కోవడానికి వినూత్న అవకాశాలను కల్పిస్తుంది.

మందగించిన ఆర్థిక పెరుగుదల, ప్రపంచ తయారీ కేంద్రం గా రూపొందేందుకు మన దేశానికున్న శక్తిని ప్రపంచ మదుపరులు ప్రశ్నిస్తున్న నేపథ్యంలో భారత ప్రభుత్వం 2014లో ప్రధాన అభివృద్ధి కార్యక్రమం – 'భారత్ లో తయారీ' (మేక్ ఇన్ ఇండియా)ని ప్రారంభించింది.

దేశంలోకి విదేశీ వాణిజ్య సంస్థలను ఆకర్షించడంతో పాటు అవి స్థానిక వ్యాపార సంస్థలు ఉత్పత్తి పెంచుకునేలా సహకరించడానికి, తోడ్పాటునందించాలనే లక్ష్యంతో 2014 సెప్టెంబరులో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'భారత్‌లో తయారీ' కార్యక్రమాన్ని ప్రారంభించారు. అత్యుత్తమ నాణ్యత కలిగిన వస్తువుల ఉత్పత్తి, పర్యావరణంపై అతి తక్కువ ప్రభావం చూపడం ద్వారా జాతీయ స్థూల ఉత్పత్తిలో వృద్ధి సాధించడం, పన్నుల ద్వారా ఆదాయాన్ని పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.

భారత్‌లో తయారీ కార్యక్రమం కింద ఉద్యోగాల కల్పన, నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ భారత్‌లో తయారీ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా మాట్లాడుతూ సామాన్య ప్రజల కొనుగోలు శక్తిని పెంచవలసిన అవసరం వున్నదని అన్నారు. దీని వల్ల డిమాండ్ పెరిగి అభివృద్ధికి బాటలు వేయడంతో పాటు మదుపరులకు లబ్ది కలుగుతుందని చెప్పారు.

ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ప్రధాని – ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన వ్యాపారానికి అనువైన దేశాల జాబితాలో భారత్ కింది స్థాయిలో వున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ అంశంపై తాను ప్రభుత్వ అధికారులను చైతన్య పరుస్తున్నానని ఆయన చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాలు, నిబంధనల్లో పారదర్శకత తీసుకువచ్చి, సునాయాసంగా పనులు జరిగేలా చూడగలిగితే సులువుగా వ్యాపారం చేయగలిగే దేశాల జాబితాలో మనం 135 నుంచి 50వ స్థానాన్ని చేరుకోగలమన్నారు.

**సందీప్ దాస్,** జర్నలిస్ట్, ఢిల్లీ
E-mail: sandipdas2005@gmail.com

### కీలకమైన ప్రాధాన్య రంగాలు

భారత్‌లో తయారీ కార్యక్రమంలో నాలుగు ప్రధాన రంగాలకు ప్రాధాన్యత నిచ్చారు. సులువుగా, వేగంగా, పారదర్శకత తో వ్యాపారం చేసే అవకాశాలను పెంపొం దించడానికి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడానికి నిబంధనల సడలింపు, అన్వేషకులు లేదా తయారీదారులకు మేధో సంపత్తి హక్కుల పరిరక్షణ, దేశీయ తయారీ రంగాన్ని పెంపొందించడానికి ఇవి తోడ్పడతాయి. తయారీ సంస్థలను ఏర్పాటు చేయడానికి సులువైన విధానాల ద్వారా వ్యాపారం చేయాలనే క్లిష్టమైన అంశంపై కేంద్ర పారిశ్రామిక విధానం – ప్రోత్సాహక విభాగం (డిఐపీపీ) భారత్‌లో తయారీ కార్యక్రమం కింద పర్యావరణ అనుమతులు పొందడానికి ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానాన్ని ప్రవేశపెట్టింది. వెబ్ ద్వారా ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేయడాన్ని ప్రారంభించారు. పరిశ్రమలను ఏర్పాటు చేయడానికిచ్చే లైసెన్సుల కాల పరిమితిని మూడేళ్లకు పెంచారు.

దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహిం చడానికి భారత్‌లో తయారీ కార్యక్రమం కింద పలు లక్ష్యాలను నిర్దేశించారు. 2022వ నాటికి వంద మిలియన్ల అదనపు ఉద్యోగాలు సృష్టించాలని కూడ లక్ష్యంగా పెట్టుకున్నారు.

సమ్మిళిత వృద్ధిలో భాగంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వలస వెళ్ళే వారికి, పట్టణ పేదలకు నైపుణ్యాభివృద్ధి అందించడంతో పాటు, తయారీ రంగంలో సాంకేతికతను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. భారత తయారీ రంగంలో ప్రపంచ స్థాయి పోటీతత్వాన్ని ప్రోత్సహిం చాలని నిర్ణయించారు. నిరంతరం పర్యా వరణాన్ని పరిరక్షిస్తూ ఆర్థికాభివృద్ధి సాధిం చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

### ఇప్పటివరకు జరిగిన ప్రగతి

భారత్‌లో తయారీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించినప్పటి నుంచి దేశీ యంగా వున్న సంస్థలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి వున్న బహుళజాతి సంస్థలు తమ తయారీ సంస్థలను భారత్‌లో నెలకొల్పనున్నట్లు ప్రకటించాయి. ఆటోమొబైల్ రంగంలో ఇటలీకి చెందిన పెద్ద ఆటో సంస్థ ఫియట్ క్రైస్లర్ ఆటోమొబైల్స్ స్పోర్ట్స్ జీపు వాహనాలను తయారు చేసే కర్మాగారాన్ని భారత్‌లో ఏర్పాటు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ సంస్థ భారత్‌లో ఉత్పత్తి చేసే తమ వాహనాలను ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, యునైటెడ్ కింగ్ డమ్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తుంది. ఈ సంస్థ తీసుకున్న నిర్ణయం వల్ల రెండు వేల ఐదు వందల కోట్ల రూపాయల మేర పెట్టుబడులు భారత్‌కు వస్తాయని భావిస్తున్నారు. స్వీడన్ కు చెందిన టెట్రాప్యాక్, స్కానియా, ఎరిక్సన్, వోల్వో ఇండియా సంస్థలు భారత్‌లో తయారీ కార్యక్రమంలో భాగస్వాములయ్యేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి. ఎయిర్ బస్ గ్రూప్ సంస్థ రాగల అయిదేళ్ళలో భారత్‌లో తన కంపెనీల ద్వారా రెండు బిలియన్ డాలర్ల మేర ఎయిరో స్పేస్ విడిభాగాలను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనితో పాటు, భారత్‌లోని కార్పొరేట్ సంస్థలు రిలయన్స్, మహీంద్రా, టాటా గ్రూప్ తదితర సంస్థలు భారత్‌లో తయారీ కార్యక్రమం కింద పెట్టుబడులు పెడతామని ఇప్పటికే ప్రకటించాయి.

### ముందున్న సవాళ్ళు

ప్రపంచీకరణ వాస్తవమైన ఈ తరుణంలో దేశీయ మార్కెట్‌తో సహా ప్రపంచ వ్యాప్తంగా ఉత్తమమైన నాణ్యతతో కూడిన వస్తువులు చౌక ధరకు అందించడానికి వీలుగా భారతీయ కంపెనీలు ప్రపంచవ్యాప్త తయారీ దార్లతో పోటీ పడవలసి వస్తున్నది.

భారత్‌లో తయారీ కార్యక్రమం విజయవంతం కావాలంటే గుర్తించిన పలు రంగాల్లో అన్వేషణలు జరగాలని ఇందు కోసం ప్రముఖ విద్యా సంస్థల్లో పరిశోధన అభివృద్ధి జరగాలని ఓ ప్రముఖ పారిశ్రామిక వేత్త తన అభిప్రాయం వ్యక్తం చేశారు.

కాగా, భారత్‌లో తయారీ కార్యక్రమ రూపకర్త, పరిశ్రమల శాఖ మాజీ కార్యదర్శి అమితాభ్ కాంత్ ఇటీవల మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ప్రభావాన్ని అంచనా వేయడానికి కొన్ని సంవత్సరాల పాటు వేచి చూడాలని అన్నారు. "మీరు సమూల మార్పులపై మాట్లా డుతున్నారు. ప్రస్తుతమున్న విధానాలను తొలగించాలని చెబుతున్నారు. దీనికి ఎన్నో ఏళ్ళు పడతాయి. ఇంత త్వరగా మీకు ప్రయో జనాలువుండవు" అని ఆయన అన్నారు.

ప్రపంచంలో భారత్ ఒక్కటే వినూత్న రీతిలో ప్రజాస్వామ్యం, జనాభా, అభివృద్ధి చెందుతున్న మధ్య తరగతి వర్గాల నుంచి పెరుగుతున్న డిమాండు కలిగి వున్నదని ప్రధాని నరేంద్ర మోదీ అభి వర్ణించారు. దీంతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేస్తూ మన దేశాన్ని తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ఈ కార్యక్రమం దోహద పడుతుంది. "రాష్ట్రాలకు పెట్టుబడులు వస్తే, అవి భారత్ లోకి వచ్చి నట్లే భావించాలి. రాష్ట్రాలు, కేంద్రం కలిసి ఒక జట్టులా సమిష్టి గా పని చేయాలి. అవి సంయుక్తంగా సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలి. అప్పుడే దేశం ముందుకు వెళుతుందని ప్రధాని చెప్పారు.


భారత్‌లో తయారీ కార్యక్రమం శుభారంభం జరిగింది. దీన్ని విజయవంతం చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై వుంది. ■

## ధరల స్థిరీకరణనిధి

పంటల ధరలు నిర్దిష్ట స్థాయి కంటే తగ్గినప్పుడు, పంటల ధరలు తక్కువగా ఉండే సమయాల్లో రైతుల కష్టాలను తీర్చడానికీ, వారి సంక్షేమం కోసం కేంద్రం రైతుల ధరల స్థిరీకరణనిధి (Price Stabilization Fund) ని ఏర్పాటు చేసింది. నిత్యావసర సరుకుల ధరలను పర్యవేక్షించడం సుపరిపాలనలో కీలక అంశం. ఈ నేపథ్యంలో క్లిష్ట సమయంలో రైతులకు ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వం తాత్కాలిక జోక్యం చేసుకునే బదులు వారికి నిరంతరం, దీర్ఘకాలం సాయం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గత కొన్ని సంవత్సరాలుగా దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లో తేయాకు, కాఫీ, రబ్బరు, పొగాకు తదితర పంటల ధరలు తగ్గిపోవడంతో సన్నకారు రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో, ధరల స్థిరీకరణనిధి (పీఎస్ఎఫ్)ని ఏర్పాటు చేయాలని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. దీనికి కేంద్ర మంత్రి వర్గ ఆర్థిక వ్యవహారాల మండలి (CCEA) 2002 జూన్‌లో ఆమోదం తెలిపింది. 2003 ఏప్రిల్‌లో ధరల స్థిరీకరణనిధి ఏర్పాటు చేశారు.

భాగస్వామ్య సూత్రం కింద ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఏడాదిలో పంటల సాధారణ దిగుబడి వుందా, లేక అత్యధిక దిగుబడి జరిగిందా లేదా నష్టాలు వచ్చాయా అనే అంశానికి లోబడి ఈ పథకం కింద ప్రభుత్వమూ, రైతులూ ఇరువురూ కూడా పిఎస్ఎఫ్ నిధికి తమ వంతు వాటాను జమ చేస్తారు. ఓ సాధారణ సంవత్సరంలో ప్రభుత్వం అయిదువందల రూపాయలు జమ చేస్తుంది. ప్రతి రైతు కూడా అయిదు వందల రూపాయల చొప్పున జమ చేస్తారు. అయితే, ఈ సొమ్మును ఉపసంహరించుకోవడానికి వీలుండదు. అత్యధిక దిగుబడులు వచ్చిన ఏడాదిలో రైతులు వెయ్యి రూపాయల చొప్పున జమ చేయాలి. అప్పుడు కూడా ఈ సొమ్మును తిరిగి తీసుకోవడానికి అవకాశం ఉండదు. అయితే, నష్టాలు సంభవించిన ఏడాదిలో ప్రభుత్వం ఒక్కో రైతుకు వెయ్యి రూపాయల చొప్పున ఇస్తుంది. ప్రతి రైతు అయిదు వందల రూపాయలు చెల్లించి తమకు కేటాయించిన బ్యాంకులో పి.ఎస్.ఎఫ్. సేవింగ్స్ బ్యాంకు ఖాతా తెరవాల్సివుంటుంది. చిన్న, సన్నకారు రైతులు కూడా ఈ పథకం కింద తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. దేశంలో 4 హెక్టార్ల కంటే తక్కువ భూమి కలిగివున్న మొత్తం 12 లక్షల 77 వేల మంది రైతుల్లో 3 లక్షల 42 వేల మంది సన్నకారు రైతులు ఈ పథకం కింద లబ్ది పొందారు. పి.ఎస్.ఎఫ్. కు సంబంధించిన కార్పస్ నిధిని భారత ప్రభుత్వ పబ్లిక్ అకౌంట్‌లో జమ చేశారు. కార్పస్ నిధిపై వచ్చిన వడ్డీని మాత్రమే పి.ఎస్.ఎఫ్. పథకం కింద వినియోగించారు. ధరల నియంత్రణకు 2016-17 కేంద్ర బడ్జెట్‌లో ధరల స్థిరీకరణనిధి కింద 900 కోట్ల రూపాయలు కేటాయించారు. ధరల స్థిరీకరణనిధితో రైతుల నుంచి మార్కెట్ ధరకు, కనీస మద్దతు ధరకు, పప్పుదినుసులు సేకరించి భారీ నిల్వలు ఏర్పాటు చేస్తారు. ■

Publishing date 21st March 2016, Posted on 22-23 March 2016
Yojana (Telugu) March 2016 RNI Regd. No 37729/80 Regd. No. H/HD-663/2015-17




వివరాలకు
సెల్స్ ఎంపోరియం, ప్రచురణల విభాగం,
204, 2వ అంతస్తు, సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ - 80
040-27535383

Printed & Published by Mrs. Sadhana Rout, Additional Director General and Head on behalf of the Publications Division, Ministry of I & B, Govt. of India. and Printed at Prakhya Art Printers Pvt. Ltd. 1-8-724/A/31, Vegetable Market Street, Nallakunta, Hyderabad - 500 044. E-mail: print@prakhyaarts.com and Published at Yojana (Telugu), 205, 2nd Floor, C.G.O. Towers, Kavadiguda, Hyderabad - 500 080. Senior Editor: Vijayakumar Vedagiri, Tel: 040-27546314